సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 6.50

సంపుటి: 18
సంచిక: 334

మంగళవారం 24-2-2026

SIMULTANEOUSLY PRINTED AT GUNTUR | MANGALAGIRI | VIJAYAWADA | CHENNAI | DELHI | BANGALORE | HYDERABAD | MUMBAI | ANANTAPUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VISAKHAPATNAM | WARANGAL

'తెలుగువారి గుండెచప్పుడు
వినగలిగే ఆత్మీయుడిగా ఉంటే చాలు...
నా జన్మ ధన్యమైనట్టే'

హెట్‌మైర్ 'సూపర్' షో

34 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్స్‌లతో 85..
జింబాబ్వేపై విండీస్ జయభేరి - 14లో

చరిత్ర సృష్టించిన 'బూంగ్'

'బాఫ్టా'లో తొలి అవార్డు సాధించిన
మణిపూర్ సినిమా - 14లో

ముకుల్‌రాయ్ కన్నుమూత

బెంగాల్ రాజకీయాల్లో అపర చాణిక్యుడిగా పేరు తెచ్చుకున్న కేంద్ర మాజీ మంత్రి, టీఎంసీ నేత ముకుల్ రాయ్ కన్నుమూశారు.

వివరాలు 6లో ▸

..ఎల్ మెంచో హతం

అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా అధినేత సెర్వాంటిస్ అలియాస్ ఎల్ మెంచోను మెక్సికో సైన్యం హతమార్చింది.

వివరాలు 6లో ▸

బెంగాల్ దుస్థితి చూసి...

సీఎం మమతా బెనర్జీ పాలనలో బెంగాల్ దుస్థితి చూసి తన గుండె పగిలిందని ప్రధాని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు.

వివరాలు 6లో ▸

97.37 లక్షల ఓట్ల తొలగింపు

'సర్' ప్రక్రియలో భాగంగా తమిళనాడులో ఏకంగా 97.37 లక్షల ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు.

వివరాలు 6లో ▸

మరణ మృదంగం మోగిస్తున్న

'పాల' కూట విషం

రాజమహేంద్రవరంలో కొనసాగుతున్న కల్తీ పాల కలకలం

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

బాధితుల్లో ఇద్దరు చిన్నారులు సహా 8 మంది పరిస్థితి విషమం

మరణాలు మరింతగా పెరిగే ప్రమాదం

- 73 కుటుంబాల నుంచి రక్త నమూనాల సేకరణ
- రూ.లక్షలు వెచ్చించి ప్రైవేటు ఆస్పత్రుల్లో వైద్యం చేయించుకుంటున్న బాధితులు
- 106 కుటుంబాలకు పాలు పోస్తున్న గణేష్
- అతన్ని అరెస్టు చేసిన కోరుకొండ పోలీసులు
- 46 పశువులకు పరీక్షలు
- పాలు, పెరుగు నమూనాలు హైదరాబాద్, విశాఖ ల్యాబ్‌లకు తరలింపు
- కల్తీ నిర్ధారణకు మరో రెండు రోజుల సమయం
- ప్రభుత్వం ఘోర వైఫల్యం
- బాధితులను పట్టించుకోని అధికార పార్టీ నేతలు
- బాధిత కుటుంబాలకు వైఎస్సార్‌సీపీ నేతలు జక్కంపూడి రాజా, విజయలక్ష్మి పరామర్శ

3 లో

దేవుడి ప్రసాదంలో కల్తీ అంటూ డెయిరీలను భయపెట్టి సొంత డెయిరీలకు కాంట్రాక్టులు కట్టబెట్టడంపై చంద్రబాబుకు ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలు తీస్తున్న పాల కల్తీపై లేకపోయింది. పాల కల్తీ బయటపడి వారం రోజులవుతున్నా.. వరుసగా ప్రాణాలు పోతున్నా.. ప్రభుత్వం నుంచి కనీస స్పందన లేకపోవడం నిర్ఘాంతపరుస్తోంది. ప్రజారోగ్యం విషయంలో చంద్రబాబు ప్రభుత్వం ఎంత నిర్లక్ష్యం వహిస్తోందో తెలుసుకోవడానికి రాజమహేంద్రవరం పాల కల్తీ ఉదంతమే ప్రత్యక్ష నిదర్శనం. ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. మరికొందరు మృత్యువుతో పోరాడుతున్నారు. అందులో చిన్నారులు కూడా ఉన్నారు. కానీ ఈ ప్రభుత్వానికి చీమకుట్టినట్లయినా లేకపోవడం విచారకరమని ప్రజలు విమర్శిస్తున్నారు.

కల్తీ పాల ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

3లో

రసాయనాలే శా'పాలు'

- ప్రమాదకరస్థాయిలో ఇథిలిన్ గ్లైకాల్
- యూరియా కూడా మోతాదుకు మించి..
- ఉద్దానం కిడ్నీ వ్యాధుల పరిశోధన ఐసీఎంఆర్ బృంద సభ్యుడి ప్రాథమిక నిర్ధారణ!

3 లో

మాట్లాడుతున్న వడ్డే శోభనాద్రీశ్వరరావు, కౌలు రైతు సంఘం ప్రతినిధులు

కౌలు రైతుల సమరభేరి

అన్నదాత సుఖీభవ వర్తింపజేయాలి

భూ యజమాని సంతకంతో ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులివ్వాలి

- పంట రుణాలు, నష్టపరిహారం, బీమా మొత్తం కౌలు రైతులకే ఇవ్వాలి
- రైతులందరికీ ఒకేసారి రుణమాఫీ చేయాలి
- బెజవాడలో ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో 30 గంటల నిరవధిక దీక్ష
- ప్రారంభించిన మాజీ మంత్రి, రైతు నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు

10 లో

చంద్రబాబు సర్కారుపై కౌలు రైతులు సమరభేరి మోగించారు. అప్పుల ఊబిలో కూరుకుపోయిన సాగుదారులను ఆదుకోవాలని గర్జించారు. రాష్ట్ర నడిబొడ్డున 30 గంటల నిరవధిక దీక్ష చేపట్టారు. అన్నదాతా సుఖీభవ వర్తింపజేయాలని, భూ యజమాని సంతకంతో ప్రమేయం లేకుండా గుర్తింపు కార్డులు ఇవ్వాలని, ప్రభుత్వ పథకాలు వర్తింపజేయాలని, రుణమాఫీ అమలు చేయాలని నినదించారు.

న్యూస్‌రీల్

నేడు పులివెందులకు వైఎస్ జగన్

మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 24, 25 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో పర్యటించనున్నారు. ఆయన ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలు తెలుసుకోనున్నారు.

వివరాలు 2లో ▸

ఫెర్రో అల్లాయ్స్‌కు బాబు సర్కారు షాక్

ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు చంద్రబాబు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పరిశ్రమలకు ఇస్తున్న విద్యుత్ రాయితీలు ఈ ఏడాది మార్చి చివరి వరకే కొనసాగుతాయని, ఆ తర్వాత ఉండవని తేల్చి చెప్పింది.

వివరాలు 10లో ▸

సోషల్ మీడియా నియంత్రణపై త్వరలో చట్టం

సామాజిక మాధ్యమాల్లో నియంత్రణ చట్టాన్ని సమీక్షించడానికి ప్రభుత్వం మంత్రుల బృందాన్ని ఏర్పాటు చేసిందని హోంమంత్రి అనిత తెలిపారు. 16 ఏళ్ల లోపు వయసున్న వారికి సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ కోసం చట్టం తీసుకొచ్చేందుకు పరిశీలిస్తున్నామన్నారు.

వివరాలు 10లో ▸

- రెడ్‌బుక్ రివర్స్..

బిహార్‌లో బేజార్!

పట్నాలో తెల్లవారుజామున ఎస్పీ దామోదర్ బృందం అరాచకం

- గిరిజన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ అక్రమ అరెస్టుకు బరితెగింపు
- గోడ దూకి చొరబడి కిడ్నాప్ చేసి తీసుకువెళ్లే యత్నం
- ఏపీ పోలీసులను అడ్డుకున్న బిహార్ పోలీసులు..
- గంటలపాటు వాగ్వాదం... ఉద్రిక్తత
- ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు.. వారెంట్.. కేసు డైరీ లేదు
- ఏపీ పోలీసుల తీరుపై పట్నా కోర్టు మండిపాటు
- సునీల్‌నాయక్ అరెస్టుకు అనుమతి నిరాకరణ
- తీవ్ర అవమానంతో ఏపీ పోలీసుల తిరుగుముఖం

2 లో

ఏపీ పోలీసులను అడ్డుకుంటున్న బిహార్ పోలీసులు

ఇదండీ సంగతి

సార్! కొన్నాళ్లు ఆ విక్టరీ సింబల్ చూపించడం మానేయండి..విమానాలు గుర్తొస్తున్నాయ్!

'ఇందాపూర్' నెయ్యిపై

చర్చించాల్సిందే

- మండలిలో టీటీడీకి ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరాపై చర్చకు వైఎస్సార్‌సీపీ పట్టు
- వైఎస్సార్‌సీపీ సభ్యుల వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన చైర్మన్.. పోడియం వద్ద వైఎస్సార్‌సీపీ సభ్యుల ఆందోళన
- ప్రతిగా టీడీపీ, జనసేన సభ్యులు కూడా పోడియం వద్ద నినాదాలు
- మండలి ప్రారంభమైన 7 నిమిషాలకే వాయిదా

10 లో

శాసనమండలి సభ్యుల హక్కులు కాపాడండి

10 లో

మండలి చైర్మన్ చాంబర్ ఎదుట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల ఆందోళన

కాపులను చంద్రబాబు వేధిస్తున్నారు

- మేము బానిసలం కాదు
- మాజీ మంత్రుల నివాసాలపై దాడులు అత్యంత దారుణం
- చంద్రబాబు సర్కారుపై కాపు ఉద్యమ నేత ముద్రగడ ఆగ్రహం

- వివరాలు 5లో

'కాయం' కష్టం!

పార్వతీపురం మన్యం జిల్లా వనకాబడి గ్రామానికి చెందిన బంగార్రాజు (21) ఈ నెల 19న జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడి 21న మృతి చెందాడు. ఆదివారం మృతదేహాన్ని విశాఖ నుంచి అంబులెన్స్‌లో తీసుకురాగా.. వనకాబడికి రోడ్డు లేకపోవడంతో 3 కిలోమీటర్ల దూరాన ఉన్న దేరువాడ వద్ద దింపేసి వెళ్లిపోయారు. దీంతో మృతదేహాన్ని కర్రకు కట్టి కుటుంబ సభ్యులు రాళ్లదారిలో ఇలా ఇంటికి తీసుకువచ్చారు.

16 లో

సాక్షి
మీకు సాక్షి దినపత్రిక అందడంలో ఏమైనా ఇబ్బందులున్నా లేక సాక్షి బదులుగా ఇతర దినపత్రికలు వేస్తున్నా.. మా టోల్ ఫ్రీ నెంబర్‌కు ఉ.7.00 గం.ల నుండి రా.8.00 గం.ల లోపు తెలుపగలరు. వెంటనే తగిన చర్యలు తీసుకుంటాం.
టోల్ ఫ్రీ నెం 1800 2125 9899

క్లుప్తంగా...

నేడు పులివెందులకు వైఎస్ జగన్

రెండు రోజుల పర్యటన

సాక్షి, అమరావతి: మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ నెల 24, 25 తేదీల్లో వైఎస్సార్ కడప జిల్లా పులివెందులలో పర్యటించనున్నారు. ఆయన ప్రజలను ప్రత్యక్షంగా కలుసుకుని సమస్యలు తెలుసుకోనున్నారు. ఈ నెల 24వ తేదీ మధ్యాహ్నం పులివెందుల చేరుకుని భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు. 25వ తేదీ ఉదయం 9.30 గంటలకు పులివెందుల నివాసం నుంచి బయలుదేరి వేంపల్లి మండలం నందిపల్లి చేరుకుంటారు. అక్కడ వెలసిన నూతన నందీశ్వర ఆలయ విగ్రహ ప్రతిష్ట మహోత్సవాల సందర్భంగా జరిగే ప్రత్యేక పూజల్లో పాల్గొంటారు. మధ్యాహ్నం పులివెందుల చేరుకుని భాకరాపురం క్యాంప్ ఆఫీస్‌లో ప్రజాదర్బార్ నిర్వహిస్తారు. రాత్రికి అక్కడి నివాసంలో బస చేస్తారు.

రాష్ట్ర సీఈవోలతో సీఈసీ సమావేశం నేడు

సాక్షి, అమరావతి: కేంద్ర ఎన్నికల సంఘం (సీఈసీ) అన్ని రాష్ట్రాల, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రధాన ఎన్నికల అధికారుల (సీఈవో)తో మంగళవారం ఢిల్లీలో సమావేశం కానుంది. ప్రధాన ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ అధ్యక్షతన నిర్వహించే సమావేశంలో ఎన్నికల కమిషనర్లు సుఖ్‌బీర్ సింగ్ సింధూ, వివేక్ జోషీలతో పాటు రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల సీఈవోలు పాల్గొననున్నారు. ఈ సమావేశంలో ఏపీ రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వివేక్ యాదవ్ పాల్గొంటారు. మారుతున్న కాలానికి అనుగుణంగా నూతన సాంకేతికతను వినియోగించుకోవడం, ఈవీఎంలు, ఓటర్ల జాబితాతోపాటు ఎన్నికల ప్రక్రియను బలోపేతం చేయడంపై సమావేశంలో చర్చించనున్నారు. ఈవీఎంలపై ఆరోపణలు వస్తున్న తరుణంలో వాటి పటిష్టత, భద్రతా ప్రమాణాలను సీఈవోలకు వివరించనున్నారు.

అప్పల బాధ తాళలేక రైతు ఆత్మహత్య

రామకృష్ణ (ఫైల్)

ప్యాపిలి: నంద్యాల జిల్లా ప్యాపిలి మండల పరిధిలోని బూరుగల గ్రామానికి చెందిన రైతు రామకృష్ణ (55) అప్పుల బాధ తాళలేక సోమవారం ఆత్మహత్యకు పాల్పడ్డాడు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు..రామకృష్ణ 10 ఎకరాల పొలాన్ని కౌలుకు తీసుకుని కొద్ది సంవత్సరాలుగా సాగు చేస్తున్నాడు. ఈ ఏడాది మొక్కజొన్న, కంది, వేరుశనగ, పొగాకు తదితర పంటలను సాగు చేశాడు. పెట్టుబడుల కోసం రూ.10 లక్షల వరకు అప్పు చేశాడు. ఈ ఏడాది పంట దిగుబడులు రాకపోవడంతో నష్టపోయాడు. ఈ క్రమంలో తీవ్ర మనస్తాపానికి గురైన రామకృష్ణ పొలంలోనే పురుగుల మందు తాగాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కర్నూలు ప్రభుత్వాసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతి చెందాడు. రామకృష్ణకు భార్య కదిరమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాల్వెన్సీ మినహాయింపు వాస్తవమే..

సాక్షి, అమరావతి: సాల్వెన్సీ మినహాయింపుపై భారత ప్రభుత్వం (ఐఆర్‌డీఏఐ) ఇచ్చిన ఉత్తర్వులు సమర్పిస్తే రాష్ట్ర బీమా టెండర్‌లో సాల్వెన్సీ మినహాయింపు ఇస్తామన్న మాట వాస్తవమేనని వైద్య, ఆరోగ్య శాఖ వెల్లడించింది. ఈ నిబంధన పీఎస్‌యూలకు వర్తిస్తుందని తెలిపింది. టెండర్‌లో బ్రోకర్ ఏజెన్సీలను నేరుగా అనుమతించబోమని పేర్కొంది. ఈ మేరకు 'ఆరోగ్య శాఖలో బ్రేకింగ్ స్కామ్' శీర్షికతో సోమవారం సాక్షిలో ప్రచురితమైన కథనానికి వైద్య శాఖ వివరణ ఇచ్చింది.

గుండెపోటుతో ముంగండ సొసైటీ సీఈవో మృతి

తమ సమస్యలను ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్న ఆందోళనతోనే..

శేషగిరిరావు (ఫైల్)

పి.గన్నవరం: డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పి.గన్నవరం మండలం ముంగండ గ్రామంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార పరపతి సంఘం (సొసైటీ) సీఈవోగా పని చేస్తున్న పోలిశెట్టి శేషగిరిరావు (గిరి) (56) సోమవారం ఇంట్లో గుండెపోటుతో మృతి చెందారు. సమస్యల పరిష్కారం కోరుతూ రాష్ట్రవ్యాప్త ఉద్యమంలో భాగంగా వారం రోజులుగా నిరవధిక దీక్ష చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోవడం లేదనే ఆందోళనతోనే ఆయన మృతి చెందారని జిల్లా సహకార సంఘాల యూనియన్ అధ్యక్షుడు యర్రంశెట్టి రామచంద్రరావు ఆరోపించారు. పోలిశెట్టి మృతదేహానికి రామచంద్రరావుతోపాటు యూనియన్ నాయకులు నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు.

బిహార్ ఐజీ సునీల్ నాయక్‌ను కిడ్నాప్ చేసేందుకు ఆయన ఇంటి వద్దకు అక్రమంగా చేరుకున్న ఏపీ పోలీసులు

సునీల్ నాయక్ ఇంటి వద్ద ఆంధ్రప్రదేశ్ పోలీసులను అడ్డుకుంటున్న బిహార్ పోలీసులు

తన ఇంటిలో దామోదర్‌ను ప్రశ్నిస్తున్న సునీల్‌నాయక్

రెడ్‌బుక్ రివర్స్

బిహార్‌లో బేజార్!

గిరిజన ఐపీఎస్ సునీల్ నాయక్ అక్రమ అరెస్టుకు బరితెగింపు

పట్నాలో తెల్లవారుజామున ఐపీఎస్ నివాసంలో గోడ దూకి ఎస్పీ దామోదర్ బృందం అరాచకం

సాక్షి, అమరావతి: చంద్రబాబు సర్కారు రెడ్‌బుక్ అరాచకాలకు బిహార్ గడ్డ ఘాటుగా బుద్ధి చెప్పింది! రెడ్‌బుక్ రాజ్యాంగ వేధింపులను బిహార్‌లో కూడా అమలు చేసేందుకు బరితెగించిన ఏపీ పోలీసులు ఘోర పరాభవానికి గురయ్యారు. ప్రస్తుతం బిహార్‌లో విధులు నిర్వహిస్తున్న గిరిజన ఐపీఎస్, ఐజీ స్థాయి అధికారి సునీల్ నాయక్‌ను అక్రమంగా అరెస్టు చేసేందుకు అక్కడకు వెళ్లిన సీఎం చంద్రబాబు సామాజిక వర్గానికి చెందిన ఎస్పీ దామోదర్ తన బృందంతో కలసి బీభత్సం సృష్టించారు. సోమవారం తెల్లవారుజామున పట్నాలోని సునీల్ నాయక్ నివాసం గోడదూకి మరీ ఎస్పీ దామోదర్ బృందం కిడ్నాపర్ల మాదిరిగా చొరబడటం తీవ్ర విభ్రాంతికి గురి చేసింది. ఏపీ పోలీసుల దౌర్జన్యాన్ని బిహార్ పోలీసు యంత్రాంగం యావత్తూ ఒక్కటై అడ్డుకుంది. మరోవైపు ఏపీ పోలీసుల తీరుపై పట్నా కోర్టు తీవ్రంగా మండిపడింది. ఎస్పీ దామోదర్ దర్యాప్తు అధికారులు పాటించాల్సిన కనీస నిబంధనలను కూడా అనుసరించకుండా ఓ ఐపీఎస్ అధికారి నివాసంలో చొరబడటంపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. ''ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు.. కేసు డైరీ లేదు.. స్థానిక కోర్టు నుంచి వారెంట్ లేదు.. ఇవేవీ లేకుండా ఒక సామాన్యుడిని కూడా అరెస్టు చేయడానికి వీల్లేదు.. అటువంటిది ఒక ఐపీఎస్ అధికారిని అరెస్టు చేయడానికి ఏపీ నుంచి పోలీసులు బిహార్ రావడం ఏమిటి..? సునీల్ నాయక్ అరెస్టును అనుమతించేది లేదు.. ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసే ప్రసక్తే లేదు..'' అని పట్నా సివిల్ కోర్టు మండిపడింది. సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. ఒక దశలో ఏపీ పోలీసులను అరెస్టు చేస్తామని కూడా వ్యాఖ్యానించింది. దాంతో బిహార్‌లో తీవ్ర అవమానానికి గురైన ఏపీ పోలీసులు బిక్క మొహంతో తిరుగుముఖం పట్టారు. ఆంధ్రప్రదేశ్ పరువు ప్రతిష్టలను బజారుకీడ్చి తీవ్ర అవమానభారంతో వెనుదిరిగారు. యావత్ దేశంలో సంచలనంగా మారిన ఏపీ పోలీసుల రెడ్‌బుక్ అరాచకం ఇలా ఉంది..!!

కిడ్నాపర్ల మాదిరిగా ఏపీ పోలీసులు..

డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ఇచ్చిన ఫిర్యాదుపై అక్రమ కేసు నమోదు చేసిన ఏపీ పోలీసులు బరితెగించి వేధింపులకు పాల్పడుతున్న విషయం తెలిసిందే. ఆయన అహాన్ని సంతృప్తి పరచడం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు యావత్ పోలీసు శాఖకు రెడ్‌బుక్ టాస్క్‌ను అప్పగించారు. దాంతో గుంటూరులోని నగరపాలెం పోలీసు స్టేషన్‌లో అక్రమ కేసు నమోదు చేయించి దర్యాప్తు పేరిట దళిత, గిరిజన ఐపీఎస్ అధికారులను వేధిస్తున్నారు. అందుకోసం అప్పటి ప్రకాశం జిల్లా ఎస్పీ దామోదర్‌ను ప్రత్యేక అధికారిగా నియమించారు. ఆయన విజయనగరం జిల్లా ఎస్పీగా బదిలీ అయినా సరే ఈ కేసు దర్యాప్తు అధికారిగా కొనసాగుతున్నారు. ఈ క్రమంలో గతంలో డిప్యుటేషన్‌పై రాష్ట్రంలో సీఐడీ డీఐజీగా పని చేసిన గిరిజన ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్‌ను లక్ష్యంగా చేసుకున్నారు. ప్రస్తుతం బిహార్‌లో అగ్నిమాపక శాఖ, హోంగార్డ్స్ విభాగం ఐజీగా ఉన్న ఆయన్ను అక్రమంగా అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసుల బృందం తాజాగా పట్నా వెళ్లింది. అందుకోసం ఏపీ పోలీసులు కిడ్నాపర్ల మాదిరిగా వ్యవహరించారు. ఎస్పీ దామోదర్ తన బృందంతో కలసి సోమవారం తెల్లవారుజామున సునీల్ నాయక్ అధికారిక నివాసం గోడ దూకి లోపలికి ప్రవేశించారు. ఆయన్ను చుట్టిముట్టి బలవంతంగా తమతో లాక్కెళ్లేందుకు యత్నించారు. అప్రమత్తమైన సునీల్ నాయక్ ప్రతిఘటించి కేకలు వేయడంతో పక్కన పోలీస్ క్వార్టర్స్‌లో ఉన్న అధికారులు అక్కడకు చేరుకున్నారు. కిడ్నాపర్లు వచ్చారని భావించి దాదాపు వందమంది పోలీసులు, హోంగార్డులు ఆ నివాసాన్ని చుట్టుముట్టారు.

ఎఫ్ఐఆర్‌లో పేరు లేదు... కేసు డైరీ, వారెంటూ లేదు..

బిహార్ అగ్ని మాపక శాఖ డీజీతోపాటు పలువురు అధికారులు, ప్రభుత్వ న్యాయవాదులు అక్కడకు చేరుకుని గట్టిగా నిలదీయడంతో ఏపీ పోలీసుల బండారం బయటపడింది. తాను ఎస్పీనని.. సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు వచ్చామని దామోదర్ చెప్పడంతో బిహార్ పోలీసు అధికారి, న్యాయవాదులు తీవ్రంగా స్పందించారు. అరెస్టు వారెంటు ఉందా? అని ప్రశ్నించగా ఏపీ పోలీసులు తెల్లమొహం వేశారు. పోనీ ఏ కేసులో అరెస్టు చేస్తున్నారు..? కేసు డైరీ ఉందా..? ఎఫ్ఐఆర్ కాపీ ఉందా..? స్థానిక కోర్టు ఇచ్చిన ట్రాన్సిట్ వారెంట్ ఉందా..? అని నిలదీయడంతో అవేవీ తమ వద్ద లేవని బదులిచ్చారు. అసలు సునీల్‌నాయక్‌కు వ్యతిరేకంగా ఎటువంటి ఆధారాలు లేవని గతంలో సుప్రీంకోర్టు చెప్పింది కదా..! అని న్యాయవాదులు గుర్తు చేయడంతో ఏపీ పోలీసులు మౌనం దాల్చారు. అయినా సరే.. 35 బీఎన్ఎస్ఎస్ కింద సునీల్‌నాయక్‌ను తాము అరెస్టు చేస్తున్నట్లు ఏకపక్షంగా ప్రకటించారు. అయితే ఆ నిబంధన కింద అరెస్టు చేసేందుకు వారికి అధికారం లేదని న్యాయవాదులు అభ్యంతరం తెలిపినా ఆలకించలేదు. ఆయన్ను అరెస్టు చేశామని, తమతో తీసుకువెళ్తామని మొండిగా వాదించారు. సునీల్‌నాయక్‌ను బలవంతంగా తీసుకువెళ్లేందుకు యత్నించారు. దాంతో బిహార్ పోలీసులు తీవ్రంగా స్పందించారు. వంద మందికి పైగా పోలీసులు, హోంగార్డులు ఏపీ పోలీసు బృందాన్ని చుట్టుముట్టడంతో తీవ్ర గందరగోళం నెలకొంది. అక్కడకు చేరుకున్న పట్నా ఎస్పీ (ఈస్ట్) భానుప్రతాప్‌సింగ్ ఏపీ పోలీసుల తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సునీల్ నాయక్‌ను మీరు అరెస్టు చేశామనుకుంటే అనుకోండి..! కానీ ఆయన్ను మా అనుమతి లేకుండా... న్యాయస్థానం ట్రాన్సిట్ వారెంట్ లేకుండా తీసుకెళ్లేందుకు అనుమతించబోమని తేల్చి చెప్పారు.

బందిపోటు దొంగల్లా వచ్చారు..!

బిహార్‌కు చెందిన ఐజీ సునీల్ నాయక్‌ను అక్రమంగా అరెస్టు చేసేందుకు ఏపీ పోలీసులు బందిపోటు దొంగల్లా వచ్చారు. ఏపీకి చెందిన ఎస్పీ స్థాయి అధికారి గోడదూకి సునీల్‌నాయక్ నివాసంలోకి చొరబడ్డారు. ఏపీ పోలీసులు ఎటువంటి నిబంధనలను పాటించలేదు. వారి వద్ద అరెస్టు వారెంటూ లేదు.. కేసు డైరీ లేదు.. ఎఫ్ఐఆర్‌లో కనీసం సునీల్ నాయక్ పేరు లేదు. బిహార్ వచ్చి ఏదైనా చేయవచ్చని అనుకుంటే ఎలా..? ఏపీ పోలీసుల తీరును పట్నా కోర్టు తప్పుబట్టింది. సునీల్ నాయక్‌ను అరెస్టు చేయడానికి వీల్లేదని చెప్పింది. సునీల్ నాయక్‌పై ఏపీ పోలీసులు పెట్టిన అక్రమ కేసును రద్దు చేయాలని ఏపీ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేస్తాం.

– శ్రీవాస్తవ్, కునాల్ తివారీ, సునీల్‌నాయక్ తరపు న్యాయవాదులు

ఏపీ డీజీపీ VS బిహార్ డీజీపీ

సునీల్ నాయక్ అక్రమ అరెస్టు పన్నాగం బెడిసికొట్టడంతో నాలుక కరుచుకున్న ఏపీ పోలీసులు డీజీపీ హరీశ్‌కుమార్ గుప్తాను ఫోన్‌లో బిహార్ డీజీపీ వినయ్‌కుమార్‌తో మాట్లాడించినట్లు సమాచారం. సునీల్ నాయక్‌ను అరెస్టు చేసేందుకు సహకరించాలని కోరడంపై బిహార్ డీజీపీ తీవ్రంగా స్పందించినట్లు తెలిసింది. 'ఐజీ సునీల్ నాయక్ నా పరిధిలో విధులు నిర్వహిస్తున్న ఐపీఎస్ అధికారి. ఈ రోజు ఏపీ పోలీసులు ఆయన నివాసంలో గోడ దూకి ప్రవేశించారు. ఆయన్ను ఎత్తుకుపోయేందుకు యత్నించారు. ఇందుకు అనుమతిస్తే భవిష్యత్‌లో నా బంగ్లాలోకి కూడా అక్రమంగా ప్రవేశించి నన్నూ ఎత్తుకుపోతారేమో..' అని తీవ్రంగా వ్యాఖ్యానించినట్లు సమాచారం. బిహార్ పోలీసులకు సమాచారం ఇవ్వకుండా.. స్థానిక ఎస్పీకి, చివరికి సంబంధిత పోలీసు స్టేషన్ అధికారికి కనీస సమాచారం ఇవ్వకుండా ఒక ఐపీఎస్ అధికారిని అపహరించేందుకు యత్నించడాన్ని తాము తీవ్రంగా పరిగణిస్తున్నామని స్పష్టం చేసినట్లు సమాచారం.

ఏపీ పోలీసులపై పట్నా కోర్టు ఫైర్.. సునీల్ నాయక్ అరెస్టుకు 'నో'

ఈ క్రమంలో సునీల్ నాయక్ తరపు న్యాయవాదులు సోమవారం ఉదయం పట్నా కోర్టును ఆశ్రయించారు. బిహార్ ఐపీఎస్ అధికారిని ఏపీ పోలీసులు అక్రమంగా అరెస్టు చేసేందుకు యత్నిస్తున్నారని న్యాయమూర్తి దృష్టికి తెచ్చారు. ఓ ఐపీఎస్ అధికారి నివాసంలోకి ఎస్పీ దామోదర్ నేతృత్వంలోని ఏపీ పోలీసుల బృందం గోడదూకి చొరబడటంపై న్యాయస్థానం తీవ్రంగా స్పందించింది. ఒకానొక దశలో ఏపీ పోలీసులను అరెస్టు చేసేందుకు ఆదేశిస్తామని కూడా హెచ్చరించింది. దీంతో ఏపీ పోలీసులు అప్పటికప్పుడు ఆగమేఘాలపై పట్నా కోర్టులో కౌంటర్ అఫిడవిట్ దాఖలు చేశారు. సునీల్ నాయక్‌ను అరెస్టు చేశామని చెబుతూ, ఏపీకి తీసుకువెళ్లేందుకు ట్రాన్సిట్ వారెంట్ జారీ చేయాలని కోరారు. దీనిపై బిహార్ పోలీసుల తరపు న్యాయవాదులు తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. అసలు సునీల్ నాయక్ పేరు ఎఫ్ఐఆర్‌లో లేదని.. ఆయనకు వ్యతిరేకంగా ప్రాథమిక ఆధారాలే లేవని సుప్రీంకోర్టు పేర్కొన్న విషయాన్ని హైకోర్టుకు నివేదించారు. అనంతరం సునీల్ నాయక్‌ను నిందితుడిగా చేర్చి నోటీసులు జారీ చేయగా పట్నా హైకోర్టు నుంచి మధ్యంతర రక్షణ పొందిన విషయాన్ని గుర్తు చేశారు. విచారణకు సహకరిస్తారని, ఆయనపై కఠిన చర్యలు తీసుకోవద్దని కోర్టు ఆదేశించిన విషయాన్ని ప్రస్తావించారు. సునీల్ నాయక్‌పై ఏపీ పోలీసులు పెట్టిన కేసును క్వాష్ చేయాల్సిందిగా ఏపీ హైకోర్టులో పిటిషన్ వేస్తామని నివేదించారు. ఇరు వర్గాల వాదనలు విన్న అనంతరం పట్నా కోర్టు సునీల్ నాయక్‌కు అనుకూలంగా ఆదేశాలు జారీ చేసింది. ఆయన్ను అరెస్టు చేసేందుకు అనుమతించేది లేదని తేల్చి చెప్పింది. సునీల్ నాయక్‌కు వ్యతిరేకంగా ట్రాన్సిట్ వారెంట్ జారీ చేసేందుకు నిరాకరించింది. సునీల్ నాయక్‌పై 30 రోజుల వరకూ ఎటువంటి చర్యలు తీసుకోవడానికి వీల్లేదని స్పష్టం చేస్తూ ఉత్తర్వులు వెలువరించింది. దాంతో ఎస్పీ దామోదర్ బృందం బిహార్‌లో భంగపాటుకు గురైంది.

రామ్మోహన్‌ని కేంద్ర మంత్రి పదవి నుంచి తప్పించండి

- ఆయనకు, వీఎస్ఆర్ కంపెనీకి మధ్య సంబంధాలు
- ఆయన పదవిలో ఉంటే విచారణ సజావుగా సాగదు
- మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మేనల్లుడు, ఎమ్మెల్యే రోహిత్ పవార్
- ప్రధాన మంత్రి మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాలకు లేఖలు
- న్యాయం జరిగే వరకూ తాము పోరాడతామంటూ స్పష్టీకరణ

సాక్షి, న్యూఢిల్లీ: 'అజిత్ దాదా ఫ్లైట్ క్రాష్ వెనుక తమకు అనేక అనుమానాలు ఉన్నాయి. ఈ అనుమానాలన్నింటినీ నివృత్తి చేయండి. మనుషుల మధ్య లేని దాదా మృతికి న్యాయం చేయండి' అంటూ ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్‌షాలను మహారాష్ట్ర డిప్యూటీ సీఎం అజిత్ పవార్ మేనల్లుడు, ఎమ్మెల్యే రోహిత్ పవార్ కోరారు. ఈ మేరకు రెండు రోజుల క్రితం ప్రధాని, కేంద్ర హోంశాఖ మంత్రికి లేఖలు రాసిన రోహిత్ పవార్ సోమవారం ఆ లేఖలను తమ సిబ్బంది ద్వారా ఢిల్లీలో పీఎంఓ, హోంశాఖ కార్యాలయాలకు పంపారు. లేఖల్లో ఆయన ప్రస్తావించిన వివరాలివీ..

ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉంది

''అజిత్ పవార్ ప్రయాణించిన ఫ్లైట్ క్రాష్ అవ్వడం వెనుక భారీ కుట్రకోణం ఉన్నట్లు మాకు అనుమానాలున్నాయి. ఘటన స్థలంలో అనేక పేలుళ్లు జరిగినట్లు గుర్తించాం. ఓ రాష్ట్రానికి డిప్యూటీ సీఎంగా ఉన్న వ్యక్తి మరణిస్తే.. విచారణ అనేది పూర్తి కాకుండా, పూర్తి రిపోర్టు బయటకు రాకుండా కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రిగా ఉన్న కింజరాపు రామ్మోహన్‌నాయుడు ''వీఎస్ఆర్ వెంచర్స్ కంపెనీ'' తప్పేమీ లేదని ఎలా ప్రకటిస్తారని ప్రశ్నించారు. ఆయన ప్రకటన తర్వాత తమకు అనేక అనుమానాలు వ్యక్తమయ్యాయి. తర్వాత తాము లోతుగా పరిశీలిస్తే.. నమ్మలేని నిజాలు బయటకు వచ్చాయి. కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడుకు వీఎస్ఆర్ కంపెనీకి మధ్య సంబంధాలు ఉన్నట్లు గుర్తించాం. అందుకు సంబంధించిన పలు డాక్యుమెంట్లను మీకు అందజేస్తున్నాం. ఈ సంబంధాలపై స్వతంత్ర, నిష్పాక్షిక దర్యాప్తు జరగాలని మేం డిమాండ్ చేస్తున్నాం. విచారణ పూర్తయ్యే వరకూ రామ్మోహన్‌ను కేంద్ర మంత్రి వర్గం నుంచి తప్పించాలి. రామ్మోహన్ నాయుడు ఆ పదవిలో ఉంటే విచారణ పారదర్శకంగా జరగదు. అధికార యంత్రాంగంపై ఒత్తిడి తెస్తారు. ఈ కారణంగా అజిత్ దాదా మృతికి న్యాయం దక్కదు. ఆ ఉద్దేశంతోనే తాము రామ్మోహన్ నాయుడు రాజీనామాను డిమాండ్ చేస్తున్నాం. డీజీసీఏ వ్యవహారంలో ఏవైనా అవకతవకలు జరిగాయా అన్నదీ స్వతంత్రంగా పరిశీలించాలి' అని ఆ లేఖల్లో రోహిత్ పవార్ కోరారు. అజిత్ పవార్ మృతికి న్యాయం జరిగే వరకూ తాము పోరాడుతూనే ఉంటామని స్పష్టం చేశారు.

రాజధాని కోసం భూములిస్తే మమ్మల్ని పట్టించుకోరా?

- కొండమరాజు రైతుల ఆవేదన
- పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు

జేసీ అశుతోష్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

గుంటూరు వెస్ట్: అమరావతి రాజధాని నిర్మాణం కోసం విలువైన భూములిచ్చిన కొండమరాజుపాలెం నిర్వాసితులు ఇప్పుడు బోరుమంటున్నారు. అధికారులు కూడా కనీసం స్పందించడం లేదని వాపోతున్నారు. భూములు తీసుకున్నప్పుడు జరీబు కింద నమోదు చేసి కౌలు ఇచ్చిన అధికారులు ఇప్పుడు మెట్ట భూమి అని చెబుతున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. దీంతో ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారంతోపాటు స్థలంలో సుమారు 200 చ.గ. భూమిని కోల్పోవాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ బాధితులు సోమవారం గుంటూరు కలెక్టరేట్‌లోని రెవెన్యూ క్లినిక్ (పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేశారు. అయితే తాము చేసేదేమీ లేదని జేసీ కరాఖండీగా చెప్పేశారు. అనంతరం రైతులు మాట్లాడుతూ తుళ్లూరు మండలంలోని అబ్బరాజుపాలెం, బోరుపాలెం, తుళ్లూరు, రాయపూడి గ్రామాల్లో 71 మంది రైతుల భూములను జరీబు కింద నమోదు చేసి.. సమీపంలోనే ఉన్న తమ భూములు జరీబులో లేవని చెప్పడం దారుణమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం స్పందించి సమస్య పరిష్కరించని పక్షంలో న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. బాధిత రైతులు తోట శివకుమారి, టి.ధనలక్ష్మి, కె.లావణ్య, కె.నాగభూషణం తదితరులు వినతిపత్రం అందజేశారు.

ఒప్పందాల కోసమే

'క్వాంటమ్' కంపెనీల సృష్టి?

డిసెంబర్‌లో ఏర్పాటు చేసిన 'ఐక్యూలీప్'తో ఫిబ్రవరి మొదట్లో ఒప్పందం ● ఆ సంస్థలో ఉన్నది ముగ్గురు ఉద్యోగులే..

- ఫోటాన్ కోర్ సిస్టమ్స్ జనవరిలో ప్రారంభం.. మూలధన వ్యయం రూ.10 లక్షలే..
- స్థాపించిన ఆరు నెలల్లోనే బెస్ట్ క్వాంటమ్ కంప్యూటింగ్ అవార్డు అందుకున్న ట్రై క్వాంటా?
- మరో రెండు కంపెనీల అడ్రస్ కూడా దొరకడం లేదట..!
- చంద్రబాబు ప్రభుత్వం చేసుకున్న 'క్వాంటమ్' ఒప్పందాలపై సోషల్ మీడియాలో పెద్ద ఎత్తున చర్చ



సాక్షి, అమరావతి: క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన సమయంలో 14 కంపెనీలతో భారీ ఒప్పందాలు కుదుర్చుకున్నామంటూ సీఎం చంద్రబాబు చేసిన ప్రకటనలో డొల్లతనం బయటపడింది. కేవలం ఒప్పందాల కోసమే కొన్ని కంపెనీలను సృష్టించి, వాటితో ఎంవోయూలు కుదుర్చుకున్నారంటూ ఆధారాలతో సహా నెటిజన్లు సామాజిక మాధ్యమాల్లో పెడుతున్నారు. ఒప్పందాలు కుదుర్చుకున్న 14 కంపెనీల్లో... మూడు కంపెనీలు డిసెంబర్, జనవరి నెలల్లోనే ఏర్పాటయ్యాయని... మరో రెండు కంపెనీల అడ్రస్‌లు ఎంత వెతికినా దొరకడం లేదని విమర్శిస్తున్నారు. డిసెంబర్, జనవరిలో ఏర్పాటు చేసిన కంపెనీలతో ఫిబ్రవరి మొదట్లో ఒప్పందం కుదుర్చుకొని 35 లక్షల ఉద్యోగాలు ఎలా కల్పిస్తారంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు.

ముగ్గురు ఉద్యోగులున్న కంపెనీతో ఒప్పందమా... 35 లక్షల ఉద్యోగాలా?

చంద్రబాబు ప్రభుత్వం ఒప్పందం చేసుకున్న వాటిలో ఐక్యూలీప్ అనే కంపెనీ డిసెంబర్‌లో ప్రారంభమైంది. ఈ కంపెనీలో ముగ్గురు ఉద్యోగులే ఉన్నారు. ఫోటాన్ కోర్ సిస్టమ్స్ అనే కంపెనీ రూ.10 లక్షల మూలధనంతో జనవరి 12న ఏర్పాటైంది. ఇక ట్రై క్వాంటా అనే కంపెనీ కూడా నెలల వ్యవధిలోనే ఏర్పాటైంది. అయితే ఆ కంపెనీ నెలకొల్పిన ఆరు నెలల్లోనే బెస్ట్ క్వాంటమ్ కంప్యూటింగ్ అవార్డును కూడా కైవసం చేసుకుందని ప్రకటించారు. కానీ, ఇంకా ప్రయోగాల దశలోనే ఉన్న క్వాంటమ్ టెక్నాలజీకి సంబంధించి అప్పుడే ఆ కంపెనీకి అవార్డులు ఎవరిచ్చారంటూ నెటిజన్లు ప్రశ్నిస్తున్నారు. ఈ కంపెనీల ప్రొఫైల్స్ చూసిన నెటిజన్లు.. ఒకటి, రెండు నెలల కిందటే ఏర్పాటు చేయడంతోపాటు కేవలం ముగ్గురు ఉద్యోగులు ఉన్నటువంటి సంస్థల ద్వారా ఎంత మందికి శిక్షణ ఇస్తారు? 35 లక్షల మందికి ఉద్యోగాలు ఎలా కల్పిస్తారు? అని ప్రశ్నిస్తున్నారు.

బాబు ప్రభుత్వం భారీ ప్రచారం

ఎప్పటిలాగానే క్వాంటమ్ వ్యాలీకి శంకుస్థాపన పేరుతో గ్రాఫిక్ డిజైన్స్ విడుదల చేసి చంద్రబాబు సర్కారు భారీ ప్రచారం చేసుకుంది. రూ.9,000 కోట్లతో 80 లక్షల చదరపు అడుగుల విస్తీర్ణంలో ఐకానిక్ భవనాలంటూ గ్రాఫిక్స్‌తో సినిమా చూపించింది. వాస్తవంగా చూస్తే ఒప్పందానికి ఒకటి, రెండు నెలల ముందు పుట్టిన మూడు కంపెనీలు, అడ్రస్ దొరకని మరో రెండు కంపెనీలతోపాటు ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, బోసాన్ క్యూసై, ఐక్యూలీప్, క్యూబిక్‌ఫోర్స్, క్వాంటమ్ ఫోకస్ ల్యాబ్స్ వంటి లోకల్ సంస్థలతో ఒప్పందాలు చేసుకుని ఈ రంగంలో భారీ పెట్టుబడులు వచ్చినట్లు ప్రచారం చేసుకోవడంపై నెటిజన్లు పెద్ద ఎత్తున విమర్శలు చేస్తున్నారు.

చికిత్స పొందుతున్న జి.వెంకటలక్ష్మి, ఆర్.సూర్యకుమారి, జి.సూర్యారావు, కె.సత్యనారాయణ, జి.వెంకటేశ్వరరావు

అందని ప్రభుత్వ వైద్యం



బాధితుడికి ప్రైవేట్ ఆస్పత్రిలో వేసిన రూ.8.50 లక్షల బిల్లు

బాధితులకు ప్రభుత్వ వైద్యం అందని ద్రాక్షగానే మారింది. మూత్ర విసర్జన స్తంభించడం, కిడ్నీ సమస్యలు, వాంతులు, విరేచనాలతో రాజమహేంద్రవరం జీజీహెచ్‌కు మూడేళ్ల చిన్నారిని తీసుకెళ్లగా.. అక్కడి వైద్యులు కాకినాడ జీజీహెచ్‌కు రిఫర్ చేశారు. అక్కడకు తీసుకెళ్లగా తమవద్ద వైద్య సదుపాయాలు లేవని వైద్యులు చెప్పడంతో ఆ చిన్నారి తల్లిదండ్రులు లబోదిబోమంటూ తిరిగి రాజమహేంద్రవరంలోని ప్రైవేటు ఆస్పత్రికి తీసుకొచ్చారు. అదే విధంగా మరో చిన్నారి రితిక్ చికిత్స కోసం ఇప్పటివరకు ప్రైవేట్ ఆస్పత్రిలో రూ.8.50 లక్షలకు పైగా ఖర్చయింది. మిగిలిన బాధితులకు సైతం వైద్య ఖర్చులు తడిసిమోపెడవుతున్నాయి.

మరణ మృదంగం మోగిస్తున్న 'పాల'కూట విషం

ఐదుకు చేరిన మృతుల సంఖ్య

బాధితుల్లో ఇద్దరు చిన్నారులు సహా 8 మంది పరిస్థితి విషమం

రాజమహేంద్రవరంలో కొనసాగుతున్న కల్తీ పాల కలకలం

మృతులు: రాధాకృష్ణమూర్తి (74), తాడి కృష్ణవేణి (74), బి.కనక రత్నం (70), ఎన్.శేషగిరిరావు (72), టి.రమామణి (58)

సాక్షి, రాజమహేంద్రవరం: తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో కల్తీ పాల దుర్ఘటన మరణ మృదంగం మోగిస్తోంది. లాలాచెరువు సమీపంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, వెంకటేశ్వర నగర్‌లలో చోటుచేసుకుంటున్న మరణాలు కలకలం రేపుతున్నాయి. కల్తీ పాలు తాగి చౌడేశ్వరి నగర్‌కు చెందిన తాడి కృష్ణవేణి (85), కనకరత్నం (70) ఇప్పటికే మృతి చెందిన విషయం తెలిసిందే. సోమవారం ఎన్.శేషగిరిరావు (72), రాధాకృష్ణమూర్తి (74), తాడి రమణి (58) మరణించారు. ఇప్పటివరకూ ఐదుగురు మృతి చెందగా.. అధికారులు మాత్రం నలుగురు మృతి చెందినట్లు వెల్లడించారు. మృతదేహాలకు హడావుడిగా పోస్టుమార్టం నిర్వహించారు. పోస్టుమార్టం నివేదికలు రావాల్సి ఉంది. బాధితుల్లో ఎక్కువ మంది 60 ఏళ్లకు పైబడిన వృద్ధులు, మూడేళ్లలోపు చిన్నారులు ఉన్నారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల్లో ఇద్దరు చిన్నారులు సహా 8 మంది పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెబుతున్నారు.

17 మంది బాధితులు

ఒక్కసారిగా మూత్రం ఆగిపోవడం (అనూరియా), వాంతులు, విరేచనాలు కావడం, కిడ్నీ ఫెయిల్ కావడం వంటి లక్షణాలతో బాధపడుతున్న వారు అధికారిక లెక్కల ప్రకారం 17 మంది ఉన్నారు. వీరిలో ఇప్పటికే ఐదుగురు మృతి చెందగా.. మరో 12 మంది కిమ్స్, రెయిన్‌బో, రవి చైతన్య, సన్‌స్టార్ తదితర ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. కిమ్స్‌లో ఏడుగురు చికిత్స పొందుతుండగా.. ముగ్గురి పరిస్థితి విషమంగా ఉంది. రెయిన్‌బోలో ముగ్గురు చిన్నారులు చికిత్స పొందుతుండగా.. ఇద్దరి పరిస్థితి విషమంగా ఉంది. వారిలో ఐదు నెలల చిన్నారికి డయాలసిస్ చేస్తున్నారు. పరిస్థితి హృదయ విదారకంగా మారింది. అభం శుభం తెలియని పసివాడికి చికిత్స అందిస్తున్న దృశ్యం అందరినీ కంటతడి పెట్టిస్తోంది. ఆదిత్య ఆస్పత్రిలో ఓ మహిళ పరిస్థితి విషమంగా ఉంది. రవి చైతన్య ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఇద్దరి పరిస్థితి కూడా విషమంగా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు. మరికొందరు జయ కిడ్నీ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పరిస్థితి చూస్తే మృతుల సంఖ్య ఇంకా పెరిగే అవకాశం ఉందని భావిస్తున్నారు. ఒకే కుటుంబానికి చెందిన నలుగురు కిమ్స్‌లో చికిత్స పొందుతున్నారు. వీరిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉండటంతో వారి కుటుంబ సభ్యుల వేదనకు అంతే లేకుండా ఉంది. బాధితుల్లో ఎక్కువ మంది మధుమేహంతో బాధపడుతున్నారు. కాగా.. వైఎస్సార్‌సీపీ నేతలు చెబుతున్నదాని ప్రకారం కల్తీ పాల బాధితులు 19 మంది ఉన్నారు. వీరిలో ఐదుగురు మంది మృతి చెందగా.. మరో 14 మంది వివిధ ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నారు. అధికారులు మాత్రం మొత్తం బాధితులు 17 మందేనని స్పష్టం చేశారు. వీరిలో నలుగురు మృతి చెందారని చెబుతున్నారు.

కల్తీ నిర్ధారణకు మరో రెండు రోజులు

పాలల్లో కల్తీని నిర్ధారించేందుకు మరో రెండు రోజుల సమయం పడుతుందని అధికారులు చెబుతున్నారు. పాల వ్యాపారి గణేష్ నుంచి పాలు పోయించుకుంటున్న 73 కుటుంబాల నుంచి రక్త నమూనాలు సేకరించి ల్యాబ్‌లకు పంపించారు. ఈ నివేదికలు ఇంకా రావాల్సి ఉంది. వీటితో పాటు పశు సంవర్ధక శాఖ ద్వారా 46 పశువులకు పరీక్షలు నిర్వహించి ఆ నమూనాలను వైజ్ఞానిక, పశు సంవర్ధక శాఖ ప్రయోగశాలలకు పంపించారు. ఆహార భద్రత అధికారులు సేకరించిన పాలు, పెరుగు, పాల ఉత్పత్తులను హైదరాబాద్, విశాఖపట్నంలోని ప్రయోగశాలలకు పంపినట్టు కలెక్టర్ కీర్తి చేకూరి వెల్లడించారు. వాటిని ఫోరెన్సిక్ ల్యాబ్‌కు సైతం పంపించామన్నారు.

మృతులు తాడి కృష్ణవేణి, నీలా శేషగిరిరావు(ఫైల్)

వెలుగులోకి కీలక విషయాలు

కల్తీ పాల కలవరానికి కారణమని భావిస్తున్న పాల వ్యాపారి గణేష్‌ను పోలీసులు అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు. విచారణలో కీలక అంశాలు బహిర్గతమైనట్లు తెలిసింది. చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్, వెంకటేశ్వర నగర్‌లలోని 106 కుటుంబాలకు కోరుకొండ మండలం నరసాపురం గ్రామానికి చెందిన అడ్డాల గణేష్ అనే వ్యాపారి ప్రతిరోజూ పాలు పోస్తున్నాడు. ఈ నెల 15వ తేదీ శివరాత్రి కావడంతో పాలకు ఒక్కసారిగా డిమాండ్ పెరిగింది. దీంతో రోజూ పాలుపోసే వారితో కలిపి మొత్తం 126 కుటుంబాలకు గణేష్ ఆ రోజు పాలు పోసినట్లు పోలీసుల విచారణలో వెల్లడైందని సమాచారం. 16వ తేదీన పోసిన పాలు కొంచెం చేదుగా ఉన్నాయని వినియోగదారులు గణేష్ దృష్టికి తీసుకెళ్లగా.. మరునాటి నుంచి అలా జరగదని అతడు చెప్పడంతో మిన్నకుండిపోయారు. తిరిగి సాధారణంగా ఎప్పుడూ ఉండే రుచే ఉండటంతో వినియోగదారులు పట్టించుకోలేదు. ఆ రోజు గణేష్ నరసాపురం గ్రామ పరిసరాల్లో పాలను సేకరించినట్లు సమాచారం. దీనిని పోలీసులు అధికారికంగా ధ్రువీకరించాల్సి ఉంది. పాలు ఎక్కడెక్కడ, ఎవరెవరి నుంచి సేకరించాడనే విషయమై ఆరా తీస్తున్నారు.

అనధికార డెయిరీ సీజ్

పాల వ్యాపారి గణేష్ నరసాపురంలో అనధికారికంగా నిర్వహిస్తున్న వరలక్ష్మి డెయిరీని పోలీసులు సీజ్ చేశారు. పాలు సేకరించే పరికరాలను స్వాధీనం చేసుకున్నారు. వెనిగర్, పాలు, కెమికల్స్ స్వాధీనం చేసుకున్నారు. పాలు, నీళ్లను పరీక్షల నిమిత్తం ల్యాబ్‌కు పంపారు. పశువుల రక్త నమూనాలు సైతం సేకరించారు. కారణాలు బయటకొచ్చిన వెంటనే గణేష్‌తో పాటు ఇతర బాధ్యులపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పోలీసులు చెప్పారు.

కాలనీల్లో వైద్య బృందాలు

చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లలో వైద్య బృందాలు పర్యటిస్తున్నాయి. పాలు వినియోగించిన వారి రక్త నమూనాలు తీసుకుంటున్నారు. ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేశారు. అధికారులు 18 బృందాలుగా విడిపోయి వైద్య పరీక్షలు చేస్తున్నారు. అనారోగ్యానికి గురైన వారిలో వికారంతో కూడిన వాంతులు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు కనిపించాయని డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు తెలిపారు. ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఎక్కువ మంది 60 ఏళ్ల పైబడిన వారేనని చెప్పారు. ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక వైద్య శిబిరాలు ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ కొనసాగిస్తున్నామన్నారు.

వైఎస్సార్‌సీపీ నేతల పరామర్శ

కల్తీ పాల బాధితులను, బాధిత కుటుంబాలను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు జక్కంపూడి రాజా, అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. రాజమహేంద్రవరం చౌడేశ్వరి నగర్‌లో పర్యటించి ఏం జరిగిందనే విషయంపై బాధిత కుటుంబాల సభ్యులను అడిగి తెలుసుకున్నారు. జక్కంపూడి రాజా, పార్టీ జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రెయిన్‌బో హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్న వారిని పరామర్శించారు. మెరుగైన చికిత్స అందించాలని వైద్యులకు సూచించారు. కల్తీ పాల ఘటనపై వైఎస్సార్‌సీపీ జాతీయ అధికార ప్రతినిధి, మాజీ ఎంపీ మార్గాని భరత్‌రామ్ ఆరా తీశారు.

బాధితుల వివరాలివీ

పేరు, వయసు
డి.రితిక్ (1.9)
జి.జయకీర్తిరాజ్ (2.9)
ఎం.రోహన్య (5 నెలలు)
జి.వెంకటేశ్వరరావు (67)
ఆర్.సూర్యకుమారి (62)
జి.సూర్యారావు (79)
జి.వెంకటలక్ష్మి (69)
బండారు వీరలక్ష్మి (60)
కె.సత్యనారాయణ (82)
కె.కృష్ణారావు (70)
బి.అనంతలక్ష్మి (62)
పిచ్చుక నాగేశ్వరరావు (70)
బళ్ల అనంతలక్ష్మి (72)
నూలు కొండబాబు (62)

మా ఇంట్లో ముగ్గురి పరిస్థితి విషమం

మా ఇంట్లో నా తల్లి, తండ్రితో పాటు నా కుటుంబ సభ్యులు నలుగురికి కిడ్నీ విఫలమైంది. వారిలో ముగ్గురి పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. శివరాత్రి నాడు మా పాల వ్యాపారి అందించిన పాలు తీసుకున్న తర్వాత ఈ అనర్థం జరిగింది. ఆ పాలు తాగిన తర్వాత వాంతులు, తల తిరగడం వంటి లక్షణాలు కనిపించాయి. వారం తర్వాత అంటే.. ఈ నెల 22న అందరికీ మూత్రం ఆగిపోయింది. కుటుంబంలో అందరికీ ఒకే సమస్య రావడంతో ఆందోళనకు గురై కిమ్స్ ఆస్పత్రిలో చేరగా చికిత్స అందిస్తున్నారు.

– మధు, చౌడేశ్వరి నగర్, రాజమహేంద్రవరం

శరీరమంతా దద్దుర్లు వచ్చేశాయి

మా మనవరాలు నాలుగు రోజుల క్రితం పాలు తాగిన వెంటనే శరీరంపై దద్దుర్లు వచ్చాయి. ఆ పాల వ్యాపారికి మేం ఈ విషయం చెప్పాం. పాలు చేదుగా ఉన్నాయని తెలిపాం. కొత్తగా గేదె ఈనిందని, అందుకే పాల రుచిలో తేడా వచ్చిందన్నాడు. ఆ తర్వాత మా చుట్టుపక్కల అతను పాలు పోసిన ఇళ్లలో కిడ్నీ బాధితులు బయటపడుతుండటంతో ఆందోళనకు గురవుతున్నాం. మా మనవరాలిని ఆస్పత్రిలో చేర్చి వైద్యుల పర్యవేక్షణలో ఉంచాం. వారు చేసిన వైద్య పరీక్షల ఫలితాలు రావాల్సి ఉంది.

– షేక్ సిరాజుద్దీన్, చౌడేశ్వరి నగర్, రాజమహేంద్రవరం

మిగతా వారిలోనూ సమస్యలు రావచ్చు

ఈ నెల 14న రాత్రి మూత్ర సమస్యతో నా వద్దకు కొందరు వచ్చారు. అందరూ ఒకే ప్రాంతానికి చెందిన వారు కావడంతో మంచినీటి సరఫరాపై అనుమానం కలిగింది. మంచినీటి సరఫరా బాగానే ఉందని మున్సిపల్ అధికారులు స్పష్టం చేయడంతో రోగులు తీసుకున్న ఆహారంపై ఆరా తీయగా పాలు తాగిన తర్వాత ఈ సమస్య వచ్చినట్లు తెలిసింది. ముందుగా బలహీనంగా ఉండే వృద్ధులు, చిన్నారులపై కల్తీ పాలు ప్రభావం చూపించాయి. మిగతా వారిలో కూడా భవిష్యత్‌లో అనారోగ్య సమస్యలు కలగవచ్చు. అందుకే ఆ పాలు తాగిన వారందరూ కిడ్నీకి సంబంధించి క్రియాటినిన్ పరీక్షలు చేయించుకోవాలి. – డాక్టర్ శశాంక్, కిడ్నీ వ్యాధుల నిపుణుడు, రాజమహేంద్రవరం

రసాయనాలే శా'పాలు'

- ప్రమాదకరస్థాయిలో ఇథిలిన్ గ్లైకాల్
- యూరియా కూడా మోతాదుకు మించి..
- ఉద్దానం కిడ్నీ వ్యాధుల పరిశోధన ఐసీఎంఆర్ బృంద సభ్యుడి ప్రాథమిక నిర్ధారణ!
- చిక్కదనం కోసం కలిపినట్టు గుర్తింపు
- అందుకే కిడ్నీలు షట్‌డౌన్.. రోజుకు రెండుసార్లు డయాలసిస్

సాక్షి, అమరావతి: అధిక మోతాదులో యూరియా, ఇథిలీన్ గ్లైకాల్ వంటి రసాయనాలు కలిసిన కల్తీ పాలే ప్రజల ప్రాణాల మీదకు తెచ్చినట్టు వైద్య నిపుణులు అభిప్రాయపడుతున్నారు. రాజమహేంద్రవరం ఘటనలో మృతులు, ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితుల ఆరోగ్య పరిస్థితి గమనించిన ఇథిలీన్ గ్లైకాల్ ప్రధాన కారణమని ఉద్దానం కిడ్నీ వ్యాధుల పరిశోధన ఐసీఎంఆర్ బృంధ సభ్యులు ప్రముఖ నెఫ్రాలజిస్ట్ డాక్టర్ రవిరాజు ఈ మేరకు ప్రాథమికంగా నిర్ధారించినట్లు సమాచారం. పాలు చిక్కగా ఉన్నాయని భ్రమింపజేయడానికి యూరియాను, కల్తీ చేసిన పాలు త్వరగా పాడవ్వకుండా ఉండటానికి, ఒకరకమైన తీపిదనాన్ని ఇవ్వడానికి ఇథిలీన్ గ్లైకాల్ కలుపుతుంటారు. ఈ రెండూ మోతాదుకు మించి కలపడం వల్లే ప్రస్తుతం రాజమహేంద్రవరం బాధితుల కిడ్నీలు షట్‌డౌన్‌కు దారితీసిందని వైద్యవర్గాల్లో చర్చ జరుగుతోంది.

రోజుకు రెండు సార్లు డయాలసిస్

రాజమండ్రిలో ఈ నెల 15వ తేదీ శివరాత్రి పండగ ముగిసిన మరుసటి రోజు నుంచి కల్తీ పాల వల్ల ప్రజల్లో అనారోగ్య సమస్యలు మొదలైనట్టు తెలుస్తోంది. క్రమంగా సమస్యలు తీవ్ర రూపం దాల్చి కిడ్నీలపై తీవ్ర ప్రభావం పడింది. దీంతో మూత్రం ఉత్పత్తి పూర్తిగా దెబ్బతిని 'అనూరియా'(హెల్త్ ఎమర్జెన్సీ పరిస్థితి) సంభవించింది. రక్తంలో యూరియా, క్రియాటిన్ స్థాయిలు అత్యంత ప్రమాదకర స్థాయికి చేరుకున్నాయని బాధితులకు చికిత్స చేసిన వైద్యులు చెప్పారు. సాధారణంగా రక్తంలో యూరియా వయోజనుల్లో 8–24 మిల్లీగ్రాములు, వృద్ధుల్లో 8–26 మిల్లీగ్రాములు, సీరమ్ క్రియాటిన్ 0.7–1.3 మిల్లీగ్రాములు ఉండాలి. అయితే రాజమండ్రి బాధితుల రక్తంలో యూరియా 130–140 మిల్లీగ్రాములు, క్రియాటిన్ 9 మిల్లీగ్రాములు ఉన్నాయని వైద్యులు వెల్లడించారు. సాధారణంగా కిడ్నీలు ఫెయిల్యూర్ ఘటనల్లో బాధితులకు రోజుకు ఒకసారి డయాలసిస్ చేస్తే సరిపోతుందని, అయితే రాజమండ్రిలో కొందరు బాధితులకు రోజులో రెండోసారి కూడా డయాలసిస్ చేసినట్టు స్పష్టం చేశారు.

సర్కారు పర్యవేక్షణ శూన్యం

రాజమండ్రి ఘటనతో రాష్ట్రంలో పాల కల్తీ విచ్చలవిడిగా సాగుతోందని స్పష్టమవుతోంది. ఇంత భారీ స్థాయిలో కేటుగాళ్లు రెచ్చిపోతుంటే ప్రభుత్వం ఏం చేస్తోందనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. రోజుకు 500–50 వేల లీటర్ల పాలను సేకరించే/ప్రాసెస్ చేసే, ఏడాదికి రూ.20 కోట్లలోపు టర్నోవర్ ఉండే డెయిరీలు రాష్ట్ర ఫుడ్ సేఫ్టీ పరిధిలోకి వస్తాయి. ప్రభుత్వం వెల్లడిస్తున్న సమాచారం ప్రకారం రాజమండ్రి ఘటనలో పాల సరఫరా కేంద్రం రాష్ట్ర ప్రభుత్వ నియంత్రణలోనే ఉంటుంది. ఈ లెక్కన పరిశీలిస్తే డెయిరీల్లో పాలు, పెరుగు, ఇతర ఉత్పత్తుల తయారీపై ప్రభుత్వ పర్యవేక్షణ ఏ మాత్రం లేదని తేటతెల్లమవుతోంది. ప్రజారోగ్యాన్ని చంద్రబాబు సర్కారు గాలి కొదిలేసిందని స్పష్టమవుతోంది.

'పాల'కులదే కల్తీ పాపం

వైఎస్సార్ సీపీ నేతలు జక్కంపూడి విజయలక్ష్మి, చెల్లుబోయిన వేణు, రాజా ధ్వజం

మృతులు, బాధిత కుటుంబ సభ్యులకు పరామర్శ

మీడియాతో మాట్లాడుతున్న జక్కంపూడి రాజా, విజయలక్ష్మి, చెల్లుబోయిన

రాజమహేంద్రవరం రూరల్: కల్తీ పాల పాపం చంద్రబాబు సర్కారుదేనని, ఈ దుర్ఘటనకు ప్రభుత్వమే బాధ్యత వహించాలని వైఎస్సార్ సీపీ యువజన విభాగం రాష్ట్ర అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా డిమాండ్ చేశారు. కల్తీ పాల వల్ల అనారోగ్యంపాలై ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ తూర్పు గోదావరి జిల్లా అధ్యక్షుడు చెల్లుబోయిన వేణుగోపాలకృష్ణ, జక్కంపూడి రాజా పరామర్శించారు. అలాగే కల్తీపాల వల్ల మరణించిన కుటుంబాలను వైఎస్సార్ సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి పరామర్శించారు. అనంతరం రాజమహేంద్రవరంలో వారు విలేకరులతో మాట్లాడారు. కల్తీ పాల వల్ల దాదాపు వారం రోజులుగా ప్రజలు ఆస్పత్రి పాలవుతున్నా, ప్రభుత్వ యంత్రాంగం స్పందించకపోవడం దారుణమని విమర్శించారు. చంద్రబాబు సర్కారుకు రాజకీయ కక్ష సాధింపులపై ఉన్న శ్రద్ధ ప్రజల ప్రాణాలపై, భద్రతపై లేకపోయిందని ఆగ్రహం వ్యక్తం చేశారు. పోలీసు యంత్రాంగాన్ని వారి పనిని వారిని చేసుకోనిస్తే ఇలా ప్రజల ప్రాణాలు పోవని రాజా పేర్కొన్నారు. చికిత్స పొందుతున్న బాధితులను ఏ ఒక్క అధికారి ఇంతవరకు పట్టించుకోవడం లేదని విమర్శించారు. బాధితుల ఆస్పత్రుల బిల్లులకే రూ.లక్షలు ఖర్చవుతున్నాయని, రెండేళ్లలోపు చిన్నారి రితిక చికిత్సకు ఇప్పటివరకు రూ.8.50 లక్షలు ఖర్చయిందని రాజా ఆవేదన చెందారు. మృతదేహాల పోస్టుమార్టం, అంత్యక్రియలకు ప్రభుత్వం హడావుడి చేయడం అనుమానాలకు తావిస్తోందని రాజా మండిపడ్డారు. బాధితులకు తమ పార్టీ నాయకుల ద్వారా సాయం అందజేస్తామని ప్రకటించారు. మాజీ మంత్రి చెల్లుబోయిన మాట్లాడుతూ.. ప్రభుత్వ చేతగానితనం వల్లనే పాల కల్తీ ఘటన జరిగిందన్నారు. వారం పది రోజులుగా ప్రైవేటు ఆస్పత్రుల్లో బాధితులు చేరుతూ ఉంటే ప్రభుత్వ యంత్రాంగం ఏం చేస్తోందని నిలదీశారు. రాజమండ్రిలో హెల్త్ ఎమర్జెన్సీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. వైఎస్సార్‌సీపీ అమలాపురం పార్లమెంటరీ నియోజకవర్గ పరిశీలకురాలు జక్కంపూడి విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న చిన్నారుల పరిస్థితి దయనీయంగా ఉందన్నారు. నెలల పిల్లలూ కల్తీ పాల బారిన పడ్డారని, వారికీ డయాలసిస్ చేయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తంచేశారు. అయినా ప్రభుత్వ యంత్రాంగంలో కదలిక లేదని మండిపడ్డారు. తక్షణం సర్కారు స్పందించి బాధితులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు.

కల్తీ పాల ఘటనపై వైఎస్ జగన్ దిగ్భ్రాంతి

సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరంలో కల్తీ పాలు తాగి ఐదుగురు మృతి చెందడం, మరికొందరు తీవ్ర అస్వస్థతకు గురై ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న విషాద ఘటనపై వైఎస్సార్‌సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ ఘటన తనను కలిచివేసిందన్నారు. మృతుల కుటుంబాలకు ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. ప్రభుత్వ నిర్లక్ష్యంతో ప్రజలు ప్రాణాలు కోల్పోవడం అత్యంత దురదృష్టకరమని ఆయన పేర్కొన్నారు. ఆహార భద్రతపై నిర్లక్ష్యం వల్ల ప్రజల ప్రాణాలకే ముప్పు ఏర్పడిందని, ఈ ఘటనకు బాధ్యులైన వారిపై కఠిన చర్యలు తీసుకుని, భవిష్యత్తులో పునరావృతం కాకుండా ప్రభుత్వం తక్షణ చర్యలు చేపట్టాలని వైఎస్ జగన్ డిమాండ్ చేశారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్నవారికి అత్యుత్తమ వైద్యసేవలు అందేలా చూడాలని, వారి ఆరోగ్య పరిస్థితిని నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. ఈ ఘటనపై వైద్య ఆరోగ్యశాఖ తక్షణమే దృష్టి సారించి, బాధితులకు సమగ్ర వైద్యం అందేలా చర్యలు తీసుకోవాలని, అవసరమైతే నిపుణుల బృందాలను నియమించాలని పేర్కొన్నారు.

మృతుల కుటుంబాలకు రూ.10 లక్షల పరిహారం: సీఎం చంద్రబాబు

సాక్షి, అమరావతి: రాజమహేంద్రవరంలోని చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్‌లలో కల్తీపాలు తాగి మృతిచెందిన వారి కుటుంబాలకు రూ.10 లక్షల చొప్పున పరిహారం ఇస్తామని సీఎం చంద్రబాబు తెలిపారు. అసెంబ్లీలో సోమవారం ఆయన మాట్లాడుతూ.. ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారి వైద్య ఖర్చులు ప్రభుత్వం భరిస్తుందని తెలిపారు. కోరుకొండ మండలం, నరసాపురం గ్రామానికి చెందిన వరలక్ష్మి మిల్క్ డెయిరీ ఈ పాలను సరఫరా చేసినట్లు చంద్రబాబు తెలిపారు.

ఘటనపై చర్యలు: హోం మంత్రి అనిత

సాక్షి, అమరావతి: రాజమండ్రిలో కల్తీ పాల ఘటనపై అన్ని చర్యలు చేపట్టామని రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత వెల్లడించారు. ఈ ఘటనపై శాసనమండలిలో సోమవారం ఆమె వివరణ ఇచ్చారు. రాజమండ్రి లాలాచెరువు ప్రాంతంలో చౌడేశ్వర్ నగర్, స్వరూప నగర్‌కు చెందిన ప్రజలు అనారోగ్యానికి పాలు సేవించడమే అని ప్రాథమికంగా నిర్ధారణ అయ్యిందన్నారు. పాల నమూనాలను స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ (హైదరాబాద్), స్టేట్ ఫుడ్ ల్యాబొరేటరీ (విశాఖపట్నం), వీఐఎంటీఏ ల్యాబ్స్(హైదరాబాద్)కు పంపించినట్టు తెలిపారు.

రూ.50 లక్షల పరిహారం ఇవ్వాలి

సాక్షి, రాజమహేంద్రవరం: కల్తీ పాలు తాగి మరణించిన ఒక్కొక్కరికీ రూ.50 లక్షల చొప్పున పరిహారం చెల్లించాలని సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు తాటిపాక మధు డిమాండ్ చేశారు. ప్రభుత్వ ఆస్పత్రుల్లో అవసరమైన వైద్య సేవలు, మందులు, పరీక్షలు లేకపోవడం వంటి కారణాలతో పేద, మధ్య తరగతి ప్రజలు ప్రాణాలు కోల్పోతున్నారన్నారు. ప్రజల ప్రాణాలు ప్రమాదంలో ఉన్నా ప్రభుత్వం మాత్రం నిర్లక్ష్య ధోరణితో వ్యవహరిస్తోందని మండిపడ్డారు.

ఇప్పటి వరకూ 12 మందికి డయాలసిస్: కలెక్టర్

సీటీఆర్ఐ (రాజమహేంద్రవరం): అక్యూట్ రీనల్ ఫెయిల్యూర్ కేసులపై ప్రజలు భయాందోళన చెందవద్దని తూర్పు గోదావరి జిల్లా కలెక్టర్ కీర్తి చేకూరి విజ్ఞప్తి చేశారు. రాజమహేంద్రవరంలో మీడియాతో ఆమె మాట్లాడుతూ.. చౌడేశ్వరి నగర్, స్వరూప్ నగర్ ప్రాంతాల్లో కిడ్నీ సంబంధిత కేసులు నమోదైన వెంటనే జిల్లా యంత్రాంగం అప్రమత్తమైందని చెప్పారు. డయాలసిస్ అవసరమై ఇప్పటివరకూ 12 మంది నగరంలోని వివిధ ఆస్పత్రుల్లో చేరారని, ఆ వ్యాపారి పాలు సరఫరా చేసిన 106 కుటుంబాల్లోని సభ్యులకు రక్తపరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. ఇప్పటివరకూ 73 కుటుంబాల నుంచి రక్త నమూనాలు సేకరించామన్నారు. వీరందరికీ నిరంతర పర్యవేక్షణతో తగిన వైద్య సేవలు అందిస్తామని స్పష్టం చేశారు. అనుమానాస్పద లక్షణాలు కనిపించిన వెంటనే హెల్ప్‌లైన్ నంబర్ 94940 60060లో సంప్రదించాలని కలెక్టర్ సూచించారు. జిల్లా ఎస్పీ డి.నరసింహ కిశోర్ మాట్లాడుతూ.. అనధికారికంగా నిర్వహిస్తున్న డెయిరీని సీజ్ చేసి పాల వ్యాపారిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు.డీఎంహెచ్ఓ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ,, అనారోగ్యానికి గురైన వారిలో వికారంతో కూడిన వాంతులు, మూత్ర విసర్జన తగ్గడం వంటి లక్షణాలు కనిపించాయని తెలిపారు. ఆస్పత్రుల్లో చేరిన వారిలో ఎక్కువ మంది 60 ఏళ్ల పైబడిన వారేనన్నారు.

పాల వ్యాపారి అరెస్ట్

కల్తీ పాల కేసులో పాల వ్యాపారి అడ్డాల గణేష్‌ను కోరుకొండ పోలీసులు సోమవారం రాత్రి అరెస్ట్ చేశారు. మహాశివరాత్రి సందర్భంగా ఒక క్యాన్‌లోని 40 లీటర్ల పాలను కల్తీ చేసినట్లు అంగీకరించాడని పోలీసులు చెప్పారు. అతడిపై వివిధ సెక్షన్లతోపాటు హత్య కేసు నమోదు చేశామన్నారు. నిందితుడిని మేజిస్ట్రేట్ ముందు హాజరుపర్చగా.. రిమాండ్ విధించడంతో రాజమహేంద్రవరం సెంట్రల్ జైలుకు తరలించామని తెలిపారు.

సాక్షి ఉద్యోగ అవకాశాలు

WANTED
PYDAH ANIMAL HUSBANDARY POLYTECNIC
Patavala Yanam Road, Kakinada, kakinada District, Ph : 73822 51826
Applications are invited for teaching posts
Qualification : B.V.Sc/ M.V.Sc
Walk-in with the latest resume on or before March 16th, 2026 or Send resume to
principalahpoly@pydah.edu.in



ఏం చేయాలో నిర్ణయించుకోవటం ఎంత ముఖ్యమో, ఏం చేయకూడదో నిర్ణయించుకోవటం అంతే ముఖ్యం.
– స్టీవ్ జాబ్స్

సాక్షి
మంగళవారం, 24 ఫిబ్రవరి 2026

ట్రంప్ అరాచకానికి బ్రేక్

‘అరాచకం సద్దుమణిగింది... దేశాధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ దూకుడుకు కళ్లెం పడింది’ అని అమెరికా ప్రజలంతా ఊపిరి పీల్చుకుని 24 గంటలు గడవకముందే మళ్లీ సమస్య మొదటికొచ్చింది. 1977 నాటి అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టం (ఐఈఈపీఏ) కింద నిరుడు ఏప్రిల్ నుంచి సుంకాలు విధిస్తున్న ఆయన చర్యలు చెల్లబోవని అమెరికా సుప్రీంకోర్టు శుక్రవారం 6–3 మెజారిటీతో తీర్పునివ్వగా, దాన్ని వమ్ము చేస్తూ ట్రంప్ కొత్తగా అన్ని దేశాలపైనా 15 శాతం అదనపు సుంకాలు విధించారు. తీర్పునిచ్చిన న్యాయమూర్తుల్ని మూర్ఖులుగా, దేశభక్తి లోపించిన వారిగా నిందించారు. పలు వ్యాపార సంస్థలతోపాటు 12 రాష్ట్రాలు దాఖలు చేసిన పిటిషన్లపై వెలువడిన ఈ తీర్పువల్ల ధరలు తగ్గి జనం లబ్ధి పొందుతారు. చాలా సందర్భాల్లో సుప్రీంకోర్టు ట్రంప్‌కు అనుకూలంగా తీర్పులిస్తూ వచ్చింది. ఏడాది కాలంలో అది మొత్తం 26 తీర్పులు వెలువరించగా, అందులో 21 ప్రభుత్వ నిర్ణయాలను సమర్థించేవే. ఇందులో అత్యధికం అప్పీళ్ల రూపంలో వచ్చినవి. 2020 అధ్యక్ష ఎన్నికల్లో ఓటమి పాలైనప్పుడు ప్రజల తీర్పును వమ్ముచేయటానికి ప్రయత్నించారన్న ఆరోపణలతో నమోదైన కేసు నుంచి ట్రంప్‌కు తొలి ఉపశమనం దొరికింది. నిరుడు మార్చిలో వలసదారులను బలవంతంగా వెనక్కి పంపే నిర్ణయాన్ని కింది కోర్టులు కొట్టివేయగా, సుప్రీంకోర్టు సమర్థించింది. మొన్న డిసెంబర్‌లో మాత్రం ఇల్లినాయీస్ నేషనల్ గార్డును స్వాధీనంలోకి తీసుకోవటం, షికాగో అభీష్టానికి భిన్నంగా అక్కడికి పంపటాన్ని తప్పుబట్టింది.

నిజానికి గత వారం ట్రంప్‌కు ‘అన్నీ మంచి శకునములే...’ అన్నట్టు మొదలైంది. అమెరికాలో 3,600 కోట్ల డాలర్ల పెట్టుబడులకు అనుమతిస్తూ జపాన్ గత మంగళవారం ఉత్తర్వులు జారీచేసింది. అధిక సుంకాలను 35 శాతానికి పరిమితం చేయటానికి అమెరికా అంగీకరించినందుకు ఈ నిర్ణయం తీసుకుంది. అలాగే అధిక సుంకాలను 32 శాతం వద్దే ఆపుతామన్న ట్రంప్ హామీకి కృతజ్ఞతగా గురువారం ఇండొనేసియా అధ్యక్షుడు దేశంలోని కీలక రంగాల్లో అమెరికా సంస్థల ప్రవేశానికి మార్గం సుగమం చేస్తూ ఉత్తర్వునిచ్చారు. వెంటనే ‘అమెరికా మళ్లీ గెలుస్తోంది’ అంటూ ట్రంప్ ట్రూత్ మాధ్యమం ద్వారా తెగ సంబరపడ్డారు. తీరా సుప్రీంకోర్టు తీర్పుతో ఆ సుంకాలు కాస్తా రద్దయ్యాయి. ఆ తీర్పు అనంతరం ట్రంప్ పెంచిన సుంకాలు కేవలం 15 శాతం కావటంతో ఆ రెండు దేశాలూ తమ నిర్ణయాలకు సహజంగానే పశ్చాత్తాప పడుతున్నాయి. మన దేశం సైతం పునరాలోచనలో పడిందని మీడియా కథనాలు చెబుతున్నాయి. సోమవారం నుంచి వరుసగా మూడు రోజులపాటు మన ప్రతినిధి బృందం అమెరికా అధికారులతో జరపవలసిన చర్చలు వాయిదా పడ్డాయి. వియత్నాం 20 శాతం అదనపు సుంకాలకు అంగీకరించగా, ఇప్పుడది 15 శాతానికి తగ్గింది. ఇంకా దక్షిణ కొరియా, తైవాన్, మలేసియా వంటి దేశాలతోపాటు అమెరికా మిత్రదేశాలు కూడా తలపట్టుకుంటున్నాయి. కాకపోతే ఒప్పందాల్ని రద్దుచేసే సాహసానికి దిగలేదు. నిరుడు 27 దేశాల యూరోపియన్ యూనియన్(ఈయూ) 15 శాతం సుంకాలకు అంగీకరిస్తూ ఒప్పందం కుదుర్చుకోగా, ట్రంప్ వాటిపై సైతం కొత్తగా 15 శాతం అదనపు సుంకాల భారం మోపారు.

తన అరాచక నిర్ణయాలను సుప్రీంకోర్టు అంగీకరిస్తుందని ట్రంప్ గట్టిగా నమ్మారు. అందుకే వీలుచిక్కినప్పుడల్లా సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తిని పొగుడుతూ వచ్చారు. అమెరికాలో న్యాయమూర్తుల నియామకాల్లో అధికార పక్షం ముద్ర బహిరంగ రహస్యం. ఆ రకంగా చూస్తే మొత్తం 9 మంది న్యాయమూర్తుల్లో ప్రధాన న్యాయమూర్తి, మరో అయిదుగురు రిపబ్లికన్ అనుకూలురు. ముగ్గురు మాత్రమే డెమాక్రాటిక్ పార్టీకి చెందినవారు. ఏదేమైనా ట్రంప్ తాజా సుంకాలు 150 రోజులు మాత్రమే అమల్లో ఉంటాయి. ఈలోగా ప్రతినిధుల సభ ద్వారా తన పంతం నెగ్గించుకోవటం ఆయనకు కష్టమే. ట్రంప్ రేటింగ్ పడిపోయి, వచ్చే నవంబర్ మధ్యంతర ఎన్నికల్లో పార్టీ ఊడ్చిపెట్టుకుపోవటం ఖాయం అన్న సర్వేలు వెలువడుతున్న నేపథ్యంలో రిపబ్లికన్లు ఏం చేస్తారన్నది చూడాలి. మొత్తానికి సుప్రీంకోర్టు చెప్పినా సరే... దేశాన్ని అనిశ్చితిలో పడేసే తన ధోరణి మారబోదని ట్రంప్ తేల్చిచెప్పారు.

గ్రహం అనుగ్రహం

శ్రీ విశ్వావసు నామ సంవత్సరం, ఉత్తరాయణం, శిశిర ఋతువు ఫాల్గుణ మాసం, **తిథి:** శు.సప్తమి ఉ.7.47 వరకు, తదుపరి అష్టమి తె.5.24 వరకు (తెల్లవారితే బుధవారం), **నక్షత్రం:** కృత్తిక ప.3.57 వరకు, తదుపరి రోహిణి, **వర్జ్యం:** లేదు, **దుర్ముహూర్తం:** ఉ.8.50 నుండి 9.35 వరకు, తదుపరి రా.10.56 నుండి 11.48 వరకు, **అమృత ఘడియలు:** ప.1.14 నుండి 3.10 వరకు.

సూర్యోదయం : 6.27
సూర్యాస్తమయం: 6.00
రాహుకాలం : ప.3.00 నుండి 4.30 వరకు
యమగండం : ఉ.9.00 నుండి 10.30 వరకు

సోషల్ టాక్

భయం వద్దు

మీరు ఉన్నఫళాన స్త్రీవాదిగా మారలేరు. అందుకోసం మీరు ప్రతిరోజూ పని చేయాలి. అర్థరహితమైన ప్రతి దాన్నీ ప్రశ్నించాలి. సమాజాన్ని ఎదుర్కోవాలి. అన్నిటి కన్నా ముఖ్యం... తప్పు చేస్తానేమోనన్న భయం లేకుండా మీరు ముందుకు సాగాలి.

– గాయత్రి చక్రవర్తి స్పివాక్, స్త్రీవాద విమర్శకురాలు

సజీవం

రాజ్యాంగం పురావస్తు శాల లోని అవశేషంగా మిగిలిపోకూడదు. సజీవమైన, శ్వాసించే గ్రంథంగా ఉపయోగపడాలి. అదే సమయంలో, పౌరులు రాజ్యాంగానికి వినియోగదారులుగా మాత్రమే కాక, సంరక్షకులుగా కూడా వ్యవహరించాలి.

– అభిషేక్ సింఘ్వీ, రాజ్యసభ ఎంపీ

శాశ్వతం

నా సినిమా నా నిశ్శబ్దాల నుంచి, నా ఒంటరితనం నుండి, అణచివేతకు గురైన నా బాల్యం నుండి వస్తుంది. వాస్తవ ప్రపంచం తరచు నాకు తగినంత ఆనందంగా లేనందు వల్లనే నేను నా సొంత ప్రపంచాన్ని ఏర్పరచుకుంటాను.

– సంజయ్ లీలా భన్సాలీ, బాలీవుడ్ దర్శకుడు

అభ్యాసం

విజయం ఎప్పుడూ మీ తల లోకి వెళ్లకూడదు. పరాజయం ఎప్పుడూ మీ హృదయంలోకి వెళ్లకూడదు. జీవితంలో నాకు వైఫల్యాలు ఎదురయ్యాయని నేనెప్పుడూ భావించలేదు. నన్ను మంచి నటుడిగా మార్చిన అభ్యాస అనుభవాలు మాత్రమే నాకు ఉన్నాయి.

– నాని, నటుడు

స్వేచ్ఛ

బైకింగ్ పురుషులది మాత్రమే కాదు... మీరు రోడ్డు మీదకు వచ్చాక, అక్కడ ఉండేది మీరు, మీరు నడిపే యంత్రం, మీ సంకల్పం మాత్రమే. బైక్‌పై ప్రయాణించే ఒక మహిళ ధైర్యం గొప్పగా ఉంటుంది. బుల్లెట్ గర్జన శబ్దం స్వేచ్ఛలా అనిపిస్తుంది.

– ధరిత్రి తెరాంగ్పి, బైకర్–యాక్టివిస్ట్

పరిణామం

మానవులతో సమానంగా ప్రకటనల ప్రపంచం వృద్ధి చెందుతోంది. ఇది మంచి పరిణామం కాదు. ఎవరూ కూడా మరిన్ని ప్రకటనలు చూడటానికి ఉత్సాహంగా మేల్కొని ఉండరు. రేపు వారు చూడబోయే ప్రకటనల గురించి ఆలోచిస్తూ నిద్రపోరు.

– జాన్ కౌమ్, వాట్సాప్ కో–ఫౌండర్

సీమకు తలమానికం తిరునగరి

అభిప్రాయం

మాకిరెడ్డి పురుషోత్తమ రెడ్డి

చరిత్రను తెలుసుకోవడం అంటే గతాన్ని గుర్తుచేసుకుని భవిష్యత్తును నిర్ణయించుకోవడం. గతం లేనిదే వర్తమానం ఉండదు, వర్తమానం లేని భవిష్యత్తును ఊహించుకోలేము. ప్రపంచ ప్రసిద్ధిగాంచిన తిరుపతి నగరానికి ఘనమైన నేపథ్యం ఉన్నది. అలాంటి తిరుపతికి అంకురార్పణ జరిగి నేటికి 896 సంవత్సరాలు.

తిరుపతి నగరానికి అనుకుని ఉన్న ప్రస్తుత తిరుచానూరులోని వేంకటేశ్వర స్వామి ఆలయం, పార్థ సారథి ఆలయం చోళుల కాలంలో రూపొందితే, అటుపిమ్మట పద్మా వతి అమ్మవారి ఆలయం వెలసింది. శ్రీ శుకమహర్షి ఆశ్రమాన్ని ఏర్పరచుకుని తపస్సు చేసిన కారణంగా తిరుశుకనూరుగా పిలిచేవారనీ, అటుపిమ్మట కాలక్రమంలో తిరుచానూరుగా మారిందనీ అంటారు. నారాయణవనం కేంద్రంగా పాలన సాగించిన ఆకాశ రాజు కుమార్తె పద్మావతి అమ్మవారిని శ్రీనివాసుడు వివాహం చేసుకున్నారు. వివాహమనంతరం 6 నెలల దీక్షా కాలాన్ని శ్రీనివాస మంగాపురంలో గడిపారు. దీక్షా కాలం తర్వాత శ్రీనివాసుడు తిరుమల వెళ్ళారు. ఆకాశరాజు సోదరుడు తొండమాన్ చక్రవర్తి కాలంలో శ్రీనివాస మంగాపురం ఆలయ నిర్మాణం జరిగినట్లు తెలుస్తోంది.

ఆధ్యాత్మిక అనుబంధమే పునాది

చారిత్రక ఆధారాల ప్రకారం, 1130 ఫిబ్రవరి 24న రామానుజాచార్యుల నిర్ణయం మేరకు గోవింద రాజపురం అగ్రహారం నిర్మాణానికి పునాది వేశారు. అంటే నేటి తిరుపతి... గోవింద రాజపురంగా పునాది వేసుకుంది. అటు పిమ్మట గోవిందరాజ ఆలయం, దాని చుట్టూ అగ్రహారం నిర్మాణం నారాయణవనం రాజ్య పాలకుడు గట్టురాజు చేపట్టారు. తర్వాత 100 సంవత్సరాలకు ఇది తిరుపతిగా రూపాంతరం చెందింది. తిరుమల శ్రీవారి ఆలయ గోపురం, శ్రీనివాస మంగాపురంతో సహా అనేక ఆలయాలకు గోపురాలు, అభివృద్ధి పనులు యాదవ రాజుల కాలంలో జరిగాయి. అందుకే టీటీడీ ఆలయాలలో యాదవులకు తొలి దర్శన అవకాశం ఒక సంప్రదాయంగా కొనసాగుతోంది.

తిరుపతి రూపుదిద్దుకుంటున్న ప్రారంభంలో తాళ్ళపాక వాసుల కృషి మరువలేనిది. శ్రీవారి ప్రాశస్త్యాన్ని విశ్వవ్యాప్తం చేయడంలో అన్నమయ్య కీర్తనలు ఎలాంటి పాత్ర పోషిస్తున్నాయో ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. అదే తాళ్ళపాకకు చెందిన తాతయ్య తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద వెలిసిన గంగమ్మ ఆలయానికి ఆద్యులు. అందుకే ఈ ఆలయాన్ని తాళ్ళపాక పెద్ద గంగమ్మ ఆలయం అని అంటారు. తాళ్ళపాక వాసులు శ్రీనివాస మంగాపురం ఆలయ అభివృద్ధిలో కూడా పాలుపంచుకున్నట్లు చెపుతారు. తాతాచార్య వంశస్థులు తాతయ్య గుంట గంగమ్మ ఆలయానికి ఆద్యులు. వీరికి తొలి తీర్థం ఇస్తారు.



◆ ఒక ప్రాంతం అభివృద్ధి చెందుతోంది అనడానికి మంచి నగరాలు ఉండటం ఒక కొలమానం. వెనుకబడిన రాయల సీమలో చెప్పుకోవడానికి ఒక నగరం కూడా లేకపోతే ఇక అభివృద్ధికి ఆస్కారం ఎక్కడిది? ఈ వెలితిని తీర్చి మహానగ రంగా మార్చగలిగే అవకాశం తిరుపతికి ఉన్నది.

తుళువ వంశానికి చెందిన శ్రీకృష్ణ దేవరాయలు ఏడుసార్లు తిరుపతి పర్యటన చేశారు. తిరుపతి, తిరుమల, తాను పర్యటించిన నాగలాపురం, నారాయణవనంలో ఆలయాల అభివృద్ధికి ఎంతో కృషి చేశారు. వారి తల్లి నాగులాంబ పేరుతో నాగులాపురం ఆలయాన్ని నిర్మించారు.

మహానగరంగా మార్చే అవకాశం

తిరుపతి, తిరుమల అంటూ ప్రస్తుతం పిలుచుకుంటున్నాం. కానీ చరిత్రను పరిశీలిస్తే రెండూ వేరు వేరు కాదని అర్థం చేసుకోవచ్చు. తిరుపతి నగరం స్వతంత్రం వచ్చే వరకు నార్త్ ఆర్కాట్ జిల్లా పరిధిలో ఉన్నది. నేటి కొండను పురాణాలలో వెంగడం అని పిలిచేవారు. పులికాట్ పరిసరాలను పాలించిన ప్రాంతానికి వెంగో రాష్ట్రం అన్న పేరు కూడా ఉంది. తిరుపతి, తిరుమలపై తమిళ ప్రభావం స్పష్టంగా కనిపిస్తుంది. గతంలో తిరుపతి గానే పిలిచేవారు. తిరు అంటే శ్రీ అని అర్థం. పతి అంటే శ్రీనివాసుడు యజమాని అని. ఆ రకంగా శ్రీనివాసుడి అజమాయిషీలో తిరుపతి ఉంటుంది. ఎంత బాగుంది ఈ పిలుపు! చాలా కాలం వరకు తమిళంలో మేల్ తిరుపతి, కీల్ తిరుపతి (కింద తిరుపతి, పైన తిరుపతి) అని పిలిచేవారు. క్రమేణా కొండ అర్థం వచ్చేలా తిరుమలగా మారింది.

తిరుపతిని అభివృద్ధి చేయడం అంటే శ్రీనివాసుడి అజమాయిషీలో ఉన్న ఆధ్యాత్మిక నగరాన్ని అభివృద్ధి చేయడమే. చారిత్రక, ఆధ్యాత్మిక నేపథ్యం తెలియనివారు తిరుపతి అభివృద్ధికి టీటీడీ నిధులు వెచ్చిస్తే అనవసర వివాదం చేస్తుంటారు. ఏపీ విభజన సమయంలో కేంద్ర ప్రభుత్వం నియమించిన శ్రీకృష్ణ కమిటీ తన పరిశీలనలో రాయలసీమలో చెప్పుకోవడానికి ఒక నగరం లేదు, ఉన్నవన్నీ గ్రామీణ పరిధి దాటని పట్టణాలు అని పేర్కొంది. ఒక ప్రాంతం అభివృద్ధి చెందుతోంది అనడానికి మంచి నగరాలుండటం ఒక కొలమానం. వెనుకబడిన రాయలసీమలో చెప్పుకోవడానికి ఒక నగరం కూడా లేకపోతే ఇక అభివృద్ధికి ఆస్కారం ఎక్కడిది? ఈ వెలితిని తీర్చి మహానగరంగా మార్చగలిగే అవకాశం తిరుపతికి ఉన్నది. తిరుపతి నగరానికి అనుకుని చెన్నై, బెంగళూరు మహానగరాలు ఉన్నాయి. వాతావరణ పరిస్థితులు, భూమి సమస్య ఆ రెండు నగరాలకు ప్రతిబంధకంగా మారింది. ఆ ప్రతిబంధకమే తిరుపతి నగర అభివృద్ధికి అవకాశంగా మారుతుంది. తిరుపతి చుట్టూ ప్రభుత్వ భూమి అందుబాటులో ఉండటంతో పాటు... దేశంలోని అన్ని ప్రాంతాలను అనుసంధానం చేస్తూ రోడ్డు, రైల్వే, విమాన మార్గాలు ఉన్నాయి. చెన్నై నగరానికి సమీపంలో మాజీ ముఖ్యమంత్రి వై.ఎస్. రాజశేఖర రెడ్డి ఏర్పాటు చేసిన శ్రీసిటీ ప్రత్యేక ఆర్థిక మండలి ఆసియా ఖండంలోనే అత్యంత విజయవంతం అయిన సెజ్‌గా మారింది. వాతావరణ సమతుల్యత అదనపు అనుకూలత. అన్ని రకాల జాతీయ, అంతర్జాతీయ సంస్థలు తిరుపతిని అత్యంత సౌకర్యవంతమైన నివాస యోగ్య నగరంగా గుర్తించాయి. తిరుపతి నగర పాలక సంస్థ తీర్మానం చేసినట్లు... చంద్రగిరి, కళ్యాణి డ్యామ్, వడమాల పేట, రాయలచెరువు, ఐఐటీ వరకు తిరుపతిని గ్రేటర్‌గా మార్చి కొన్ని మౌలిక సదుపాయాలు కల్పిస్తే అనతి కాలంలోనే మరో హైదరాబాద్‌గా మారుతుంది.

తొలి దర్శనం నుంచి ప్రథమ పౌరురాలి వరకు...

వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి అధికారంలో ఉన్నప్పుడు తీసుకున్న రెండు కీలక నిర్ణయాలను ప్రస్తావించడానికి ఇది సరైన సమయం. విజయనగర రాజుల తర్వాత యాదవ రాయలు తిరుపతి ఆలయాల అభివృద్ధిలో గొప్ప పాత్ర పోషించారు. శ్రీవారి ఆలయం ముందు భాగాన గొల్లమండపం నిర్మించి, గోవుల పెంపకంతో శ్రీవారి నైవేద్యానికి ఆ పాలను వినియోగించే వారని అంటారు. వివిధ కొలనులను వారి హయాంలోనే నిర్మించినట్లు ఆధారాలు కనిపిస్తాయి. దైవ దర్శనంలో కోనేటి స్నానానికి ఎంత ప్రాముఖ్యత ఉంటుందో తెలిసిందే. అందుకే శ్రీవారి ఆలయాలలో తొలి దర్శనం యాదవ వంశస్థులకు ఇస్తారు. అయితే ఈ సంప్రదాయానికి సాధికారత ఇచ్చింది మాత్రం జగన్ గారే. అదే సామాజిక వర్గానికి చెందిన శిరీష యాదవ్‌ను తిరుపతి నగరానికి తొలి మేయర్‌గా చేసిన ఘనత కూడా జగన్‌కే దక్కుతుంది. అది కూడా జనరల్ మేయర్ స్థానంలో బీసీలకు ఇవ్వాలనే నిర్ణయమూ, తిరుపతి అంకురార్పణలో కీలక భూమిక పోషించిన యాదవ సామాజిక వర్గానికి రాజకీయ గుర్తింపు ఇవ్వడమూ సముచిత నిర్ణయం. ఎంతో స్ఫూర్తినిచ్చే తిరుపతి నగర ఆవిర్భావ చారిత్రక సత్యాన్ని తన అధ్యయనం ద్వారా అందించిన చరిత్రకారుడు దేవిరెడ్డి సుబ్రమణ్యం రెడ్డి, ఈ చారిత్రక సత్యాన్ని గుర్తించి ఆవిర్భావ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించిన నాటి టీటీడీ చైర్మన్ భూమన కరుణాకర రెడ్డి అభినందనీయులు.

వ్యాసకర్త రాయలసీమ మేధావుల ఫోరం సమన్వయ కర్త

ప్రజల ఒత్తిడే యుద్ధాన్ని ఆపగలదు!

నేటితో ఉక్రెయిన్ మీద రష్యా దాడి చేసి, నాలుగేళ్లు పూర్తవుతున్నాయి. ఉక్రెయిన్ వరకూ చూస్తే – లక్ష మందికి పైగా సైనికులు చనిపోయారు. మూడు లక్షల మందికి పైగా గాయపడ్డారు. 15 వేల మందికి పైగా పౌరుల ప్రాణాలు పోయాయి. 40 వేల మందికి పైగా గాయపడ్డారు. రష్యా సైన్యంలో లక్షకు పైగా మరణాలు జరిగి ఉండవచ్చనీ, గాయపడిన వారి సంఖ్య మరింత ఎక్కువగా ఉండవచ్చని భావిస్తున్నారు. ఈ సమాచారాన్ని ఆ యా ప్రభుత్వాలు చెప్పవు. ఐక్యరాజ్య సమితి, ఇనిస్టిట్యూట్ ఫర్ ద స్టడీ ఆఫ్ వార్, బ్రోకింగ్స్ ఇనిస్టిట్యూషన్ వంటి పరిశోధనా సంస్థల ద్వారా బైటకొచ్చిన సమాచారం ఇది. ‘ఉక్రెయిన్ నాటోలో సభ్యత్వం తీసుకోకూడదు! క్రిమియా, డొనెత్స్క్, లుహాన్స్క్, జపోర్జియా, ఖెర్సాన్ వంటి ప్రాంతాలను రష్యాకి చెందినవిగా ఉక్రెయిన్ అంగీకరించాలి! పెద్ద పెద్ద ఆయుధాల్ని, అలాగే పాశ్చాత్య దేశాల మద్దతుని తగ్గించాలి’ లాంటి రష్యా పెట్టే షరతులకు తలొగ్గడానికి ఉక్రెయిన్ సిద్ధంగా లేదు. ఆ షరతులకు తలొగ్గనిదే దిగిరావడానికి రష్యా సిద్ధంగా లేదు.

అమెరికా ఒక పక్కన ఇరాక్, సిరియా, యెమెన్ లాంటి మధ్య ప్రాచ్య దేశాల పైన దాడులు చేస్తూ... ‘రష్యా దాడి అంతర్జాతీయ చట్టాల ఉల్లంఘన’ అనడమూ; ‘ఉక్రెయిన్ భౌగోళిక సమగ్రతను

కాపాడాలి’ అనడమూ హాస్యాస్పదం.

ఉక్రెయిన్‌కు ఇప్పటివరకు అమెరికా నుంచి సైనిక, ఆర్థిక సహాయం 100 బిలియన్ డాలర్లు పొందింది. 500 బిలియన్ డాలర్ల (దాదాపు 45 లక్షల కోట్లు) దాకా అమెరికాలో ఆయుధ వ్యాపారం జరిగి ఉంటుందని అంచనా. ఇవి ‘స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్, డిఫెన్స్ సెక్యూరిటీ కార్పొరేషన్ ఏజెన్సీ, యూ.ఎస్. డిపార్టుమెంట్ ఆఫ్ డిఫెన్స్ లాంటి సంస్థలు ప్రకటించిన సంగతులే!

ఇంక భారత దేశానికి వస్తే, ‘సమతుల్య తటస్థత’ అనే ఎత్తుగడని పాటిస్తూ, చాలా సందర్భాల్లో ఈ విషయంలో ఐక్యరాజ్య సమితి ఏర్పాటు చేసిన వోటింగ్‌లో పాల్గొనకుండా, రష్యాను ఖండించే తీర్మానాలపైన కూడా ఓటు వేయలేదు. భారత ప్రధాని మోదీ 2022లో రష్యా అధ్యక్షుడు పుతిన్‌ను కలిసినప్పుడు ‘ఇది యుద్ధ కాలం కాదు’ అని ఒక వ్యాఖ్యానం చేసి మౌన వ్రతాన్ని పాటించారు.

ఇండియాకు రష్యా నుండి చౌకగా క్రూడ్ ఆయిల్ కావాలి. అలాగే రక్షణ రంగంలో సహకారం కావాలి. అందుకోసం దానితో స్నేహం తప్పదు. అలాగే పాశ్చాత్య దేశాలతో కూడా దానికి కొన్ని అవసరాలు ఉన్నాయి అంటే; ఇండో–పసిఫిక్ ప్రాంతంలో భద్రత, సముద్ర మార్గాల స్వేచ్ఛ, చైనా ప్రభావాన్ని పరోక్షంగా సమతుల్యం చేయడం, టెక్నాలజీ, వ్యాక్సిన్లు, సరఫరా వంటి అంశాల్లో సహకారం కావాలి.

దానికోసమే క్వాడ్ (భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల కూటమి) వంటి వేదికల్లో పాల్గొనడం. వీటన్నిటికీ మించి చైనాతో ఇండియాకు 76 ఏళ్ళ పోరు ఉంది.

అంతర్జాతీయ సంస్థలు కూడా యుద్ధాన్ని ఆపడానికి నిజాయితీగా ఏ ప్రయత్నాలూ చేయడం లేదు. పౌర ప్రాణాలకన్నా ఏదీ ముఖ్యం కాదు కాబట్టి, ముందైతే ‘కాల్పుల విరమణ’ జరగాలి. అది జరగాలి అంటే ఆ యా దేశాల ప్రభుత్వాల మీద ప్రజల ఒత్తిడి పెరగాలి. అది మాత్రమే యుద్ధాన్ని ఆపగలదు.

– నన్నూరి వేణుగోపాల్ । మానవ హక్కుల కార్యకర్త
(రష్యా–ఉక్రెయిన్ యుద్ధానికి నేటితో నాలుగేళ్లు)

పరిమిత సేవలతో వైద్యమెలా?

ఇన్ బాక్స్

ఉద్యోగి, పెన్షనర్ అనారోగ్యానికి గురైనప్పుడు, చికిత్స ఖర్చుల గురించి ఆందోళన చెందకుండా వైద్యం పొందగలగాలి. అదే ఆరోగ్య పథకానికి ప్రాణం. ఈ లక్ష్య సాధన కోసం ఏపీలో ఏర్పాటు చేయబడిన సంస్థ డా।। ఎన్‌టీఆర్ వైద్య సేవా ట్రస్ట్. ప్రజల ఆరోగ్యాన్ని హక్కుగా భావించి, వైద్యం వ్యాపారంగా మారకూడదన్న ఆలోచనతో ఈ ట్రస్ట్ ఏర్పడింది. కానీ కేవలం ఆసుపత్రిలో చేర్పించి చేసే చికిత్సలకు మాత్రమే దీని సేవలు పరిమితమవ్వడం బాధాకరం.

నేడు వైద్య శాస్త్రంలో వచ్చిన పురోగతితో అనేక క్లిష్టమైన వ్యాధులకు కూడా బయట ఉండి చికిత్స తీసుకునే పద్ధతులే ఎక్కువగా అమలులో ఉన్నాయి. గుండె, మూత్రపిండాలు, నరాలు, క్యాన్సర్ వంటి వ్యాధులకు తరచూ పరీక్షలు, వైద్యుల సంప్రదింపులు, మందులు అవసరమవుతున్నాయి. ఇవన్నీ ఆసుపత్రిలో చేర్పు లేకుండానే జరుగుతున్నాయి. ప్రస్తుత విధానంలో ఆసుపత్రిలో చేరినప్పుడు మాత్రమే చికిత్స ఖర్చులు భరిస్తోంది ట్రస్ట్. మరి శస్త్రచికిత్సకు ముందు చేసే పరీక్షలు, శస్త్రచికిత్స అనంతరం తరచూ చేయాల్సిన వైద్య సంప్రదింపులు, మందుల ఖర్చులు అన్నీ కూడా చికిత్సలో విడదీయరాని భాగాలే. ఈ ఖర్చులను కవర్ చేయకపోతే ఎలా?

ఆరోగ్య పథకం ఉద్దేశ్యం నిజంగా నెరవేరాలంటే ప్రతి ఉద్యోగి, పెన్షనర్ కుటుంబానికి కనీసం ఐదు 5 లక్షల రూపాయల విలువైన ‘సమగ్ర ఆరోగ్య బీమా కార్డు’ ఇవ్వాల్సిన అవసరం ఉంది. ఈ కార్డు కుటుంబ మొత్తానికి వర్తించే విధంగా ఉండాలి. గతంలో ఉన్న వ్యాధులకు కూడా మొదటి రోజు నుంచే చికిత్స అందేలా ఏర్పాటు చేయాలి. ప్రత్యేకించి సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రుల్లో తీసుకునే బయట చికిత్సల ఖర్చుల తిరిగి చెల్లింపు తప్పనిసరిగా అమలు చేయాలి. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల్లో ఉన్న గుర్తింపు పొందిన ఉన్నత వైద్య కేంద్రాల్లో తీసుకున్న చికిత్సలకు ఇది వర్తించాలి.

ఇలాంటి సమగ్ర ఆరోగ్య బీమా పథకం ఆర్థికంగా సాధ్యం కాదన్న వాదన సరైంది కాదు. ప్రభుత్వం ప్రధాన భారం భరిస్తూ, ఉద్యోగులు, పెన్షనర్ల నుంచి స్వల్పంగా వసూలు చేస్తే సరిపోతుంది. ప్రభుత్వం నెలకు 1,500 రూపాయలను నిర్ణయించినట్లయితే, ప్రభుత్వం రూ. 900, ఉద్యోగులు రూ. 600 చెల్లించే విధంగా ఉండాలి. కాబట్టి ఎంప్లాయీస్ హెల్త్ స్కీం పథకాన్ని సమీక్షించి... ఉద్యోగులకు, పెన్షనర్లకు ఆరోగ్య, ఆర్థిక భద్రత కల్పించాలి.

– టి.ఎమ్.బి. బుచ్చిరాజు । ఏపీ రూరల్ డెవలప్‌మెంట్ శాఖ ఇంజినీరింగ్ విభాగ రిటైర్డ్ ఉద్యోగుల సంక్షేమ సంఘం అధ్యక్షులు

నగర వినియోగదారు తీరు

డేటా పాయింట్

‘రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా’ నిర్వహించిన ‘కన్జూమర్ కాన్ఫిడెన్స్ సర్వే’ ప్రకారం, గ్రామీణ భారతీయుల కన్నా నగర భారతీయులు ఆర్థికంగా ఉదాసీనంగా ఉన్నారని తేలింది. గ్రామీణుల కంటే కాస్త మెరుగైన ఆర్థిక స్థిరత్వం ఉన్నప్పటికీ నగర వాసులు ఖర్చుకు వెనుకా ముందూ చూసుకుంటున్నారు.

అంశాల వారీగా సర్వేలో తమ ఆర్థిక స్థితి గురించి నగర భారతీయుల స్పందన ఇలా ఉంది...



అంతా తెలియాల్సిందే!

చెడు విన వద్దు, చెడు కనవద్దు, చెడు మాట్లాడవద్దు... వినటానికి ఎంత బాగున్నాయో ఈ మాటలు! ఔనూ, ఏదైనా వినకముందే అది చెడు అని ఎలా తెలుస్తుంది? ఇంతకూ చెడు అంటే ఏమిటి, మంచి అంటే ఏమిటి? ఒకరికి మంచిదైతే మరొకరికి చెడ్డదవుతుంది. ఒకనికి తన మత గ్రంథం మంచిదైతే ఇతరులకు అది చెడ్డదవుతుంది. మరి ఎలా?

ప్రతి దాన్ని చూడాల్సిందే, వినాల్సిందే, మాట్లాడ వలసిందే, చర్చించాల్సిందే. అయితే విచక్షణా జ్ఞానాన్ని వినియోగించి సత్యమేదో, అసత్యమేదో తెలుసుకోవాలి. తనకు, ఇతరులకు మేలు చేస్తుందా, లేదా అని చూడాలి. అది సత్యమై, మేలు చేసేదైతే మంచిది అనుకోవాలి, కీడు చేసేదైతే చెడ్డది అని గ్రహించాలి. ‘చెడు వినవద్దు’ అంటే అలాంటి దాన్ని మరీ, మరీ వినవద్దనే అర్థం గానీ అసలే వినవద్దు అని అర్థంకాదు. మనసులోనే అణచి పెట్టమని కాదు. మరచిపొమ్మని అర్థం.

ఈ ప్రపంచంలోనే చెడు ఉంది కదా, ఇక్కడి నుంచి వెళ్ళిపోవాలా? కొంత చెడు ఉంటుంది, కొంత మంచి ఉంటుంది. మనం వివేకాన్ని వినియోగించి మంచిని గ్రహించి, చెడును వదలివేయాలి. చక్కెర, ఇసుక కలిసి ఉంటే చిన్న చీమ కూడా చక్కెరను తీసికొని, ఇసుకను వదలివేస్తుంది కదా; మరి మనుషులమైన మనం వివేకాన్ని వినియోగించి అలా చేయలేమా? అన్నిటిని విందాం, అన్నిటినీ చూద్దాం, విచక్షణా జ్ఞానాన్ని వినియోగిద్దాం, మంచిని గ్రహిద్దాం. భద్రం శ్రుణ్వంతు (మంచిని విను), భద్రం పశ్యంతు (మంచిని చూడు), భద్రం కుర్వంతు (మంచిని చెయ్యి) అని చెప్పిన మహర్షులకు వారసులం మనం.

– రాచమడుగు శ్రీనివాసులు

సాక్షి ఎడిటోరియల్ పేజీకి వ్యాసాలను, అభిప్రాయాలను యూనికోడ్‌లో పంపాలి. ఈ–మెయిల్: editpage@sakshi.com
ఎడిట్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలను ఆ యా రచయితల వ్యక్తిగత అభిప్రాయాలుగా గమనించాలి.

క్లుప్తంగా...

అంగుళం సైజులో ఖురాన్
150 ఏళ్ల నుంచి భద్రం

అతిచిన్న ఖురాన్ గ్రంథం

మార్కాపురం: ముస్లింలకు అత్యంత పవిత్రమైన గ్రంథం ఖురాన్. 150 ఏళ్ల నుంచి అంగుళం సైజులో ఉన్న ఖురాన్ గ్రంథం ఇప్పటికీ భద్రంగా ఉంది. ప్రకాశం జిల్లా మార్కాపురం కొత్త సెంటర్‌లో స్టార్ ఆటోమొబైల్స్ అధినేత అబ్దుల్ రజాక్ తన తాత మొహిద్దీన్ ఖాన్ సంపాదించిన ఖురాన్‌ను తన తండ్రి దగ్గర నుంచి తాను వారసత్వంగా తీసుకున్నట్లు చెప్పారు. రైల్వే ఉద్యోగి అయిన తన తాత అప్పట్లో ప్రయాణ సమయంలో ఈ ఖురాన్‌ను భూతద్దంతో చదివేవాడని తెలిపారు. ఈ ఖురాన్ గ్రంథం పాదుషా కాలంనాటిది అని చెప్పారు.

అసెంబ్లీలో లడ్డూ అవినీతిని డైవర్ట్ చేసే కుట్ర
మాజీ మంత్రి మేరుగు నాగార్జున ఆక్షేపణ

సాక్షి, అమరావతి: టీటీడీ నిధులు హెరిటేజ్‌కి అడ్డగోలుగా దోచి పెడుతున్నట్లు ఆధారాలతో సహా దొరికిపోయిన చంద్రబాబు.. ఆ అవినీతి బాగోతం బయటపడుతుందనే భయంతోనే ఇన్నాళ్లూ మండలిలో చర్చకు ఒప్పుకోలేదని వైఎస్సార్‌సీపీ బాపట్ల జిల్లా అధ్యక్షుడు, మాజీ మంత్రి మేరుగు నాగార్జున చెప్పారు. ప్రజల్లో హెరిటేజ్ అవినీతిపై చర్చ జరుగుతోందని ఐవీఆర్ఎస్ కాల్స్ సర్వే ద్వారా తెలుసుకున్న చంద్రబాబు.. బలం ఉన్న అసెంబ్లీలో చర్చ పేరుతో 4 గంటల పాటు వైఎస్సార్‌సీపీ మీద బురద జల్లించడానికి సిద్ధమయ్యారని ఆరోపించారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడుతూ.. 'ఇందాపూర్ డెయిరీ నెయ్యిని హైదరాబాద్‌లో కేజీ రూ.560కి విక్రయిస్తున్నారు. అదే ఇందాపూర్ డెయిరీ నెయ్యిని టీటీడీకి కేజీ రూ.685కి సరఫరా చేస్తోంది. ఆ రకంగా టీటీడీ నిధుల్ని ఇందాపూర్ డెయిరీ ముసుగులో హెరిటేజ్‌కు బాబుదోచి పెడుతున్నారు' అని చెప్పారు. 'తిరుమల లడ్డూ వ్యవహారం, ఇందాపూర్ – హెరిటేజ్ డెయిరీల అనుబంధంపై మండలిలో చర్చించాలని వైఎస్సార్‌సీపీ పట్టుబడుతూనే ఉంది. బాబు బండారాలు బయటపడతాయని మండలిలో చర్చించకుండా పారిపోతూనే ఉన్నారు. మండలిలో కాకుండా, అసెంబ్లీలో బలం ఉంది కాబట్టి, ప్రజల్లోకి ఏకపక్షంగా కూటమి సభ్యులతో అబద్ధాలు చెప్పించడానికి నాలుగు గంటల పాటు చర్చిస్తామని ప్రభుత్వం ప్రకటించింది. వైఎస్సార్‌సీపీ మీద బురద జల్లడమే లక్ష్యంగా బాబు ఈ కుట్ర పన్నారు' అని నాగార్జున చెప్పారు.

వీఎస్ఆర్ వెంచర్స్ వెనుక హెరిటేజ్ ఫిన్‌లీజ్
వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్‌రెడ్డి ఫైర్

సాక్షి,అమరావతి: ప్రైవేటు మినీ విమానాలు నిర్వహిస్తున్న వీఎస్ఆర్ వెంచర్స్‌లో చంద్రబాబు కుటుంబ సభ్యులు పెట్టుబడులు పెట్టి ప్రజాధనాన్ని దోపిడీ చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ అధికార ప్రతినిధి కారుమూరి వెంకట్‌రెడ్డి ఆరోపించారు. ప్రభుత్వ ఖర్చులతో జరిగే వ్యవహారాల ద్వారా చంద్రబాబు కుటుంబం లబ్ధి పొందుతోందని, ఇది కదా అసలైన క్విడ్ ప్రోకో అని అన్నారు. ఆయన సోమవారం తాడేపల్లిలోని వైఎస్సార్‌సీపీ కేంద్ర కార్యాలయంలో మీడియాతో మాట్లాడారు. 'వైఎస్ జగన్‌ను రాజకీయంగా దెబ్బతీసే దురుద్దేశంతో చంద్రబాబు తిరుమల లడ్డూలో పంది కొవ్వు, దున్న కొవ్వు అంటూ ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేశారు. ఇందులో హెరిటేజ్, ఇందాపూర్ డెయిరీల మధ్య ఉన్న వ్యాపార బంధం బయటపడి చంద్రబాబే అడ్డంగా దొరికిపోయారు. మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాదంతో మరో కొత్త వ్యవహారం వెలుగులోకి వచ్చింది. హెరిటేజ్ ఫిన్‌లీజ్ అనే మరో సంస్థ ద్వారా వీఎస్ఆర్ వెంచర్స్‌లో పెట్టుబడులు పెట్టిన విషయం బయటపడింది. ఇందులో పెట్టుబడిదారులుగా హెరిటేజ్ ఫిన్‌లీజ్ అధినేతలు నారా భువనేశ్వరి, బ్రాహ్మణి ఉన్నారు. ఈ సంస్థ విమానాలను చంద్రబాబు ప్రభుత్వం వినియోగిస్తూ ప్రజాధనాన్ని ఆ సంస్థకు చెల్లిస్తున్నారు. ఇదే అసలైన క్విడ్ ప్రో కో వ్యవహారం. ఈ విమానాల్లో చంద్రబాబు కుటుంబం యధేచ్ఛగా విహరిస్తోంది' అని చెప్పారు.

ఏఐ గుప్పిట్లోకి కోచింగ్ మాడ్యూల్

నీట్, జేఈఈ పరీక్షల కోసం సరికొత్త లెర్నింగ్ మాడ్యూల్స్
ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోచింగ్ కోసం సరికొత్త టెక్నాలజీ
2028 నాటికి రూ.2.5 లక్షల కోట్ల పెట్టుబడులు
నాణ్యత తప్పితే ఒత్తిడి పెరుగుతుందనే ఆందోళన



జాతీయ పరీక్షల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ఆధిపత్యం

సాక్షి, హైదరాబాద్: జాతీయ ఇంజనీరింగ్, మెడికల్ వంటి కీలకమైన కోచింగ్‌ను ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ ప్రభావితం చేయబోతోంది. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ కోచింగ్ కేంద్రాల నిర్వాహకులు దీనిపై పెద్దఎత్తున పెట్టుబడులు పెట్టేందుకు సిద్ధమవుతున్నారు. ప్రముఖ బిజినెస్ కన్సల్టెన్సీ సర్వీసుల సంస్థ ఇలాంటి అంశాలపై అధ్యయనం చేసి ఇటీవల మార్కెట్ రీసెర్చ్ నివేదికను వెల్లడించింది. మారుతున్న ట్రెండ్‌కు అనుగుణంగా కోచింగ్ విధానాలను ఏఐతో అనుసంధానించాలని భావిస్తున్నట్లు తెలిపింది. అంతర్జాతీయ సాఫ్ట్‌వేర్ సంస్థలతో పాటు ఆన్‌లైన్ కోచింగ్ కేంద్రాలను ఇప్పటికే తీసుకున్నాయి. నీట్, జేఈఈ కోచింగ్‌ల్లో 80 శాతం మంది కోచింగ్‌పైనే ఆధారపడుతున్నారు. 2022 వరకూ కోచింగ్ కేంద్రాల వ్యాపారం దేశవ్యాప్తంగా రూ. 58 వేల కోట్లు ఉంది. 2025 నాటికి ఇది రూ.70 వేల కోట్లకు చేరింది. 2028 నాటికి రూ. 1.38 లక్షల కోట్లకు చేరుతుందని ఈ సంస్థ అంచనా వేసింది. అయితే, ఏఐ ఆధారిత మాడ్యూల్స్‌ను జోడించడం వల్ల ఇది 2028 నాటికి 2.5 లక్షల కోట్లకు చేరుతుందని భావిస్తున్నారు. ఇప్పటికే కోచింగ్ కేంద్రాలు మార్కెట్లో పబ్లిసిటీకి ఏటా రూ.150 కోట్లకుపైగానే ఖర్చు పెడుతున్నాయి.

కేంద్ర కమిటీ అధ్యయనం

జేఈఈ, నీట్ కోచింగ్ కేంద్రాల పనితీరుపై కేంద్ర విద్యాశాఖ గత ఏడాది కమిటీ వేసింది. కేంద్ర ఉన్నత విద్య కార్యదర్శి వినీత్ జోషి చైర్మన్‌గా ఈ కమిటీలో సీబీఎస్ఈ చైర్మన్, పాఠశాల ఉన్నత విద్య విభాగాల సంయుక్త కార్యదర్శులు, ఐఐటీ, ఎన్ఐటీ, ఎన్సీఈఆర్టీ ప్రతినిధులు, కేంద్రీయ-నవోదయ విద్యాలయాలు, ప్రైవేటు స్కూల్ ప్రిన్సిపల్‌ను ఇందులో సభ్యులుగా చేర్చింది. కోచింగ్‌తో పనిలేకుండా పోటీ పరీక్షలకు ఎలా సన్నద్ధమవ్వాలనే కోణంలో పరిశీలించేలా ఈ కమిటీ నివేదిక ఇవ్వాలి. ప్రైవేటు కోచింగ్ కేంద్రాల పబ్లిసిటీ, నాణ్యత ప్రమాణాలను ఈ కమిటీ పరిశీలించాలి. పాఠశాల విద్యలో లోపాలు, క్రిటికల్ థింకింగ్ విధానాలు, స్కూల్ విద్య నుంచే పోటీ పరీక్షల సన్నద్ధత, కాలేజీల్లో కెరీర్ గైడెన్స్, ఒత్తిడి లేని సిలబస్ తీసుకురావడంపై కమిటీ అధ్యయనం చేయనుంది. ఇప్పుడు ఏఐ పాత్ర పెరుగుతుండటంతో మరింత లోతుగా అధ్యయనం చేయాలని భావిస్తోంది.

ఒత్తిడి పెరుగుతుందా? తగ్గుతుందా?

కోచింగ్ కేంద్రాలు ఏఐ మాడ్యూల్స్‌ను అనుసరిస్తున్నాయి. అయితే, దీనిపై ముందుగా విద్యార్థులకు అవగాహన కల్పించాలి. ఇందుకు అవసరమైన ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలి. దేశంలోని 78 శాతం కోచింగ్ కేంద్రాల్లో కనీస నాణ్యత ప్రమాణాలు లేవని కేంద్ర విద్యాశాఖ గుర్తించింది. ఫలితంగా జేఈఈ, నీట్‌లో వివిధ రూపాల్లో ప్రశ్నలు వస్తే విద్యార్థులు సమాధానం ఇవ్వలేకపోతున్నారు. ఈ దశలో ఏఐ మాడ్యూల్స్ కోచింగ్ తీసుకునే విద్యార్థులకు మానసిక ఒత్తిడి వస్తుందని నిపుణులు అంటున్నారు. జేఈఈ మెయిన్స్‌కు ఏటా 13 లక్షల మంది, నీట్‌కు 22 లక్షల మంది పోటీపడుతున్నారు. కోచింగ్ కేంద్రాలు ర్యాంకులు సాధించే మెరిట్ విద్యార్థులను విడిగా పెట్టి క్లాసులు నిర్వహిస్తాయి. వీళ్లు 20 శాతమే ఉంటున్నారు. మిగతా వాళ్లను నాణ్యత లేని ప్యాకేజీతో కాలం వెళ్లదీస్తున్నాయి. ర్యాంకులు రాని విద్యార్థులు తీవ్ర మానసిక వేదనకు గురవుతున్నారు. ఆత్మహత్యలకూ పాల్పడుతున్నారు. నేషనల్ క్రైం రికార్డు బ్యూరో లెక్కల ప్రకారం 2013లో 8,423 మంది విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకుంటే, 2022 నాటికి ఈ సంఖ్య 13,044కు పెరిగింది. 2025 నాటికి ఇది 13 శాతం పెరిగినట్టు అంచనా వేసింది. ఈ పరిస్థితికి వెళ్లకుండా ఆన్‌లైన్ కేంద్రాలపై నియంత్రణ అవసరమని ఐఐటీ–బాంబే అధ్యాపకుడు నీలం త్రివిక్రమ్ సూచించారు.

ఈ లాంగ్వేజ్ కీలకం

పైథాన్ లాంగ్వేజ్ ఆధారంగా ప్రోగ్రామింగ్ చేస్తున్నారు. నీట్, జేఈఈ వంటి వాటిల్లో అనలిటిక్స్, స్టూడెంట్ ప్రొఫైలింగ్, అనుమానాల నివృత్తి చేసే చాట్‌బాట్స్ మొత్తం ఏఐతోనే పనిచేస్తాయి. ఇవి ప్రశ్నల్లో ఉన్న కఠినత్వం, వాటి పరిష్కారం, మాక్ టెస్టుల నిర్వహణ, విద్యార్థి వ్యక్తిగత స్టడీ ప్లాన్ రూపొందిస్తాయి. లైవ్ డాష్‌బోర్డ్, ఏఐ చాట్‌బాట్లను రూపొందిస్తున్నారు. ర్యాంక్ ప్రిడిక్షన్ ద్వారా సీటు ఎక్కడ వస్తుందనే కౌన్సెలింగ్ ప్లానింగ్ కూడా ఉంటుంది. న్యూరల్ నెట్‌వర్క్, అటెన్షన్ మాడ్యూల్స్ ప్రిపరేషన్ స్థాయిని పెంచేలా ప్రోగ్రామ్ చేస్తున్నారు. కెమికల్ ఎడ్యుకేషన్ బ్యాలెన్సింగ్, ఆర్గానిక్ రియాక్షన్ సీక్వెన్స్ అనాలిసిస్ ఏఐ అందిస్తుంది. సింబాలిక్ రీజనింగ్, ఇంటిగ్రేషన్, డిఫరెన్షియేషన్ లాజిక్, వెక్టార్ అండ్ మ్యాట్రిక్స్ ఇంటర్‌ప్రిటేషన్ వంటి మ్యాథ్స్ ఆధారిత ప్రోగ్రామింగ్‌లోనూ ఏఐ కీలక పాత్ర పోషించబోతోంది.

చంద్రబాబు కాపులను వేధిస్తున్నారు

- మేము బానిసలం కాదు
- మాజీ మంత్రుల నివాసాలపై దాడులు అత్యంత దారుణం
- చంద్రబాబు సర్కారుపై కాపు ఉద్యమ నేత ముద్రగడ పద్మనాభం ఆగ్రహం

అంబటిని పరామర్శిస్తున్న ముద్రగడ పద్మనాభం, తమ్మినేని సీతారాం, మేరుగ, చిత్రంలో నూరిఫాతిమా, మురళీకృష్ణ, బాలవజ్రబాబు

పట్నంబజారు(గుంటూరు ఈస్ట్)/ఇబ్రహీంపట్నం: కాపుల వల్లే రెండుసార్లు ముఖ్యమంత్రి అయిన చంద్రబాబు వారిపైనే దాడులు చేయిస్తూ అవమానాలు, వేధింపులకు గురిచేస్తున్నారని కాపు ఉద్యమ నేత, వైఎస్సార్‌సీపీ నాయకులు ముద్రగడ పద్మనాభం ఆగ్రహం వ్యక్తం చేశారు. కాపులంతా బానిసలుగా బతకాలని చంద్రబాబు కోరుకుంటున్నారని, అది జరగదని మండిపడ్డారు. సోమవారం ఆయన గుంటూరు సిద్ధార్థ నగర్‌లోని మాజీ మంత్రి అంబటి రాంబాబు ఇంటికి మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి మేరుగు నాగార్జునతో కలిసి వచ్చారు. అంబటిని పరామర్శించారు. ఆయన యోగక్షేమాలను అడిగి తెలుసుకున్నారు. ముద్రగడ మాట్లాడుతూ గతంలో తనపైనా, తన కుటుంబంపైనా దాడి చేయించారని, ఇప్పుడు అంబటి రాంబాబు కుటుంబంపైనా దాడి చేయించారని చంద్రబాబుపై మండిపడ్డారు. 'అయ్యా చంద్రబాబు నీకు, మీ సతీమణి, మీ కుమారుడు, కోడలికి అవమానం జరిగితే మీ ఫీలింగ్స్ ఏమిటి?' అని ముద్రగడ ప్రశ్నించారు. మాజీ మంత్రుల నివాసాలపై దాడులు చేయించటం అత్యంత దారుణమని ఆగ్రహం వ్యక్తం చేశారు. తిరుమల లడ్డూ ప్రసాదం విషయంలో చంద్రబాబు అబద్ధాలు వల్లించడం హాస్యాస్పదమన్నారు. మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ మంత్రి మేరుగు నాగార్జున మాట్లాడుతూ అరెస్టులు, అక్రమ కేసులకు వైఎస్సార్‌సీపీ నేతలు భయపడరని స్పష్టం చేశారు. ఇప్పటికైనా అబద్ధాలు ఆపి దేవదేవుడికి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. అలాగే ఇబ్రహీంపట్నంలో మాజీ మంత్రి జోగి రమేష్ కుటుంబ సభ్యులను సోమవారం ముద్రగడ పద్మనాభం పరామర్శించారు. దాడి జరిగిన తీరును జోగి రమేష్ ఆయనకు వివరించారు. మాజీ మంత్రి సీదిరి అప్పలరాజు కూడా జోగి రమేష్‌ను పరామర్శించారు. కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ నగర గుంటూరు నగర అధ్యక్షురాలు షేక్ నూరి ఫాతిమా, పొన్నూరు నియోజకవర్గ సమన్వయకర్త అంబటి మురళీకృష్ణ, తాడికొండ నియోజకవర్గ సమన్వయకర్త వనమా బాలవజ్రబాబు, పార్టీ రాష్ట్ర కార్యదర్శి నిమ్మకాయల రాజనారాయణ, వైఎస్సార్‌సీపీ భీమవరం నియోజకవర్గం ఇన్‌చార్జ్, ఉమ్మడి గోదావరి జిల్లాల కాపు సంఘం అధ్యక్షుడు చిలిమిలి వెంకటరాయుడు, పార్టీ రాష్ట ప్రధాన కార్యదర్శి తోట రామకృష్ణ పాల్గొన్నారు.

గుంతకల్లులో దొంగల బీభత్సం

నలుగురు రైల్వే ఉద్యోగుల ఇళ్లల్లో చోరీ
86 తులాల బంగారం, 2.05 కిలోల వెండి, రూ.3.70 లక్షల నగదు అపహరణ

దుస్తులు, వస్తువులు బయట పడేసిన దృశ్యం

గుంతకల్లు: అనంతపురం జిల్లా గుంతకల్లులో ఆదివారం రాత్రి దొంగలు బీభత్సం సృష్టించారు. స్థానిక రైల్వేకాలనీలోని నాలుగు క్వార్టర్స్‌లలో దొంగతనం చేశారు. తాళాలు వేసి ఉన్న ఆ ఇళ్లల్లోంచి మొత్తం 86 తులాల బంగారం, 2.05 కిలోల వెండి, రూ.3.70 లక్షల నగదు అపహరించారు. పట్టుకునేందుకు వెంటాడిన బాధితులు, పోలీసులపై రాళ్లు, కత్తులతో దాడిచేసి దొంగలు పరారయ్యారు. గుంతకల్లులో రైల్వే డబుల్ క్వార్టర్స్‌లో రైల్వే ఉద్యోగులు నాగరాజు, నరసింహారెడ్డి, రాజేష్, సమీపంలోని మరో బ్లాక్‌లో బాలాజీనాయక్ నివాసం ఉంటున్నారు. బాలాజీనాయక్ తన కుమారుడు చిత్తేష్‌నాయక్‌కు సోమవారం ఇంటర్ ఫస్టియర్ పరీక్షలు ఉండడంతో ఆదివారం కారులో కుటుంబంతో సహా అనంతపురం వెళ్లారు. నాగరాజు సమీప బంధువు, ఆర్పీఎఫ్ పోలీసు ప్రసాద్ కుమార్తె రిసెప్షన్‌కు కుటుంబసభ్యులు, బంధువులతో కలిసి బస్సులో అనంతపురం వెళ్లారు. నరసింహారెడ్డి నైట్ డ్యూటీకి వెళ్లగా, రాజేష్ వ్యక్తిగత పనుల రీత్యా ఆదివారం రాత్రి ఇంట్లో లేరు. నాలుగు ఇళ్లకు తాళాలు వేసి ఉన్నాయి. ఇదే అదునుగా భావించిన దొంగలు ఈ నాలుగు ఇళ్లల్లోకి చొరబడ్డారు. బాలాజీనాయక్ ఇంట్లో దాదాపు 75 తులాల బంగారు ఆభరణాలు, 1.50 కిలోల వెండి, రూ.2 లక్షల నగదు, కుమారుడు చిత్తేష్ హుండీ డబ్బు కూడా ఎత్తుకెళ్లారు. నాగరాజు ఇంట్లో 7.5 తులాల బంగారం, 55 తులాల వెండి, రూ.1.60 లక్షల నగదు, నరసింహారెడ్డి ఇంట్లో 3.8 తులాల బంగారం, రూ.10 వేల నగదు అపహరించారు. రాజేష్ ఇంట్లో ఏమీ దొరకలేదు.

బందిపోట్లను తలపిస్తూ..

అపహరించిన సొమ్ము, సొత్తు మూటలతో దొంగలు రాత్రి 2.30 గంటల సమయంలో వెళ్లడానికి సిద్ధమయ్యారు. అదే సమయంలో నాగరాజు కుటుంబసభ్యులు అనంతపురంలో వివాహ రిసెప్షన్ ముగించుకుని ఇంటికి వచ్చారు. తాళం పగులగొట్టి ఉండడంతో నాగరాజు వెంటనే 100కు డయల్ చేసి పోలీసులకు సమాచారం ఇచ్చారు. చుట్టుపక్కల చీకటి ప్రదేశాల్లో వెదికిన నాగరాజు కుటుంబసభ్యులు సమీపంలోని ముళ్లపొదల్లో నక్కి ఉన్న ముగ్గురు దొంగలను గమనించారు. అంతలోనే వన్‌టౌన్ పోలీసులు అక్కడికి చేరుకున్నారు. అందరూ కలిసి పట్టుకోవడానికి ప్రయత్నించగా దొంగలు రాళ్లు విసిరారు. నాగరాజుపైకి కత్తి విసరగా ఆయన తప్పించుకున్నారు. నాగరాజు అన్న వీరేష్‌పై కాలిపై రాయి పడడంతో రక్తగాయమైంది. సొమ్ము, సొత్తు మూటలతో పారిపోతున్న దొంగలను పట్టుకోవడానికి పోలీసులు వెంటాడినా ప్రయోజనం లేకపోయింది. దొంగలు రాళ్లు విసురుతూ సమీపంలోని హంపయ్య కొట్టాల మీదుగా ముళ్లపొదల్లో వెళ్లి అక్కడ నుంచి చీకట్లో అదృశ్యమయ్యారు. ముగ్గురు దొంగలు పారిపోతున్న దృశ్యాలు సీసీ కెమెరాల్లో రికార్డయ్యాయి. గుంతకల్లు డీఎస్పీ శ్రీనివాస్, సీఐ మనోహర్ సోమవారం ఘటనాస్థలాన్ని పరిశీలించారు. పోలీసు జాగిలాలు హంపయ్య కొట్టాల ఏరియా వైపు వెళ్లి అక్కడ ఆగిపోయాయి.

చంద్రబాబుపై కేసుల మూసివేత దస్త్రాలు ఇప్పించండి

హైకోర్టులో విశ్రాంత అధికారి కొండలరావు పిటిషన్లు

సాక్షి, అమరావతి: చంద్రబాబు 2014–19 మధ్య ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో జరిగిన ఏపీ స్కిల్ డెవలప్‌మెంట్ కుంభకోణం, ఇన్నర్ రింగ్ రోడ్డు భూముల కుంభకోణంపై సీఐడీ నమోదు చేసిన కేసులను మూసివేసిన ఉత్తర్వుల కాపీతో పాటు ఆ కేసు తాలూకా దస్త్రాలు ఇప్పించాలని విశ్రాంత ఉద్యోగి వేము కొండలరావు హైకోర్టులో రివిజన్ పిటిషన్లు దాఖలు చేశారు. కేసుల దస్త్రాలు ఇవ్వడానికి నిరాకరిస్తూ విజయవాడ ఏసీబీ కోర్టుజారీ చేసిన ఉత్తర్వులను సవాలు చేశారు. ఈ వ్యాజ్యాలపై సోమవారం న్యాయమూర్తి డాక్టర్ జస్టిస్ వెంకట జ్యోతిర్మయి ప్రతాప విచారణ జరిపారు. పిటిషనర్ తరపున న్యాయవాది జడా శ్రవణ్‌కుమార్ వాదనలు వినిపించారు. పిటిషనర్ ఈ కేసులకు థర్డ్ పార్టీ అనే కారణంతో దస్త్రాలు ఇచ్చేందుకు ఏసీబీ కోర్టు నిరాకరించిందని తెలిపారు. కేసులో విస్తృత ప్రజాప్రయోజనాలు ముడిపడి ఉన్నాయని.. థర్డ్ పార్టీ సైతం అన్నీ దస్త్రాలు పొందవచ్చునని తెలిపారు. ఈ వ్యాజ్యాల్లో ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతివాదిగా ఉన్నారని, ఆయనకు నోటీసులు ఇవ్వాలని కోరారు. పోలీసుల తరపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) మెండ లక్ష్మీనారాయణ వాదనలు వినిపిస్తూ ఇదే తరహా పిటిషన్లు ఇప్పటికే హైకోర్టులో పెండింగ్‌లో ఉన్నాయని గుర్తుచేశారు. ఇరుపక్షాల వాదనలు విన్న న్యాయమూర్తి పూర్తి వివరాలు సమర్పించాలని సీఐడీని ఆదేశిస్తూ విచారణను వచ్చే వారానికి వాయిదా వేశారు.

నేటి నుంచి అంగన్‌వాడీల నిరాహార దీక్షలు

యూనియన్ నేతలతో మంత్రి సంధ్యారాణి చర్చలు విఫలం

సాక్షి, అమరావతి: అంగన్‌వాడీలకు వేతనాల పెంపుపై ప్రభుత్వం దాటవేత ధోరణి అవలంబిస్తోంది. అంగన్‌వాడీలకు చెందిన 3 యూనియన్లు ఉద్యమ కార్యాచణ ప్రకటించిన నేపథ్యంలో మంత్రి సంధ్యారాణి సంఘం నేతలతో సోమవారం జరిపిన చర్చలు విఫలమయ్యాయి. దీంతో మంగళవారం నుంచి నిరాహార దీక్షలు ప్రారంభించనున్నారు. వెలగపూడిలోని సచివాలయంలో మహిళా శిశు సంక్షేమ శాఖ కార్యదర్శి ఎ.సూర్యకుమారితో కలిసి జరిపిన చర్చల్లో వేతనాల పెంపు తప్ప, మిగిలిన అంశాలను చర్చించడంతో యూనియన్ నేతలు తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు.

ఏసీబీ ఉచ్చులో సీఐ, ఎస్ఐ

అనిల్‌కుమార్, వెంకటరమణ

సింహాద్రిపురం: లంచం తీసుకుంటున్న ఎస్ఐని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకుని కేసు నమోదు చేసిన ఏసీబీ అధికారులు, ఆయన వాంగ్మూలం మేరకు సీఐని కూడా అదుపులోకి తీసుకున్న ఘటన వైఎస్సార్ కడప జిల్లా సింహాద్రిపురంలో చోటుచేసుకుంది. ఏసీబీ జిల్లా డీఎస్పీ సీతారామారావు సోమవారం తెలిపిన సమాచారం ప్రకారం ఇటీవల సింహాద్రిపురంలో బంగారం చోరీ కేసులో బండిపై దొంగలు వెళ్లినట్టు సీసీ కెమెరా ద్వారా గుర్తించారు. ఆ బండి నెంబర్ ట్రేస్ చేయగా అనంతపురానికి చెందిన బ్రహ్మం అనే కన్సల్టెంట్ ఆ బైకును బీహార్‌కు చెందిన దిలీప్ అనే వ్యక్తికి అమ్మినట్లు తేలింది. దీంతో బ్రహ్మంసహా ఈ బైక్ విక్రయ ప్రక్రియలో పాలుపంచుకున్న వారందరినీ 11రోజులుగా పులివెందుల రూరల్ సీఐ వెంకటరమణ, సింహాద్రిపురం ఎస్ఐ అనిల్ కుమార్ భయభ్రాంతులకు గురిచేయడం ప్రారంభించారు. బైక్‌తో తమకు ప్రస్తుతం ఎటువంటి సంబంధం లేదని వారు పేర్కొన్నప్పటికీ ఎస్ఐ, సీఐ వారిని వదిలిపెట్టలేదు. రూ.22 లక్షలు ఇవ్వకపోతే అందరిమీదా ఈ కేసును బనాయిస్తామని హెచ్చరించారు. అయితే చివరకు రూ.4 లక్షలకు బేరం కుదిరింది. ఈ క్రమంలో బాధితులు ఏసీబీని ఆశ్రయించారు. పోలీస్‌స్టేషన్‌లో ఎస్ఐ రూ.1.50 లక్షలు తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు పట్టుకున్నారు. సీఐ డబ్బు తీసుకోమంటే తీసుకున్నానన్న ఎస్ఐ వాంగ్మూలం మేరకు లింగాల – పులివెందుల మధ్యలో సీఐని కూడా అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేశారు.

బీజేపీ కార్యకర్త ఆత్మహత్యాయత్నం

- టీడీపీ నేతలకు అనుకూలంగా ఇంటి స్థలం రాళ్లు తొలగించిన సీఐ
- వారం రోజులుగా రోజూ స్టేషన్‌కు పిలిపించి వేధింపులు
- మనోవేదనతో ఆత్మహత్యాయత్నం

అంకారావు

త్రిపురాంతకం: ఇంటి స్థలం వివాదంలో సీఐ తన కుటుంబ సభ్యులను వేధించాడంటూ ఓ బీజేపీ కార్యకర్త పురుగుల మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసిన ఘటన మార్కాపురం జిల్లా త్రిపురాంతకం మండలం పాత అన్నసముద్రం గ్రామంలో సోమవారం జరిగింది. బాధిత కుటుంబ సభ్యుల కథనం మేరకు.. గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త పంపనాటి అంకారావు ఇంటి వెనక టీడీపీ నేతల ఇళ్లు ఉన్నాయి. వాటికి దగ్గర దారి కోసం అంకారావు ఇంటి స్థలం నుంచి అక్రమంగా రోడ్డు వేసేందుకు టీడీపీ నాయకులు ప్రయత్నించారు. టీడీపీ వర్గీయులకు సీఐ అసాన్ వత్తాసు పలికి అంకారావు ఇంటి హద్దు రాళ్లను శనివారం దగ్గరుండి తొలగించారు. అంతటితో ఆగక అతని కుటుంబ సభ్యులను పోలీస్‌స్టేషన్‌కు రావాలని హెచ్చరించారు. స్టేషన్‌కు వెళ్లిన అంకారావు తండ్రి సుబ్బయ్య, తమ్ముడు విజేష్‌ని బెదిరించి ఒకరోజు స్టేషన్‌లోనే ఉంచారు. అంతక్రితం వారం రోజులుగా తరచూ పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి స్థలం వదిలేసుకోవాలంటూ వేధించారు. అక్రమంగా కేసులు బనాయించడంతోపాటు, ఫిర్యాదును కూడా తిరస్కరించారు. తిరిగి సోమవారం రావాలని హుకుం జారీ చేశారు. దీంతో తీవ్ర మనస్తాపానికి గురైన అంకారావు తన పొలానికి వెళ్లి సెల్ఫీ వీడియోలో ఆవేదన వ్యక్తం చేస్తూ పురుగుల మందు తాగాడు. 'బీజేపీ కార్యకర్తలకు న్యాయం జరగడం లేదు. గ్రామానికి చెందిన టీడీపీ నేతలకు సీఐ వత్తాసు పలికి దౌర్జన్యం చేశాడు' అని వాపోతూ స్థానిక వాట్సాప్ గ్రూప్‌లో పోస్టు చేశాడు. అపస్మారక స్థితిలో ఉన్న అంకారావును పక్క పొలాల్లో ఉన్న వ్యక్తి చూసి హుటాహుటిన ఆస్పత్రిలో చేర్చి, బంధువులకు సమాచారం ఇచ్చాడు. ప్రాణాపాయ స్థితిలో ఉండటంతో మెరుగైన వైద్యం కోసం వినుకొండ ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. అతని పరిస్థితి విషమంగా ఉందని వైద్యులు చెప్పారు. అంకారావు వీహెచ్‌పీలో యాక్టివ్‌గా పనిచేసే కార్యకర్తగా ఈప్రాంతంలో గుర్తింపు ఉంది.

ఎస్పీకి బీజేపీ నేతల ఫిర్యాదు

అంకారావు సెల్ఫీ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో బీజేపీ రాష్ట్ర మీడియా ప్రతినిధి ఏలూరి రామచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షుడు కే పిచ్చయ్య, పార్టీ మండల కార్యదర్శి ఎస్ మల్లికార్జున్ అధికారులతో, అంకారావు కుటుంబ సభ్యులతో మాట్లాడారు. జిల్లా ఎస్పీతో ఘటనపై వాస్తవాలు తేల్చేందుకు విచారణ జరపాలని కోరినట్లు రామచంద్రారెడ్డి తెలిపారు.

కూటమి ప్రభుత్వంలో ఉన్నందుకు సిగ్గు పడుతున్నాం

నెల్లూరు జిల్లా కలెక్టర్ వల్ల పేదలకు న్యాయం జరగడం లేదు
బీజేపీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ పురుషోత్తంరెడ్డి

వినతిపత్రంతో బీజేపీ నాయకులు

వాకాడు: కూటమి ప్రభుత్వంలో కలిసి పని చేస్తున్నందుకు సిగ్గు పడుతున్నామని బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు పాపారెడ్డి పురుషోత్తమ్‌రెడ్డి విచారం వ్యక్తపరిచారు. సోమవారం ఆయనతో పాటు బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు పనబాక కోటేశ్వరరావు, నాయకుడు కాలా వల్లీప్రసాద్ స్థానిక తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేసి కార్యాలయం ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ జిల్లాలో ప్రస్తుత కలెక్టర్ ద్వారా పేదలకు ఎలాంటి న్యాయం జరగడం లేదని తెలిపారు. ఆక్రమణలో ఉన్న భూములను ప్రైవేట్ వ్యక్తులకు అప్పగిస్తే తాము పోరాటాలు చేస్తామని హెచ్చరించారు. మండలంలో నెలకొన్న ప్రజల సమస్యలపై పలుమార్లు అధికారులకు విన్నవించినా పరిష్కారం లభించలేదన్నారు. మండలంలో దాదాపు వెయ్యి నుంచి రెండు వేల ఎకరాలు పేదల భూములు భూ స్వాముల ఆక్రమణలో ఉన్నాయని ఇటీవల జాయింట్ కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం కాలేదన్నారు. స్థానిక తహసీల్దార్‌కు అనేక సార్లు వినతిపత్రాలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆరోపించారు. తమ పరిస్థితే ఇలా ఉంటే సామాన్యుల పరిస్థితి ఏమిటని ఆయన అధికారులపై మండిపడ్డారు. దుగరాజపట్నం పోర్టు రానున్న నేపథ్యంలో ఆక్రమణలో ఉన్న భూములను ఓ ప్రైవేట్ వ్యక్తికి కట్టబెట్టేందుకు కలెక్టర్‌తో పాటు కొందరు రాజకీయ నాయకులు పన్నాగం పన్నుతున్నారని ఆయన ఆరోపించారు. తాము కూటమి ప్రభుత్వంలో పేరుకు భాగస్వాములమే తప్పా, సాధారణ ప్రజల్లా ప్రతి సోమవారం అర్జీలు పట్టుకుని కార్యాలయాల చుట్టూ తిరుగుతున్నామని పురుషోత్తం రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలి

యానాది సంక్షేమ సంఘం అధ్యక్షుడు కేసీ పెంచలయ్య

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): అన్ని రంగాల్లో వెనుకబడిన యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని ఏపీ యానాది సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కేసీపెంచలయ్య డిమాండ్ చేశారు. ఎస్టీ వర్గీకరణ, యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేయాలన్న డిమాండ్లతో విజయవాడ అలంకార్ సెంటర్‌లోని ధర్నా చౌక్‌లో చేపట్టిన రిలే నిరాహార దీక్షలను సోమవారం పెంచలయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 28 వరకు దీక్షలు కొనసాగుతాయని తెలిపారు. ఎస్టీల్లో అత్యధిక జనాభా కలిగిన యానాదాలు విద్య లేకపోవడంతో ఇతర గిరిజన తెగలతో పోటీ పడలేక అన్ని విధాలా నష్టపోతున్నారన్నారు. యానాదులకు ప్రత్యేక కార్పొరేషన్ ఏర్పాటు చేసి ఆదుకోవాలని కోరారు. రిజర్వేషన్ ఫలాలు పొందాలంటే ఎస్సీ వర్గీకరణ తరహాలో ఎస్టీ వర్గీకరణ చేపట్టాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తమ పోరాటం ఆగదని స్పష్టం చేశారు.

బొప్పాయి పంట దున్నేసిన రైతులు

బొప్పాయి పంటకు తెగుళ్లు ఆశించి పంట దెబ్బతింది. ఉద్యాన శాఖాధికారుల దృష్టికి తీసుకెళ్లినా పరిష్కారం చూపలేదు. దీంతో దిక్కుతోచని రైతులు 25 ఎకరాల్లో పంటను ట్రాక్టర్లతో దున్నేసిన ఘటన ప్రకాశం జిల్లా మద్దిపూడి మండలం పన్నూరు గ్రామంలో సోమవారం జరిగింది. మండలంలో దాదాపు 80 హెక్టార్లలో బొప్పాయి సాగు చేశారు. గంగపాలెం, పన్నూరు, మద్దిపూడి, కూచిపూడి తదితర గ్రామాల్లో పంటకు వైరస్ ఆశించింది. ఆకు ముడుచుకుపోవడం, పిందెలు గిడసబారి రాలిపోయాయి. ఎకరాకు దాదాపు రూ.35 వేలు ఖర్చయిందని, అప్పులు తీసుకొచ్చి పంట సాగు చేస్తే ఎలాంటి ఉపయోగంలేదని రైతులు వాపోయారు. రూ.9 లక్షల మేర నష్టం వాటిల్లిందని పన్నూరు గ్రామానికి చెందిన బొప్పాయి రైతులు వనిపెంట రోసిరెడ్డి, బూసి వెంకటనారాయణ, బూసి వెంకటరామిరెడ్డి, వేముల వెంకటేశ్వరరెడ్డి, వేములు సుబ్బారావు వాపోయారు. హార్టీకల్చర్ అధికారులు ఎవరూ పట్టించుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు.

– మద్దిపూడి

నమ్మి బ్యాంకు ఖాతా వివరాలు ఇస్తే..

స్నేహితుడిని మోసం చేసిన యువకుడు

బనశంకరి: ఏడాదిగా పరిచయం ఉన్న స్నేహితుడు కదా అని తన బ్యాంకు ఖాతా వివరాలు ఇవ్వడంతో ఓ విద్యార్థి ఇబ్బందుల్లో పడ్డాడు. బెంగళూరులో జరిగిన ఈ ఘటన వివరాలు.. ఓ ఇంజనీరింగ్ విద్యార్థి (19)కి ఆయుష్ (23) పరిచయమయ్యాడు. తన బ్యాంక్ అకౌంట్ బ్లాక్ అయిందని, ఇంటి నుంచి డబ్బు తెప్పించుకుంటానని మాయమాటలు చెప్పి విద్యార్థి బ్యాంకు పాస్‌బుక్, ఏటీఎం కార్డు, సిమ్ తీసుకున్నాడు. అప్పటి నుంచి ఆయుష్ ఆ అకౌంట్ ద్వారా సుమారు రూ.7 కోట్లు కొట్టేశాడు. ఇటీవల విద్యార్థికి అనుమానం వచ్చి తన అకౌంట్ ద్వారా సైబర్ మోసాలు జరుగుతున్నాయని బ్యాంకు సిబ్బందికి ఫిర్యాదు చేయడంతో ఖాతాను బ్లాక్ చేశారు. బెంగళూరు ఉత్తర విభాగ సైబర్ క్రైం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో నిందితున్ని అరెస్టు చేసి కేసు విచారణ చేపట్టారు. ఆయుష్‌కు సైబర్ ముఠాలతో లింకులు ఉన్నట్లు అనుమానాలున్నాయి.

మెక్సికో డ్రగ్ డాన్ మెంచో హతం

మెరుపుదాడితో మట్టుబెట్టిన మెక్సికో సైన్యం

- తమ బాస్ మరణంతో రెచ్చిపోయిన డ్రగ్స్ ముఠా సభ్యులు
- 6 చోట్ల దాడుల్లో 25 మంది సైనికుల దుర్మరణం
- పలు ప్రాంతాల్లో దుకాణాలు, బ్యాంకులు, వాహనాలకు నిప్పు

మెంచో

మెక్సికో సిటీ: మాదకద్రవ్యాల అక్రమ రవాణాకు స్వర్గధామమైన మెక్సికోలో అంతర్జాతీయ డ్రగ్స్ ముఠా అధినేత నెమెసియో రూబెన్ ఒసెగుయెరా సెర్వాంటిస్ అలియాస్ ఎల్ మెంచోను మెక్సికో సైన్యం పక్కా వ్యూహంతో దాడి చేసి హతమార్చింది. సొంత రాష్ట్రం జలిస్కోలోని తపల్పా పట్టణంలో ఎల్ మెంచో దాక్కున్నాడని అమెరికా ఇచ్చిన కాస్తంత నిఘా సమాచారంతో రంగంలోకి దిగిన మెక్సికో సైన్యం ఆ ప్రాంతాన్ని తమ అధీనంలోకి తెచ్చుకుంది. అతను పారిపోకుండా రహదారులను కాలిపోతున్న వాహనాలతో దిగ్బంధించింది. సైన్యం మెరుపుదాడితో వెనువెంటనే అప్రమత్తమైన మెంచో అనుచరులు అత్యంత అధునాతన ఆయుధాలతో సైనికులపైకి కాల్పులు జరిపారు. సైన్యం సైతం కాల్పులతో దీటుగా బదులిచ్చింది. ఈ హోరాహోరీ కాల్పుల్లో ఎల్ మెంచో తీవ్రంగా గాయపడ్డారు. వెంటనే అతడిని విమానంలో సమీప సిటీకి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే ఎల్ మెంచో చనిపోయినట్లు వైద్యులు ధ్రువీకరించారు. మెంచోతోపాటు మరో ఆరుగురు డ్రగ్స్ ముఠా సభ్యులు హతమయ్యారు. మరో ఇద్దరిని అరెస్ట్‌చేశారు. ఆయుధాలతో నిండిన వాహనాలను, రాకెట్ లాంచర్లు, ఇతర ఆయుధాలను సైన్యం స్వాధీనం చేసుకుంది. వేర్వేరు ఘటనల్లో మొత్తం 30 మంది నేర అనుమానితులు సైతం చనిపోయారని మెక్సికో సిటీ పోలీస్ చీఫ్ ఒమర్ గార్సియా హర్‌ఫూఛ్ చెప్పారు. మిచోవాకన్‌లో మరో నలుగురు చనిపోయారు. తమ బాస్ మరణించడంతో పట్టరాని ఆవేశంతో డ్రగ్స్ ముఠా సభ్యులు దేశంలో వేర్వేరు చోట్ల దాడులకు పాల్పడ్డారు. ఆరు ఘటనల్లో మొత్తం 25 మంది నేషనల్‌గార్డ్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. మెంచో ఆట కట్టించినందుకు సైన్యాన్ని మెక్సికో అధ్యక్షురాలు క్లాడియా షీన్‌బామ్ అభినందించారు. అధికారంలోకి వచ్చినప్పటి నుంచి డ్రగ్స్ ముఠాల ఆటకట్టించాలన్న ప్రజా డిమాండ్లు, అంతర్జాతీయ ఒత్తిళ్లకు తలొగ్గి అమెరికా నుంచి నిఘా సాయం తీసుకున్నారు. తమ ముఠా నాయకుడు చనిపోయాడన్న పట్టరాని ఆగ్రహంతో మాదకద్రవ్యాల ముఠా సభ్యులు పేట్రేగిపోయారు. వీధుల్లోకి వచ్చి దుకాణాలు, బ్యాంకులు, వాహనాలకు నిప్పుపెట్టారు. తపల్పా పట్టణంలో జరిగిన ఆపరేషన్‌లో ముఠా సభ్యులు జరిగిన నేషనల్‌గార్డ్ సభ్యుడు ప్రాణాలు కోల్పోయాడు. పుయెర్టో వల్లార్టాలోని జైలులో జైలు గార్డ్‌ను ఎల్ మెంచో అనుచరులు చంపేశారు. గ్వాడలజారాలో రాష్ట్ర ప్రాసిక్యూటర్ కార్యాలయంపై దాడి చేసి ఒకరిని చంపేశారు. అమెరికాలోకి అక్రమంగా ఫెంటానిల్ మాదకద్రవ్యాన్ని సరఫరాచేస్తూ ఎల్ మెంచో అతిపెద్ద నేరం చేశాడని ట్రంప్ సర్కార్ గతంలోనే ఆగ్రహం వ్యక్తంచేసింది. ఎల్ మెంచో అరెస్ట్‌కు వీలుగా కీలక సమాచారం ఇచ్చిన వాళ్లకు ఏకంగా 1.5 కోట్ల డాలర్ల(దాదాపు రూ.136.35 కోట్లు) బహుమతిగా ఇస్తామని అమెరికా ప్రభుత్వం ప్రకటించింది. ఎల్ మెంచో సారథ్యంలోని సీజేఎన్‌జీ ముఠాను విదేశీ ఉగ్రసంస్థగా ట్రంప్ సర్కార్ ఈనెలలోనే ప్రకటించింది. గతంలో వేరే డ్రగ్స్ ముఠాలో పనిచేసిన ఎల్ మెంచో 2009లో అందులోంచి బయటికొచ్చి సొంతంగా 'ది జలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్(సీజేఎన్‌జీ) పేరుతో కొత్తడ్రగ్స్ ముఠాను తయారుచేసి మాదకద్రవ్యాల అక్రమ సరఫరాతోపాటు బెదిరింపులు, హత్యలు, అపహరణల వంటి నేరాలకు పాల్పడ్డాడు.

ఎల్ మెంచో హత్యకు ప్రతీకారంగా మెక్సికోలోని జలిస్కో రాష్ట్రంలో రోడ్లపై వాహనాలను తగలబెడుతున్న అతని మద్దతుదారులు

భారతీయులకు భారత సర్కార్ అడ్వైజరీ..

ముఠా సభ్యుల విధ్వంసం నేపథ్యంలో అక్కడి భారతీయులు అప్రమత్తంగా ఉండాలని మోదీ సర్కార్ సోమవారం ఒక అడ్వైజరీ జారీచేసింది. 'జలిస్కో రాష్ట్రంలోని పుయెర్టో వల్లార్టా, ఛపాలా, గ్వాడలజారా సిటీలతోపాటు మిచోవాకన్, గుయెరియో, న్యూవో లియాన్ రాష్ట్రాల్లో ఉండే భారతీయులు ఘర్షణలు జరిగే వైపు వెళ్లకండి. తదుపరి నోటీస్ వచ్చేదాకా సురక్షిత ప్రాంతాలకే పరిమితం కండి. సైన్యం జాడలేని ప్రాంతాల్లో బయట తిరగకండి. మీ షెల్టర్లలోనే ఉండిపోండి. స్థానిక అధికారుల సూచనలను పాటించండి''అని మెక్సికోలోని భారత రాయబార కార్యాలయం తన సామాజిక మాధ్యమ 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టింది.

మూడు దశాబ్దాలుగా మారణ హోమం

59 ఏళ్ల ఎల్ మెంచో పశ్చిమ మెక్సికోలోని మిచోవకన్ రాష్ట్రంలో 1966లో అగిలిలా పరిధిలోని మారుమూల గ్రామంలో జన్మించాడు. ఇతని కుటుంబం అవకాడో పంట సాగుచేసేది. ఐదో తరగతిలోనే బడి చదువు మానేసిన మెంచో టీనేజీలోనే అక్రమ గంజాయి పంట సాగుకు గార్డ్‌గా పని చేసేవాడు. తర్వాత మెరుగైన జీవితం కోసం 1980 దశకంలో అక్రమంగా కాలిఫోర్నియా రాష్ట్రంలోకి చొరబడ్డాడు. హెరాయిన్ సరఫరా చేస్తూ 1994లో అమెరికా పోలీసులకు దొరికిపోయాడు. మూడేళ్ల జైలుశిక్ష అనుభవించాడు. తర్వాత మరో నేరం చేస్తూ పట్టుబడ్డాడు. దీంతో పోలీసులు దేశబహిష్కరణ చేసి మెక్సికోకు తిప్పి పంపారు. 30 ఏళ్ల వయసులో స్వదేశం వచ్చాక పోలీస్‌బలగాల్లో పనిచేశాడు. అప్పుడు మాదకద్రవ్యాల ముఠాల గుట్టుమట్టు తెల్సుకుని ఉద్యోగం వదిలేసి మిలేనియో కార్టెల్‌లో చేరాడు. అక్కడే ముఠా నేతల్లో ఒకరి చెల్లిని పెళ్లాడి కీలక నేతగా ఎదిగాడు. తర్వాత కార్టెల్‌లో విభేదాలు, ముఠాపై సైన్యం దాడులతో వేరే ముఠాలతో చేతులు కలిపాడు. అవి రెండు ముక్కలవడంతో చివరకు సొంతంగా 2009లో జలిస్కో న్యూ జనరేషన్ కార్టెల్‌ను ఏర్పాటుచేసుకుని మెక్సికోలోనే అతిశక్తివంతమైన ముఠాల్లో ఒకటిగా దానిని విస్తరింపజేశాడు. మూడు దశాబ్దాలపాటు ఎన్నో హత్యలు, దోపిడీలు, కిడ్నాప్‌లు చేసి సైన్యానికి కొరకరాని కొయ్యగా మారాడు. కొకైన్, మెథాంఫెటమైన్స్, ఫెంటానిల్ డ్రగ్స్‌తోపాటు శరణార్థులనూ అమెరికాలోకి తరలించాడు. తనను పట్టుకోవడానికి వచ్చిన పోలీసులపై, తమ ముఠాపై దాడి చేయడానికి వచ్చిన సైన్యంపై ఏకంగా డ్రోన్లతో దాడిచేసేవాడు. బాంబు పేలుళ్లు జరిపించేవాడు. దొరక్కుండా ఎక్కువగా గ్రామీణ ప్రాంతాలలో దాక్కునేవాడు. 2015లో ఏకంగా సైనిక హెలికాప్టర్‌పై దాడిచేసి నేలమట్టంచేశాడు. ఆన్‌లైన్ ద్వారా ముఠా సభ్యులను చేర్చుకునేవాడు.

ఇదీ మా విజయమే: ట్రంప్

ఇప్పటికే చాలా యుద్ధాలను ఆపానని పలుమార్లు ప్రకటించుకున్న ట్రంప్ సోమవారం సైతం ఎంమెంచో మరణాన్ని సైతం తన విజయంగా అభివర్ణించుకున్నారు. అమెరికా అధ్యక్ష భవనం మహిళా ప్రెస్ సెక్రటరీ కరోలిన్ లీవిట్ తన 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్‌పెట్టారు. ''ఎల్ మెంచోను హతమార్చడానికి మెక్సికో ప్రభుత్వానికి కీలకమైన నిఘా సమాచారాన్ని అమెరికాయే అందజేసింది. గతంలోనే మెంచో ముఠాను ట్రంప్ ఉగ్రసంస్థగా ప్రకటించి మంచిపని చేశారు. నార్కోటెర్రరిజానికి పాల్పడే వాళ్లకు తగిన శిక్ష వేస్తామని ట్రంప్ గతంలోనే పునరుద్ఘాటించారు''అని ఆమె రాసుకొచ్చారు. దీంతో సంబరపడిన ట్రంప్ తన సొంత సామాజిక మాధ్యమం 'ట్రూత్ సోషల్'లో ఒక పోస్ట్‌పెట్టారు. ''మేం ఈ మధ్య చాలా విజయాలను సాధిస్తున్నాం. ఇది మరీ అతిశయోక్తిగా ఉన్నా వాస్తవం మాత్రం ఇదే''అని రాసుకొచ్చారు. దీనిపై మెక్సికో ఆగ్రహం వ్యక్తంచేసింది. పలువురు నేషనల్‌గార్డ్ సభ్యుల ప్రాణత్యాగాల ఫలితంగానే మా ఆపరేషన్ విజయవంతమైంది. దాడికి అమెరికా కాస్తంత మాత్రమే నిఘా సమాచారం ఇచ్చింది. మిగతా పనంతా మేమే కష్టపడి పూర్తిచేశాం''అని మెక్సికో కరాఖండిగా చెప్పేసింది.

బెంగాల్ దుస్థితి చూసి... గుండె పగిలింది!

మమత పాలనలో సర్వనాశనం
- బెంగాలీలకు మోదీ బహిరంగ లేఖ
- అన్ని రంగాల్లోనూ రాష్ట్రం వెనకబడింది
- మార్పు తథ్యం, జనం అదే కోరుతున్నారు
- ఈసారి బీజేపీకి అవకాశమివ్వాలన్న ప్రధాని

కోల్‌కతా: పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అసమర్థ పాలనకు మారుపేరుగా మారారంటూ ప్రధాని నరేంద్ర మోదీ దుయ్యబట్టారు. ''ఆమె పాలనలో బెంగాల్ దుస్థితి చూసి నా గుండె పగిలింది. రాష్ట్ర ప్రజలకు మమత అన్నివిధాలా తీవ్ర అన్యాయం చేస్తున్నారు''అంటూ మండిపడ్డారు. ''రాష్ట్రానికి జరుగుతున్న ఈ తీరని అన్యాయాన్ని సరిదిద్దుతా. 'వికసిత పశ్చిమ్ బంగా'గా తీర్చిదిద్దుతా''అని ప్రతిజ్ఞ చేశారు. బెంగాల్లో అతి త్వరలో అసెంబ్లీ ఎన్నికలు జరగనుండటం తెలిసిందే. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో రాజకీయ మార్పు అనివార్యమని ప్రధాని అభిప్రాయపడ్డారు. ''ప్రజలు విజ్ఞతతో కూడిన తీర్పు ఇస్తారు. తద్వారా బెంగాల్ కూడా దేశంలో ఇతర ప్రాంతాలకు దీటుగా ప్రగతి బాటన 'ఛగుతుంది''అని విశ్వాసం వెలిబుచ్చారు. ఈ మేరకు బెంగాల్ ఓటర్లను ఉద్దేశించి మోదీ సోమవారం బహిరంగ లేఖ రాశారు. బెంగాలీ భాషలో రాసిన ఈ లేఖను 'జై మా కాళీ'అంటూ ప్రారంభించారు. ''బెంగాల్లో మార్పు తథ్యం. వచ్చే ఎన్నికల్లో బెంగాలీలు విజ్ఞతతో ఓటేస్తారు. ఈ విషయంలో నాకు పూర్తి విశ్వాసముంది''అని చెప్పారు.

అక్రమాలకు అడ్డుకట్ట వేస్తాం

స్వాతంత్ర్యం వచ్చిన తొలినాళ్లలో ఆర్థిక, పారిశ్రామిక రంగాల్లో బెంగాల్ యావద్దేశానికే చుక్కానిగా ఉండేదని మోదీ అన్నారు. ''స్వామి వివేకానంద మొదలుకుని అరబిందో, సుభాష్ చంద్రబోస్, రవీంద్రనాథ్ టాగూర్, శ్యామాప్రసాద్ ముఖర్జీ దాకా ఎందరో గొప్ప మార్గదర్శులను దేశానికి అందించింది వంగ భూమే. అలాంటి రాష్ట్రంలో ఇప్పుడు నెలకొన్న దుస్థితి చూస్తే గుండె తరుక్కుపోతోంది. బెంగాల్లో పాలన మచ్చుకు కూడా కన్పించడం లేదు''అంటూ లేఖలో ఆయన మండిపడ్డారు. ''పాలకుల అసమర్థత వల్ల 60 ఏళ్లుగా రాష్ట్రం అన్ని రంగాల్లోనూ వెనకబాటుకు గురైంది. సరిహద్దుల గుండా అక్రమ చొరబాట్లకు అడ్డాగా మారింది! ముఖ్యంగా మమత సర్కారు అధికారమే పరమావధిగా సంతుష్టీకరణ, ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతోంది. టాగూర్ ఘనంగా కీర్తించిన 'సోనార్ బంగ్లా'లో నకిలీ ఓటర్లు కుప్పలు తెప్పలుగా పుట్టుకొచ్చారు. రాష్ట్రంలో ఎటు చూసినా ఉపాధి లేమి తాండవిస్తోంది. దాంతో యువత పొట్ట చేతబట్టుకుని వలస బాట పడుతోంది. మహిళలకు భద్రత కరువైంది''అంటూ దుయ్యబట్టారు. నానాటికీ సమస్యల్లో కూరుకుపోతున్న బెంగాల్‌ను చూసి దేశమంతా ఆందోళన చెందుతోందన్నారు. ''బెంగాల్ ప్రజలు ఈ దుస్థితిని మౌనంగా ఇంకెంత కాలం భరించాలి? మార్పుకు సమయం ఆసన్నమైంది. ఇతర రాష్ట్రాల్లో ప్రజల జీవన ప్రమాణాలు ఎంతో మెరుగయ్యాయి. పేదల ముఖాల్లోకి చిరునవ్వులు వచ్చాయి. ఆయుష్మాన్ భారత్ తదితర పథకాలతో దేశమంతా ప్రగతి చెందుతోంది. ఈ వృద్ధి గాథలో బెంగాల్ కూడా భాగం కావాల్సిన తరుణమిదే''అన్నారు. రాష్ట్ర ప్రజలకు సేవ చేసే అవకాశం కోసం ఉత్సాహంగా ఎదురు చూస్తున్నట్టు మోదీ చెప్పారు. 'ఎక్కడైతే మనసు నిర్భీతిగా ఉంటుందో, ప్రజలు తలెత్తుకుంటారో...'అన్న టాగూర్ కవితా పంక్తులను ఉదహరించారు. ''బెంగాల్లో బీజేపీ అధికారంలోకి వస్తే అవినీతిని రూపుమాపుతుంది. అక్రమ చొరబాట్లకు పూర్తిగా అడ్డుకట్ట వేస్తాం. అర్హులైన శరణార్థులకు సీఏఏ ద్వారా పౌరసత్వం కల్పిస్తాం''అంటూ హామీ ఇచ్చారు.

మండిపడ్డ తృణమూల్

బెంగాలీ ఓటర్లకు మోదీ బహిరంగ లేఖపై అధికార తృణమూల్ కాంగ్రెస్ పార్టీ తీవ్రంగా మండిపడింది. దాన్ని ఎన్నికల వేళ మోదీ ఆడుతున్న నాటకమంటూ పార్టీ అధికార ప్రతినిధి కుణాల్ ఘోష్ దుయ్యబట్టారు. బెంగాల్ సంక్షేమం పట్ల మొసలి కన్నీరు కారుస్తున్న మోదీ, రాష్ట్రానికి కేంద్ర ప్రభుత్వ ఉపాధి సహా పలు పథకాల నిధులను ఎందుకు నిలిపేశారో బదులివ్వాలన్నారు. కేంద్రం నుంచి బెంగాల్‌కు ఏకంగా రూ.1.96 లక్షల కోట్ల మేరకు నిధులు బాకీ ఉన్నాయని ఆయన ఆరోపించారు. ముందుగా ఆ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం ఎన్ని అడ్డంకులు సృష్టిస్తున్నా అభివృద్ధి చెందుతున్న రాష్ట్రాల జాబితాలో బెంగాల్ అగ్రస్థానంలో ఉందని కుణాల్ చెప్పుకొచ్చారు. మోదీ లేఖను ఓట్ల కోసం ఆడిన డ్రామాగా కాంగ్రెస్ సీనియర్ నేత అధీర్ రంజన్ చౌదరి కొట్టిపారేశారు.

తమిళనాడులో... 97.37 లక్షల ఓట్ల తొలగింపు

- మొత్తం ఓటర్ల సంఖ్య 5.67 కోట్లు
- తుది జాబితా ప్రకటించిన ఈసీ

చెన్నై: స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) ప్రక్రియలో భాగంగా తమిళనాడులో ఏకంగా 97.37 లక్షల ఓటర్ల పేర్లను జాబితా నుంచి తొలగించారు. ఫలితంగా రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 5.67 కోట్లకు పరిమితమైంది. ఈ మేరకు తుది ఓటర్ల జాబితాను రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి అర్చనా పట్నాయక్ సోమవారం విడుదల చేశారు. సర్ ప్రక్రియకు ముందు రాష్ట్రంలో ఓటర్ల సంఖ్య 6.41 కోట్లని ఈ సందర్భంగా ఆమె తెలిపారు. మరణం, శాశ్వత వలసలు తదితర కారణాలతో సర్ ప్రక్రియలో భాగంగా 97.37 లక్షల ఓట్లను తొలగించినట్టు వెల్లడించారు. రాష్ట్రంలో ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ గత అక్టోబర్ 27 నుంచి జనవరి 1 దాకా కొనసాగింది. గత డిసెంబర్ 19 నాటి డ్రాఫ్ట్‌లో మొత్తం ఓటర్ల సంఖ్య 5.43 కోట్లుగా నిలిచింది. అభ్యంతరాలు, చేరికలు, తీసివేతలు, 27.53 లక్షల కొత్త ఓటర్ల నమోదు తదితరాల అనంతరం తుది సంఖ్య 5.67 కోట్లుగా తేలింది. వీరిలో పురుషుల (2.77 కోట్లు) కంటే స్త్రీల సంఖ్యే (2.89 కోట్లు) అధికం కావడం విశేషం! శివలింగ నల్లూరు అసెంబ్లీ నియోజకవర్గంలో అత్యధికంగా 5,36,772 మంది ఓటర్లు ఉండగా చెన్నైలోని హార్బర్ అసెంబ్లీ స్థానంలో అత్యల్పంగా 1,16,896 మంది నమోదయ్యారు.

నెదర్లాండ్స్‌కు యువ సారథి

- సంకీర్ణ సర్కారుకు 38 ఏళ్ల రాబ్ సారథ్యం
- అతి పిన్న వయస్కుడైన ప్రధానిగా రికార్డు

ద హేగ్: నెదర్లాండ్స్‌లో నూతన సంకీర్ణ సర్కారు కొలువుదీరింది. 38 ఏళ్ల రాబ్ జెటెన్ దేశ ప్రధానిగా సోమవారం బాధ్యతలు స్వీకరించారు. రాబ్, ఆయన మంత్రివర్గ సభ్యులతో రాజు విలియం అలెగ్జాండర్ ప్రమాణస్వీకారం చేయించారు. దేశ చరిత్రలోనే అత్యంత పిన్న వయస్కుడైన ప్రధానిగా రాబ్ రికార్డు సృష్టించారు. తాను స్వలింగ సంపర్కిని అని కూడా రాబ్ గతంలోనే బాహాటంగా వెల్లడించడం విశేషం. తద్వారా, ఇలా ప్రకటించుకున్న తొలి ప్రధానిగా కూడా ఆయన నిలిచారు! ఈ పరిణామాన్ని స్వాగతిస్తున్నట్టు నెదర్లాండ్స్ ఎల్‌జీబీటీక్యూఐ సంస్థ పేర్కొంది. తమ సామాజిక వర్గానికి రాబ్ రోల్‌మోడల్‌గా నిలుస్తారంటూ ఆశాభావం వెలిబుచ్చింది! ఆధునిక ప్రపంచ చరిత్రలో అత్యంత పిన్న వయస్కుడైన ప్రధాని రికార్డు సెబాస్టియన్ కుర్జ్ పేరిట ఉంది. ఆయన 2017లో 32 ఏళ్ల వయసులోనే ఆస్ట్రియా ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. అంతకుముందు 1783లో విలియం పిట్ ద యంగర్ కేవలం 28 ఏళ్ల వయసులో గ్రేట్ బ్రిటన్ ప్రధాని అయ్యారు!

విషమ పరీక్షే

మూడు పార్టీలతో కూడిన మైనారిటీ సర్కారును నాలుగేళ్ల పూర్తి కాలం పాటు నెట్టుకురావడం రాబ్‌కు సవాలేనని పరిశీలకులు భావిస్తున్నారు. ఎందుకంటే 150 స్థానాలున్న పార్లమెంటు దిగువ సభలో రాబ్‌కు చెందిన డెమొక్రాట్స్66 పార్టీ సారథ్యంలోని పాలక సంకీర్ణానికి 66 సీట్లే ఉన్నాయి! పైగా ఎగువ సభలో కూడా సంకీర్ణానికి మెజారిటీ లేదు.

'రోబో'ముద్ర నుంచి.. ప్రధాని పీఠం దాకా!

రోబో! నెదర్లాండ్స్ రాజకీయ వర్గాల్లో ఒకప్పుడు రాబ్ జెటెన్‌కు ఉన్న ముద్దుపేరు! మీడియా ఏ ప్రశ్నలడిగినా పెద్దగా ఆలోచించకుండా యథాలాపంగా నోటికొచ్చింది చెబుతారని జర్నలిస్టులే ఆయనకు ఆ పేరును ఖాయం చేశారు. అలాంటి స్థితి నుంచి ప్రధాని పీఠం దాకా రాబ్‌ది ఆద్యంతం ఆసక్తికర ప్రస్థానం. ఆయన దక్షిణాది నగరమైన ఉడెన్‌లో పుట్టి పెరిగారు. బిజినెస్ అడ్మినిస్ట్రేషన్లో మాస్టర్స్ అనంతరం కొంతకాలం ప్రభుత్వ రంగ రైల్వే కంపెనీ ప్రొరైల్‌లో పని చేశారు. అథ్లెట్‌గా కూడా రాణించారు. 2017లో డి66 పార్టీ తరఫున తొలిసారిగా పార్లమెంటుకు ఎన్నికయ్యారు. రాజకీయాల్లోకి వచ్చిన కొత్తల్లో మీడియాను సీరియస్‌గా తీసుకునేవారు కాదు. జర్నలిస్టుల ప్రశ్నలకు నోటికొచ్చిన జవాబులిచ్చేవారు. దాంతో పెద్దగా సీరియస్‌నెస్ లేని నాయకునిగా ముద్రపడ్డారు. అయితే తర్వాతి కాలంలో రాజకీయంగా తనకు తాను సానబెట్టుకుంటూ వచ్చారు. తద్వారా పరిణతి చెందిన నేతగా గుర్తింపు పొందారు.

రాబ్ జెటెన్

'43 ఏళ్ల'రికార్డు... 43 ఏళ్లకు బద్దలు!

38 ఏళ్లకే నెదర్లాండ్స్ ప్రధాని పదవి చేపట్టడం ద్వారా రాబ్ చరిత్ర సృష్టించారు. అంతకుముందు ఆ రికార్డు రుడ్ లబర్స్ పేరిట ఉండేది. క్రిస్టియన్ డెమొక్రాట్ పార్టీకి చెందిన లబర్స్ 1982లో 43 ఏళ్ల వయసులో ప్రధానిగా బాధ్యతలు చేపట్టారు. సరిగ్గా 43 ఏళ్ల ఆ రికార్డును తర్వాత రాబ్ బద్దలు కొట్టడం విశేషం! లబర్స్ 1994 దాకా 12 ఏళ్ల పాటు ప్రధానిగా ఉన్నారు. నెదర్లాండ్స్ చరిత్రల్లో అత్యధిక కాలం పదవిలో కొనసాగిన ప్రధానుల్లో ఒకరిగా నిలిచారు. మరి ఆ రికార్డును కూడా రాబ్ అధిగమిస్తారేమో చూడాలి.

సిగ్గుమాలిన పనులు మీవే

మోదీ 'మురికి రాజకీయాలు' వ్యాఖ్యలకు రాహుల్ దీటైన జవాబు

న్యూఢిల్లీ: హస్తినలో ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సుకు యువజన కాంగ్రెస్ నేతలు టీ–షర్ట్‌లు విప్పేసి చేసిన నిరసనను ప్రధాని మోదీ 'మురికి రాజకీయాలు'అంటూ విమర్శించడంతో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్‌గాంధీ తనదైన రీతిలో ప్రధానిపై విమర్శలతో విరుచుకుపడ్డారు. ఈ మేరకు సోమవారం తన 'ఎక్స్'ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. ''సిగ్గుమాలిన పనుల గురించి మీరు మాట్లాడుతున్నారా మోదీజీ?!. సిగ్గుమాలిన పని అంటే ఏంటో నేను చెప్తా. మీ పేరు, మీ మంత్రి పేరు, మీ స్నేహితుని పేర్లు లైంగికనేర ఎప్‌స్టీన్ ఫైల్స్‌లో దర్శనమిచ్చాయి. ఎప్‌స్టీన్ వంటి లైంగిక నేరగాడితో సంబంధం ఉండటం అత్యంత సిగ్గుమాలిన పని. అమెరికాతో మీరు కుదుర్చుకున్న వాణిజ్య ఒప్పందం ద్వారా దేశాన్నే అమ్మేసేందుకు సాహసించారు. ఇది కూడా సిగ్గుమాలిన పనే. అదానీపై కేసు నమోదైతే చర్యలు తీసుకోకుండా 14 నెలలపాటు చేష్టలుడిగి చూడటం నిజంగా సిగ్గుమాలిన చర్య''అని రాహుల్ ఆరోపించారు.

2018కి ముందు కేసుల పునర్విచారణ కుదరదు

భూ సేకరణ పరిహారంపై సుప్రీం

న్యూఢిల్లీ: ఎన్‌హెచ్‌ఏఐ చట్టం కింద భూ సేకరణ, నష్టపరిహారాలకు సంబంధించి 2018కి ముందు కేసుల పునఃపరిశీలన సాధ్యపడదని సుప్రీంకోర్టు అభిప్రాయపడింది. ఎన్‌హెచ్‌ఏఐ పిటిషన్‌పై విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భూయాన్ ధర్మాసనం సోమవారం ఈ మేరకు పేర్కొంది. ఎన్‌హెచ్‌ఏఐ చట్టం కింద సేకరించిన రైతుల భూమికి పరిహారం, వడ్డీ చెల్లించాలన్న నిర్ణయం గత ఉదంతాలకు కూడా వర్తిస్తుందంటూ 2019లో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. దీనిపై ఎన్‌హెచ్‌ఏఐ తీవ్ర ఆందోళన వెలిబుచ్చింది. ''అలాగైతే మాపై ఏకంగా రూ.32 వేల కోట్ల మేరకు ఆర్థిక భారం పడుతుంది. కనుక ఈ నిర్ణయాన్ని ఇకపై తలెత్తే వివాదాలకు మాత్రమే వర్తింపజేయాలి''అని కోరింది. అలా చేయడం రాజ్యాంగంలోని ఆర్టికల్ 14లో పేర్కొన్న సమానత్వపు హక్కుకు విఘాతమే అవుతుందంటూ ఈ విజ్ఞప్తిని అప్పట్లో న్యాయస్థానం తిరస్కరించింది. దానిపై ఎన్‌హెచ్‌ఏఐ పెట్టుకున్న రివ్యూ పిటిషన్‌పై సీజేఐ ధర్మాసనం విచారణ జరుపుతోంది. 2019 నాటి తీర్పును ఫిబ్రవరి 4 నాటి విచారణ సందర్భంగా కూడా ధర్మాసనం సమర్థించింది. దీనిపై వాదనలు సోమవారం కూడా కొనసాగాయి. ఈ ఉదంతానికి సంబంధించి అభ్యంతరాలేమైనా ఉంటే లిఖితపూర్వకంగా సమర్పించాలని ఇరు వర్గాలను ధర్మాసనం ఆదేశించింది. విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

కేంద్ర మాజీ మంత్రి, టీఎంసీ నేత ముకుల్ రాయ్ కన్నుమూత

బెంగాల్ రాజకీయాల్లో చాణక్యునిగా ఖ్యాతి

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో అపర చాణిక్యుడిగా పేరు తెచ్చుకున్న కేంద్ర మాజీ మంత్రి, తృణమూల్ కాంగ్రెస్ నేత ముకుల్ రాయ్ కన్నుమూశారు. సోమవారం తెల్లవారుజామున కోల్‌కతాలో ఒక ప్రైవేట్ ఆస్పత్రిలో గుండెపోటుతో మరణించారు. 71 ఏళ్ల రాయ్ పలు అనారోగ్య సమస్యలతో బాధపడుతున్నారు. రెండేళ్లుగా తరచూ ఆస్పత్రి పాలవుతూ వస్తున్నారు. ఇటీవలే కోమాలోకి వెళ్లారు. ఆదివారం రాత్రి ఆయన మరో మారు గుండెపోటుకు గురయ్యారని, డాక్టర్లు ఎంత ప్రయత్నించినా లాభం లేకపోయిందని కుమారుడు శుభ్రాన్షు రాయ్ వెల్లడించారు.

టీఎంసీ మూల స్తంభం

ముకుల్ రాయ్ 1954లో ఉత్తర 24 పరగణాల జిల్లాలోని కాంచ్రపరాలో జన్మించారు. 1980ల్లో యువజన కాంగ్రెస్‌తో రాజకీయ జీవితాన్ని ప్రారంభించారు. తరవాత నాలుగు దశాబ్దాల పాటు కాంగ్రెస్, టీఎంసీ, బీజేపీల్లో పలు హోదాల్లో పని చేశారు. 1998లో కాంగ్రెస్ నుంచి బయటికి వచ్చి తృణమూల్ కాంగ్రెస్‌ను స్థాపించిన మమతా బెనర్జీతో చేతులు కలిపారు. పార్టీ వ్యవస్థాపక సభ్యుడిగా, మూల స్తంభంగా పనిచేశారు. తరువాత పార్టీ ప్రధాన కార్యదర్శి అయ్యారు. 2006లో రాజ్యసభకు ఎన్నికయ్యారు. తరవాత ఢిల్లీలో టీఎంసీ ట్రబుల్ షూటర్‌గా మారారు. యూపీఏ రెండో పర్యాయం అధికారంలో ఉండగా కేంద్ర నౌకాయాన శాఖ సహాయ మంత్రిగా, రైల్వే మంత్రిగా పనిచేశారు. బెంగాల్లో 34 ఏళ్ల లెఫ్ట్ ఫ్రంట్ పాలనకు తెర దించి 2011లో తృణమూల్ చరిత్రాత్మక విజయం సాధించాక జిల్లాల్లో పార్టీని పటిష్టం చేయడంలో గణనీయ పాత్ర పోషించారు. అయితే శారదా చిట్‌ఫండ్ కేసు, నారద స్టింగ్ ఆపరేషన్‌లో ముకుల్ పేరు బయటికి రావడం వివాదాస్పదమైంది. 2015 వరకు తృణమూల్ ప్రధాన కార్యదర్శిగా, పార్టీలో నంబర్ టూగా ఉన్నారు. కానీ పార్టీతో విభేదాల కారణంగా ఆయనను ఆ పదవి నుండి తొలగించారు. ఆ తరువాత తృణమూల్‌కు రాజీనామా చేసి బీజేపీలో చేరారు. బెంగాల్లో బీజేపీని బలోపేతం చేయడంలో కీలకంగా వ్యవహరించారు. ఇది రాష్ట్రంలో రాజకీయ సమీకరణాలనే మార్చేసింది! 2019 లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ బెంగాల్లో ఏకంగా 18 సీట్లు గెలుచుకుంది. తరవాత 2021 అసెంబ్లీ ఎన్నికల్లో ముకుల్ కృష్ణ నగర్ ఉత్తర నియోజకవర్గం నుంచి బీజేపీ ఎమ్మెల్యేగా గెలుపొందారు. తర్వాత కొద్ది నెలల్లోనే తృణమూల్ గూటికి తిరిగొచ్చారు. బీజేపీ టికెట్‌పై గెలిచి పార్టీ మారినందుకు చట్ట, రాజకీయపరమైన వివాదాలను ఎదుర్కొన్నారు. పార్టీ మారినందుకు ఫిరాయింపుల నిరోధక చట్టం కింద కలకత్తా హైకోర్టు ఆయనను ఎమ్మెల్యేగా అనర్హుడిగా ప్రకటించింది.

కుప్పకూలిన ఎయిర్ అంబులెన్స్ ఏడుగురి దుర్మరణం!

జార్ఖండ్‌లో ఘోరం

రాంచీ: జార్ఖండ్‌లో ఘోరం జరిగింది. ఒక రోగిని అత్యవసరంగా ఢిల్లీకి తరలిస్తున్న ఎయిర్ అంబులెన్స్ దట్టమైన అడవిలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో ఇద్దరు సిబ్బందితో సహా అందులో ప్రయాణిస్తున్న ఏడుగురూ మృత్యువాత పడ్డట్టు భావిస్తున్నారు. ''అంబులెన్స్ రాంచీ విమానాశ్రయం నుంచి రాత్రి 7.10కి బయల్దేరింది. 20 నిమిషాల తర్వాత దానికి ఎయిర్ ట్రాఫిక్ కంట్రోల్‌తో సంబంధాలు తెగిపోయాయి. కాసేపటికే ఛత్రా జిల్లాలోని సిమారియా సమీపంలో కుప్పకూలింది''అని రాంచీ విమానాశ్రయ డైరెక్టర్ వినోద్‌కుమార్ తెలిపారు. ప్రమాద ప్రాంతానికి హుటాహుటిన సహాయక బృందాలను పంపినట్టు ఛత్రా డీసీపీ కీర్తిశ్రీ తెలిపారు. ఘటనా స్థలి దట్టమైన అడవిలో ఉండటంతో మృతులు తదితరాలపై ఇంకా వివరాలేవీ తెలియరాలేదని వివరించారు. ప్రమాదానికి గురైన బీచ్‌క్రాఫ్ట్ కింగ్ ఎయిర్ బీఈ9ఎల్ వీటీ–ఏవీజే శ్రేణి విమానం రెడ్‌బర్డ్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ సంస్థకు చెందినది. ప్రమాదానికి కారణం ఏమిటన్నది తెలియరాలేదు. ఎయిర్‌క్రాఫ్ట్ యాక్సిడెంట్ ఇన్వెస్టిగేషన్ బ్యూరో (ఏఏఐబీ) బృందం విచారణ నిమిత్తం ఘటనా స్థలికి బయల్దేరింది. విమానంలో పైలట్లు వివేక్ వికాస్ భగత్, సౌరజ్‌దీప్ సింగ్, రోగి సంజయ్‌కుమార్ (41), వైద్యుడు వికాస్‌కుమార్ గుప్తా, అటెండెంట్లు అర్చనా దేవి, ధురుకుమార్, వైద్య సహాయకుడు సచిన్‌కుమార్ మిశ్రా ఉన్నారు.

'తేజస్' తగ్గిపోయిందా!

జెట్లను తాత్కాలికంగా పక్కన పెట్టిన వాయుసేన?

- ప్రమాదం నేపథ్యంలో నిర్ణయం!
- సాంకేతిక సమస్యే: హెచ్ఏఎల్

న్యూఢిల్లీ: దేశీయంగా అభివృద్ధి చేసిన తేలికరకం తేజస్ యుద్ధ విమానాల వినియోగాన్ని వాయుసేన తాత్కాలికంగా పక్కన పెట్టిందంటూ వార్తలు వస్తున్నాయి! ప్రభుత్వ రంగ హిందూస్తాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ (హెచ్ఏఎల్) ప్రతిష్టాత్మకంగా రూపొందించిన ఆ యుద్ధ విమానాలు తరచూ ప్రమాదాల బారిన పడుతుండటంతో ముందుజాగ్రత్తగా ఈ నిర్ణయానికి వచ్చినట్టు చెబుతున్నారు. ఫిబ్రవరి 7వ తేదీన తేజస్ విమానం ల్యాండవుతుండగా ప్రమాదానికి గురైనట్టు సోమవారం వార్తలొచ్చాయి. పైలట్ సురక్షితంగా బయటపడ్డా, ఆ ప్రమాదంలో విమానం బాగా దెబ్బతిన్నట్టు అవి పేర్కొన్నాయి. కానీ దీన్ని హెచ్ఏఎల్ మంగళవారం ఖండించింది. జరిగింది ప్రమాదం కాదని, 'చిన్న ఘటన'మాత్రమేనని చెప్పుకొచ్చింది. ఈ మేరకు సంస్థ అధికార ప్రతినిధి ఒక ప్రకటన జారీ చేశారు. ''తేజస్ నేలకూలిందన్న వార్తలు నిజం కాదు. విమానం నేలపై ఉండగా చిన్న సాంకేతిక సమస్య తలెత్తిందంతే''అని పేర్కొన్నారు. ''తేజస్ విషయంలో ప్రపంచంలోని అత్యుత్తమ భద్రతా ప్రమాణాలను పాటిస్తున్నాం. తాజా ఉదంతాన్ని లోతుగా పరిశీలిస్తున్నాం. ఈ విషయంలో వాయుసేనతో కలిసి పని చేస్తున్నాం. సమస్య త్వరలో పరిష్కారం అవుతుంది''అని వివరించారు. అయితే తేజస్‌లో తాజాగా తలెత్తిన సాంకేతిక సమస్యకు సంబంధించి వివరాలేమీ వెల్లడించలేదు.

ఫిబ్రవరి 7న ఒక వైమానిక స్థావరంలో ల్యాండయ్యే క్రమంలో తేజస్ విమానం రన్‌వేను దాటి ముందుకు వెళ్లిపోవడంతో బాగా దెబ్బ తిన్నట్టు చెబుతున్నారు. దాంతో అదిక వినియోగానికి ఏమాత్రమూ పనికి రాదని వాయుసేన నిర్ధారించినట్టు వార్తలొచ్చాయి. దీనిపై కూడా హెచ్ఏఎల్ తన ప్రకటనలో స్పందించ లేదు. ప్రస్తుతానికి తేజస్ రకం విమానాలన్నింట్లో వాయుసేన పూర్తిస్థాయిలో తనిఖీలు నిర్వహిస్తున్నట్టు చెబుతున్నారు. భద్రత తదితర ప్రమాణాలను పూర్తిగా నిర్ధారించుకున్నాకే తిరిగి వాటి వాడకంపై నిర్ణయం తీసుకుంటుందని తెలుస్తోంది. షెడ్యూల్ మేరకు తేజస్ శ్రేణిలో రెండో తరం ఎంకే1ఏ యుద్ధవిమానాల భద్రతా ప్రమాణాలను వచ్చే ఏప్రిల్లో వాయుసేన పూర్తిస్థాయిలో తనిఖీ చేయాల్సి ఉంది. వాటిని వాయుసేన అమ్ములపొదిలోకి చేర్చుకోవడంపై ఆ తర్వాతే రక్షణ శాఖ తుది నిర్ణయానికి రానుంది. వాయుసేనలో ప్రస్తుతం 30 తేజస్ ఎంకే1 శ్రేణి యుద్ధ విమానాలు సేవలందిస్తున్నాయి. తేజస్ తాజా ప్రమాదానికి సాంకేతిక సమస్యలే కారణమని ప్రాథమికంగా తేలినట్టు చెబుతున్నారు. ముఖ్యంగా విమానంలోని పలు ఆన్‌బోర్డ్ వ్యవస్థల్లో కీలక వైఫల్యాలను గుర్తించారని అంటున్నారు.

సాక్షి
గుంటూరు
మంగళవారం । 24 । ఫిబ్రవరి । 2026

సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం సోమవారం 539.80 అడుగులకు చేరింది. శ్రీశైలం నుంచి 24,222 క్యూసెక్కులు వచ్చి చేరుతోంది.



నిమ్మకాయల ధరలు

తెనాలి:తెనాలి మార్కెట్‌యార్డులో సోమవారం క్వింటా నిమ్మకాయలు కనిష్ట ధర రూ.6,000, గరిష్ట ధర రూ.7,600, మోడల్ ధర రూ.7,000 వరకు పలికింది.

సుబ్రహ్మణ్యేశ్వరుడి కల్యాణం

ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ):ఇంద్రకీలాద్రిపై శ్రీ వల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యస్వామి కల్యాణం సోమవారం కనులపండువగా జరిగింది. ఉత్సవ మూర్తులకు పంచామృతాలతో అభిషేకాలు చేశారు.

రంజాన్ వేళలు

	ఇఫ్తార్ (మంగళ)	సహరి (బుధ)
గుంటూరు	6.27	5.15
నరసరావుపేట	6.21	5.13
బాపట్ల	6.19	5.11

న్యూస్‌రీల్

సుబ్రమణ్యేశ్వరునికి వెండి నెమలి తొడుగు ఆభరణం

అమరావతి: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన అమరావతి అమరేశ్వరాలయంలో సుబ్రమణ్యేశ్వరస్వామికి దాతలు సోమవారం వెండి నెమలి తొడుగు ఆభరణం సమర్పించారు. అమెరికాలోని కాలిఫోర్నియాకు చెందిన యార్లగడ్డ పవన్‌కుమార్, పూర్ణిమ సౌభాగ్య లక్ష్మి దంపతులు ఈ ఆభరణం సమర్పించారు. సుమారు ఎనిమిది లక్షల రూపాయల విలువైన వెండి నెమలి తొడుగు ఆభరణానికి అర్చకులు సంప్రోక్షణ అనంతరం ప్రత్యేక పూజలు చేసి స్వామివారికి అలంకరించారు. తొలుత దాతలు అమరేశ్వరునికి అభిషేకం, బాలచాముండేశ్వరి, అమ్మవార్లకు కుంకుమ పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రేఖ, అర్చకులు శంకరమంచి రాజశేఖర్ పాల్గొన్నారు.

3వ రోజుకు చేరుకున్న ప్రతిష్ఠా మహోత్సవాలు

తాడేపల్లిరూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని సీతానగరం విజయకీలాద్రి దివ్యక్షేత్రంపై ప్రతిష్ఠా మహోత్సవాలు సోమవారంతో మూడవ రోజుకు చేరుకున్నాయి. జీయర్ ఎడ్యుకేషనల్ ట్రస్ట్ మేనేజర్ పురాణం వెంకటాచార్యులు మాట్లాడుతూత్రిదండి చిన్నజీయర్‌స్వామి, త్రిదండి అహోబిల రామానుజ జీయర్‌స్వామి వార్ల స్వీయ పర్యవేక్షణలో ఈనెల 21వ తేదీ నుంచి 26వ తేదీ వరకు ప్రతిష్ఠా మహోత్సవాలు అంగరంగ వైభవంగా నిర్వహిస్తున్నట్టు తెలిపారు. సోమవారం ఉదయం ఛాయాధివాసం, శ్రీ హయగ్రీవ ఇష్టి, జలాధివాసం, పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్ఠి కార్యక్రమాలు నిర్వహించామని తెలిపారు.

ముగిసిన శ్రీమహా సుదర్శన హోమం

తెనాలి: పట్టణానికి చెందిన శ్రీవిఖనస శ్రీనివాస ట్రస్ట్ ఆధ్వర్యంలో స్థానిక బాలాజీరావుపేట లోనీ కోట బద్రీనాథ్ గుప్తా స్థలంలో జరుగుతున్న శ్రీ మహా సుదర్శన హోమం సోమవారం పూర్ణాహుతితో ముగిసింది. తొలుత స్వామివారికి విశేష తులసి దళార్చనను వైఖానస పండితులు ఆగమోక్తంగా నిర్వహించారు. ట్రస్టు నిర్వాహకులు ఆర్‌వీ కిరణ్ కుమార్ మాట్లాడుతూ వెంకటేశ్వర స్వామి గానామృతం అయిదో పర్యాయం ముగింపు సందర్భంగా శ్రీమహా సుదర్శన హోమం నిర్వహించినట్టు తెలిపారు. ట్రస్ట్ కార్యక్రమాలకు సహకరిస్తున్న దాతలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. రానున్న రోజుల్లో ట్రస్టు ఆధ్వర్యంలో నారాయణ అష్టాక్షరి దివ్య క్షేత్రం నిర్మిస్తామని తెలిపారు. వైఖానస పండితులు మేడూరి శ్రీనివాసమూర్తి భూదాన విశిష్టతను భక్తులకు వివరించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు మూర్తి వెంకటేశ్వరరావు, మడుపల్లి చంద్రశేఖర్, జంజం రామారావు, గుడివాడ బాలకృష్ణ ,రొంపిచర్ల సురేష్, మాజేటి వెంకటేష్, గోలి సోమశేఖర్, బచ్చు లీలా ప్రసాదరావు, మద్దు హరీష్, గార్లపాటి అశోక్, కోట రవిశంకర్, సంకీర్తన బృందం సభ్యులు, భక్తులు పాల్గొన్నారు.

రాజధాని కోసం భూములిస్తే

పట్టించుకోరా!

జేసీ అశుతోష్ శ్రీవత్సకు వినతిపత్రం అందజేస్తున్న బాధితులు

- కొండమరాజు గ్రామ బాధితుల ఆవేదన
- పీజీఆర్ఎస్‌లో జాయింట్ కలెక్టర్‌కు ఫిర్యాదు
- చేసేదేమీ లేదంటూ తేల్చి చెప్పిన జేసీ

గుంటూరు వెస్ట్: అమరావతి రాజధాని నిర్మాణం కోసం విలువైన తమ భూములిచ్చిన కొండమరాజు పాలెం గ్రామ నిర్వాసితులు ఇప్పుడు బోరుమంటున్నారు. అధికారులు కూడా కనీసం స్పందించడం లేదు. భూములు తీసుకున్న ప్రారంభంలో జరీబు కింద నమోదు చేసుకుని కొలిచ్చిన అధికారులు ఇప్పుడు జరీబు కాదు మీది కేవలం మెట్ట భూమి మాత్రమే అని చెబుతున్నారు. దీంతో బాధితులకు ప్రభుత్వం ఇచ్చే నష్టపరిహారం, స్థలంలో సుమారు 200 చ.గ. భూమిని కోల్పోవాల్సి వస్తుంది. బాధితులు సోమవరం స్థానిక కలెక్టరేట్‌లోని రెవెన్యూ క్లినిక్ (పీజీఆర్ఎస్)లో జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సకు వినతి పత్రం అందజేశారు. తాము చేసేదేమీ లేదని జేసీ ఖరాఖండీగా చెప్పేశారు. తుళ్లూరు మండలంలోని అబ్బరాజుపాలెం, బోరుపాలెం, తుళ్లూరు, రాయపూడి గ్రామాల్లోని 71 మంది భూములిచ్చిన రైతులకు జరీబు కింద నమోదు చేసిన అధికారులు సమీపంలోనే ఉన్న కొండమరాజు గ్రామానికి చెందిన 17 మంది బాధితుల భూములు జరీబులో లేవని చెప్పడంతో తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. న్యాయపోరాటానికి సిద్ధమవుతున్నారు. ఆవేదన వారి మాటల్లోనే...

ఇంత అన్యాయం చేస్తారనుకోలేదు

మా భూమి రెండెకరాలు ల్యాండ్ పూలింగ్‌కు ఇచ్చాం. తొలి మూడేళ్లు మాకు జరీబు కింద కౌలు చెల్లించారు. ఎనిమిదేళ్లుగా ఆపేసారు. మా భూమిలో బోరు, కరెంట్ ఉన్నాయి. అన్ని రకాల పంటలు పండించే వాళ్లం. ఇప్పుడు కొత్తగా అధికారులు డ్రై ల్యాండ్ అంటున్నారు. రాజధాని కోసం భూమిలిచ్చిన మాలాంటి వాళ్లను ఇన్ని ఇబ్బందులకు గురిచేస్తారా, మరీ ఇంత అన్యాయం చేస్తారనుకోలేదు. ప్రభుత్వం పునరాలోచించి న్యాయం చేయాలి.

– తోట శివకుమారి

ప్లాట్లు ఇచ్చి రిజిస్ట్రేషన్ చేయడం లేదు

మేము ఎకరా పొలం రాజధాని నిర్మాణం కోసం ఇచ్చాం. నిబంధనల ప్రకారం మాకు ప్లాటు ఇచ్చారు. ఇప్పుడు మీది మెట్ట భూమి మీకు జరీబు భూమి హక్కుదారులకు ఇచ్చినట్లు ఇవ్వడం కుదరదని ఇచ్చిన ప్లాటు రిజిస్ట్రేషన్ చేయడం లేదు. బంగారం లాంటి భూమిని తీసుకుని ఇలా ఎందుకు ఇబ్బంది పెడుతున్నారు. ఎన్నిసార్లు తిరిగినా పట్టించుకోవడంలేదు.

– టి.ధనలక్ష్మి

పచ్చని పొలాలు తీసుకున్నారు..

మా భూమిలో మూడు పంటలు పండేవి. రాజధాని అంటూ కల్లబొల్లి మాటలు చెప్పి తీసుకున్నారు. ఇప్పుడు సినిమా చూపిస్తున్నారు. పైన నాయకులు చెప్పే మాటలకు కింద స్థాయిలో అధికారుల వ్యవహార శైలికి సంబంధం లేకుండా ఉంది. న్యాయమైన మా సమస్యలను పరిష్కరించకుండా మా భూముల్లో వీఐపీ టవర్స్ కడుతున్నారు. ఇది ఎంత వరకు న్యాయం. దీనిని న్యాయస్థానాల్లోనే తేల్చుకుంటాం.

– కె.లావణ్య

భూములు తిరిగి ఇచ్చేయండి

రెండెకరాల భూమి ఇచ్చి చందాల కోసం తిరిగినట్లు అధికారుల చుట్టూ తిరగాల్సిన పరిస్థితి వచ్చింది. మా గ్రామంలో 17 మందికి మాత్రమే ఇలా మెట్ట అని రాశారు. దీనిని వెంటనే మార్చాలి. మాకు న్యాయం చేయకపోతే మేము ఇచ్చిన భూములు మాకు ఇచ్చేయాలి. ఎన్నో ఆశలు పెట్టుకుంటే ఇంత దారుణంగా వ్యవహరిస్తారా. భూములు సర్వే చేయించిన జేసీ అశుతోష్ శ్రీవత్సకు వినతిపత్రం ఇస్తే ఏమీ చేయలేమని చెబుతున్నారు.

– కె.నాగభూషణం

అర్జీలు స్వీకరిస్తున్న జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా

అర్జీలు నిర్ణీత సమయంలో

పరిష్కరించాల్సిందే..

- జిల్లా కలెక్టర్ ఎ.తమీమ్ అన్సారియా
- 558 అర్జీలు స్వీకరణ

గుంటూరు వెస్ట్: అర్జీలు నిర్ణీత సమయంలో పరిష్కరించాల్సిందేనని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా స్పష్టం చేశారు. సోమవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఎస్ఆర్ శంకరన్ సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)లో కలెక్టర్ అధికారులతో కలసి అర్జీలు స్వీకరించారు. కలెక్టర్ మాట్లాడుతూ అందిన ప్రతి అర్జీని పక్కాగా పరిష్కారం చేయాలన్నారు. కొంత మంది అధికారులు ఇంకా పూర్తిస్థాయిలో శ్రద్ధ వహించాలని స్పష్టం చేశారు. నిర్దేశ సమయంలో పరిష్కరించాలని, నిర్దేశ సమయానికి తరువాత పరిష్కరించే వారిపై చర్యలు తప్పవని హెచ్చరించారు. దివ్యాంగులకు సంబంధించిన అర్జీలను కలెక్టర్ నేరుగా వారి వద్దకే వెళ్లి తీసుకున్నారు. అనంతరం అందిన 558 అర్జీలను జాయింట్ కలెక్టర్ అశుతోష్ శ్రీవత్సవ, డీఆర్వో షేక్ ఖాజావలి, ఆర్డీఓ కె.శ్రీనివాసరావు, డెప్యూటీ కలెక్టర్లు గంగరాజు, లక్ష్మీకుమారి, శ్రీనివాస్, జెడ్పీ సీఈఓ వి.జ్యోతిబసులతో కలిసి జిల్లా కలెక్టర్ పరిశీలించారు.

సమస్యలు పరిష్కరించాలి

జిల్లాలో అసంఖ్యాకంగా ఉన్న దివ్యాంగుల న్యాయమైన సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం ముందుకు రావాలి. రెండు సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న బ్యాక్‌లాగ్ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి. ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యం కల్పించాలి. మూడు చక్రాల వాహనాలు అందజేయాలి.

– బొక్కా ఆగస్టీన్, వైఎస్సార్ సీపీ దివ్యాంగుల విభాగం జిల్లా అధ్యక్షులు

సచివాలయాన్ని మార్చేస్తారా!

పెదనందిపాడు మండలం గొరిజవోలుగుంటపాలెంలో ప్రభుత్వ భవనంలో గ్రామ సచివాలయం 7 ఏళ్లుగా కొనసాగుతుంది. ఈ గ్రామంతోపాటు అబ్బినేనిగుంటపాలెం ప్రజలకు ఇది సౌలభ్యంగా ఉంది. ఇప్పుడు ఎటువంటి సమాచారంగాని, నిబంధనలు పాటించకుండా కొంతమంది ఈ సచివాలయాన్ని అబ్బినేనిగుంటపాలెంకు తరలించేందుకు ప్రయత్నిస్తున్నారు. విచారించి చర్యలు తీసుకోవాలి.

– గొరిజవోలు గ్రామ ప్రజలు

ఎస్టీ మహిళా సర్పంచ్ నిరసన

పంచాయతీ పారిశుధ్య కార్మికులతో కలిసి కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలుపుతున్న ప్రత్తిపాడు ఎస్టీ మహిళా సర్పంచ్

- పారిశుధ్య కార్మికులకు జీతాలు కూడా ఇవ్వనివ్వకుండా అధికారులు అడ్డుకుంటున్నారంటూ ఆరోపణ
- పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి ఆందోళన
- ఈవోపీఆర్డీ హామీతో నిరసన విరమణ
- బోర్డు వైసీపీది, పెత్తనం టీడీపీ వాళ్ల దంటున్న టీడీపీ వార్డు సభ్యుడు

ప్రత్తిపాడు: ప్రత్తిపాడు ఎస్టీ మహిళా సర్పంచ్ (వైఎస్సార్‌సీపీ) నిరసన స్వరం వినిపించారు. జీతాల బిల్లులు కూడా చేయకుండా అడ్డుకుంటున్నారంటూ అధికారుల తీరును ఎండగడుతూ పంచాయతీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేసిన ఘటన నియోజకవర్గ కేంద్రంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి..

- ప్రత్తిపాడు గ్రామ పంచాయతీలో సుమారు పదిహేను మంది పారిశుధ్య, వాటర్, విద్యుత్ సిబ్బంది కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్నారు. వీరికి నెలకు ఒక్కొక్కరికి రూ.10 వేల నుంచి రూ.15 వేల వరకు వేతనాలు చెల్లిస్తున్నారు.
- వీరికి గడిచిన ఐదు, ఆరు నెలలుగా జీతాలు చెల్లించడం లేదు. దీంతో పంచాయతీ కాంట్రాక్టు ఉద్యోగులు జీతాలు చెల్లించండి మహాప్రభో.. అంటూ గత కొద్ది రోజులుగా అటు పంచాయతీ పాలకవర్గ సభ్యులను, ఇటు అధికారులను వేడుకుంటున్నారు. ఎప్పటికప్పుడు వారికి నచ్చజెబుతూ మొత్తం జీతాల బకాయిలు చెల్లించకుండా, ఎంతోకొంత నగదు ఇచ్చి రోజులు నెట్టుకొస్తున్నారు.

పారిశుధ్య కార్మికుల ఆందోళన..

- సోమవారం పంచాయతీ కార్మికులంతా జీతాల బకాయిలు చెల్లించాలంటూ స్థానిక పంచాయతీ కార్యాలయం ఎదుట ఆందోళనకు దిగారు. బకాయిలున్న అన్ని నెలల జీతం మొత్తం వెంటనే చెల్లించాలని, అప్పటి వరకు పనుల్లోనికి రాబోమని డిమాండ్ చేస్తూ మధ్యాహ్నం నుంచి పనులను బహిష్కరించి, కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేశారు.
- వీరికి సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు లక్ష్మణరావు, పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా సెక్రటరీ చింతల శ్రీనివాసరావులు మద్దతు తెలిపారు.

కార్యాలయం ఎదుట బైఠాయించిన ఎస్టీ సర్పంచ్..

- పంచాయతీ సిబ్బంది జీతాల కోసం కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన వ్యక్తం చేస్తున్న నేపథ్యంలో వారికి మద్దతుగా వైఎస్సార్‌సీపీ ఎస్టీ మహిళా సర్పంచ్ వసువర్తి రమాదేవి కూడా వారితో పాటు బైఠాయించారు. పారిశుధ్య కార్మికులకు తమ మద్దతు తెలిపారు. వారికి వెంటనే జీతాలు చెల్లించాలని డిమాండ్ చేశారు.
- మీరే కదా జీతాలు చెల్లించేది.. మీరే వచ్చి బైఠాయించడం ఏమిటని మీడియా ప్రతినిధులు రమాదేవిని ప్రశ్నించించారు. మేం జీతాల బిల్లులు పెడదామంటే కొందరు అధికారులు అడ్డుకుంటున్నారని, అందుకే జీతాల కోసం నిరసన చేస్తున్నానని సర్పంచ్ ఆరోపించారు.
- అనంతరం అక్కడకు చేరుకున్న డిప్యూటీ ఎంపీడీవో షేక్ ఆదం షఫీ మంగళవారం పారిశుధ్య కార్మికులకు జీతాల బిల్లులు పెడతామని స్పష్టమైన హామీ ఇవ్వడంతో రమాదేవి నిరసన విరమించారు.

పంచాయతీ బోర్డు వైసీపీదే.. పెత్తనం టీడీపీ వాళ్లది..

- ఇదిలా ఉంటే సాయంత్రం సమయంలో పంచాయతీ పాలకవర్గంలోని కొందరు టీడీపీ, జనసేన వార్డు సభ్యులు విలేకరుల సమావేశం నిర్వహించారు.
- పంచాయతీలో ఉండాల్సిన చెక్‌బుక్‌లు లేవని, పంచాయతీలో రూ. పద్నాలుగు లక్షల మేర అవినీతి జరిగిందని రకరకాల ఆరోపణలు చేశారు.
- ఇదే సమావేశంలో పాల్గొన్న తెలుగుదేశం పార్టీ వార్డు సభ్యుడు మాత్రం 'ప్రస్తుతం వైసీపీ వాళ్లది బోర్డు నడుస్తుందని, టీడీపీ వాళ్లు పెత్తనం చేస్తున్నారని అన్నారు. అందువల్ల వివాదాలు ఉన్నాయన్నారు.

నా ఇల్లు, కార్యాలయంపై దాడి చేసిన వారిని

ఎన్ని రోజులు జైలులో పెట్టారు..?

- చంద్రబాబు, లోకేష్ స్థాయిలో జరిగిన కుట్ర మేరకే ఈ దాడి
- ఆ రోజు పోలీసుల ప్రేక్షకపాత్రకు వారు ఇచ్చిన ఆదేశాలు కారణం కాదా?
- ఈ దాడికి రాష్ట్ర ముఖ్యమంత్రి బాధ్యత వహించాలి
- రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతపాలన ఉంటే జవాబులు చెప్పండి
- కేంద్ర ర్యాంకింగ్స్‌లో చివరి స్థానానికి దిగజారిన ఆంధ్రప్రదేశ్
- మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు

మీడియాతో మాట్లాడుతున్న అంబటి, చిత్రంలో ఎంవీఎస్ నాగిరెడ్డి తదితరులు

గుంటూరు ఎడ్యుకేషన్: సీఎం చంద్రబాబును దూషించాననే ఆరోపణలతో తనను 18 రోజులు జైలులో పెట్టించిన టీడీపీ ప్రభుత్వం, తన ఇంటిపైనా, కార్యాలయంపైనా దాడి చేసిన వారిని ఎన్ని రోజులు జైలులో పెట్టించారో చెప్పాలని మాజీ మంత్రి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అంబటి రాంబాబు ప్రశ్నించారు. గుంటూరులోని తన నివాసం వద్ద సోమవారం ఆయన మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పలు అంశాలను సీఎంకు సంధించారు.

- తన ఇంటిపై దాడికి సీఎం చంద్రబాబు, నారా లోకేష్ స్థాయిలో కుట్రలు జరిగాయన్నారు. పోలీసుల ప్రేక్షక పాత్రకు కారణం చంద్రబాబు ఇచ్చిన ఆదేశాలు కావా అని ప్రశ్నించారు? ఈ దాడికి సీఎం బాధ్యత వహించాలన్నారు.
- తమ ఆదేశాలతో పంపిన టీడీపీ రౌడీ మూకలు ఏం చేసినా మౌనంగా ఉండాలని చెప్పడం వలనే దాడి జరిగిందని తాను చేస్తున్న ఆరోపణలకు చంద్రబాబు లేదా ఆయన కుమారుడు లోకేష్ సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు.
- సీఎంను దూషించానని తనను అక్రమ కేసులతో జైలుకు పంపిన ప్రభుత్వం, తన ఇంటిపై దాడికి పాల్పడిన వారిని ఎన్ని రోజులు జైల్లో ఉంచారో చెప్పాలన్నారు.
- తాను కులాల మధ్య చిచ్చు పెట్టేందుకు ప్రయత్నించానని, రిమాండ్ రిపోర్టులో తనపై అభాండాలు వేశారన్నారు. సీఎం సామాజిక వర్గాన్ని తాను దూషించానని రిపోర్టులో పొందుపర్చారని, అందు వలనే సీఎం కులానికి చెందిన వారిని తన ఇంటిపైకి పంపించారా అని ప్రశ్నించారు ?
- రాష్ట్రంలో ప్రజాస్వామ్యయుతంగా పాలన జరుగుతుంటే, తన ప్రశ్నలకు ఖచ్చితంగా సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సీఎం చంద్రబాబు, లోకేష్ ప్రోద్బలంతో వారు పోలీసు శాఖకు ఇచ్చిన ఆదేశాలతోనే తన ఇల్లు, కార్యాలయాలపై దాడి జరిగిందని తాను చేస్తున్న ఆరోపణలకు సమాధానం చెప్పాలని, లేకుంటే తన ఆరోపణలు నిజమని ఒప్పుకున్నట్లే భావించాల్సి వస్తుందన్నారు.

కూటమి నేతలు ఫోన్‌లో పరామర్శించారు

- తన ఇల్లు, కార్యాలయాలపై దాడులు జరిగి, తనను అక్రమంగా జైల్లో పెట్టించిన తరువాత వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తన ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులకు ధైర్యం చెప్పారని అన్నారు. తాను జైల్లో ఉన్న రోజుల్లో ఎంతో మంది వైఎస్సార్‌సీపీ నేతలు ఇంటికి వచ్చి తన కుటుంబ సభ్యుల్లో నింపిన ధైర్యం, వారు ఇచ్చిన ఓదార్పును మర్చిపోలేమని చెబుతూ వారందరికి కృతజ్ఞతలు తెలిపారు.
- తనపై మోపిన అక్రమ కేసులను టీడీపీ, జనసేన నేతలు తప్పుపట్టారని చెప్పారు. టీడీపీ, జనసేనలో రాజ్యాంగాన్ని గౌరవించే పలువురు నేతలు తనకు ఫోన్ చేసి పరామర్శించారన్నారు.
- దేశంలోని 10 రాష్ట్రాల్లో శాంతి, భద్రతలు, పరిపాలనలో కేంద్రం ఇచ్చిన ర్యాంకింగ్స్‌లో ఏపీ చివరిస్థానంలో ఉందని, భవిష్యత్తులో 29 రాష్ట్రాలస్థాయిలో సర్వే చేసినా టీడీపీ ప్రభుత్వ తీరుతో మన రాష్ట్రానికి చివరి స్థానం వస్తుందని అంబటి రాంబాబు చెప్పారు.
- వైఎస్సార్ సీపీ రైతు విభాగ నేత ఎంవీఎస్ నాగిరెడ్డి మాట్లాడుతూ గత సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలనలో రాష్ట్రంలో రాజకీయ దాడులు, కక్ష సాధింపు చర్యలు లేవన్నారు. ఈ 20 నెలల కాలంలో ప్రతిపక్ష నేతలపై కక్ష సాధింపు చర్యలు, పోలీసు కేసులు, భౌతిక దాడులు పెరిగిపోయాయని ఆరోపించారు.

జూనియర్ ఇంటర్ పరీక్షలు ప్రారంభం

- మంగళగిరిలో పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేసిన ఇంటర్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా
- జిల్లాలోని 87 కేంద్రాల పరిధిలో పరీక్షలు
- 35,111 మంది విద్యార్థులు హాజరు
- గుంటూరు నగరంలోని పలు ప్రాంతాల్లో విద్యుత్ కోత

గుంటూరు ఎడ్యుకేషన్: ఇంటర్మీడియెట్ పబ్లిక్ పరీక్షల్లో భాగంగా ప్రథమ సంవత్సర విద్యార్థులకు సోమవారం పరీక్షలు ప్రారంభమయ్యాయి. జిల్లా వ్యాప్తంగా ఏర్పాటు చేసిన 87 కేంద్రాల పరిధిలో పరీక్షలకు దరఖాస్తు చేసిన 36,018 మంది విద్యార్థుల్లో 35,111 మంది హాజరయ్యారు. ఉదయం 8.00 గంటల నుంచి విద్యార్థులు వారి వెంట వచ్చిన తల్లిదండ్రులతో పరీక్ష కేంద్రాలు కోలాహలంగా మారాయి. ఉదయం 9.00 గంటల తరువాత ఆసల్యంగా వచ్చే విద్యార్థులను పరీక్ష కేంద్రాల్లోని అనుమతించబోమని ఇంటర్మీడియెట్ బోర్డు జారీ చేసిన హెచ్చరికలతో విద్యార్థులు సకాలంలో చేరుకున్నారు. ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా, ఆర్ఐవో జి.సునీత మంగళగిరిలోని వీజే జూనియర్ కళాశాల పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఇంటర్ పరీక్షలు ప్రారంభమైన రోజునే గుంటూరు నగరంలోని వివిధ ప్రాంతాల్లో విద్యుత్ కోతలు విధించారు. రోడ్ల విస్తరణ, మరమ్మతుల పేరుతో ఎస్వీఎన్ కాలనీ, తారక రామానగర్, స్తంభాలగరువు, అమరావతిరోడ్డు ప్రాంతాల్లో ఉదయం 8.00 నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత కోత విధించారు. పరీక్షలు జరిగే రోజుల్లో పరీక్ష కేంద్రాలు ఉన్న ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో వివిధ పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ కోతలు అమలు కావడంతో విద్యార్థులు ఇబ్బందులు పడ్డారు.

మంగళగిరిలోని పరీక్ష కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న ఇంటర్మీడియెట్ బోర్డు కార్యదర్శి రంజిత్ బాషా

పెదపలకలూరు రోడ్డులోని విజ్ఞాన్ జూనియర్ కళాశాల కేంద్రంలో పరీక్షకు హాజరైన విద్యార్థులు

మిర్చి యార్డు సమాచారం (సోమవారం ధరలు)

వచ్చిన బస్తాలు	1,17,276
అమ్మకాలు	1,10,365
నిల్వ	24,393

నాన్ ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,500–20,000
నంబరు-5	13,500–20,000
341	14,000–20,500

ఏసీ కామన్ రకం క్వింటా (రూ.)

334	13,000–19,500
నంబరు-5	13,000–19,500
341	14,000–20,000

నాన్ ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000 – 17,500
బాడిగ-355	14,000 – 24,000
దేవనూరు డీలక్స్	15,500 – 24,500
ఆర్మూర్	13,000 – 16,500
తాలుకాయలు	8,000 – 11,500

ఏసీ ప్రత్యేక రకాలు క్వింటా (రూ.)

తేజ	13,000–17,000
బాడిగ - 355	14,000–23,000
తాలు	8,500 – 10,500

–కొరిటిపాడు (గుంటూరు)

పసుపు ధరలు (సోమవారం)

యార్డుకు వచ్చిన బస్తాలు : 284

కొమ్ములు : 159 బస్తాలు (ధర రూ॥ల్లో)

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
11,500	12,850	12,450

కాయలు : 125 బస్తాలు

కనిష్ట :	గరిష్ట :	మోడల్ :
10,750	12,800	12,300

మొత్తం అమ్మకాలు : 213.00 క్వింటాళ్లు

–దుగ్గిరాల

దళారుల చేతిలో మోసపోకండి

జిల్లా వ్యవసాయాధికారి ఎం.పద్మావతి

శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న పద్మావతి

ప్రత్తిపాడు: రైతులు దళారుల చేతిలో మోస పోవద్దని జిల్లా వ్యవసాయాధికారి ఎం. పద్మావతి అన్నారు. విత్తనాలు నుంచి పంట విక్రయం వరకు ప్రతి అంశంపై అవగాహన పెంచుకోవాలని సూచించారు. పెదనందిపాడు మండలం పాలపర్రులోని జీడీసీఎంఎస్‌లో సోమవారం మార్క్‌ఫెడ్ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రం ప్రారంభోత్సవం జరిగింది. ముఖ్య అతిథిగా హాజరైన ఎం.పద్మావతి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా డీఏవో మాట్లాడుతూ రైతులు నాణ్యత ప్రమాణాలకు అనుగుణంగా పద్నాలుగు శాతం తేమ ఉండేలా చేసుకోవాలన్నారు. తొలుత రైతులు రైతు సేవ కేంద్రాల్లో ఈకేవైసీ చేయించుకుని, ఫార్మర్ రిజిస్ట్రేషన్ చేయించుకోవాలని సూచించారు. షెడ్యూల్ ప్రకారం ఎకరానికి పన్నెండు క్వింటాళ్ల చొప్పున, ఒక రైతు 40 క్వింటాళ్ల వరకు విక్రయించుకోవచ్చునని తెలిపారు. ఈ క్రాప్ ఆధారంగా జీడీసీఎంఎస్ కేంద్రాల్లో ప్రభుత్వం నిర్ణయించిన కనీస మద్దతు ధర రూ. 5,870కు శనగలు విక్రయించుకోవచ్చని చెప్పారు. ఈ కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ డీఎం టి. నరసింహారెడ్డి, గుంటూరు సహాయ వ్యవసాయ సంచాలకుడు ఎన్. మోహన్‌రావు, మండల వ్యవసాయ అధికారి ఐ. సుబ్రహ్మణ్యం, రైతులు పాల్గొన్నారు.

జిల్లా పోలీసు కార్యాలయంలో పీజీఆర్ఎస్

ఫిర్యాదులు స్వీకరిస్తున్న డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు

పట్నంబజారు: గుంటూరు జిల్లా పోలీసు కార్యాలయంలో సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా అనేక మంది బాధితులు, ఫిర్యాదుదారులు వారి సమస్యలను అధికారుల దృష్టికి తీసుకొచ్చారు. పీజీఆర్ఎస్‌లో మొత్తం 215 అర్జీలను అధికారులు స్వీకరించారు. ట్రాఫిక్ డీఎస్పీ బెల్లం శ్రీనివాసరావు, ఈస్ట్ సబ్‌డివిజన్ డీఎస్పీ షేక్ అబ్దుల్ అజీజ్, సీసీఎస్ డీఎస్పీ మధుసూదనరావులు ఫిర్యాదులు స్వీకరించారు.

చర్యలు తీసుకోని పట్టాభిపురం సీఐ

నేను చుట్టుగుంటలో నివాసం ఉంటూ.. జేకేసీ కళాశాల రోడ్డులో పౌల్ట్రీ ఫాం నిర్వహిస్తున్నా. ఈ నెల 12వ తేదీ రాత్రి సుమారు 20 మందిపైగా వచ్చి మా చికెన్ షాపుపై దాడి చేశారు. కోడిగుడ్లు, రూ.19 వేల నగదు ఎత్తుకెళ్లారు. షాపు గేటు పగులకొట్టి, దుకాణాన్ని సర్వనాశనం చేశారు. ప్రొక్లయినర్‌తో వచ్చి పక్కనే ఉన్న నివాసాలను కూడా ధ్వంసం చేశారు. దీనిపై 13వ తేదీన పట్టాభిపురం సీఐకి ఫిర్యాదు చేసినా చర్యలు తీసుకోలేదు. ప్రాణహాని కూడా ఉంది. వారిని కఠినంగా శిక్షించటంతోపాటు మాకు రక్షణ కల్పించాలని విజ్ఞప్తి చేస్తున్నాం.

– నేరెళ్ళ దుర్గానాగమల్లేశ్వరరావు (చుట్టుగుంట)

వైభవం... ధ్వజారోహణం

ధ్వజారోహణంలో గరుత్మంతుడు

గరుడ ముద్దలు అందుకుంటున్న భక్తులు

- నృసింహుని కళ్యాణానికి దేవతలకు ఆహ్వానం
- ధ్వజారోహణంలో గరుత్మంతుని ప్రతిష్ఠ

మంగళగిరి టౌన్ : మంగళాద్రిలో వేంచేసిన యున్న లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాలలో అతి ప్రధానమైన ఘట్టం ధ్వజారోహణం. బ్రహ్మోత్సవాల్లో భాగంగా రెండవరోజు సోమవారం రాత్రి ఋత్వికరణ, అంకురారోపణాది కార్యక్రమాలు నిర్వహించారు. స్వామి కళ్యాణోత్సవానికి భక్త జనులను, దేవతలను ఆహ్వానానికి భక్తాగ్రేస్వరుడైన గరుత్మంతుని ధ్వజంపై ప్రతిష్టించారు. అష్టాంగాధిపతి అయిన గరుత్మంతునికి నివేదన చేసిన ప్రసాదాన్ని గరుడముద్దలు అన్న పేరుతో సంతానం లేని దంపతులు ప్రసాదంగా స్వీకరిస్తే సంతాన ఫలితం కలుగుతుందని భక్తుల నమ్మకం. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారి ధ్వజారోహణం తిలకించి, గరుడ ముద్దలు స్వీకరించి స్వామివారి ఆశీస్సులు పొందారు. ఈ వేడుకలను ఆలయ కార్యనిర్వహణాధికారి కె. సునీల్ కుమార్ పర్యవేక్షించగా కైంకర్య పరులుగా మంగళగిరి మాస్టర్ వీవర్స్ అసోసియేషన్ వ్యవహరించారు.

నేడు హనుమంత వాహనంపై...

లక్ష్మీ నరసింహస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మూడవ రోజైన మంగళవారం రాత్రి శ్రీవారు హనుమంత వాహనంపై గ్రామోత్సవంలో దర్శనమివ్వనున్నారు. భక్తులు పాల్గొని ఉత్సవాన్ని తిలకించి స్వామివారిని దర్శించుకోవాలని ఆలయ అధికారులు కోరారు.

మోసగించిన వారికి జైలుశిక్ష

తాడేపల్లి రూరల్: ఉద్యోగాలు ఇప్పిస్తానని మోసం చేసిన ముగ్గురు నిందితులకు మంగళగిరి న్యాయస్థానం జైలు శిక్షతోపాటు జరిమానా విధించింది. మంగళగిరి ఏజేసీజే కోర్టు న్యాయమూర్తి ఎం. ప్రసన్నలక్ష్మి సోమవారం తీర్పు వెలువరించారు. వివరాల ప్రకారం... తాడేపల్లి పట్టణానికి చెందిన దొంతిరెడ్డి అనుదీప్‌రెడ్డి గుంటూరు మున్సిపల్ కార్యాలయంలో కాంట్రాక్ట్ ఉద్యోగిగా పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో జమ్మిలిదిన్నె బసిరెడ్డి, దేవిరెడ్డి తిరుపతి రెడ్డి, జమ్మిలిదిన్నె ప్రవళికలు కస్టమ్స్ కార్యాలయంలో ఉద్యోగం ఇప్పిస్తామని నమ్మబలికి రూ.40 లక్షలు తీసుకుని పరారయ్యారు. దీనిపై తాడేపల్లి పోలీస్ స్టేషన్‌లో బాధితుడు 2019 ఆగస్టు 2వ తేదీన ఫిర్యాదు చేశాడు. అప్పటి ఎస్ఐ ఆర్ నారాయణ కేసు నమోదు చేసి దర్యాప్తు చేశారు. చీటింగ్ కేసు నమోదు చేసిన తాడేపల్లి పోలీసులు దర్యాప్తు నివేదికను న్యాయస్థానానికి అందించారు. కేసు పూర్వాపరాలను పరిశీలించిన న్యాయమూర్తి.. నిందితులకు మూడు సంవత్సరాల జైలుశిక్షతోపాటు ఒక్కొక్కరికి రూ.10 వేల జరిమానా విధించారు. ఈ కేసులో ప్రభుత్వ న్యాయవాదిగా కె. శివలీల వ్యవహరించారు.

విజిలెన్స్ దాడుల్లో భారీగా సిగరెట్లు పట్టివేత

సత్తెనపల్లి: అనుమతులకు విరుద్ధంగా బిల్లులు లేకుండా సిగరెట్లు గుట్టు చప్పుడు కాకుండా విక్రయిస్తున్నారని అందిన సమాచారం మేరకు గుంటూరు విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారి ఇ.సూర్య శ్రవణ్ కుమార్ ఆదేశాల మేరకు విజిలెన్స్ బృందం, సత్తెనపల్లి రెవెన్యూ అధికారులతో కలిసి సోమవారం దాడులు నిర్వహించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లిలోని వడ్డవల్లి ఆంజనేయ స్వామి దేవాలయం వెనుక బజార్‌లో 15వ వార్డుకు చెందిన నోముల కోటేశ్వరరావు గృహంలో సోమవారం అధికారుల బృందం తనిఖీలు నిర్వహించింది. ఈ తనిఖీల్లో బిల్లులు లేకుండా అనధికారికంగా సిగరెట్లను నిల్వ చేసి విక్రయిస్తున్నట్లు తేలింది. ఈ సిగరెట్లపై చిత్రపరమైన ఆరోగ్య హెచ్చరిక లేకపోవడం, ఎటువంటి చెల్లుబాటు అయ్యే అనుమతులు లేకపోవడాన్ని గుర్తించారు. నోముల కోటేశ్వరరావును విజిలెన్స్ అధికారులు ప్రశ్నించగా పట్టణంలో నివసించే ఉయ్యూరు సుబ్బారావు గుప్తా నుంచి ఈ సిగరెట్లను కొనుగోలు చేస్తున్నట్లు అంగీ కరించారు. మొత్తం రూ. 3,31,060 విలువైన మొత్తం ఆరు రకాల అనధికార విమల్, బ్లాక్, గోల్డ్ విమల్, విమల్, గోల్డ్‌శాండ్, పలాస్ సిగరెట్లను స్వాధీనం చేసుకున్నారు. నోముల కోటేశ్వరరావు, ఉయ్యూరు సుబ్బారావు గుప్తాపై సత్తెనపల్లి టౌన్ పోలీస్ స్టేషన్‌లో క్రిమినల్ కేసు నమోదు చేయబడుతుందన్నారు. తనిఖీలలో విజిలెన్స్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఇన్‌స్పెక్టర్ కె.చంద్రశేఖర్, అసిస్టెంట్ జియాలజిస్ట్ అనిల్‌బాబు, సబ్ ఇన్‌స్పెక్టర్ అమీర్, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

దంపతుల మధ్య గొడవ

- భర్తపై మరో వ్యక్తి దాడి
- చికిత్స పొందుతూ బాధితుడి మృతి

వెంకటేశ్వర నాయక్ మృతదేహం

మంగళగిరి టౌన్: భార్యాభర్తలు గొడవ పడుతుండగా మరో వ్యక్తి వచ్చి భర్తపై దాడి చేయడంతో గాయాలపాలైన చికిత్స పొందుతూ మృతి చెందిన ఘటనపై మంగళగిరి రూరల్ పోలీసులు సోమవారం కేసు నమోదు చేశారు. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. పల్నాడు జిల్లా, ఈపూరు మండలం, అంగలూరు తండాకు చెందిన జరపాల వెంకటేశ్వర నాయక్ (30), భార్య ప్రియాంక బాయితో మంగళగిరి మండలం కురగల్లు గ్రామానికి పనుల నిమిత్తం వచ్చారు. ఓ ప్రైవేటు కంపెనీలో లేబర్ వర్క్ చేస్తూ ఆ కంపెనీ ఇచ్చిన ఇంటిలో ఉంటూ రోజూ పనులు చేసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆదివారం మధ్యాహ్నం వెంకటేశ్వర నాయక్ మద్యం తాగొచ్చి భార్యతో గొడవపడ్డాడు. భర్తను ప్రతిఘటిస్తున్న క్రమంలో అక్కడే పనిచేస్తున్న కృష్ణ అనే వ్యక్తి వెంకటేశ్వర నాయక్ తలపై కర్రతో గట్టిగా కొట్టాడు. అతడు కింద పడిపోవడంతో చుట్టుపక్కల ఉన్న వారు గాయాలపాలైన దంపతులను గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తీసుకువెళ్లారు. వెంకటేశ్వర నాయక్ చికిత్స పొందుతూ సోమవారం మృతి చెందాడు. మృతుడి తండ్రి వాక్యా నాయక్ ఫిర్యాదు మేరకు మంగళగిరి రూరల్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కాటూరిలో గుండె ఆపరేషన్‌లకు రంగం సిద్ధం

రేపు గవర్నర్ చేతుల మీదుగా ఆధునిక క్యాథ్‌లాబ్ ప్రారంభం

మాట్లాడుతున్న డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్, డాక్టర్ చల్లా మోహన్‌రావు

గుంటూరు మెడికల్: ఏపీలోనే తొలిసారిగా గుండె చికిత్సలు చేసే అడ్వాన్స్‌డ్ ఇంటర్వెన్షనల్ సీమెన్స్ క్యాథ్‌ల్యాబ్ (గుండె వ్యాధుల చికిత్స)ను రూ. 6 కోట్లతో ఏర్పాటు చేసినట్టు కాటూరి మెడికల్ కాలేజ్ అండ్ హాస్పటల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ చెప్పారు. ఈనెల 25న రాష్ట్ర గవర్నర్ జస్టిస్ అబ్దుల్ నజీర్ ముఖ్య అతిథిగా విచ్చేసి గుండె శస్త్రచికిత్స ఆపరేషన్ థియేటర్ ప్రారంభిస్తారని చెప్పారు. గుంటూరులోని కాటూరి అర్బన్ క్లీనిక్‌లో సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ క్యాథ్ ల్యాబ్ అత్యంత అధునాతన సాంకేతిక పరిజ్ఞానాన్ని కలిగి ఉందన్నారు. ఈ విధమైన ల్యాబ్ టెక్నాలజీ ఆంధ్రప్రదేశ్‌లో తమ వద్ద మాత్రమే ఉందన్నారు.

- ఈనెల 25న కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్‌లో 22వ కన్వొకేషన్, గ్రాడ్యుయేషన్ డే–2026 వేడుకలకు గవర్నర్ ముఖ్య అతిథిగా విచ్చేస్తున్నట్టు డాక్టర్ ఏకుల కిరణ్‌కుమార్ వెల్లడించారు. గౌరవ అతిథిగా డాక్టర్ చంద్రశేఖర్ సంకురాత్రి హాజరవుతారన్నారు.
- కాటూరి మెడికల్ కాలేజీ హాస్పిటల్ చైర్మన్ కాటూరి సుబ్బారావు, డైరెక్టర్ డాక్టర్ స్వైరరావు నేతృత్వంలో అత్యాధునిక వైద్య సేవలు పేద ప్రజలకు నామమాత్రపు ఫీజులతో, మరికొన్ని రకాల వైద్య సేవలు ఎన్టీఆర్ వైద్య సేవ ద్వారా పూర్తి ఉచితంగా అందజేస్తున్నామన్నారు. గ్రామాల్లో సైతం ఉచిత వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు. సమావేశంలో కాలేజీ డీన్ డాక్టర్ చల్లా మోహన్‌రావు తదితరులు పాల్గొన్నారు.

రైలు కింద పడి మహిళ బలవన్మరణం

గురజాల: రైలు కింద పడి మహిళ ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం ఉదయం చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం... గురజాలలో నివాసం ఉంటున్న వీరిశెట్టి వైష్ణవి (39) స్థానికంగా ప్రైవేటు పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంటుంది. భర్త కిషోర్ లెక్చరర్‌గా పనిచేస్తాడు. ఈక్రమంలో తెల్లవారు జామున మాచర్ల నుంచి గుంటూరు వెళ్లే ప్యాసింజర్ రైలు కింద పడి వైష్ణవి ఆత్మహత్యకు పాల్పడింది. ఘటనలో వైష్ణవి కొన ఊపిరితో ఉండటంతో స్థానికులు 108 సహాయంతో గురజాలలోని సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. వైద్యశాలలో వైద్యులు పరీక్షించి మృతిచెందినట్లు తెలిపారు. మృతురాలికి భర్త, ఏడు సంవత్సరాల కుమారుడు ఉన్నారు. పోస్టుమార్టం నిమిత్తం సామాజిక ఆరోగ్య కేంద్రంలో ఉంచారు. రైల్వే పోలీసులు సమాచారం సేకరించి విచారణ చేపడుతున్నారు.

వైద్యశాల ఎదుట బంధువుల ఆందోళన..

సామాజిక ఆరోగ్య కేంద్రం వద్ద వైష్ణవి బంధువులు ఆందోళన చేపట్టారు. వైష్ణవి మృతికి భర్త కిషోర్ కారణమని కిషోర్ వైష్ణవిని ఎప్పుడు కట్నం కోసం వేధిస్తుండేవాడని మృతురాలి తల్లిదండ్రులు ఆరోపించారు. వైష్ణవిని పక్కంటి ఆడవాళ్లతో మాట్లాడినా అనుమానించి, అవమానించేవాడని.. గత కొంత కాలంగా చిత్రహింసలు పెడుతూ ఇబ్బందులకు గురిచేసేవాడని ఆరోపించారు. భర్త వేధింపులు తాళలేకనే తమ కుమార్తె ఆత్మహత్యకు పాల్పడిందని ఆరోపించారు. వైద్యశాల వద్ద వైష్ణవి కుమారుడు విలపించిన తీరు పలువురిచే కంట తడి పెట్టించింది.

అనుమానాస్పద స్థితిలో వ్యక్తి మృతి

సుమంత్ (ఫైల్)

గుణదల(విజయవాడ తూర్పు): అనుమానాస్పద స్థితిలో ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన మాచవరం పోలీస్ స్టేషన్ పరిధిలో సోమవారం చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. గుంటూరుకు చెందిన గడ్డం సుమంత్(28) గత కొంత కాలంగా మాచవరం దాసాంజనేయ స్వామి ఆలయం వద్ద స్వీట్స్ వ్యాపారం నిర్వహిస్తున్నాడు. మూడు నెలల క్రితం పరిచయమైన రామలక్ష్మి అనే మహిళతో సహజీవనం చేస్తూ.. ఇద్దరూ అదే ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని ఉంటున్నారు. ఇటీవల వీరిద్దరి మధ్య వ్యక్తి గత విషయాలపై తరచూ గొడవలు జరుగుతున్నాయి. సోమవారం ఉదయం నుంచీ ఇంట్లోనే ఉన్న సుమంత్ ఎవరూ లేని సమయం చూసి ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. కొద్ది సేపటికి అక్కడకు వచ్చిన రామలక్ష్మి అతనిని చూసి కంగారు పడి కేకలు వేసింది. అంతలో అక్కడకు చేరుకున్న స్థానికులు మృతుడిని కిందకి దించి పోలీసులకు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు వివరాలు సేకరించి అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేశారు. పంచనామా నిమిత్తం మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

క్లుప్తంగా

బోడె రామచంద్ర యాదవ్‌పై కేసు నమోదు

మంగళగిరి టౌన్: భారత చైతన్య యువజన (బీసీవై) పార్టీ జాతీయ అధ్యక్షుడు బోడె రామచంద్ర యాదవ్‌పై మంగళగిరి రూరల్ పోలీస్‌స్టేషన్‌లో సోమవారం కేసు నమోదైంది. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ సమీపంలో ఆదివారం బీసీ సింహగర్జన మహాసభ ఏర్పాటు చేశారు. కేటాయించిన సమయం కంటే ఎక్కువ సేపు సభను నిర్వహించడం, రాజకీయ విద్వేష ప్రసంగం చేయడం, సెక్షన్ 30 అమలులో ఉండగా రాజకీయ ర్యాలీలు, ప్రజలకు ఇబ్బందులు కలిగించడం వంటి అంశాలపై కేసు నమోదు చేసినట్లు మంగళగిరి రూరల్ పోలీసులు తెలిపారు.

అటవీ రాయబారులుగా విద్యార్థులు వెలగాలి

బాపట్ల: వ్యవసాయ విద్యార్థులు స్థిరమైన లక్ష్యాన్ని నిర్దేశించుకొని నిబద్ధతతో సాగితే వ్యవసాయ అటవీ రాయబారులుగా వెలుగొందుతారని ఐసీఏఆర్ సీఏఎఫ్ఆర్ఐ డైరెక్టర్ డాక్టర్ ఎ.అరుణాచలం అన్నారు. బాపట్ల వ్యవసాయ కళాశాలలో "స్థిరత్వం కోసం వ్యవసాయ అభివృద్ధిని ప్రోత్సహించే అడవుల పెంపకం"పై అతిథి ఉపన్యాసకులుగా ఆయన ప్రసంగించారు. పీజీ, పీహెచ్‌డీ విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడారు. అర్బన్, రూరల్ ప్రాంతాల్లోని అటవీరహిత ప్రదేశాలలో చెట్లను పెంచడం ద్వారా 33% అటవీ విస్తీర్ణతను పెంపొందించవచ్చన్నారు. ప్రపంచ వృక్ష గణాంకాల గురించి వివరించారు. కళాశాల అసోసియేట్ డీన్ డాక్టర్ పి.ప్రసూన రాణి పాల్గొన్నారు.

కౌలు రైతులందరికీ రుణాలివ్వాలి

కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు పాశం రామారావు

జిల్లా కలెక్టరేట్ ప్రాంగణంలో నిరసన వ్యక్తం చేస్తున్న కౌలు రైతు సంఘ నాయకులు

లక్ష్మీపురం: భూ యజమాని సంతకంతో నిమిత్తం లేకుండా కౌలు రైతులందరికీ గుర్తింపు కార్డులిచ్చి, వెంటనే పంట రుణాలు మంజూరు చేయాలని, అన్నదాత సుఖీభవ కౌలు రైతులందరికీ వర్తింపచేసి రూ.20 వేలు ప్రతి కౌలు రైతుకు ఇవ్వాలని, లేకపోతే ఆందోళనను ఉధృతం చేస్తామని కౌలు రైతుల సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పాశం రామారావు హెచ్చరించారు. సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం వద్ద రైతు, కౌలురైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు బొట్ల రామకృష్ణ అధ్యక్షతన జరిగిన ధర్నాలో ఆయన మాట్లాడుతూ సాగు భూమిలో 70 శాతం భూమిని కౌలు రైతులే సాగు చేస్తున్నారని, ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు పలు హామీలు ఇచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నా పట్టించుకోలేదని విమర్శించారు. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కౌలురైతుల ప్రస్తావనే లేదని అన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి ఈమని అప్పారావు మాట్లాడుతూ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే కేంద్ర ప్రభుత్వ కుట్రను తిప్పికొట్టాలని, జిల్లాలోని లంక భూములను సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలివ్వాలని కోరారు. కౌలు రైతుల సంఘం జిల్లా కార్యదర్శి మన్నవ మల్లేశ్వరరావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అడ్డగోలుగా భూ సేకరణ చేస్తోందని పేర్కొన్నారు. 2013 భూ సేకరణ చట్టం, ప్రస్తుత మార్కెట్ ధర ప్రకారం నష్టపరిహారం ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో కౌలు రైతుల సంఘం నాయకులు ప్రకాశరావు, రాజేంద్ర, పలె కృష్ణ, పాల్గొన్నారు.

చలో విజయవాడ విజయవంతం చేయాలి

చిలకలూరిపేట: ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఉద్యోగులు, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ ఈ నెల 25న నిర్వహిస్తున్న చలో విజయవాడ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని ఎస్టీయూ రాష్ట్ర ఆర్థిక కార్యదర్శి కె.కోటేశ్వరరావు, రాష్ట్ర డైరీ కమిటీ కన్వీనర్ పి.శ్రీనివాసరావు పిలుపు నిచ్చారు. ఎస్టీయూ ఆధ్వర్యంలో చలో విజయవాడ (సమర శంఖం) పోస్టర్‌ను పట్టణంలోని సీపీఐ కార్యాలయంలో సోమవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులు, ఉపాధ్యాయులు, పెన్షనర్ల ఐక్య పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ప్రభుత్వం మౌనం వహిస్తే సహించేది లేదని, ఇది హక్కుల కోసం జరుగుతున్న పోరాటంగా అభివర్ణించారు. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇచ్చినట్లు 12వ పీఆర్సీ కమిషన్ ఏర్పాటు, 30 శాతం మధ్యంతర భృతి కల్పించాలన్నారు.

ఏఎన్‌యూ పీజీ ప్రశ్నపత్రంలో తప్పులు

- మొదటి సెమిస్టర్ విద్యార్థులకు అవస్థలు
- పీజీ కో ఆర్డినేటర్ నిర్లక్ష్యమే కారణం



ఆంగ్ల ప్రశ్నపత్రంలో తప్పు

ఏఎన్‌యూ(పెదకాకాని): ఏఎన్‌యూలో పీజీ పరీక్షల నిర్వహణ అత్యంత బాధ్యతారాహిత్యంగా ఉందని విద్యార్థులు వాపోతున్నారు. ప్రస్తుతం జరుగుతున్న మొదటి సెమిస్టర్ పరీక్షల్లో అధికారుల నిర్లక్ష్యం మరోమారు బట్టబయలైంది. ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయం పరిధిలో పీజీ మొదటి సెమిస్టర్ పరీక్షలు ఈ నెల 18వ తేదీ నుంచి ప్రారంభమయ్యాయి. మొత్తం 19 సెంటర్లలో పరీక్షలు జరుగుతున్నాయి. తొలిరోజు బుధవారం ఆంగ్ల పరీక్ష పేపరు, సోమవారం జరిగిన బయాలజీ విభాగాల పరీక్షల ప్రశ్నపత్రాల్లో తప్పులను చూసి విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. తొలిరోజు తప్పులతో కూడిన ప్రశ్నపత్రం ఇచ్చి సోమవారం అసలు సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చాయని విద్యార్థులు వాపోతున్నారు. ... ప్రశ్నపత్రంలో 50 శాతానికి పైగా సిలబస్‌లో లేని ప్రశ్నలు రావడంతో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ... సిలబస్‌లో లేని ప్రశ్నలు వచ్చాయని వర్సిటీ అధికారుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ... పీజీ కో ఆర్డినేటర్ మన్నం సుబ్బారావు వచ్చి విద్యార్థుల చేతుల్లో నుంచి తప్పుగా వచ్చిన ప్రశ్నపత్రాలను తీసుకెళ్లడం తీవ్ర చర్చనీయాంశమైంది. సోమవారం జరిగిన బీఈడీ పరీక్షల్లో కూడా పలు సెంటర్లలో ఒక దానికి బదులు మరొక పేపరు ఇవ్వడంతో విద్యార్థులు అయోమయానికి గురయ్యారు. పరీక్ష నిర్వహణ అలసత్వంగా మారింది. మూడో సెమిస్టర్ పరీక్షల్లో కూడా తప్పులతో కూడిన ప్రశ్నపత్రాలు ఇవ్వడం, ఒకే ప్రశ్న మూడు సార్లు ఇవ్వడం వంటి ఘటనలు చోటు చేసుకున్నాయి. విద్యార్థుల జీవితాలతో చెలగాటం ఆడవద్దని విద్యావేత్తలు, తల్లిదండ్రులు, విద్యార్థులు వర్సిటీ అధికారులను కోరుతున్నారు.

కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : గుంటూరు, గుంటూరు-522006, గుంటూరు జిల్లా, ఆంధ్రప్రదేశ్.

స్థిరాస్తుల అమ్మకానికి వేలం అమ్మకం ప్రకటన

ఇ-వేలం తేదీ & సమయం: 30.03.2026, ఉ. 02.00 గం. నుండి సా॥ 4:00 గం. వరకు

రిజర్వు ధర: రూ. 5,20,000/- ; ధరావత్తు సొమ్ము: రూ. 52,000/-

https://baanknet.com ; www.canarabank.com ; 8333813834 ; 8291220220 ; support.baanknet@psballiance.com

తేది: 21.02.2026, ప్రదేశం: గుంటూరు — సం/- అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

సాక్షి క్లాసిఫైడ్స్

REAL ESTATE

■ NH-16 చిలకలూరిపేట దగ్గర DTCP ప్లాట్స్ (ఆఫర్) బ్యాంక్ లోను సౌకర్యం కలదు. బుకింగ్స్ జరుగుతున్నవి. సంప్ర॥ 8801545629, 9398873045

PLOT FOR SALE

■ గుంటూరు 16వ డివిజన్లో వెంచర్, నారాకోడూరు వెళ్లే రోడ్డుకి దగ్గర్లో, 30 అ. రోడ్డు, ఫెన్సింగ్, ఎంట్రన్స్ గేట్లు. చ. గజం రూ. 13,500/- మాత్రమే. స్పాట్ రి. ✆ 83175 28192

TO-LET COMMERCIAL

■ 3000చ॥అ॥ల కమర్షియల్ స్పేస్ బ్యాంకులకు / హాస్పిటల్స్‌కు అద్దెకు ఇవ్వబడును. రిషీ వాల్యూ హోమ్స్, జి.టి.రోడ్. ✆9394101244, 9390827957

SERVICES

GOLD FINANCE

■ బంగారం బ్యాంకులలో / ఏ ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్నవి విడిపించి ఈ రోజు మార్కెట్ ధర ప్రకారం కొనబడును. (స్పాట్ క్యాష్) ఫోన్ : 81422 92071

■ బంగారం కొనుగోలు, బ్యాంకులలో ఇతర ప్రైవేటు సంస్థలలో తాకట్టులో ఉన్న మీ బంగారం మా డబ్బుతో విడిపించి అధిక ధర చెల్లించి తీసుకొనబడును. ✆ 83338 33368

WANTED

■ మందడి, మాచర్ల, నాగార్జునసాగర్ ప్రాంతాలలో పనిచేయుటకు సెక్యూరిటీ గార్డ్స్ కావలెను. జీతం: 14000/- సంప్ర: 7569673994

■ Lady Staff Wanted B.Tech/ MBA, Study Abroad Consultancy Salary upto 15k, Good Communication Skills Exp./ Freshers. 93819 85468

■ ప్రముఖ సంస్థ నందు పనిచేయుటకు ఆఫీస్ స్టాఫ్, లేడీ టెలీకాలర్స్, మేనేజర్స్ జీతం+ ఇన్సెంటివ్స్ కలవు. సంప్ర: 9398873045, 8801545629

■ వారాహి మోటార్స్ ఆథరైజ్డ్ డీలర్స్ ఐషర్ ట్రాక్టర్స్ నందు పనిచేయుటకు సేల్స్ ఎగ్జిక్యూటివ్స్ కావలెను. ఈ క్రింది మండలాల్లో గుంటూరు, మంగళగిరి, పొన్నూరు, తాడేపల్లి, మేడికొండూరు, కాకుమాను, రేపల్లె, చెరుకుపల్లిలో పని చేయుటకు కావలెను. ఆసక్తి కలిగిన అభ్యర్థులు సంప్ర: Ph: 8374550999, 9778959999. అడ్రస్: వారాహి మోటార్స్ ఆథరైజ్డ్ డీలర్స్, ఐషర్ ట్రాక్టర్స్, NH-5,ఆటోనగర్, గుంటూరు.

■ Wanted B or D Pharmacy Candidates to work in a Pharmacy in Guntur City. PCI Registration mandatory. 6300975241

■ Wanted B.Com or MBA Candidates to work as an Accountant in Medical distribution firm in Guntur City. Contact : 6300975241

■ హరేకృష్ణ హోంకేర్ నందు వృద్ధులను, పేషెంట్లను, చంటిపిల్లలను చూసుకొనుటకు వర్కర్స్ / నర్సులు కావలెను. ఉచిత వసతి భోజనం. జీతం:17K.Ph:9640648899, 9848999184.

■ డ్వాక్రా మహిళలకు, నిరుద్యోగులకు, ఇంట్లో ఉంటూ పెట్టుబడి మీదే పెట్టుకొని ...

సాక్షి క్లాసిఫైడ్స్ గుంటూరు ప్యాక్ రూ. 475 ... 7075167663 7075161541

క్లుప్తంగా

నూతన వాహనం అందజేత

తాడికొండ: అమరావతితోపాటు రాజధాని రీజియన్ పరిధిలోని మొక్కల పెంపకం, గ్రీనరీ నిర్వహణ కోసం నూతన వాహనాన్ని సోమవారం సంబంధిత అధికారులకు సీఆర్‌డీఏ అందజేసింది. 36 హెచ్‌పీ ట్రాక్టర్‌ను తాజాగా కొనుగోలు చేసింది. కమిషనర్ కె.కన్నబాబు సంబంధిత అధికారులకు రాయపూడిలో ప్రధాన కార్యాలయంలో కొత్త వాహనం తాళాలను అందజేశారు. ల్యాండ్ స్కేప్ – ఎన్విరాన్‌మెంట్ విభాగ అడిషనల్ డైరెక్టర్ హార్టికల్చర్ బి.జాన్ బెన్నీ, హార్టికల్చర్ అధికారి ఎ.శివరామకృష్ణ పాల్గొన్నారు.

చలో కలెక్టరేట్‌ను విజయవంతం చేయాలి

ఫిరంగిపురం: పంచాయతీ కార్మికుల వేతనాలు పెంచాలని, టెండర్ల విధానం రద్దు చేయాలని కోరుతూ చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పంచాయతీ వర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సీహెచ్ రామారావు, ప్రధాన కార్యదర్శి డి.శామ్యూల్ అన్నారు. ఈ నెల 27న చలో కలెక్టరేట్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు. అనంతరం పోస్టర్లను ప్రదర్శించారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు బి. ఇబ్రహీం, పంచాయతీ కార్మికులు పాల్గొన్నారు.

కనీస వేతనం ఇవ్వాలని రిలే దీక్షలు

ఫిరంగిపురం: అంగన్‌వాడీ కార్యకర్తల కనీస వేతనం రూ. 26వేలు ఇవ్వాలని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా గౌరవ అధ్యక్షురాలు జి. రమణ అన్నారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరాహార దీక్షలు ప్రారంభించారు. మార్చి 2న విజయవాడలో నిర్వహించే మహాధర్నాలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలని తెలిపారు. సీఐటీయూ మండల కార్యదర్శి షేక్ మస్తాన్‌వలి, అంగన్‌వాడీలు పాల్గొన్నారు.

ఘనంగా ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు

కొల్లిపర: మండల కేంద్రంలోని శ్రీదేవి భూదేవి సమేత జనార్దనస్వామి వారి దేవస్థానంలో సోమవారం వేదపండితుల సమక్షంలో వేదమంత్రాల మధ్య బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. స్వామి వారిని పండితులు పెండ్లి కుమారుడిగా అలంకరించి ప్రత్యేక పూజాకార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గజవాహనంపై స్వామివారి గ్రామోత్సవం నిర్వహించారు. ఆలయ బ్రహ్మోత్సవాల్లో మహిళలు పెద్ద ఎత్తున పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు జగన్నాథాచార్యులు మాట్లాడుతూ బ్రహ్మోత్సవాలు మార్చి 1వ తేదీ వరకు జరుగుతున్నట్లు తెలిపారు. 9 రోజుల పాటు స్వామి వారికి ప్రత్యేక పూజ కార్యక్రమాలు, సాయంత్రం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

అయోడిన్ లోపిస్తే ఎదుగుదలకు ప్రమాదం

మండల వైద్యాధికారిణి డాక్టర్ నేహా

కొల్లిపర: గర్భిణులకు పుట్టబోయే వారిలో, అలాగే పుట్టిన పిల్లల్లో అయోడిన్ లోపించినప్పుడు పిల్లల ఎదుగుదల ఆగి అనేక ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయని మండల వైద్యాధికారిణి డాక్టర్ నేహా గంటా అన్నారు. జాతీయ అయోడిన్ లోపాల రుగ్మతల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలో వివిధ గ్రామాలల్లో 6 నుంచి 12 ఏళ్ల లోపు పిల్లలకు గాయిటర్ వ్యాధి పరీక్షలు నిర్వహించి అయోడిన్ శరీరానికి ఎందుకు అవసరం? వంటి అంశాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు అవకాశాలను ఉపయోగించుకోవాలి

మంగళగిరి టౌన్ : బూట్ క్యాంప్ ద్వారా తమకు అందుబాటులో ఉన్న అవకాశాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కాలేజియేట్ ఎడ్యుకేషన్ కమిషనర్, రూసా ప్రాజెక్ట్ ఆఫీసర్ డాక్టర్ నారాయణ భరత్ గుప్త సూచించారు. గుంటూరు జిల్లా మంగళగిరిలోని రతన్‌టాటా ఇన్నోవేషన్ హబ్ (ఆర్‌టీఐహెచ్) కార్యాలయంలో సోమవారం సీసీఈ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న ప్రభుత్వ డిగ్రీ కళాశాలల విద్యార్థుల కోసం స్టూడెంట్ ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్, ఇన్నోవేషన్ బూట్ క్యాంప్‌ను నిర్వహించారు. 5 రోజుల కార్యక్రమంలో భాగంగా మొదటిరోజు ప్రారంభ సమావేశంలో నారాయణ భరత్ గుప్త మాట్లాడుతూ ఈ క్యాంప్ ద్వారా అత్యంత డిమాండ్ ఉన్న పరిశ్రమ భాగస్వాములు, ఆవిష్కరణల తరగతులు ఉంటాయన్నారు. విద్యార్థులు వాస్తవ ప్రపంచానికి దగ్గరగా ఉన్నందున దీర్ఘకాలిక సమాజ సవాళ్లను పరిష్కరించే దృక్పథం, శక్తిని కలిగి ఉండాలని పేర్కొన్నారు. ఇలాంటి ప్లాట్‌ఫామ్‌ల ద్వారా ఆచరణీయ వ్యాపారాలుగా మార్చడానికి స్పష్టత లభిస్తుందన్నారు. ఇలాంటి అవకాశాలే జీవితాల్లో గొప్ప విజయానికి మలుపులుగా మారుతాయని వివరించారు. 60 మంది విద్యార్థులు ఈ బూట్ క్యాంప్‌లో పాల్గొన్నారు. కార్యక్రమంలో సీసీఈ అకడమిక్ గైడెన్స్ ఆఫీసర్ డాక్టర్ సీహెచ్ తులసి, ఐటీ స్పెషల్ ఆఫీసర్ ఆఫ్ డ్యూటీ డాక్టర్ ఎ.వి. కవిత, ఆర్టీఐహెచ్ హెడ్ ఇంక్యుబేషన్ తరుణ్ కృష్ణకుమార్ తదితరులు పాల్గొన్నారు.

బూట్ క్యాంప్‌లో విద్యార్థులకు సూచనలు చేస్తున్న డాక్టర్ నారాయణ భరత్ గుప్త

ధర్నాను జయప్రదం చేయాలని పిలుపు

తాడేపల్లి రూరల్: మున్సిపల్ కార్మికుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ నేడు విజయవాడలో ధర్నాచౌక్ నందు జరిగే కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని సీఐటీయూ తాడేపల్లి మండల కార్యదర్శి పల్లెకృష్ణ పిలుపునిచ్చారు. సోమవారం తాడేపల్లి రూరల్ పరిధిలోని కుంచనపల్లి, వడ్డేశ్వరం, కొలనుకొండ, గుండిమెడ గ్రామాల్లో పారిశుద్ధ్య కార్మికులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కృష్ణ మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులకు కనీస వేతన చట్టం ప్రకారం జీతాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీస సౌకర్యాలు కూడా కల్పించడం లేదని విమర్శించారు. మున్సిపల్ కార్మికుల సమస్యలపై విజయవాడలో ఈనెల 23వ తేదీన జరుగునున్న ధర్నాలో అందరూ పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. కార్యక్రమంలో ఏపీ మున్సిపల్ పారిశుద్ధ్య కార్మిక సంఘం తాడపల్లి మండల కార్యదర్శి మేకల డేవిడ్, పారిశుద్ధ్య కార్మిక సంఘం నాయకురాలు కృష్ణ తులసి, కోటేశ్వరి, ఇస్సాకు, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులతో మాట్లాడుతున్న పల్లెకృష్ణ

ఉత్సాహంగా గ్రంథోత్సవం

పుస్తక ప్రదర్శనను ప్రారంభిస్తున్న రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు

పుస్తకాలను పరిశీలిస్తున్న విద్యార్థులు, అధ్యాపకులు

తాడేపల్లి రూరల్: తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలోని సెంట్రల్ లైబ్రరీ ఆధ్వర్యంలో సోమవారం పుస్తక ప్రదర్శన (గ్రంథోత్సవం 2026)ను వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు ప్రారంభించారు. ఈ సందర్భంగా కేఎల్‌యూ కేంద్ర గ్రంథాలయాధికారి డాక్టర్ ఆర్.కె. కిషోర్ పట్నాల మాట్లాడుతూ ఈ పుస్తక ప్రదర్శన రెండు రోజులపాటు నిర్వహిస్తామని చెప్పారు. పఠన అలవాట్లను పెంపొందించడం, గ్రంథాలయ వనరుల సమర్థవంత వినియోగించడం, సమగ్ర మేధో వికాసాన్ని ప్రోత్సహించడం ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశమని అన్నారు. రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు మాట్లాడుతూ తక్షణ ఇంటర్నెట్ వినియోగం కంటే గ్రంథాలయాలు లోతైన అవగాహనను అందిస్తాయన్నారు. పీ అండ్ డీ సీనియర్ డైరెక్టర్, కమాండర్ గురుమూర్తి గంగాధరన్ మాట్లాడుతూ గ్రంథాలయంలో రెండు లక్షలకుపైగా పుస్తకాలతో పాటు విస్తృత డిజిటల్ వనరులు ఉన్నాయని తెలిపారు. ఇస్కాన్ నటరాజ కృష్ణ దాస్ స్వామిజీ మాట్లాడుతూ పుస్తకాలు చదవడం ద్వారా జీవితాన్ని అర్థవంతంగా తీర్చిదిద్దవచ్చని తెలిపారు. స్టార్ బుక్ లింక్స్ ప్రతినిధి జయ ప్రకాష్ నారాయణ మాట్లాడుతూ అధ్యాపకులు, విద్యార్థులు సూచించిన వ్యక్తిత్వ వికాసం, సాహిత్యం, పోటీ పరీక్షలు, బాలల సాహిత్యం, ఆధ్యాత్మిక గ్రంథాలు వంటి విభాగాలకు చెందిన పుస్తకాలు ప్రదర్శనకు ఉంచినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రొ వైస్ చాన్సలర్ డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌ఛార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, కేఎల్‌యూ కేంద్ర గ్రంథాలయ ప్రొఫెసర్ ఇన్‌ఛార్జి డాక్టర్ కిరణ్ కుమార్, విశ్వవిద్యాలయ ప్రతినిధులు, అధ్యాపకులు, ఆధ్యాత్మిక ప్రముఖులు, పబ్లిషర్స్ పాల్గొన్నారు.

అలరించిన 'విటోపియా- 2026'

తాడికొండ: గత రెండు రోజులుగా వీఐటీ ఏపీ యూనివర్సిటీలో కొనసాగుతున్న వార్షిక క్రీడా సాంస్కృతిక ఉత్సవం (విటోపియా- 2026) ఘనంగా కొనసాగింది. మూడవ రోజు సోమవారం నిర్వహించిన వివిధ సాంస్కృతిక కార్యక్రమాల్లో విద్యార్థులు పోటీపడుతూ తమ ప్రతిభను చాటుకున్నారు. సాయంత్రం జరిగిన ప్రో షోలో మోహన భోగరాజు, అబ్దుల్ వాహబ్ బ్యాండ్, డీజే నోటోరియస్ సంగీత విభావరిలు అలరించాయి. దర్పన్ రావల్, మక్కా బ్యాండ్, తెర మీకో బ్యాండ్లు పలు రకాల వాయిద్యాలతో వర్సిటీ హోరెత్తింది. వర్సిటీ ఇన్‌చార్జి వీసీ డాక్టర్ పి. అరుల్మోళివర్మన్, రిజిస్ట్రార్ డాక్టర్ జగదీష్ చంద్ర ముదిగంటి, డాక్టర్ ఎస్. గోపీకృష్ణన్ (విటోపియా కన్వీనర్), డాక్టర్ ఖాదీర్ పాషా (స్టూడెంట్ వెల్ఫేర్ డిప్యూటీ డైరెక్టర్), డాక్టర్ రామచంద్ర రావు (ఫిజికల్ ఎడ్యుకేషన్ డైరెక్టర్), విద్యార్థులు పాల్గొన్నారు.

పాటలు ఆలపిస్తున్న గాయకులు

తెనాలిలో న్యాయవాదుల నిరసన

తెనాలిరూరల్: కర్నూలులో న్యాయవాదిపై అక్కడి నాలుగో పట్టణ సీఐ విక్రమసింహ చేసిన దాడికి నిరసనగా తెనాలిలో న్యాయవాదులు కోర్టు విధులను బహిష్కరించారు. సీఐ విక్రమసింహపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కర్నూలులో గంజాయి కేసులో జానకిరామ్ అనే వ్యక్తిని పోలీస్‌స్టేషనులో పెట్టారని అతడి తల్లిదండ్రులు ప్రాధేయపడటంతో అక్కడి న్యాయవాది ఎం.పవన్‌కుమార్ కర్నూలు నాలుగో పట్టణ పోలీస్‌స్టేషనుకు ఈనెల 21వ తేదీన వెళ్లారు. సీఐ విక్రమ సింహను అతడి చాంబరులో కలిశారు. దీనిపై ఆగ్రహించిన సీఐ విక్రమసింహ అసభ్య పదజాలంతో పవన్‌కుమార్‌ను దూషించారు. ఫలానా కేసులో ముందస్తు బెయిలు ఎందుకు వేశావు? ముద్దాయిలను నాకు పట్టించలేదంటూ బూతులు తిట్టాడు. అక్కడే వున్న క్రైం పార్టీ పోలీసు మురళీని డోర్ లాక్ చేయమని చెప్పి, పవన్‌కుమార్‌పై భౌతిక దాడి చేశారు. చివరకు తన కాళ్లకు మొక్కించుకుని వదిలిపెట్టినట్టు తెనాలి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్ తెలిపారు. కర్నూలులో పవన్‌కుమార్‌పై దాడికి నిరసనగా సోమవారం తెనాలిలో న్యాయవాదులు కోర్టుల ప్రాంగణం వెలుపల నిరసన నినాదాలు చేశారు. సీఐ విక్రమసింహను వెంటనే విధుల నుంచి సస్పెండ్ చేయాలని, క్రిమినల్ కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు బేతాళ ప్రభాకర్, కార్యదర్శి హరిదాసు గౌరీశంకర్, సీనియర్ న్యాయవాదులు తాడిబోయిన శ్రీనివాసరావు, మద్ది మల్లికార్జున రావు, చింకా సురేష్ చంద్రయాదవ్, మండలపు వేణు గోపాల్, ఇందుపల్లి రాజారామ్, గ్రంధి జయరాం, కంభంపాటి వెంకటేశ్వరరావు, మధిర సురేష్, అంజనీ, బొంత వీరాంజనేయులు తదితరులు పాల్గొన్నారు.

కోర్టు వద్ద నిరసన తెలుపుతున్న న్యాయవాదులు

తహసీల్దార్‌కు రెండు అర్జీలు

తెనాలిరూరల్: పట్టణ కొత్తపేటలోని మండల తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం ప్రజాసమస్యల పరిష్కార వేదిక సమావేశాన్ని నిర్వహించారు. తెనాలి ఎంపీడీవో అత్తోట దీప్తి అర్జీలను స్వీకరించారు. మొత్తం రెండు అర్జీలు మాత్రమే వచ్చాయి. వీటిని సంబంధిత అధికారులకు పంపి నిర్ణీత వ్యవధిలోగా పరిష్కారానికి కృషిచేస్తానని అత్తోట దీప్తి చెప్పారు. సమావేశంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
99122 25447 (మంగళగిరి)
7075167541 (తాడికొండ)
Office mail : sakshigntadvt@gmail.com

లబ్ధిదారులకు చెక్కులు పంపిణీ

మంగళగిరి టౌన్: మంగళగిరి మండలం పెదవడ్లపూడి గ్రామానికి చెందిన పలువురు లబ్ధిదారులకు స్థానిక టీడీపీ నాయకులు సోమవారం ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. జవ్వాది సాంబశివరావుకు, చిట్టిబొమ్మ అనూరాధ, వాకా శ్రీనివాసరావుల నివాసాలకు వెళ్లిన నాయకులు సాయాన్ని అందజేశారు. మొత్తం రూ. 2,23,923 విలులైన చెక్కులను పంపిణీ చేసినట్లు నాయకులు పేర్కొన్నారు.

తాడేపల్లిలో..

తాడేపల్లి రూరల్: అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్న ఓ మహిళకు ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును సోమవారం టీడీపీ నాయకుడు కొమ్మారెడ్డి కిరణ్ అందజేశారు. తాడేపల్లి రూరల్ గుండిమెడ గ్రామానికి చెందిన వేముల అంజలికి రూ. 67వేలు అందించినట్లు తెలిపారు.

న్యాయవాది మోసంపై వృద్ధురాలు ఫిర్యాదు

తెనాలిరూరల్: న్యాయవాది మోసం చేయడమే కాకుండా కులం పేరుతో దూషించి దాడి చేశాడంటూ దళిత వృద్ధురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. వివరాలిలా ఉన్నాయి. పట్టణ ఐతానగర్ ప్యాడిసన్‌పేటకు చెందిన పినపాటి శ్యామ్ నానారావు, శారద దంపతులకు సంబంధించిన నివాస స్థల వివాదం కోర్టులో ఉంది. వీరి తరపున న్యాయవాది గొడవర్తి భాస్కరరావును నియమించుకున్నారు. భాస్కరరావు వైరి వర్గంతో కుమ్మక్కై వారికి అనుకూలంగా డిక్రీ వచ్చేలా చేశాడని, దీని గురించి ప్రశ్నిస్తే తనను కులం పేరుతో దూషించడమే కాకుండ దాడి చేశాడంటూ శారద టూ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు కావడంతో డీఎస్పీ బి.జనార్ధనరావు సోమవారం బాధితురాలి ఇంటికి వెళ్లి విచారించి స్టేట్‌మెంట్ నమోదు చేశారు. దళిత వృద్ధులను మోసం చేసి దాడికి పాల్పడిన భాస్కరరావును అరెస్ట్ చేసి బార్ కౌన్సిల్ నుండి డిబార్ చేయాలని ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు కిన్నెర నాగరాజు డిమాండ్ చేశారు.

నేడు బహిరంగ వేలం

తెనాలిటౌన్: శ్రీ లక్ష్మీ పద్మావతి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం వైకుంఠపురంలో మంగళవారం ఉదయం 11 గంటలకు 2026–27 సంవత్సరానికి సంబంధించి వివిధ లీజు హక్కులకు చెందిన ఇ-టెండర్, సీల్డు టెండరు బహిరంగ వేలం నిర్వహించబడునని ఆలయ కార్యనిర్వహణాధికారి వి.అనుపమ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సమాజంలో 'మానవత'ను పెంపొందించటమే ఆశయం

మానవత సంస్థ రాష్ట్ర వ్యవస్థాపకుడు

తెనాలి: సమాజంలో మానవతను పెంపొందించటమే ఆశయమని ప్రముఖ స్వచ్ఛంద సేవాసంస్థ మానవత వ్యవస్థాపకులు ఎన్.రామచంద్రారెడ్డి అన్నారు. మానవత, తెనాలి శాఖ సభ్యులతో సోమవారం ఆయన సమావేశమయ్యారు. స్థానిక ఏఎస్ఎన్ డిగ్రీ కాలేజీలో ఏర్పాటైన సమావేశానికి తెనాలి శాఖ చైర్మన్ డాక్టర్ కొలసాని రామ్‌చంద్ అధ్యక్షత వహించారు. ముఖ్యఅతిథిగా హాజరైన సంస్థ రాష్ట్ర శాఖ అధ్యక్షులు, వ్యవస్థాపకులు రామచంద్రారెడ్డి మాట్లాడారు. సంస్థ కార్యకలాపాలను సమీక్షించారు. తెనాలి శాఖ చేపడుతున్న సేవా కార్యక్రమాలను అభినందించారు. రాష్ట్రంలోని ఇతర శాఖలకు స్ఫూర్తిని ఇస్తున్నారని చెబుతూ, ప్రస్తుతమున్న 650 మంది సభ్యులను వచ్చే ఏడాదికి వెయ్యి మందికి పెరిగేలా చూడాలని సూచించారు. పట్టణంలో ప్రతి ఇంటి నుంచి ఒకరు మానవత, తెనాలి శాఖలో సభ్యుడిగా ఉండేలా చూడాలన్నారు. ఇందుకు అవసరమైన సూచనలను చేశారు. కార్యక్రమంలో మానవత రాష్ట్ర కన్వీనర్ మారబోయిన కోటేశ్వరరావు, సెంట్రల్ కమిటీ సభ్యులు రామాంజనేయులు రెడ్డి, గుంటూరు శాఖ నుంచి ఉప్పల సాంబశివరావు పాల్గొన్నారు. తెనాలి శాఖ ఎగ్జిక్యూటివ్ కమిటీ ప్రెసిడెంట్ పి.వాసు, వైస్ ప్రెసిడెంట్ ఓంకార్ ప్రసాద్, సెక్రెటరీ పి.వెంకట్, జాయింట్ సెక్రెటరీ డీవీ. సోమయ్య శాస్త్రి, ట్రెజరర్ ఎస్వీ శర్మ, ఎగ్జిక్యూటివ్ సభ్యులు మొవ్వా సత్యనారాయణ, అయినాల మల్లేశ్వరరావు, ఈఎల్‌వీ అప్పారావు, పి.మల్లికార్జునరావు, ఆర్.భుజంగరావు, సీహెచ్.శ్రీనివాసరావు, యడవల్లి రోహిణి, పి.శోభారాణి, శివరాజ కుమారి తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలి

తాడేపల్లి రూరల్ : మహిళలు ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ సలహాదారు సీతాశర్మ పేర్కొన్నారు. తాడేపల్లి రూరల్ వడ్డేశ్వరం కేఎల్ యూనివర్సిటీలో సోమవారం అంతర్జాతీయ మహిళా సమ్మిట్‌ను నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సీతాశర్మ మాట్లాడుతూ అన్ని రంగాల్లో మహిళలు ముందుటున్నారనే విషయాన్ని గుర్తుంచుకోవాలన్నారు. ప్రతి ఒక్కరూ చదువుకునే సమయంలో ఇతర వ్యాపకాలవైపు ఆకర్షితులు కాకూడదని పేర్కొన్నారు. విద్యలో ఆటంకాలను అధిగమించడానికి జీవితంలో ఎదురైన అనుభవాలను వివరించారు. రమేష్ ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ మమత రాయపాటి మాట్లాడుతూ మహిళలు శారీరకంగా, మానసికంగా ఆరోగ్యంగా ఉండడంతోపాటు సామాజికంగా ఉన్నతంగా ఉండాలని తెలిపారు. మహిళలు ఆరోగ్యంగా ఉంటేనే కుటుంబాలు ఆరోగ్యంగా ఉంటాయని, సమాజం కూడా ఆరోగ్యంగా ఉంటుందని పేర్కొన్నారు. ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ చైర్ పర్సన్ డాక్టర్ కె. రూతురమ్య మాట్లాడుతూ ఈ సమ్మిట్‌లో మహిళల సాధికారత, సామాజిక – ఆర్థిక రంగాలలో మహిళా నాయకత్వం, విద్య, వృత్తి, అవకాశాలు, సమాన హక్కులు గురించి, వ్యాపార నైపుణ్యం, నాయకత్వ అవకాశాలను పెంపొందించడం తదితర అంశాలపై చర్చలు జరిగాయని తెలిపారు. వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు మాట్లాడుతూ విద్యార్థినులు అయినా, మహిళా అధ్యాపకులు అయినా పురుషులతో సమానంగా పోటీ పడాలన్నదే వర్సిటీ కార్యదర్శి కోనేరు శివకాంచన లత ఉద్దేశమని తెలిపారు. కార్యక్రమంలో చాన్సలర్ కోనేరు సత్యనారాయణ, కోనేరు నిఖిల, వీసీ డాక్టర్ జి. పార్థసారథి వర్మ, ప్రో వీసీలు డాక్టర్ ఏవీఎస్ ప్రసాద్, డాక్టర్ ఎన్. వెంకట్రామ్, డాక్టర్ కె. రాజశేఖరరావు, రిజిస్ట్రార్ డాక్టర్ కె. సుబ్బారావు, విద్యార్థి సంక్షేమ విభాగం ఇన్‌చార్జి డీన్ డాక్టర్ కేఆర్ఎస్ ప్రసాద్, సలహాదారు డాక్టర్ హబీబుల్లా ఖాన్, చైర్ పర్సన్లు డాక్టర్ కేసీహెచ్ శ్రీకావ్య, డాక్టర్ గోవర్ధిని, కన్వీనర్లు హరిత, ప్రియ, ఉమెన్ డెవలప్‌మెంట్ సెల్ కో కన్వీనర్ డాక్టర్ సోనీ, డాక్టర్ ప్రసన్న తదితరులు పాల్గొన్నారు.

జ్యోతి ప్రజ్వలన చేసి సదస్సును ప్రారంభిస్తున్న మహిళా ప్రతినిధులు

పర్యవేక్షణ అధికారికి వినతి

తాడేపల్లి రూరల్: తాడేపల్లి పట్టణ పరిధిలోని ఇంటర్మీడియెట్ విద్యామండలి కార్యాలయంలో రాష్ట్ర పరీక్ష పర్యవేక్షణ అధికారికి ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్, రాష్ట్ర కార్యదర్శి రాజేష్‌లు వినతి పత్రాన్ని సోమవారం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఇంటర్ పరీక్షలు ప్రారంభమయ్యాయని, రాష్ట్ర ప్రభుత్వం ఒక్క నిమిషం ఆలస్యం కాకుండా పరీక్షా కేంద్రానికి చేరుకోవాలని నిబంధన పెట్టడం వలన విద్యార్థులు, తల్లిదండ్రులు చాలా ఆందోళనకు గురవుతున్నారని అన్నారు. గ్రామీణ ప్రాంతంలో సరైన సమయంలో బస్సు సౌకర్యాలు లేక ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రానికి రవాణా సౌకర్యం కల్పించకుండా ఇలాంటి నిబంధనలు పెట్టడం సరికాదని తెలిపారు. తక్షణమే ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలని కోరారు. చాలా కేంద్రాల్లో మౌలిక వసతులు లేక విద్యార్థులు ఇబ్బందులకు గురవుతున్నారని, వెంటనే సదుపాయాలు కల్పించాలని కోరినట్లు తెలిపారు. కార్యక్రమంలో పీడీఎస్‌యూ జిల్లా నాయకులు గణేష్, వెంకటేష్, దిరాజ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

అధికారికి వినతిపత్రం అందిస్తున్న పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు భాస్కర్ తదితరులు

కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలి

పొన్నూరు: చంద్రబాబు ప్రభుత్వం ఎన్నికలకు ముందు భవన నిర్మాణ కార్మికులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలని, పెండింగ్‌లో ఉన్న 46 వేల క్లెయిమ్‌లను వెంటనే పరిష్కరించాలని ఏఐటీయూసీ నియోజకవర్గ అధ్యక్షులు ఆరేటి రామారావు కోరారు. భవన నిర్మాణ కార్మికుల సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరుతూ భవన నిర్మాణ కార్మిక సంఘం, ఏఐటీయూసీ ఆధ్వర్యంలో సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. రామారావు మాట్లాడుతూ కార్మికులు మరణానంతరం వారి కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నాయని, వారిని ఆదుకోవడంలో ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుందన్నారు. కార్మికులకు ఇచ్చిన హామీ ప్రకారం భవన నిర్మాణ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి, సమస్యలు పరిష్కరించాలన్నారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. కార్పెంటర్ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకులు పెద్ది రాజు, ఆర్ బాబు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, జాజిరెడ్డి, నక్క సాయిబాబు, బాలయ్య, జ్యోతి, ధనలక్ష్మి, మహాలక్ష్మి, నాగమల్లేశ్వరి, తేజ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఆరేటి రామారావు

రోడ్లు, కాల్వలు నిర్మించండి

తెనాలిఅర్బన్: 4వ వార్డులో రోడ్లు, కాల్వలు లేక అనేక ఇబ్బందులు పడుతున్నామని వాటిని నిర్మించే విధంగా చర్యలు తీసుకోవాలని ఆ ప్రాంత వాసులు కోరారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికను సోమవారం మున్సిపల్ కార్యాలయంలో నిర్వహించారు. ఇన్‌ఛార్జి అసిస్టెంట్ కమిషనర్ డాక్టర్ మొంవ్వా యేసుబాబు, ఎంఈ శ్రీకాంత్‌లు ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. 14వ వార్డు మెయిన్ రోడ్డులో అడ్డుగా ఉన్న చెట్టును తొలగించాలని, 27వ వార్డులో కైలాస్ భవన్ రోడ్డు పేరును మార్పు చేయాలని కోరారు. అర్జీలన్ని పరిశీలించి తగు చర్యలు తీసుకుంటామని వారు హామీ ఇచ్చారు. కార్యక్రమంలో మేనేజర్ విల్సన్ జయకర్, పలువురు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

SHRIRAM Finance | శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్
రిజిస్టర్డ్ ఆఫీస్: శ్రీ టవర్స్, ప్లాట్ నెం. 14ఎ, సౌత్ ఫేజ్, ఇండస్ట్రియల్ ఎస్టేట్, గిండి, చెన్నై-600032.
జోనల్ ఆఫీస్ చిరునామా: శ్రీరామ్ ఎన్‌క్లేవ్, అన్నపూర్ణ నగర్, 5వ లైన్, ఇన్నర్ రింగ్ రోడ్డు, గోరంట్ల, గుంటూరు - 522034.

డిమాండ్ ప్రకటన

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ యాక్ట్, 2002 లోని సెక్షన్ 13(2) క్రింద డిమాండ్ ప్రకటన

[illegible]

ఋణగ్రహీత (లు) / సహ ఋణగ్రహీతలు / హామీదారు(లు) పేరు	ఎన్.పి.ఏ తేది ఋణ మొత్తం	డిమాండ్ నోటీసు తేది బకాయి మొత్తం
1. మారగాని రవికుమార్, తండ్రి: శ్రీనివాసరావు, డి.నెం: 1-55, 2-1 నుండి 3-55, కొలనుకొండ, తాడేపల్లి (మండలం), గుంటూరు జిల్లా-522501. 2. మారగాని వెంకట శేషకుమారి, భర్త: రవికుమార్, డి.నెం: 1-55, 2-1 నుండి 3-55, కొలనుకొండ, తాడేపల్లి (మండలం), గుంటూరు జిల్లా-522501. 3. షేక్ శ్రీనివాసరావు, తండ్రి: వెంకటేశ్వర్లు, డి.నెం: 13-7-11, 6వ లైన్, గుంటూరువారి తోట, బస్టాండ్ ఎదురుగా, గుంటూరు-522001.	31-03-2021 రూ. 25,00,000/- [illegible]	04-02-2026 ది. 04-02-2026 తేది నాటికి రూ. 24,88,244/- [illegible]

ఎంటర్‌ప్రైజ్ ఫైనాన్స్ లోన్ అగ్రిమెంట్ నెం.లు. GUNBRTF1812310008

[illegible] AP CRDA వారి ఎల్.పి.నెం. 29/2017/VJA, ఫైల్ నెం. CRDA-12023(35)/7/2017 [illegible]

ప్రదేశం: గుంటూరు
అధీకృత అధికారి, శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్

క్లుప్తంగా...

ఆ రూ.లక్ష గిఫ్ట్ కూపన్లు నాకొద్దు

- ప్రజాధనాన్ని కూటమి ప్రభుత్వం వృథా చేస్తోంది
- మండలిలో మా హక్కులను కాలరాస్తున్నారు.. అందుకే తిరిగిచ్చేస్తున్నా..
- పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి

సాక్షి, అమరావతి: ప్రజాధనాన్ని వృథా చేస్తున్న కూటమి ప్రభుత్వం ఎమ్మెల్సీలకు రూ.లక్ష విలువ చేసే గిఫ్ట్ కూపన్లు ఇచ్చిందని, అందుకే తాను ఆ కూపన్లను తిరిగి పంపుతున్నానని పీడీఎఫ్ ఎమ్మెల్సీ బొర్రా గోపీమూర్తి తెలిపారు. అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. బీఏసీ టైం టేబుల్ ప్రకారం శాసనమండలిలో ఐదు రోజుల పాటు బడ్జెట్‌పై చర్చ జరగాల్సింది పోయి ఇతర అంశాల వైపు దారి మళ్లిస్తున్నారని ఆయన అన్నారు. అసెంబ్లీలో విపక్షం లేనందున, అధికార పార్టీ బడ్జెట్‌ను ప్రవేశపెట్టి, వాళ్లే జబ్బలు చరుచుకుంటున్నారనని ఆయన ఎద్దేవా చేశారు. అయితే మండలిలో విపక్షాలు ఉన్నాయి.. కనీసం ఇక్కడైనా చర్చించాల్సింది పోయి, తమ లాంటి స్వతంత్ర ఎమ్మెల్సీల హక్కులను కాలరాస్తున్నారని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఉద్యోగులు, ఉపాధ్యాయులు, శ్రామికులు, అంగన్‌వాడీలు, కేజీబీవీ సిబ్బంది, రైతుల సమస్యలపై అసలు చర్చించడం లేదని ఆరోపించారు. ఎలాంటి చర్చలు జరగని మండలిలో ఎమ్మెల్సీగా ఉన్న తనకు ఇచ్చిన రూ.లక్ష విలువైన గిఫ్ట్ కూపన్లను తిరస్కరిస్తున్నట్లు ఆయన ప్రకటించారు. ఏడాది పాటు టాటా సంస్థకు చెందిన 'క్రోమా' షో రూమ్‌లో రూ.లక్ష విలువైన వస్తువులు కొనుగోలు చేసుకోమంటూ కూపన్లు ఇవ్వడం ద్వారా ప్రజాధనాన్ని వృథా చేస్తున్నట్లుగా భావించి ప్రభుత్వానికి తిరిగి ఇచ్చేస్తున్నానని ఆయన స్పష్టం చేశారు. శాసన మండలి జాయింట్ సెక్రటరీ విజయరాజుకు సోమవారం కూపన్లు తిరిగి ఇచ్చేశారు.

లేబర్ కోడ్స్ అమలుకు ప్రాథమిక నోటిఫికేషన్ జారీ

అభ్యంతరాల వెల్లడికి అవకాశం

సాక్షి,అమరావతి: కేంద్రం ప్రవేశపెట్టిన లేబర్ కోడ్స్ అమల్లో భాగంగా ఏపీ సామాజిక భద్రత నియమావళి–2026 ప్రాథమిక నోటిఫికేషన్‌ను సోమవారం రాష్ట్ర కార్మిక శాఖ వెలువరించింది. దీని ద్వారా ప్రభావితమయ్యే వ్యక్తుల సమాచారం కోసం ముసాయిదా నోటిఫికేషన్ 45 రోజుల పాటు అందుబాటులో ఉంచుతామని స్పష్టం చేసింది. ఈలోగా ప్రజలు తమ అభ్యంతరాలు తెలియజేయాలని సూచించింది. https://labour.ap.gov.in/,aplabourcodes2026@gmail.comద్వారా ప్రజలు తమ అభ్యంతరాలు తెలియజేయాల్సి ఉంటుంది.

సోషల్ మీడియా నియంత్రణపై త్వరలో చట్టం

హోం మంత్రి అనిత వెల్లడి

సాక్షి,అమరావతి: సామాజిక మాధ్యమాల నియంత్రణకు చట్టం చేయడానికి వీలుగా తగిన చర్యలను సిఫారసు చేయడానికి మంత్రుల బృందాన్ని ప్రభుత్వం ఏర్పాటు చేసిందని హోంమంత్రి అనిత చెప్పారు. ఆమె సోమవారం అసెంబ్లీలో మాట్లాడుతూ..సామాజిక మాధ్యమాల్లో జవాబుదారీతనం, తప్పుడు ప్రచారం, తప్పుడు సమాచారం, ఆన్‌లైన్ దుర్వినియోగం, ఫిర్యాదుల పరిష్కార యంత్రాంగం, పౌర హక్కుల సంరక్షణ అంశాలను కమిటీ పరిశీలిస్తుందని వివరించారు. మంత్రుల బృందం సిఫారసుల ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని తెలిపారు. పొరుగు రాష్ట్రాలు, ఇతర దేశాల్లో అమల్లో ఉన్న చట్టాలను అధ్యయనం చేస్తున్నట్లు చెప్పారు. 16 ఏళ్ల లోపు వయసున్న వారికి సోషల్ మీడియా వినియోగంపై నియంత్రణ కోసం చట్టం తీసుకొచ్చేందుకు పరిశీలిస్తున్నామన్నారు. కాగా, జైళ్లలో సంస్కరణలకు సంబంధించిన బిల్లుతో పాటు ఇద్దరికి మించి సంతానంపై ఉన్న ఆంక్షలను ఎత్తివేసే బిల్లుకు అసెంబ్లీలో ఆమోదముద్ర వేశారు.

శ్రీకాకుళంలో ప్రబలిన డయేరియా

శ్రీకాకుళం: శ్రీకాకుళం జిల్లా కేంద్రంలోని పలు ప్రాంతాల్లో డయేరియా ప్రబలింది. పది రోజుల కిందట ఆదివారం పేట, బలగ పరిసర ప్రాంతాల్లో డయేరియా ప్రబలగా తాజాగా గోల్కొండ రేవు మేదర వీధి పరిసర ప్రాంతాల్లో 30 మంది వరకు డయేరియా బారిన పడినట్లు సమాచారం. వీరంతా సమీపంలోని ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్లి చికిత్స పొందుతున్నారు. మంచి నీటి పైప్‌లైన్‌లో మురుగు నీరు కలవడంతో డయేరియా ప్రబలినట్లు తెలుస్తోంది. విషయం తెలుసుకున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ బాధితులను పరామర్శించారు. పారిశుధ్య పనులు చేపట్టాలని ఆదేశించారు.

శాంతి సస్పెన్షన్ ఎత్తివేతపై నిర్ణయం తీసుకోండి

సాక్షి, అమరావతి: దేవదాయ శాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శాంతిపై విధించిన సస్పెన్షన్ ఎత్తివేతపై నిబంధనల ప్రకారం నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు సోమవారం దేవదాయ శాఖ ముఖ్య కార్యదర్శి, కమిషనర్‌ను ఆదేశించింది. ఓ ఉద్యోగిని ఏడాది కాలానికి మించి సస్పెన్షన్‌లో ఉంచరాదంటూ 2024లో ప్రభుత్వం జారీ చేసిన జీవో 22 ప్రకారం నిర్ణయం తీసుకోవాలని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు న్యాయమూర్తి జస్టిస్ దొనడి రమేష్ ఉత్తర్వులు జారీ చేశారు.

'ఇందాపూర్'పై చర్చించాల్సిందే

టీటీడీకి ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరాపై మండలిలో చర్చకు వైఎస్సార్‌సీపీ పట్టు

- వైఎస్సార్‌సీపీ సభ్యుల వాయిదా తీర్మానాన్ని తిరస్కరించిన చైర్మన్
- పోడియం వద్ద వైఎస్సార్‌సీపీ సభ్యుల ఆందోళన
- ప్రతిగా టీడీపీ, జనసేన సభ్యులు కూడా పోడియం వద్ద నినాదాలు
- మండలి ప్రారంభమైన ఏడు నిమిషాలకే వాయిదా

మీడియా పాయింట్ వద్ద మాట్లాడుతున్న మండలిలో విపక్షనేత బొత్స సత్యనారాయణ

సాక్షి, అమరావతి: తిరుమల తిరుపతి దేవస్థానం(టీటీడీ)కి హెరిటేజ్ సంస్థకు అనుబంధంగా ఉన్న ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరా చేయడం, తిరుపతి లడ్డూ ప్రసాదంపై చర్చ జరపాలంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు సోమవారం కూడా శాసనమండలిలో ఆందోళన చేశారు. ఉదయం పది గంటల ప్రాంతంలో మండలి ప్రారంభం కాగానే టీటీడీకి ఇందాపూర్ డెయిరీ నెయ్యి సరఫరా చేయడం, తిరుపతి లడ్డూ ప్రసాదంపై చర్చ జరపాలంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మొండితోక అరుణ్‌కుమార్, వై.శివరామిరెడ్డి, పీవీవీ సూర్యనారాయణరాజు వాయిదా తీర్మానం ఇచ్చారు. దానిని తిరస్కరించిన చైర్మన్ మోషేన్‌రాజు... ప్రశ్నోత్తరాల కార్యక్రమాన్ని చేపడుతున్నట్టు ప్రకటించారు. దీంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు తమ స్థానాల వద్దే నిలుచుని ఇందాపూర్‌పై చర్చ జరగాలి.. హెరిటేజ్‌పై చర్చ జరగాలి... తిరుపతి లడ్డూపై చర్చ జరగాలి... అంటూ నినాదాలు చేస్తూ, ప్లకార్డులు ప్రదర్శించారు. అయినా ప్రశ్నోత్తరాల కార్యక్రమం ప్రారంభం కావడంతో వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు నినాదాలు చేసుకుంటూ చైర్మన్ పోడియం వద్దకు చేరుకుని చర్చకు పట్టుపట్టారు. అదే సమయంలో పలువురు టీడీపీ, జనసేన ఎమ్మెల్సీలు కూడా చైర్మన్ పోడియం ముందుకు వెళ్లి పోటీగా నినాదాలు చేశారు. దీంతో సభలో గందరగోళం నెలకొనడంతో... ప్రారంభమైన ఏడు నిమిషాలకే చైర్మన్ సభను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సభ ముగిశాక మీడియా పాయింట్ వద్ద మండలి విపక్ష నేత బొత్స సత్యానారాయణ, పార్టీ ఎమ్మెల్సీలతో కలిసి మీడియాతో మాట్లాడారు. 'శ్రీ వేంకటేశ్వరస్వామి ఫొటోల్ని చెప్పులతో పట్టుకున్నామని సీసీ ఫుటేజ్ సగం తీసుకొచ్చి నానా హడావిడి చేశారు. బీఏసీ మీటింగ్‌లో పూర్తి ఫుటేజ్ కావాలని కోరాం. అందులో చూస్తే వైఎస్సార్‌సీపీ సభ్యులు దేవుని ఫొటో పట్టుకున్నప్పుడు చెప్పులు ధరించలేదని స్పష్టంగా ఉంది. చెప్పులు ధరించినట్లుగా ప్రచారం చేస్తున్న దృశ్యాలు లేవు. కాబట్టి ఈ వీడియోల్ని ఎలా మార్ఫింగ్ చేశారన్నది చర్చించాలని మండలి చైర్మన్‌ను కోరాం. అలాగే, మండలిలో మేం మాట్లాడేది బయటకి రావడంలేదు. టీడీపీ సభ్యులు మాట్లాడితేనే లైవ్ ఇస్తున్నారు. అసలు మండలిలోని మా ఫొటోలు బయటికెవరు విడుదల చేశారు?' అని విపక్ష నేత బొత్స సత్యనారాయణ అన్నారు. 'శ్రీవారి లడ్డూ ప్రసాదంపై సీఎం చంద్రబాబు, ఇతర ప్రభుత్వ పెద్దలు చేసిన ఆరోపణలపై శాసనమండలిలో చర్చ కోసం తాము చేస్తున్న డిమాండ్ మేరకు ప్రభుత్వం ఎట్టకేలకు దిగొచ్చింది. బీఏసీ సమావేశం సోమవారం జరిగింది.. ఇందులో ఈనెల 26న మండలిలో చర్చ చేపట్టాలని నిర్ణయించారు. ఈ అంశంపై చర్చకు పట్టుబడితే ఇప్పటివరకూ తప్పించుకున్నారు. సీబీఐపై నమ్మకంలేకే ప్రభుత్వం ఏకసభ్య కమిషన్‌ను వేసింది.. అయితే, న్యాయస్థానాలపై మాకు ఎప్పుడూ నమ్మకం ఉంది. బీఏసీ భేటీలో మూడు అంశాలపై చర్చ చేపట్టాలని కోరాం. ఇందులో మొదటిది.. రాష్ట్రంలో క్షీణించిన శాంతిభద్రతలు, రెండోది.. రైతుల ఇబ్బందులు, మూడోది.. లడ్డూ నెయ్యి. చంద్రబాబు ప్రభుత్వంలో వ్యవసాయాన్ని ఛిన్నాభిన్నం చేశారు.. గిట్టుబాటు ధరలేదు.. బీమా లేదు.. పొగాకు, మిర్చి, మొక్కజొన్న, కోకో, మామిడి రైతులు ఇబ్బందిపడుతున్నారు.

విశాఖలో భూదోపిడీపైనా చర్చిస్తాం..

'మండలిలో విద్య, సాగునీటి ప్రాజెక్టులపైనా చర్చిద్దామన్నారు. అందుకు అంగీకరించాం. వైజాగ్‌లో గీతం వర్సిటీ పేరు మీద రూ.5 వేల కోట్ల విలువైన భూములు దోచుకోవాలని చూస్తున్నారు. నిన్న మొన్న పెట్టిన స్టార్టప్ కంపెనీలకు 99 పైసలకే కారు చౌకగా భూములు కట్టబెట్టిన వ్యవహారంపైనా చర్చ కోరాం. విశాఖలో భూములను చంద్రబాబు కుటుంబం ఎలా దోచుకుంటుందో మండలిలో చర్చిస్తాం' అని బొత్స సత్యనారాయణ తెలిపారు. 'హెరిటేజ్ వెనుక ఉన్న ఇందాపూర్ డెయిరీ హైదరాబాద్ మార్కెట్‌లో కేజీ నెయ్యి రూ.560 (జీఎస్టీ అదనం)కి అమ్ముతూ.. టీటీడీకి మాత్రం రూ.658కు సరఫరా చేస్తోంది. దీన్నిబట్టి ప్రజలకు కల్తీనెయ్యి అమ్ముతున్నారని అనుకోవాలా? లేక టీటీడీకి ఎక్కువ ధరకు సరఫరా చేస్తూ శ్రీవారి సొమ్మును దోచుకుంటున్నట్లు అనుకోవాలా? ప్రభుత్వం దీనికి సమాధానం చెప్పాలి. టీడీపీ కూటమి నేతలకు, వారి సంస్థలకు ధనార్జన ఆశ లేకపోతే దేవుడికి సరఫరా చేసే నెయ్యి రేటు తగ్గించి ఇవ్వాలి కదా?' అని ప్రశ్నించారు.

బాబు దుర్మార్గాలు బయటకొస్తున్నాయి..

మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ విమాన ప్రమాద ఘటనపై మరో కొత్త వ్యవహారం వెలుగులోకి వచ్చింది. ఎన్సీపీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ వెల్లడించిన విషయాలు అందరినీ ఆశ్చర్యానికి గురిచేశాయి. హెరిటేజ్‌కి వీఎస్ఆర్ ఏవియేషన్‌కు ఉన్న బంధం ఏంటో రోహిత్ పవారే బయటపెట్టారు. దీనికి అధికార పక్షం ఏం సమాధానం చెబుతుంది? హెరిటేజ్ సంస్థ పాలు, పెరుగు వ్యాపారం మాత్రమే చేస్తుందని అందరం అనుకున్నాం. కానీ, హెరిటేజ్ ఫిన్‌లీజ్ అనే మరో సంస్థ ద్వారా వీఎస్ఆర్ వెంచర్స్‌లో పెట్టుబడులు పెట్టిన విషయం ఇప్పుడు బయటపడింది. చంద్రబాబు దుర్మార్గాలు ప్రజలకు ఒకొక్కటిగా తెలిసిపోతున్నాయి.

కల్తీ పాలు మరణాలు సర్కారు హత్యలే..

రాజమహేంద్రవరంలో కల్తీ పాలతో పలువురు చనిపోవడం, 20 మంది వరకూ ఆస్పత్రిపాలు కావడం దురదృష్టకరం. దీన్ని ప్రభుత్వ వైఫల్యంగా అర్థంచేసుకోవాలి. ప్రభుత్వ నియంత్రణ, పర్యవేక్షణ లేకపోవడం, దిగువ స్థాయిలో అవినీతి పెచ్చుమీరిపోవడంవల్ల ఈ మరణాలు జరిగాయి. గతంలో కల్తీసారా మరణాలు చూశాం.. కానీ, కల్తీ పాలతో జనం చనిపోవడం ఇప్పుడే వింటున్నాం. అన్ని శాఖల్నీ గాలికొదిలేశారు. పచ్చ మీడియా వాస్తవాలు పక్కనబెట్టి ప్రభుత్వాన్ని మోస్తోంది. రాజమహేంద్రవరంలో జరిగిన మరణాలు ప్రభుత్వ హత్యలుగానే భావించాలి. కల్తీ చేసిన వారితో పాటు బాధ్యులైన అధికారులపైనా చర్యలు తీసుకోవాలి. ప్రభుత్వం అంటే భయం లేకపోవడంవల్లే ఇలాంటి ఘటనలు జరుగుతున్నాయి.

శాసనమండలి సభ్యుల హక్కులు కాపాడండి

మండలి చైర్మన్ చాంబర్ ఎదుట వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీల ఆందోళన

చైర్మన్ చాంబర్ ఎదుట నిరసన తెలుపుతున్న వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు

సాక్షి, అమరావతి: శాసనమండలి సభ్యుల హక్కులను కాపాడాలంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు సోమవారం మండలి లాబీలోని చైర్మన్ చాంబర్ ఎదుట ఆందోళన నిర్వహించారు. ఉదయం సభ తాత్కాలికంగా వాయిదా పడిన సమయంలో దాదాపు అర్ధగంటపాటు ఆందోళన నిర్వహించి ప్రభుత్వంతోపాటు అసెంబ్లీ సెక్రటరీ జనరల్‌కు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. శాసనమండలి చైర్మన్ పోడియం వద్ద సీసీ టీవీ ఫుటేజీ విడుదల విషయంలో ప్రభుత్వ దొంగ వైఖరి నశించాలంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. చైర్మన్ పోడియం వద్ద కార్యక్రమాలకు సంబంధించిన సీసీ టీవీ ఫుటేజీని ఇవ్వాలని తాము కోరుతున్నా, ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు ఆరోపించారు. అదే సమయంలో అధికార పార్టీకి అనుకూలంగా ఉన్న, వారికి ప్రయోజనం కలిగించేలా ఉన్న సీసీ ఫుటేజీ మాత్రం బయటకు వచ్చిందని, మీడియాలో కూడా ఫొటోలు ప్రచురితమయ్యాయని వారు తెలిపారు. 'మండలి సభ్యుల హక్కులను కాపాడండి... మీకో న్యాయమా.. మాకో న్యాయమా.. ద్వంద్వ వైఖరి నశించాలి.. చైర్మన్ గారూ మాకు న్యాయం చేయండి... ప్రజాస్వామ్యాన్ని కాపాడండి..' అంటూ వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం మండలిలో విపక్ష నేత బొత్స సత్యనారాయణ తమ పార్టీ ఎమ్మెల్సీలను చైర్మన్ వద్దకు తీసుకువెళ్లి చర్చలు జరిపారు. బయటకు వచ్చాక వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు మాట్లాడుతూ తాము కోరిన సీసీ టీవీ ఫుటేజీని ఇచ్చేందుకు చైర్మన్ అంగీకరించారని తెలిపారు.

శ్రీవారికి అపచారం చేసిందెవరో తేలాలి..

సాక్షి, అమరావతి: ''శ్రీ వేంకటేశ్వరస్వామికి అపచారం చేసిందెవరో ఈ ప్రభుత్వం బయటపెట్టాలి. చంద్రబాబుకు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరుతూ శాసనమండలి సమావేశంలో చెప్పులు తీసేసి శ్రీవారి ఫొటో తీసుకెళ్లి నిరసన తెలిపాం. మేం మండలి నుంచి బయటికి రాకుండానే మా ఫొటోలు బయటకెలా వచ్చాయి? మేం ఏనాడూ శ్రీ వేంకటేశ్వరస్వామి ప్రతిష్టను దిగజార్చేలా మాట్లాడలేదు. ప్రభుత్వానికి దమ్ముంటే మొత్తం ఫుటేజీ బయటపెట్టాలి'' అని వైఎస్సార్‌సీపీ ఎమ్మెల్సీలు లేళ్ళ అప్పిరెడ్డి, తూమాటి మాధవరావు, వరుదు కళ్యాణి, కల్పలతారెడ్డి, తోట త్రిమూర్తులు, రమేష్‌యాదవ్, పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి ఎంవీ రామచంద్రారెడ్డి డిమాండ్ చేశారు.అసెంబ్లీ మీడియా పాయింట్ వద్ద సోమవారం మాట్లాడారు. ''మోకాళ్ల కింద వరకే కనపడేలా వీడియోలు మార్ఫింగ్‌చేసి విడుదల చేశారు. వీడియోలు ఇవ్వాలని కోరితే మండలి చైర్మన్ నిస్సహాయత వ్యక్తం చేశారు. చైర్మన్ అధికారాలకు కోత పెడుతున్నారు. ఆయన సెక్రటరీని అడిగితే వీడియో ఫుటేజ్ ఇవ్వడంలేదు. వ్యవస్థలు టీడీపీ అనుబంధ సంఘాలుగా ప్రవర్తిస్తున్నాయి. వేంకటేశ్వరస్వామిని నమ్మేవాళ్లే అయితే మండలిలోని మొత్తం ఫుటేజీ బయటపెట్టండి. లేదంటే తప్పుచేశామని క్షమాపణ చెప్పండి. చైర్మన్‌ను అడిగితే మాట్లాడే వాళ్ల రికార్డు మాత్రమే ఉందంటున్నారు. అదే నిజమైతే ఈనాడు, ఆంధ్రజ్యోతిలో ఆ ఫొటోలెలా వచ్చాయి?అని ప్రశ్నించారు. ఇందాపూర్, హెరిటేజ్, భోలేబాబా డెయిరీ సంబంధాలపై ఏకసభ్య కమిషన్ విచారణ జరపాలి. అసెంబ్లీ సెక్రటరీ జనరల్ నియంతలా ప్రవర్తిస్తున్నారు''అని ఆగ్రహం వ్యక్తం చేశారు.

కేంద్ర శాఖలకు భూ కేటాయింపుల విధానంలో మార్పులు

- అనెగ్జర్–11 జారీలో సవరణలు చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- ప్రత్యేక పరిస్థితుల్లో 'సీసీఎల్ఏ'దే తుది నిర్ణయం

సాక్షి, అమరావతి: కేంద్ర ప్రభుత్వ శాఖలకు చేసే భూ కేటాయింపుల విధానంపై రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేసింది. 2012లో జారీ చేసిన భూ కేటాయింపుల విధానాన్ని సవరిస్తూ సోమవారం ఉత్తర్వులిచ్చింది. సాధారణంగా ప్రభుత్వం నుంచి భూమి పొందాలంటే సంబంధిత శాఖ ధ్రువీకరణ పత్రం ఇవ్వాలి. ఆ పత్రాన్నే అనెగ్జర్–11గా పిలుస్తారు. ఆ శాఖకు నిజంగా భూమి అవసరమా? ఎంత విస్తీర్ణం అవసరం? ప్రభుత్వ ప్రయోజనాలకు అనుగుణంగానే భూ కేటాయింపు ఉందా? అవసరమైన భూమి అందుబాటులో ఉందా? వంటి అంశాలను అధికారికంగా నిర్ధారించే పత్రమిదే. అయితే కేంద్ర ప్రభుత్వ శాఖలకు భూ కేటాయింపులు చేసేటప్పుడు ఈ పత్రం ఎవరు ఇవ్వాలనే దానిపై సందిగ్ధం ఉంది. ఈ నేపథ్యంలో దానిపై రాష్ట్ర ప్రభుత్వం స్పష్టతనిచ్చింది. కేంద్రానికి చెందిన ఏ శాఖ భూమి కోరినా, అవే విధులు నిర్వహించే రాష్ట్ర ప్రభుత్వ శాఖ ఉంటే ఆ శాఖే ఈ పత్రాన్ని జారీ చేయాలని తాజా సవరణలో పేర్కొంది. ఉదాహరణకు రైల్వే, జాతీయ రహదారుల సంస్థలకు భూమి అవసరమైతే రాష్ట్రంలోని సంబంధిత శాఖే ఈ పత్రమివ్వాలి. ఒకవేళ ఈ పత్రాన్ని ఎవరు ఇవ్వాలన్న సందిగ్ధత ఉంటే సీసీఎల్ఏ తుది నిర్ణయం తీసుకుంటుందని తెలిపింది. అయితే, రాజకీయ పార్టీలకు భూమి కేటాయింపుల విషయంలో ఈ పత్రం అవసరం లేదని ఉత్తర్వుల్లో స్పష్టం చేసింది.

హెరిటేజ్ కోసమే బాబు డ్రామా

- బూట్లు వేసుకుని పూజలు చేసే బాబుకు భక్తి గురించి మాట్లాడే అర్హత లేదు
- తీవ్రంగా ధ్వజమెత్తిన ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్

సాక్షి,అమరావతి: ముఖ్యమంత్రి చంద్రబాబు తన సొంత హెరిటేజ్ సంస్థకు లాభం చేకూర్చడమే లక్ష్యంగా తిరుమల లడ్డూ ప్రసాదంపై అపవిత్రమైన ఆరోపణలు చేశారని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అధికార ప్రతినిధి, ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ ధ్వజమెత్తారు. సోమవారం తాడేపల్లిలో ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ.. నిత్యం బూట్లు వేసుకుని పూజలు చేసే సీఎం చంద్రబాబుకు భక్తి గురించి మాట్లాడే అర్హత లేదన్నారు. తిరుమల లడ్డూ ప్రసాదం వివాదం వెనుక ఉన్న అసలు మాస్టర్ ప్లాన్ హెరిటేజ్ సంస్థకు లాభం చేకూర్చడమేనని తాటిపర్తి తేల్చి చెప్పారు. గతంలో కేజీ నెయ్యి రూ. 321 ఉంటే, దాన్ని ఏకంగా రూ. 658కి పెంచి హెరిటేజ్ అనుబంధ ఇందాపూర్ డెయిరీకి చంద్రబాబు కట్టబెట్టడమే ఇందుకు నిదర్శనమన్నారు. పక్కనే ఉన్న తెలంగాణలో రూ. 550కే నెయ్యి దొరుకుతుంటే, తిరుమలకు మాత్రం రూ. 658కి ఎందుకు కొంటున్నారని ప్రశ్నించారు. మరోవైపు నెయ్యి సరఫరాపై హెరిటేజ్ పచ్చి అబద్ధాలు చెబుతోందని... తాము దేవాలయాలకు నెయ్యి సరఫరా చేయట్లేదని చెబుతున్న హెరిటేజ్ 2002లో చంద్రబాబు సీఎంగా ఉన్నప్పుడే టీటీడీ టెండర్లలో పాల్గొన్న విషయాన్ని ఆధారాలతో సహా తాటిపర్తి బయటపెట్టారు. ఏడుకొండలనూ టీటీడీ పరిధిలోకి తీసుకొస్తూ జీవో 746 జారీ చేయడం ద్వారా... తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతిష్టను దివంగత సీఎం వైఎస్సార్ మరింత పెరిగేలా చేశారని స్పష్టం చేశారు. కానీ చంద్రబాబు అధికారంలోకి వచ్చాక తిరుమల, శ్రీశైలం, సింహాచలంలో వరుసగా ప్రమాదాలు, అపశృతులు చోటుచేసుకుంటున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. తిరుమలలో భక్తుల క్యూలైన్లోకి పాము వచ్చిందంటే పాలన ఎంత అధ్వానంగా ఉందో అర్థమవుతోందని తాటిపర్తి ఎద్దేవా చేశారు. హెరిటేజ్, ఇందాపూర్ డెయిరీల మధ్య సంబంధాలపై శాసనమండలిలో చర్చకు రావాలని సవాల్ విసిరారు. ఇప్పటికైనా దేవదేవుడిపై చేసిన తప్పుడు ఆరోపణలకు చంద్రబాబు లెంపలు వేసుకుని క్షమాపణ చెప్పాలని, హెరిటేజ్ లాభాల కోసం భక్తుల మనోభావాలతో ఆడుకోవడం మానుకోవాలని కోరారు.

మోంథా తుపాను సాయం ఎప్పుడిస్తారు?

అసెంబ్లీలో ప్రభుత్వాన్ని నిలదీసిన ఎమ్మెల్యేలు

సాక్షి, అమరావతి: గతేడాది అక్టోబర్‌లో విరుచుకుపడిన మోంథా తుపాను వల్ల నష్టపోయిన రైతులకు ఇప్పటికీ పరిహారం అందించకపోవడంపై అధికార పార్టీ ఎమ్మెల్యేలు అసహనం వ్యక్తం చేశారు. సోమవారం అసెంబ్లీ ప్రశ్నోత్తరాల్లో ఎమ్మెల్యేలు అడిగిన ప్రశ్నలకు హోం మంత్రి అనిత స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. గతంలో తుపాన్ల సమయంలో భారీగా పంట, ఆస్తి నష్టంతో పాటు మనుషుల ప్రాణ నష్టాన్ని ఎక్కువగా చూసేవాళ్లమని, అయితే విపత్తు నిర్వహణపై సీఎం చంద్రబాబు ప్రత్యేక దృష్టి పెట్టడం , టెక్నాలజీని ఉపయోగించుకుని ప్రజలను అప్రమత్తం చేయడంతో వాటిని తగ్గించగలిగామని మంత్రి చెప్పారు. తుపాను కారణంగా 25 జిల్లాల్లో 4.19 లక్షల ఎకరాల్లో పంటలు దెబ్బతినగా, 3.42 లక్షల మంది రైతులకు రూ.410.99 కోట్ల ఇన్‌పుట్ సబ్సిడీ ఇవ్వాల్సి ఉందని చెప్పుకొచ్చారు. అయితే మోంథా తుపాను పరిహారం ఎప్పుడిస్తారో చెప్పాలని పెడన టీడీపీ ఎమ్మెల్యే కాగిత కృష్ణ ప్రసాద్ కోరగా..త్వరలోనే ఇస్తామంటూ మంత్రి అనిత సమాధానాన్ని దాటవేశారు.

కేజీబీవీ ఉపాధ్యాయులకు జీతాలు పెంచలేం: మంత్రి లోకేశ్

కేజీబీవీల్లో పనిచేస్తోన్న ఉపాధ్యాయులు, ప్రిన్సిపాల్స్‌కు జీతాల పెంపు తమ చేతుల్లో లేదని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి లోకేశ్ స్పష్టం చేశారు. కేజీబీవీల్లో టీచర్లకు కనీస వేతన చట్టం అమలు చేస్తామని, జీతాలు పెంచుతామని ఎన్నికల్లో హామీ ఇచ్చామని శాసనసభ ప్రశ్నోత్తరాల సమయంలో టీడీపీ ఎమ్మెల్యే కూన రవి కుమార్ సభ దృష్టికి తీసుకువచ్చారు. కేజీబీవీల్లో కాంట్రాక్ట్ పద్ధతిలో పనిచేస్తున్న ప్రిన్సిపాల్స్ గెజిటెడ్ కాకపోవడంతో వారు జారీ చేసే మార్క్‌మెమోలతో ప్రభుత్వ ఉద్యోగాలకు వెళ్లేటప్పుడు అభ్యంతరాలు వస్తున్నాయన్నారు. దీనిపై మంత్రి లోకేశ్ బదులిస్తూ పాఠశాలల నిర్వహణ, సిబ్బంది జీతభత్యాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 60:40 నిష్పత్తిలో నిధులు ఖర్చు చేస్తాయని, అందువల్ల వీరి జీతాల పెంపు రాష్ట్రాల చేతుల్లో ఉండదని స్పష్టం చేశారు. ఏప్రిల్‌లో జాబ్ క్యాలెండర్ ప్రకటిస్తామని చెప్పారు.

ఫెర్రో అల్లాయ్స్‌కు బాబు సర్కారు షాక్

- మార్చి చివరి వరకే విద్యుత్ రాయితీలు
- ఆ తర్వాత మొత్తం చార్జీలు చెల్లించాల్సిందే
- ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు చంద్రబాబు సర్కారు షాక్
- 50 వేల మంది జీవనోపాధి ప్రశ్నార్థకం



సాక్షి, అమరావతి: ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు చంద్రబాబు ప్రభుత్వం షాక్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ పరిశ్రమలకు ఇస్తున్న విద్యుత్ రాయితీలు ఈ ఏడాది మార్చి చివరి వరకే కొనసాగుతాయని, ఆ తర్వాత ఉండవని తేల్చి చెప్పింది. రెండేళ్ల పాటు రాయితీలు కొనసాగించాలని ఫెర్రో అల్లాయ్స్ ప్రొడ్యూసర్స్ అసోసియేషన్ చేసిన అభ్యర్థనను ప్రభుత్వం అంగీకరించలేదు. మార్చి 31 వరకే రాయితీలు ఉంటాయని, ఈ ఏడాది ఏప్రిల్ 1 (వచ్చే ఆర్థిక సంవత్సరం) నుంచి రాయితీలు లేకుండా సాధారణ సుంకాలను చెల్లించడానికి సిద్ధం కావాలని ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు స్పష్టం చేసింది. ఈ మేరకు ఇంధన శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్ సోమవారం ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో ఈ పరిశ్రమలు ఆర్థిక ఇబ్బందుల్లో పడి, ఆ ప్రభావం 50 వేల మంది జీవనోపాధి ప్రశ్నార్థకమవుతుందని పారిశ్రామిక, కార్మిక వర్గాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి.

ఇకపై నడపడం కష్టమే

రాష్ట్రంలోని ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమల్లో ప్రత్యక్షంగా, పరోక్షంగా 50 వేల మంది జీవనోపాధి పొందుతున్నారు. వీరి సంక్షేమంతోపాటు పారిశ్రామిక రంగం అభివృద్ధిని దృష్టిలో పెట్టుకొని వైఎస్ జగన్ ప్రభుత్వం ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలకు విద్యుత్ సుంకం యూనిట్‌కు రూ.0.6 పైసలకు, డిమాండ్ ఛార్జీలు 90 శాతం వరకూ తగ్గించింది. 10 శాతం మాత్రమే వసూలు చేసింది. పరిశ్రమలు, కార్మికుల సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని గత ప్రభుత్వం ఇచ్చిన రాయితీలు, ప్రోత్సాహకాలను మరో రెండేళ్ల పాటు కొనసాగించాలని ఫెర్రో అల్లాయ్స్ పరిశ్రమలు ప్రభుత్వాన్ని కోరినప్పటికీ పాలకులు కరగలేదు. ఈ వెసులుబాటు ఆ పరిశ్రమలకు ఈ ఆర్థిక సంవత్సరంతో ముగుస్తుందని తెగేసి చెప్పింది. ఏప్రిల్ 1 నుంచి ముక్కుపిండి మరీ మొత్తం చార్జీలను వసూలు చేస్తామని చంద్రబాబు ప్రభుత్వం చెబుతోంది. చంద్రబాబు ప్రభుత్వం గత ఏడాదే ఈ పరిశ్రమలపై నిబంధనలు విధించింది. వాటికి అవసరమయ్యే కరెంటును కేవలం విద్యుత్ పంపిణీ సంస్థ(డిస్కం)ల నుంచే కొనాలని గతేడాదే నిబంధనలు విధించింది. మార్చి తరువాత వేసవిలో ఉష్ణోగ్రతల కారణంగా ఏర్పడే విద్యుత్ కొరత కారణంగా అధిక ధరలకు డిస్కంలు విద్యుత్‌ను కొంటాయి. దానిని సరఫరా చేసి ఎక్కువ చార్జీలు వసూలు చేయడం వల్ల ఫెర్రో పరిశ్రమలకు మరింత భారంగా మారుతుంది. దానికి తోడు ఈ రాయితీలు కూడా మార్చితో ముగిసిపోతే అవీ, ఇవీ కలిపి ఫెర్రో అల్లాయ్స్ మూతపడే పరిస్థితి వస్తుందని పారిశ్రామిక వర్గాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నాయి.

కౌలు రైతుల సమరభేరి

- బెజవాడలో ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో 30 గంటల నిరవధిక దీక్ష
- ప్రారంభించిన మాజీ మంత్రి, రైతు నేత వడ్డే శోభనాద్రీశ్వరరావు

దీక్షలో పాల్గొన్న కౌలు రైతు సంఘ నాయకులు,కౌలు రైతులు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): వ్యవసాయ రంగానికి ఎంతో చేస్తున్నామని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు గొప్పలు చెప్పుకొంటున్నాయని, వాస్తవానికి అవి చెప్పేదానిలో పది శాతం కూడా చేయడం లేదని అఖిల భారత కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీనర్, మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ధ్వజమెత్తారు. కౌలు రైతులందరికీ అన్నదాత సుఖీభవ వర్తింపజేసి రూ.20 వేలు ఇవ్వాలని, భూయజమాని సంతకం తొలగించి గుర్తింపు కార్డులు ఇవ్వాలని, పంట రుణాలు, నష్టపరిహారం, బీమా మొత్తం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఏపీ కౌలు రైతు సంఘం ఆధ్వర్యంలో ఎన్టీఆర్ జిల్లా విజయవాడ ధర్నా చౌక్‌లో 30 గంటల నిరవధిక దీక్షను సోమవారం కౌలు రైతులు చేపట్టారు. ఈ దీక్షను మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భూ యజమానుల కన్నా కౌలు రైతులే అధిక శాతం భూములను సాగు చేస్తున్నారని తెలిపారు. వారిని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పట్టించుకోకపోవడం దుర్మార్గమని విమర్శించారు. కౌలు రైతులు ఎంతగా శ్రమిస్తున్నా అప్పులే మిగులుతున్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. బ్యాంకులు కౌలు రైతులకు రుణాలు ఇవ్వడం లేదని, ఆవేదన వ్యక్తం చేశారు. చిన్న, సన్నకారు రైతుల్లో 24 శాతం మంది ప్రైవేటు వడ్డీ వ్యాపారులపై ఆధారపడుతున్నారని వెల్లడించారు. నూటికి రూ.2 నుంచి రూ.3 వరకు వడ్డీకి అప్పులు తెచ్చి సాగు చేస్తూ తీవ్రంగా నష్టపోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఎటువంటి భూమిగానీ, తోటి రైతు సంతకంతో గానీ పని లేకుండా రూ.2 లక్షల వరకు రుణాలు ఇవ్వొచ్చని ఆర్‌బీఐ స్పష్టంగా చెప్పినప్పటికీ బ్యాంకులు రుణాలు ఇవ్వడం లేదని వడ్డే ధ్వజమెత్తారు. బడా వ్యాపారులకు రుణాలు ఇచ్చి లక్ష్యాలను పూర్తి చేస్తున్నారే తప్ప రైతులు, కౌలు రైతులను పట్టించుకోవడం లేదన్నారు. కౌలు రైతులు పంటలు సాగు చేయకపోతే ఆహార భద్రతకు ముప్పువాటిల్లే ప్రమాదం ఉందని హెచ్చరించారు. రైతులకు ఒక పర్యాయం రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. కేంద్ర ప్రభుత్వం రైతులకు మేలు చేయకపోగా.. కేరళ రాష్ట్ర ప్రభుత్వం రైతులకు ప్రకటించిన బోనస్ ఇవ్వకూడదంటూ లేఖ రాయడాన్ని తప్పుబట్టారు. రైతులకు, కౌలు రైతులకు జరుగుతున్న అన్యాయంపై కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేయాలని పిలుపునిచ్చారు. న్యాయస్థానాల్లోనూ న్యాయ పోరాటం చేయాలని పేర్కొన్నారు.

హామీల అమలేదీ?

ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఎన్నికల ముందు చంద్రబాబు కౌలు రైతులకు ఇచ్చిన హామీలు ఏ ఒక్కటీ అమలు జరగలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. అన్నదాత సుఖీభవ కింద రూ.20 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంతకం తొలగించి కౌలు గుర్తింపు కార్డులు జారీ చేయాలన్నారు. ప్రభుత్వం నుంచి వచ్చే ప్రతి ప్రయోజనం కౌలు రైతులకే చెందాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం సీనియర్ నాయకుడు వై.కేశవరావు మాట్లాడుతూ.. ఇటీవల ప్రవేశపెట్టిన రాష్ట్ర బడ్జెట్‌లో కౌలు రైతుల ప్రస్తావన లేకపోవడం బాధాకరమన్నారు. కౌలు రైతుల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మాగంటి హరిబాబు మాట్లాడుతూ.. రైతుల నుంచి భూములు బలవంతంగా లాక్కుంటూ, ఎకరం 99 పైసల వంతున బడా కార్పొరేట్లకు కేటాయించడానికి భూములు ఎవడబ్బ సొమ్మని నిలదీశారు. రైతులను పట్టించుకోకపోతే ఇంటిదారి పట్టిస్తారని కూటమి నేతలను హెచ్చరించారు. దీక్షలో కౌలు రైతుల సంఘం కృష్ణా జిల్లా అధ్యక్షుడు టి.వి.లక్ష్మణస్వామి, పంచకర్ల రంగారావు, జె.వెంకటేశ్వరరావు, జి.సీతారెడ్డి, గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

Write about the role of women in Print culture

PRINT CULTURE AND THE MODERN WORLD

KEY POINTS

1. The Chinese accordion book was folded and stitched on the side.
2. Calligraphy means beautiful and artistic writing.
3. The oldest Japanese printed book is the Diamond Sutra from AD 868.
4. Edo is the old name for Tokyo.
5. Marco Polo brought woodblock printing ideas from China.
6. Gutenberg built the 1st printing press in 1430s in Germany.
7. The Jikji of Korea is one of the world's oldest books.
8. A volume of the Jikji is kept in the National Library of France.
9. The Jikji explains ideas of Zen Buddhism.
10. UNESCO listed the Jikji in the Memory of the World Register.
11. Vellum is parchment made from animal skin.
12. By 1448, Gutenberg completed his printing system.
13. His first printed book was the Bible.
14. A compositor is a person who arranges text for printing.
15. A ballad is a simple folk story in verse.
16. In 1517, Martin Luther wrote his 95 Theses against , gainst Church p
17. Luther's New Testament translation sold 5,000 copies.
18. Luther said printing was God's greatest gift.
19. An almanac gives yearly information about stars and weather.
20. A chapbook is a small book sold by travelling sellers.
21. Despotism means one person has absolute power.
22. Ulama are Islamic legal scholars.
23. A fatwa is a legal opinion in Islamic law.
24. A mufti is a legal scholar who gives fatwas.
25. Erasmus, a Latin scholar, wrote a book called Adages.
26. Booksellers hired peddlers to sell small books in villages.
27. In France, cheap small books were called "Bibliothèque Bleue."
28. Isaac Newton began publishing his scientific ideas.
29. Writers like Paine, Voltaire and Rousseau were widely read.
30. Mercier said the printing press was the strongest tool of progress.
31. He warned that tyrants should fear powerful writers.
32. A children's press was started in France in 1857.
33. Grimm Brothers collected and published German folk tales.
34. Jane Austen, the Bronte sisters and George Eliot were famous women writers.
35. Richard Hoe invented the power-driven cylindrical press.
36. Hafiz was a poet, and his works are called the Diwan.
37. Printing first came to India through the Portuguese in Goa.
38. Jesuit priests printed many books after learning local languages.

2 MARKS QUESTIONS

1. What is Chapbook?
1. A term used to describe pocketsize books.
2. These books are sold by travelling pedlars called chapmen.

2. What was the print revolution?
1. Print revolution was a new way of producing books.
2. It transformed the lives of people.
3. It influenced popular perceptions.
4. It opened new ways of looking at things.

3. What is protestant reformation?
1. A sixteenth-century movement to reform the Catholic Church dominated by Rome.
2. Martin Luther was one of the main Protestant reformers.
3. Several traditions of anti-Catholic Christianity developed out of the movement.

4. What were the "Biliotheque Bleue"?
1. In France low-priced small books were printed on poor quality.
2. They were bound in cheap blue covers.
3. They were named as "Biliotheque Bleue".

5. Who invented printing press? In which country? Which book was printed first?
1. Johann Gutenberg
2. Germany
3. The Bible

6. Write about the Gutenberg Press
1. Gutenberg made the first printing press.
2. It used metal letters.
3. Books became cheaper.
4. Knowledge spread faster.

8 MARKS QUESTIONS

1. Why did some people in eighteenth century Europe think that print culture would bring enlightenment and end despotism?
1. The print culture would help in spreading of literacy.
2. It spread the knowledge among all class of people.
3. Reformers felt that it is the most powerful engine for progress.
4. It would bring enlightenment and an end to despotism.

2. Why did some people fear the effect of easily available printed books? Choose one example from Europe and one from India.
1. Upper class people feared about the cheap printed books.
2. They feared the spread of literacy among the common people.
3. The literacy would lower their position or authority

3. Explain how print culture assisted the growth of nationalism in India./Print culture assisted the growth of nationalism – Justify.
1. Books, magazines helped in the spread of new ideas.
2. Gandhiji spread his ideas of Swadeshi through newspaper.
3. Many vernacular newspapers reported oppressive methods.
4. National leaders mobilised Indians through the newspapers.
5. Ravi Verma and Rabindranath Tagore painted Bharatmata.
6. Bharatmata enhanced the sense of nationalism among Indians.
7. Print culture united the people living in different parts of India.
8. Thus, the print culture assisted the growth of nationalism in India.

4. "Printing press played a major role in shaping the Indian Society of the 19th century" – Comment. / Examine the statement.
1. The printing press significantly shaped Indian society.
2. It led to the public debates.
3. It fostered to grow the sense of nationalism.
4. It connected all the communities across India.
5. It created a pan-Indian identity.
6. It provided a platform for critical thinking and social change.
7. It Spread the Reformist Ideas across India.
8. It improved the literacy and awareness.
9. It improved the Inter-regional Connectivity.

5. Write about Gutenberg and the first Printing Press.
1. Gutenberg was the son of a merchant.
2. He grew up on a large agricultural estate.
3. From his childhood he had seen wine and olive presses.
4. Subsequently, he learnt the art of polishing stones.
5. He became a master goldsmith.
6. He also acquired the expertise to create lead moulds.
7. The olive press provided the model for the printing press.
8. By 1448, Gutenberg perfected the system.
9. The first book he printed was the Bible.
10. About 180 copies were printed and it took three years.

6. Write about the role of women in Print culture.
1. Liberal men began educating their womenfolk at home.
2. They sent women to schools.
3. Some Hindus believed that a literate girl would be widowed.
4. Muslims feared that educated women would be corrupted.
5. Sometimes, rebel women defied such prohibition.
6. In Bengal Rash Sundari Debi studied secretly in kitchen.
7. Later, she wrote her autobiography Amar Jiban in 1876.
8. It was the first full-length autobiography published in Bengali.

Continued on next page..

9. A few women wrote books highlighting their experiences.

7. **Give reasons: Woodblock print only came to Europe after 1295.**
   1. Woodblock print was invented in the 16th century in China.
   2. It came to Europe along with Marco Polo in 1295.
   3. He returned to Italy after many years of exploration in China.
   4. He brought the knowledge of woodblock print on his return.

8. **Give reasons: Martin Luther was in favour of print and spoke out in praise of it.**
   1. Yes, Martin Luther was in favour of print.
   2. He spoke out in praise of the printing.
   3. The print media helped popularise his ideas.
   4. In 1517 he wrote the Ninety-Five Theses criticising the Church.
   5. These writings were read widely.
   6. His translation of the New Testament was also accepted.
   7. It was possible due to the improvements in print technology.
   8. It allowed even the working classes to gain access to books.

9. **Give reasons: The Roman Catholic Church began keeping an Index of Prohibited books from the mid-sixteenth century.**
   1. The Roman Catholic Church faced dissents after16th century.
   2. People had written many books to interpret the God.
   3. Therefore, the church banned such books.
   4. The church kept the record of such banned books.
   5. It was called the Index of Prohibited Books.

10. **Gandhi said the fight for Swaraj is a fight for liberty of speech, liberty of the press, and freedom of association.**
    1. Gandhi considered that the liberty of speech, liberty of press and freedom of association were three most powerful vehicles of expressing and cultivating public opinion.
    2. Therefore, he said the fight for Swaraj was a fight for liberty of speech, press, and freedom for association.

11. **Write short notes : The Gutenberg Press.**
    1. The Gutenberg Press was established by Johann Gutenberg.
    2. It was the first-known printing press.
    3. By 1448 he had perfected the system of printing.
    4. He used olive and wine presses.
    5. The first book that he printed was the Bible.
    6. He printed 180 copies in 3 years.

12. **Write short notes : Erasmus's idea of the printed book.**
    1. Erasmus was the Latin scholar and a Catholic reformer.
    2. He criticized the printing of books.
    3. He thought that most of the books are stupid and irreligious.
    4. He also felt that such books reduce the value of the writings.

13. **Write short notes : The Vernacular Press Act**
    1. It was modelled on the Irish Press Laws.

    2. It was passed in 1878.
    3. The law gave rights to censor editorials in the vernacular press.
    4. The government had rights to seize the press.
    5. This was a complete violation of the freedom of expression.

14. **What were the effects of the spread of print culture for poor people in nineteenth century India?**
    1. The poor people got access to the low-price books.
    2. Many social reformers educated readers.
    3. These were read by people across the country.
    4. Jyotiba Phule wrote against the caste system in India.
    5. BR Ambedkar also wrote powerfully against the caste system.
    6. Periyar, wrote about the caste system prevailing in Madras.
    7. The poor now became more aware of their rights.
    8. Thus, the print culture helped underprivileged citizens in India.

15. **What did the spread of print culture in nineteenth century India mean to:**

    a) Women
    1. Indian women gained importance as readers and authors.
    2. Women became more literate as a result.
    3. Women's education was highlighted.
    4. A few women began writing novels and autobiographies.
    5. Kailash Bashini Debi wrote on the miseries of the women.
    6. Women now have access to new sources of entertainment.

    b) The poor
    1. Many publishers began creating cheap books.
    2. They were sold at crossroads.
    3. Printed materials started to reach the poor.
    4. Folktales and stories could be heard by the people.
    5. Kashi baba published ChoteAur Bade Ka Sawal in 1938.
    6. He explained about the caste and class exploitations.

    c) Reformers
    1. Reformers used print media to draw attention on social evils.
    2. Raja Ram Mohan Roy released the Samband Kaumudi.
    3. Kailash Bashini Debi wrote novels.
    4. Tara bai Shinde and Pandita Rama bai wrote on the widows.
    5. Jyotiba Phule wrote on the conditions of the low caste.
    6. Ambedkar wrote against the caste system.

POWER-SHARING

KEY POINTS

1. Sharing of power among legislature, executive and judiciary is important to the design of a democracy.
2. Belgium has a little over one crore population.
3. Belgium capital city is Brussels.
4 French speaking community was rich and powerful.
5. The Dutch-speaking people constituted a majority in the country, but a minority in the capital.
6. Most of the Sinhala-speaking people are Buddhists.
7. Most of the Tamils are Hindus or Muslims.
8. **Ethnic:** A social division based on shared culture.
9. Sri Lanka got independence in 1948.
10. Sinhala community sought to secure dominance.
11. 1956 act was recognised Sinhala as the only official language.
12. They disregarded Tamil.
13. Sri Lankan Tamils felt they were aliens.
14. **Majoritarianism:** A belief that the majority community should be able to rule a country in whichever way it wants, by disregarding the wishes and needs of the minority.
15. By 1980s Sri Lankan Tamils demanded for an independent state.
16. The Dutch-speaking community has accepted equal representation in the Central Government.
17. Apart from the Central and the State Government, there is a third kind of government.
18. Community government has the power regarding cultural, educational and language-related issues.
19. European Union headquarters is in Brussels.
20. **Civil war:** A violent conflict between opposing groups within a country that becomes so intense that it appears like a war.
21. **Prudential:** Based on prudence, or on careful calculation of gains and losses.
22. Lebanon capital is Beirut.
23. Lebanon's leaders came together & agreed to some basic rules.
24. The country's President must be a Catholic Christian.
25. The Prime Minister must be a Sunni Muslim.
26. The Deputy Prime Minister must be a Orthodox Christian.
27. The Speaker must be a Shi'a Muslims.
28. Power is shared among legislature, executive and judiciary.
29. It is called as horizontal distribution of power.
30. Power can be shared among governments at different levels.
31. Government for the entire country is called federal government
32. In India, we refer to it as the Central or Union Government.
33. In India, we have State Governments at state level.
34. Power sharing arrangements can also be seen in the way political parties, pressure groups and movements control or influence those in power.

Prepared by
K. Suresh,
Subject Expert

Daily Quiz

సమాధానాలు రాయడానికి ఈ క్యూఆర్ కోడ్‌ను స్కాన్ చేయండి.

1. **State(s) with the special status:**
   A. Arunachal Pradesh
   B. Mizoram
   C. Nagaland
   D. All the above

2. **Rural local government is known as:**
   A. Panchayat Samiti
   B. Zila Parishad
   C. Panchayati Raj
   D. None of these

3. **Conducts the elections to panchayats and municipalities:**
   A. State Election Commission
   B. High court
   C. Supreme Court
   D. Parliament

14. **Special status article:**
    A. Article 371
    B. Article 271
    C. Article 172
    D. Article 152

15. **Concurrent List:**
    A. Education
    B. Forest
    C. Marriage
    D. All the above

ప్రేక్షకులు ‘పదహారేళ్ల వయసు’ దగ్గర ఆగిపోయారు.
అభిమానులు ‘వేటగాడు’ వానలో
తడిసి ముద్దవుతూనే ఉన్నారు.
కుర్రకారుకి వయసు మీరినా
‘ప్రేమాభిషేకం’ వద్ద మఠం వీడలేదు.
మహిళా హృదయాలలో ‘కార్తీక దీపం’ వెలిగించిన ‘దేవత’
‘అతిలోక సుందరి’గా ఎప్పటికీ ఉండిపోతుందనుకున్నారు.
శ్రీదేవి వీడిపోయి ఎనిమిదేళ్లు.
కాని ‘దేవుడా... దేవుడా.. దేవుడా’ అని
ముద్దులొలికే ఈ గుంటూరు అమ్మాయి
మరపునకు రాదే. ఈ బాధ తీరిపోదే.

వెండితెర చాందినీ

స్మరణ నేడు శ్రీదేవి వర్ధంతి

మీకు ఆనందం కలిగించే విషయం ఏది?

‘నాకు నీళ్లలో షూటింగ్ అన్నా, నీళ్లతో ఆడుకోవాలన్నా చాలా ఇష్టం. ఈత కూడా వచ్చు. నీళ్లతో ఆడితే ఆనందంగా ఉంటుంది’

నీరంటే ఇష్టపడే ఈ నటి, ఈత తెలిసిన ఈ నటి, పిల్లలు కూడా మునిగి మరణించలేని బాత్‌టబ్‌లో నిర్జీవంగా చివరిసారిగా అభిమానులకు కనిపించింది.

•••

తల్లిదండ్రులు పిల్లల మనసుకెక్కేలా మాట్లాడితే ఇక జీవితాంతం వదలవు. శ్రీదేవి సినిమాల్లో ఎదుగుతున్నప్పుడు ‘నిజాయితీగా పని చెయ్. అది నిన్ను కాపాడుతుంది’ అని తండ్రి అయ్యప్పన్ అన్నారు. శ్రీదేవి అలాగే పని చేసింది. తల్లి రాజేశ్వరమ్మ శ్రీదేవికి మూడు మాటలు చెప్పారు. 1. హీరోయిన్‌కి ముక్కు చక్కగా ఉండాలి. 2. మనసులోని మాట పెదవి దాటకూడదు. 3. పెదాలపై ఎప్పుడూ నవ్వు మెరుస్తూ ఉండాలి.... శ్రీదేవి పెదాలు ఎప్పుడూ నవ్వుతూనే ఉంటాయి. శ్రీదేవి మనసు విప్పి ఎవరితోనైనా మాట్లాడిందే లేదు. ఇక ముక్కు సంగతి?

•••

‘బొబ్బిలిపులి’ వచ్చినప్పుడు నేల, బెంచీ క్లాసుల్లో ఉన్న ఆడ వాళ్లు ఆ సినిమా చూసి ఇళ్లకొచ్చి భర్త అన్నం తింటుంటే ‘శ్రీదేవి ముక్కుకు ఆపరేషన్ చేయించుకుందట’ అని చెప్పి వింత పోవడమే. ఆ సినిమాలో శ్రీదేవి కొన్ని సీన్లలో సర్జరీ చేయని ముక్కుతో, కొన్ని సీన్లలో సర్జరీ చేసిన ముక్కుతో కనపడుతుంది. ఆ సీజన్‌లో వచ్చిన సినిమాలలో శ్రీదేవి ఇలా రెండు విధాలుగా కనిపిస్తుంది. ముక్కుకు ఆపరేషన్ చేయించుకోవడం అనే మాట సామాన్యులు దక్షిణాదిన వినడం బహుశా అదే ప్రథమం. శ్రీదేవి తన ముక్కును మరణించే ముందు వరకూ సరి చేయించుకుంటూనే ఉంది. ఆ ముక్కు క్షీణించి క్షీణించి ‘ఇంగ్లిష్ వింగ్లిష్’ సమయానికి శ్రీదేవిని శ్రీదేవి కాకుండా చేసింది.

•••

కొందరు అమ్మాయిలు ఎంత చక్కగా ఉన్నా దర్శకులు, నిర్మాతలు హీరోయిన్లుగా చేయరు. సినిమా కమర్షియల్ వ్యాపారం. మగవాళ్ల ఆదరణ పైచేయిగా ఆధారపడిన వినోద కళ. సినిమాకు వచ్చిన సగటు ప్రేక్షకుడికి తెర మీద హీరోయిన్ గ్లామరస్‌గా కనపడాలి. అయస్కాంతంలా లాగాలి. నేల క్లాసు ప్రేక్షకుడి భాషలో చెప్పాలంటే ‘సిస్టర్ ఫీలింగ్’ తేకూడదు. ఆ సమయానికి స్టార్లుగా ఉన్న జయసుధ, జయప్రద ప్రధానంగా పెర్ఫార్మెన్స్ మీద ఆధారపడిన పాత్రలు చేసేవారు. మోడ్రన్ దుస్తులు వారికి అంతగా నప్పేవి కావు. కాని శ్రీదేవి పెర్ఫార్మెన్స్ చేయగలదు. మోడ్రన్‌గా కనిపించగలదు. యువతరం కోరుకునే గ్లామర్ ఆమెలో అతి సహజంగా మెరిసేది. ‘వేటగాడు’లో మేక్సీలో ‘జాబిలితో చెప్పనా’ పాడితే ఊళ్లో ఆడపిల్లలంతా మేక్సీలు కుట్టించుకోవడమే. ‘వేటగాడు’కు ముందు ఎన్టీఆర్‌కు చాలామంది హీరోయిన్లు. ‘వేటగాడు’ తర్వాత శ్రీదేవి మాత్రమే హీరోయిన్– ఒకటీ అరా తప్ప.

•••

నాగేశ్వరరావు ప్రేమిస్తాడు. ప్రాణాలు ఇచ్చేంత ప్రేమ చూపించాలంటే ఆ ప్రేమికురాలు శ్రీదేవి అయితేనే సాధ్యం. ‘ఈ అమ్మాయి కోసం ప్రాణాలు ఇవ్వొచ్చురా’ అనేలా నాగేశ్వరరావుకే కాదు కాలేజీ ఎగ్గొట్టి హాల్లో దూరిన కుర్రమొఖానికి కూడా అనిపించాలి. అందుకు శ్రీదేవే సరిపోతుందని దాసరికి తెలుసు. ‘ప్రేమాభిషేకం’ అక్కినేని సినిమాయే. శ్రీదేవి వల్ల కూడా అక్కినేని సినిమా. ఆ తరువాత అక్కినేని కెరీర్ కొంచెం డల్‌గా ఉన్నప్పుడు శ్రీదేవితో కలిసి నటించిన ‘శ్రీరంగనీతులు’ మరో హిట్‌గా నిలిచింది. ‘తొంగి తొంగి చూడమాక చందమామా... నీ సంగతంత తెలుసులే చందమామా’...

•••

హీరోలకు తమ సబ్జెక్ట్‌లు రొటీన్ అవుతున్నాయనుకున్నప్పుడల్లా గ్లామర్ యాడ్ చేస్తే ఆడతాయని తెలుసు. కృష్ణ, శ్రీదేవి జంట కృష్ణకు ప్లస్ అయ్యింది. ‘ఖైదీ రుద్రయ్య’ అనే సినిమా పేరు గుర్తుందా? కృష్ణ నటించిన ఆ సినిమా కూడా హిట్ అయ్యింది. శ్రీదేవి గ్లామర్ అప్పుడు పీక్‌లో ఉంది. సరిగా ఆడలేదుకాని కృష్ణ, శ్రీదేవి నటించిన ‘మహారాజశ్రీ మాయగాడు’లో వారిద్దరి కామెడీ బాగుంటుంది. అంతెందుకు... సినిమాలు ఢమాల్ ఢిమేల్ అంటున్న సమయాన అమితాబ్ శ్రీదేవికి రోజూ లారీడు (నిజంగానే) ఫ్లవర్ బొకేలు పంపి ‘ఆఖరీ రాస్తా’లో హీరోయిన్‌గా నటించేలా ఒప్పించి, హిట్ చేసుకుని బతికాననుకున్నాడు.

శ్రీదేవి గొప్పనటి. తమిళం వారే అది ఎక్కువగా ఉపయోగించుకున్నారు. ‘ఆకలి రాజ్యం’లో శ్రీదేవి నటన చూడాలి. నిజ జీవితంలో ఏమీ చదువుకోని శ్రీదేవి ఆ సినిమాలో ఇంటెలెక్చువల్‌గా, మెచ్యూర్డ్ పర్సనాలిటీతో కనిపిస్తుంది. కమల్ హాసన్ అందరినీ మింగేయవచ్చు షాట్‌లో. గొంతుకు అడ్డం పడే రకం శ్రీదేవి. వీరిద్దరూ కలిసి నటించిన ‘ఒక రాధ ఇద్దరు కృష్ణులు’ పెద్ద హిట్‌గానీ దురదృష్టవశాత్తు ఆ ప్రింట్ ఎక్కడా లేదు. శ్రీదేవి కామిక్ టైమ్‌కి ఆ సినిమా మంచి ఉదాహరణ. ఈ కామిక్ టైమింగ్‌తో శ్రీదేవి హిందీలో ‘చాల్‌బాజ్’లో చెలరేగితే బాలీవుడ్ డంగైపోయింది. ‘చాల్‌బాజ్’ సూపర్ డూపర్ హిట్. అందులో రజనీకాంత్, సన్నీడియోల్ హీరోలు. ఎవరికీ గుర్తుండరు.



శ్రీదేవి ఎవరికైనా రుణపడి ఉండాలి అనంటే దర్శకుడు కె.రాఘవేంద్రరావుకే. ఆయన శ్రీదేవిని ‘వేటగాడు’తో తెలుగులో స్టార్‌ని చేశాడు. హిందీలో ‘హిమ్మత్‌వాలా’తో. ఈ రాఘవేంద్రరావే శ్రీదేవి స్టార్‌డమ్ జత చేసి నాగార్జునకు ‘ఆఖరి పోరాటం’, చిరంజీవికి ‘జగదేకవీరుడు అతిలోక సుందరి’ వంటి మెగాహిట్స్ ఇచ్చాడు. శ్రీదేవి వల్ల అనిల్ కపూర్ ‘మిస్టర్ ఇండియా’తో, రిషి కపూర్ ‘చాందినీ’తో పెద్ద హిట్స్ చూశారు. ‘ఖుదాగవా’కు శ్రీదేవి సైన్ చేసిందని విని అమితాబ్ గంతులేశాడు. ఒక దశలో జితేంద్ర మూడు పూట్ల భోజనం శ్రీదేవి సమేత సినిమాలతో గడిచిపోయింది.

•••

శ్రీదేవి ‘క్షణక్షణం’లో నటించి ఒక కల్ట్ క్లాసిక్ మనకు మిగిల్చి పోయింది ఆఖరుగా. ఆమె ఆఖరి బింబాన్ని ఆ సినిమాతో ఆపుకుంటేనే అభిమానులకు సంతోషం.

50 ఏళ్లు నటించిన జీనియస్ నటి శ్రీదేవి.

మరో నూటయాభై ఏళ్లు గడిచినా స్మరణకు వస్తూనే ఉంటుంది.

– ఫ్యామిలీ డెస్క్

ట్రెండ్

మజిల్ మమ్మీ

మహిళలకు సంబంధించి సోషల్ మీడియాలో తాజా ట్రెండ్.. మజిల్ మమ్మీ. ‘బాగా సన్నబడాలి... మెరుపు తీగలా కనిపించాలి’ అనుకునే ట్రెండ్‌లు ఎన్నో వచ్చాయి. వాటికి భిన్నమైన ట్రెండ్ ఇది. వెల్నెస్ సంస్కృతికి సంబంధించిన పాత స్టీరియోటైప్‌లను తోసిరాజని మహిళల శక్తి, ఫిట్‌నెస్‌ను పునర్నిర్వచిస్తున్న ట్రెండ్ ఇది. గత ఫిట్‌నెస్ ట్రెండ్‌ల మాదిరిగా కాకుండా ‘మజిల్ మమ్మీ’ కండరాల అభివృద్ధిపై ప్రధానంగా దృష్టి పెడుతుంది. ఈ ట్రెండ్ ప్రధాన సందేశం...బలం బలంలాగే కనిపించాలి. బరువు తగ్గడం మాత్రమే ఫిట్‌నెస్ కాదు. స్త్రీలు సన్నగా కనిపించాలి, బరువులు ఎత్తవద్దు, స్ట్రెంత్ ట్రెనింగ్ మనకు సంబంధించింది కాదు, నాజూకుగా కనిపించాలంటే మజిల్ అక్కర్లేదు...ఇలాంటి సంప్రదాయ సౌందర్య ప్రమాణాలను నేటి తరం మహిళలలో చాలామంది తిరస్కరిస్తున్నారు. కండరాలపై దృష్టి సారించే ఈ ఫిట్‌నెస్ ట్రెండ్ ఊపందుకోవడానికి మరో ప్రధాన కారణం...దీర్ఘకాలిక ఆరోగ్యం గురించి అవగాహన పెరగడం. మెరుగైన ఎముక సాంద్రత(బోన్ డెన్సిటీ), హార్మోన్ల సమతుల్యత...మొదలైవాటికి ప్రాధాన్యతన పెరిగింది. టిక్‌టాక్, ఇన్‌స్టాగ్రామ్ లాంటి ప్లాట్‌ఫామ్‌లలో ‘మజిల్ మమ్మీ’ ట్రెండ్ ఎక్కువగా కనిపిస్తోంది. ‘అసలు సిసలు ఫిట్‌నెస్ అంటే ఏమిటి?’ అనే కాప్షన్‌తో జనాదరణ పొందిన డెడ్‌లిఫ్ట్‌లు, స్క్వాట్‌లు, రెసిస్టెంట్స్ వర్క్‌కు సంబధించిన వీడియో క్లిప్‌లకు, ఆఫ్‌బీట్ మ్యూజిక్, జోక్స్ జోడించి పోస్ట్ చేస్తున్నారు.



సమ్‌థింగ్ స్పెషల్

ఆటో డ్రైవర్ బామ్మ @ 65

‘నువ్వు నాకు ఆటోడ్రైవింగ్ నేర్పించాలిరా కన్నా’ అని కుమారుడిని అడిగింది మంగళ. ‘ఈ సరదా ఏమిటి!’ ఆశ్చర్యంగా అడిగాడు కుమారుడు. ‘సరదా కోసం కాదు, ఆటో నడిపి నాలుగు డబ్బులు సంపాదించాలనుకుంటున్నాను’ అని చెప్పింది తల్లి. మనసులో ఏమనుకున్నాడో తెలియదుగానీ, తల్లి కోరినట్లే ఆటో నడపడం నేర్పించాడు కుమారుడు. పదిహేను రోజుల్లో పర్‌ఫెక్ట్‌గా ఆటోనడపడం నేర్చుకుంది మంగళ. ఆ తరువాత ఆటోరిక్షా డ్రైవర్‌గా కొత్త ప్రయాణం మొదలుపెట్టింది. మహారాష్ట్ర సతార జిల్లాలో కరాడ్–ఉండాలే రోడ్డులో రోజూ ఉదయం తొమ్మిది గంటల నుండి సాయంత్రం ఆరు గంటల వరకు ఆటో నడుపుతుంది. నెలకు అయిదు నుంచి ఏడు వేల వరకు సంపాదిస్తుంది. ఇది తక్కువ మొత్తమే కావచ్చు. ఆమెకు మాత్రం కోట్లతో సమానం! ఎందుకంటే ఆ డబ్బులో శ్రమ ఫలం ఉంది. ఆత్మగౌరవం ఉంది. ‘నేను చాలారోజులు ఇంట్లోనే ఉన్నాను. దీని వల్ల ఎవరికీ ఉపయోగం లేదు అనిపించింది. ఏదో ఒక పని చేయాలనుకున్నాను. నా కొడుకు ప్రోత్సాహంతో ఆటో నడపడం నేర్చుకున్నాను. ఇంటి ఖర్చులకు, నా వైద్య అవసరాలకు నేను సంపాదించిన డబ్బు ఉపయోగపడుతుంది. డ్రైవింగ్ అంటే నాకు ఇష్టం కాబట్టి, ఎలాంటి భయం ఉండదు. ఇతర డ్రైవర్లు నన్ను గౌరవంగా చూస్తారు. ముందు అమ్మను వెళ్లనివ్వండి అంటారు’ అని ఆనందంగా చెబుతోంది 65 సంవత్సరాల మంగళ.

బులియన్ (బంగారం 10 గ్రా.: వెండి కిలో) ఫిబ్రవరి 23న ముగింపు రూ.లలో

	హైదరాబాద్	విజయవాడ	విశాఖపట్నం	రాజమండ్రి	ప్రొద్దుటూరు	చెన్నై
బంగారం (24 క్యారెట్లు)	1,58,420	1,63,450	1,61,350	1,63,450	1,57,500	1,62,110
బంగారం (22 క్యారెట్లు)	1,45,718	1,47,900	1,47,900	1,52,340	1,44,900	1,48,600
వెండి	2,69,000	2,82,800	3,00,000	2,82,800	2,70,000	3,00,000

గమనిక: గిట్టుబాటు, నిల్వ, పోటీ వంటి పలు అంశాల ప్రాతిపదికన షాపుల మధ్య పసిడి ధరల్లో కొంత వ్యత్యాసం ఉండవచ్చు.

సాగుబడి

శతభిష కార్తె

ఫిబ్రవరి 19 నుంచి

పోషక లోపాలు తీర్చే చొప్ప!

పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ పద్ధతులతో పశుపోషణలో సత్ఫలితాలు

దేశంలో పశువుల పోషకాహార లోటును పరిష్కరించడానికి పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ ఒక సమర్థవంతమైన, సుస్థిరమైన పరిష్కారం. పంటలు పెరిగే దశలోనే వాటిలో అవసరమైన పోషకాల (జింక్, ఇనుము, రాగి వంటి సూక్ష్మపోషకాల) పరిమాణాన్ని, వాటి జీవ లభ్యతను సస్యవిజ్ఞాన పద్ధతుల్లో పెంపొందించడాన్నే బయోఫోర్టిఫికేషన్ అంటారు.

బయోఫోర్టిఫికేషన్ మూడు విధాలు:

1. నేల ద్వారా ఎరువుల వినియోగం.. పొలం మట్టిలో లోపించిన పోషకాలను లేదా సూక్ష్మపోషకాలను నీటిలో కలిపి నేలకు అందిస్తారు.

2. పంటలపై పిచికారీ చేయడం.. ఎరువులను ద్రవరూపంలో నేరుగా మొక్కల ఆకులపై పిచికారీ చేస్తారు. దీని వల్ల మొక్కలు పోషకాలను వేగంగా గ్రహిస్తాయి.

3. సూక్ష్మజీవుల ప్రయోగం.. నేలలో ప్రయోజనకరమైన సూక్ష్మజీవులను మట్టిలో కలుపుతారు. తద్వారా మొక్కలు నేల నుంచి పోషకాలను తీసుకునే సామర్థ్యం పెరుగుతుంది.

గణనీయమైన మార్పు..

సుస్థిర వ్యవసాయ పద్ధతులతో కూడిన బయోఫోర్టిఫికేషన్ వ్యూహాల అమలు ద్వారా దేశ పశుపోషణ రంగంతోపాటు, ఆర్థికాభివృద్ధిలో గణనీయమైన మార్పు తీసుకురావచ్చు. అయితే, పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ ద్వారా మేత పోషక విలువను పెంచే పద్ధతి అమలుకు అనేక అడ్డంకులు ఎదురవుతున్నాయి. నేలలోని పోషక అసమతుల్యతలు, ఉదాహరణకు అధిక ఫాస్ఫరస్ స్థాయిలు జింక్ శోషణను నిరోధించడం వంటివి మొక్కల పోషక గ్రహణ శక్తిని దెబ్బతీస్తున్నాయి. వేడిగాలులు, కరువులు, వర్షపాతంలో ఒడిదుడుకులు వంటి తీవ్రమైన వాతావరణ పరిస్థితులు పంట పెరుగుదలను, పోషకాల గ్రహణను నిరోధిస్తాయి. ఆర్థిక, సామాజిక అంశాలు కూడా ఈ ప్రక్రియను ప్రభావితం చేస్తున్నాయి. సూక్ష్మపోషక ఎరువులు, అధునాతన సాంకేతికతలతో కూడిన ఖర్చులు ఎక్కువగా ఉండటం వల్ల చిన్న రైతులు ఇటువంటి నూతన వ్యవసాయ పద్ధతులను అనుసరించలేక పోతున్నారు. పశుగ్రాస పంటల బయోఫోర్టిఫికేషన్ పద్ధతులపై మరింత పరిశోధన జరగాలి. ఖర్చు–ప్రభావంపై దీర్ఘకాలిక అధ్యయనాలు అవసరం.

– డా. సి.హెచ్. రామకృష్ణ, అసోసియేట్ ప్రొఫెసర్ (అగ్రానమీ),
పి.వి. నరసింహారావు తెలంగాణ పశువైద్య విశ్వవిద్యాలయం, హైదరాబాద్ (9491562536)

రాగితో పెరిగిన దిగుబడి

పరిశోధనల ప్రకారం, ఓట్స్ పశుగ్రాస పంటకు నేల ద్వారా హెక్టారుకు 6 కిలోల రాగి అందించడం వల్ల దాని జీవలభ్యత పెరిగి దిగుబడి మెరుగుపడింది. అలాగే, విత్తిన 60–90 రోజుల్లో ఆకులపై 0.2% రాగిని పిచికారీ చేయటం వల్ల రాగి గ్రహణ శక్తి, దిగుబడి, ప్రొటీన్స్ గణనీయంగా పెరిగాయి. డా. సి.హెచ్. రామకృష్ణ బృందం హైదరాబాద్‌లో చేసిన పరిశోధన ఫలితాల ప్రకారం.. నేలకు హెక్టారుకు 25 కిలోల చొప్పున జింక్ సల్ఫేట్‌ను సిఫారసు చేసిన ఎరువులతోపాటు దుక్కిలో వేస్తే.. పచ్చిమేతలో అత్యధిక జింక్ సాంద్రత (41.4 పీపీఎం) నమోదైంది. అలాగే, విత్తిన 15, 30, 45, 60 రోజుల తర్వాత 1% అన్నభేదిని ఆకులపై పిచికారీ చేస్తే అత్యధిక ఇనుము సాంద్రత (155.3 పీపీఎం) నమోదైంది.

అంతేకాకుండా, ఈ పద్ధతులు సైలేజ్ (పాతరగడ్డి)లోని పోషక విలువలను కూడా మెరుగుపరిచాయి. అందువల్ల, ఇటువంటి బయోఫోర్టిఫైడ్ పశుగ్రాసం లేదా సైలేజ్‌ను ఎక్కువ కాలం మేతగా ఇవ్వడం వల్ల గొర్రెలలో శరీర బరువు, సగటు రోజువారీ పెరుగుదల, రక్తంలోని ఖనిజాల స్థాయిలను మెరుగుపరచవచ్చని నిరూపితమైంది. ఈ విధానం వల్ల నేల సారం పెరిగి పశుగ్రాస దిగుబడి పెరగడమే కాకుండా, ఇటు పశువుల్లో అటు మనుషుల్లోనూ ఉన్న ఖనిజ లవణాల లోపాలను సరిదిద్దవచ్చని ఈ అధ్యయనం వెల్లడించింది.

నత్రజని ప్రాముఖ్యత

పంట అభివృద్ధికి, పశుగ్రాస ఉత్పత్తికి నత్రజని చాలా కీలకమైన పోషకం. ఇది ప్రొటీన్లు, అమైనో ఆమ్లాలు, పత్రహరితం, ఇతర ముఖ్యమైన అణువుల నిర్మాణానికి అవసరం. నత్రజని ఎరువులు మేత నాణ్యతను, ముఖ్యంగా పొడి పదార్థం, ముడి మాంసకృత్తుల సాంద్రతను పెంచుతాయి.

పరిశోధనా ఫలితాల ప్రకారం, హెక్టారుకు 25 టన్నుల పశువుల ఎరువు వాడినప్పుడు, మొక్కజొన్న గ్రాసంలో జింక్ (15.3%), రాగి (7.5%), మాంగనీస్ (28.4%), ఇనుము (15.6%) వంటి సూక్ష్మపోషకాల స్థాయిలు పెరిగాయి. నత్రజని (120 కిలోలు/హెక్టారు)ని పశువుల ఎరువుతో కలిపి వాడటం వల్ల పశుగ్రాసంలో ముడి ప్రొటీన్లు 36.56% వరకు పెరిగినట్లు పరిశోధనా ఫలితాలు వెల్లడిస్తున్నాయి.

గొర్రెల్లో జింక్ లోపం పోయింది

మొక్కజొన్న, అలసంద వంటి పశుగ్రాస పంటల పెరుగుదలకు, అధిక దిగుబడికి జింక్ చాలా ముఖ్యం. పశుగ్రాసంలో జింక్ లోపం ఉంటే పశువుల ఎదుగుదల తగ్గటం, పునరుత్పత్తి సమస్యలు, ఎముకలు, చర్మ కణజాలం దెబ్బతినటం జరుగుతాయి.

2020లో డా. గిరిధర్ బృందం బెంగళూరులో (ఐసీఏఆర్–ఎన్ఐఎన్‌పీ) ఒక అధ్యయనం చేసింది. జింక్ ఎరువులను నేలలో వేసి పండించిన జొన్న చొప్పను జింక్ లోపం ఉన్న గొర్రెలకు 120 రోజులపాటు ప్రయోగాత్మకంగా తినిపించారు. హెక్టారుకు 25 కిలోల జింక్ సల్ఫేట్ వేస్తే జొన్న చొప్ప దిగుబడి హెక్టారుకు 4.2 టన్నులు పెరిగింది. చొప్పలో జింక్ పరిమాణం 14.4 పీపీఎం మేర వృద్ధి చెందింది. బయోఫోర్టిఫైడ్ చొప్ప తిన్న గొర్రెల్లో జింక్ స్థాయి పెరగటంతో పాటు.. రక్తంలోని జింక్ పరిమాణం పెరిగింది. వ్యాధి నిరోధక శక్తి పెరిగింది.

జీవన ఎరువుల ప్రాముఖ్యత

రసాయన ఎరువులు మితిమీరి వాడకం వల్ల భూమి నిస్సారమవడమే కాకుండా, పశుగ్రాసంలో పోషకాల సమతుల్యత దెబ్బతినే అవకాశం ఉంది. ఈ సవాలును ఎదుర్కోవడంలో మొక్కల పెరుగుదల ప్రోత్సహించే అజోటోబాక్టర్, అజోస్పిరిలియం వంటి జాతుల జీవన ఎరువులు కీలకపాత్ర పోషిస్తాయి. జీవసంబంధమైన నత్రజని స్థిరీకరణ, ఫాస్ఫేట్ కరిగింపు, ఫైటో హార్మోన్ల ఉత్పత్తి వంటి చర్యల ద్వారా పోషకాల లభ్యతను పెంచుతాయి. ఇవి జీవసంబంధంగా నత్రజనిని స్థిరీకరించడం ద్వారా పంటల నాణ్యతను, దిగుబడిని మెరుగుపరుస్తాయి. ఈ సుస్థిర పద్ధతులను అవలంబించడం వల్ల నేల సారాన్ని కాపాడుకుంటూనే పశుపోషణను లాభసాటిగా మార్చుకోవచ్చు.

పత్తి యంత్రం రెడీ

- యంత్రం ఖరీదు రూ. 15 లక్షలు
- పత్తి తీత ఖర్చు కిలోకు రూ. 5 మాత్రమే!
- 90% సమయం, 65% ఖర్చు ఆదా అవుతుంది

పత్తి తీయటంలో వ్యయప్రయాసలతో సతమతమవుతున్న రైతుల కష్టాలు గట్టెక్కే రోజులు వచ్చాయి. భోపాల్‌లోని సెంట్రల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ (ఐసీఏఆర్ – సీఐఏఈ) శాస్త్రవేత్తలు అభివృద్ధి చేసిన పత్తి తీసే యంత్రాన్ని కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ ఇటీవల రైతులకు అంకితం చేశారు. భారతీయ వ్యవసాయ పరిశోధనా మండలి (ఐసీఏఆర్) సమాచారం ప్రకారం.. ప్రీ–క్లీనింగ్ సిస్టమ్‌తో కూడిన ఈ యంత్రాన్ని ట్రాక్టర్‌కు అమర్చి ఉపయోగించాలి. విత్తన పత్తిలో చెత్త 15% కంటే తక్కువగా ఉంటుంది. ఖరీదు రూ. 15 లక్షలు. దీంతో కిలో పత్తి తీత ఖర్చు రూ. 5కు తగ్గుతుంది. గంటకు 0.23 హెక్టారులో పత్తి తీసే సామర్థ్యం దీనికుంది. ఇప్పటి పద్ధతితో పోల్చితే 90% సమయం, 65% ఖర్చు ఆదా అవుతుంది.

మంత్రి ‘ఎక్స్’లో ఇలా ట్వీట్ చేశారు.. ‘ఇప్పటివరకు చేతి వేళ్లతో పత్తిని తీస్తున్నారు. అందుకు చాలా సమయంతో పాటు అధిక శ్రమతో కూడిన పని. దాంతో రైతులకు ఖర్చు కూడా గణనీయంగా పెరిగింది. చాలా కాలంగా, రైతులు పత్తి తీసే ప్రక్రియను సులభతరం చేసే యంత్రం కావాలని అడుగుతున్నారు. నేడు వారి కోరిక నెరవేరింది. ఈ యంత్రం త్వరలో రైతులకు అందుబాటులోకి వస్తుంది. ఈ యంత్రంతో పత్తి తీసే పనిని నేను వ్యక్తిగతంగా పరిశీలించాను. సమయంతోపాటు ఖర్చులనూ తగ్గించడానికి, పత్తి సాగును మరింత లాభదాయకంగా మార్చడానికి ఇది సహాయపడుతుంది. అదే సమయంలో, చీడపీడలను తట్టుకుంటూ అధిక దిగుబడినివ్వగల కొత్త పత్తి రకాలను అభివృద్ధి చేస్తున్నాం..’ అని మంత్రి పేర్కొన్నారు. 2 వరుసల్లో వత్తుగా విత్తిన పత్తి మొక్కల (హెచ్‌డీపీఎస్) నుంచి సీజన్‌లో ఒకేసారి పత్తి తియ్యటానికి వీలుగా ఈ యంత్రాన్ని రూపొందించారు.

తొలి రౌండ్‌లోనే శ్రీజ ఓటమి

వరల్డ్ టేబుల్ టెన్నిస్ సింగపూర్ స్మాష్ లెవెల్ టోర్నీ సింగిల్స్ విభాగంలో భారత క్రీడాకారుల పోరాటం ముగిసింది. మహిళల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్, తెలంగాణ ప్లేయర్ ఆకుల శ్రీజ... భారత రెండో ర్యాంకర్ మనిక బత్రా... పురుషుల సింగిల్స్‌లో భారత నంబర్‌వన్ మానవ్ ఠక్కర్ తొలి రౌండ్‌లోనే వెనుదిరిగారు. సింగపూర్‌లో సోమవారం జరిగిన తొలి రౌండ్ మ్యాచ్‌ల్లో ప్రపంచ 42వ ర్యాంకర్ శ్రీజ 8–11, 5–11, 11–8, 5–11తో ప్రపంచ 39వ ర్యాంకర్ అనా హుర్సే (వేల్స్) చేతిలో... ప్రపంచ 46వ ర్యాంకర్ మనిక 10–12, 8–11, 11–4, 9–11తో ప్రపంచ నాలుగో ర్యాంకర్ జు యులింగ్ (మకావ్) చేతిలో... ప్రపంచ 34వ ర్యాంకర్ మానవ్ 8–11, 11–9, 6–11, 3–11తో ప్రపంచ 56వ ర్యాంకర్ హువాంగ్ జుజెంగ్ (చైనా) చేతిలో ఓటమి పాలయ్యారు. శ్రీజ, మనిక, మానవ్‌లకు 4,000 డాలర్ల (రూ. 3 లక్షల 63 వేలు) చొప్పున ప్రైజ్‌మనీతోపాటు 20 ర్యాంకింగ్ పాయింట్లు లభించాయి. పురుషుల డబుల్స్‌లో మానవ్–మనుశ్ షా... మహిళల డబుల్స్‌లో దియా–యశస్విని జోడీలు ప్రిక్వార్టర్ ఫైనల్ చేరాయి.

నేటి నుంచి రంజీ ట్రోఫీ ఫైనల్

కర్ణాటక X జమ్మూకశ్మీర్

వేదిక: హుబ్లీ

ఉదయం గం. 9:30 నుంచి

జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

హెట్‌మైర్ ‘సూపర్’ షో

టాస్ నెగ్గగానే జింబాబ్వే కెప్టెన్ సికందర్ రజా బౌలింగ్ ఎంచుకొని మొదటి తప్పు చేశాడు. హెట్‌మైర్ బ్యాటింగ్‌కు దిగగానే 9 పరుగుల వద్ద ముసెకివా సులువైన క్యాచ్ నేలపాలు చేసి ముప్పుతెచ్చాడు. ఇది మ్యాచ్‌నే మార్చేసింది. వాంఖడేను మురిపించింది. ప్రేక్షకుల్ని మెరుపులతో ముంచెత్తింది. ఈ ప్రపంచకప్‌లో అసలైన టి20 విందునిచ్చింది. ‘సూపర్–8’లో విండీస్‌కు భారీ విజయాన్నిచ్చింది.

34 బంతుల్లో 7 ఫోర్లు, 7 సిక్సలతో 85

- ‘సూపర్–8’ మ్యాచ్‌లో జింబాబ్వేపై 107 పరుగుల తేడాతో వెస్టిండీస్ ఘనవిజయం
- రాణించిన పావెల్, మోతీ, హోసీన్
- టి20 ప్రపంచకప్‌లో అజేయంగా కరీబియన్ జట్టు

ముంబై: వెస్టిండీస్ విధ్వంసం... జింబాబ్వే విలాపం... ఈ టి20 ప్రపంచకప్‌కే మెరుపుల ‘షో’కులద్దిన ‘సూపర్–8’ మ్యాచ్‌లో కరీబియన్ జట్టు 107 పరుగులతో తేడాతో జింబాబ్వేపై భారీ విజయాన్ని నమోదుచేసింది. టాస్ ఓడి ముందుగా బ్యాటింగ్ చేపట్టిన వెస్టిండీస్ నిర్ణీత 20 ఓవర్లలో 6 వికెట్ల నష్టానికి 254 పరుగుల భారీస్కోరు చేసింది. ‘ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్’ హెట్‌మైర్ (34 బంతుల్లో 85; 7 ఫోర్లు, 7 సిక్స్‌లు), రోమ్‌మన్ పావెల్ (35 బంతుల్లో 59; 4 ఫోర్లు, 4 సిక్స్‌లు) ఆకాశమే హద్దుగా చెలరేగారు. ఎన్‌గరవ, ముజరబాని చెరో 2 వికెట్లు తీశారు. తర్వాత కొండంత లక్ష్యాన్ని ఛేదించలేక చేతులెత్తేసిన జింబాబ్వే 17.4 ఓవర్లలో 147 పరుగులకే ఆలౌటైంది. ఇవాన్స్ (21 బంతుల్లో 43; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) రాణించాడు. గుడకేశ్ మోతీ (4/28), హోసీన్ (3/28) వెన్నువిరిచారు. తమ తదుపరి ‘సూపర్–8’ పోటీల్లో 26న దక్షిణాఫ్రికాతో వెస్టిండీస్; అదేరోజు భారత్‌తో జింబాబ్వే ఆడతాయి.

హెట్ ‘ఫైర్’

ఓపెనర్లు బ్రాండన్ కింగ్ (9), షై హోప్ (14) వికెట్లను కోల్పోయిన విండీస్ హెట్‌మైర్, పావెల్ ధనాధన్ భాగస్వామ్యంతో శరవేగంగా దూసుకెళ్లింది. క్రీమర్ వేసిన ఏడో ఓవర్లో 2 వరుస సిక్స్‌లు కొట్టిన హెట్‌మైర్... రజా వేసిన మరుసటి ఓవర్లో మూడు సిక్స్‌లు బాదేశాడు. దీంతోనే అతను 19 బంతుల్లో టి20 ప్రపంచకప్‌లో ఫాస్టెస్ట్ ఫిఫ్టీ చేసిన కరీబియన్ బ్యాటర్‌గా రికార్డును నెలకొల్పాడు. హెట్‌మైర్ బాదిన మొత్తం 7 సిక్స్‌ల్లో ఐదింటిని ఈ రెండు ఓవర్లలోనే కొట్టడం విశేషం! హెట్‌మైర్ విధ్వంసరచనకు కారణమైన ముసెకివా మళ్లీ అతను 70 పరుగుల వద్ద కొట్టిన షాట్‌ను రెండోసారి క్యాచ్ పట్టలేకపోయాడు. మరోవైపు పావెల్ 29 బంతుల్లో ఫిఫ్టీ సాధించాడు. ఇద్దరు కలిసి మూడో వికెట్‌కు కేవలం 52 బంతుల్లోనే 122 పరుగుల రికార్డు భాగస్వామ్యం నెలకొల్పారు. వీళ్లిద్దరు అవుటయ్యాక రూథర్‌ఫోర్డ్ (13 బంతుల్లో 31 నాటౌట్; 3 ఫోర్లు, 2 సిక్స్‌లు), షెఫర్డ్ (10 బంతుల్లో 21; 3 సిక్స్‌లు), హోల్డర్ (4 బంతుల్లో 13; 2 సిక్స్‌లు) దంచేయడంతో విండీస్ సులువుగా 250 పరుగుల్ని దాటేసింది.

హెట్‌మైర్

జింబాబ్వే విలవిల

ఆస్ట్రేలియా, శ్రీలంకలాంటి మేటి జట్లను ఓడించి సూపర్–8కు చేరుకున్న జింబాబ్వే... విండీస్ ఆల్‌రౌండ్ ప్రదర్శనకు కుదేలైంది. 20 పరుగుల వద్దే మరుమని (14), బెనెట్ (5), బర్ల్ (0) వికెట్లను కోల్పోయింది. కాస్త కుదుటపడి 50 స్కోరును దాటగానే గుడకేశ్ మోతీ చావుదెబ్బ తీయడంతో 103 పరుగులకే 9 వికెట్లను కోల్పోయి ఓటమికి చేరువైంది. మైయెర్స్ (28), కెప్టెన్ రజా (27) మెరుగ్గా ఆడారంతే! ఆఖరి వికెట్ ఎన్‌గరవ (7 నాటౌట్) అండతో బ్రాడ్ ఇవాన్స్ కాసేపు చెలరేగడంతో జింబాబ్వే పరాజయం ఆలస్యమైంది.

254 టి20 ప్రపంచకప్ చరిత్రలో రెండో అత్యధిక స్కోరు నమోదు చేసిన జట్టుగా వెస్టిండీస్ నిలిచింది. 2007 టి20 ప్రపంచకప్ మ్యాచ్‌లో కెన్యాపై శ్రీలంక 6 వికెట్లు కోల్పోయి 260 పరుగులు సాధించింది.

107 టి20ల్లో పరుగుల తేడా పరంగా విండీస్‌కిది రెండో అతిపెద్ద విజయం. 2024లో ఉగాండాపై విండీస్ 134 పరుగుల తేడాతో గెలిచింది.

‘సూపర్–8’ గ్రూప్–1 పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.రే
వెస్టిండీస్	1	1	0	2	5.350
దక్షిణాఫ్రికా	1	1	0	2	3.800
భారత్	1	0	1	0	-3.800
జింబాబ్వే	1	0	1	0	-5.350

నోట్: ఆ–ఆడినవి, గె–గెలిచినవి, ఓ–ఓడినవి, పా–పాయింట్లు, నె.ర.రే–నెట్ రన్‌రేట్

టి20 ప్రపంచకప్‌లో నేడు

ఇంగ్లండ్ X పాకిస్తాన్

వేదిక: పల్లెకెలె రాత్రి 7 గంటల నుంచి

స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

పావెల్

స్కోరు వివరాలు

వెస్టిండీస్ ఇన్నింగ్స్: బ్రాండన్ కింగ్ (సి) ముసెకివా (బి) ఎన్‌గరవ 9; షై హోప్ (సి) బెనెట్ (బి) ఇవాన్స్ 14; హెట్‌మైర్ (సి) బెనెట్ (బి) క్రీమర్ 85; పావెల్ (సి) ముసెకివా (బి) ముజరబాని 59; రూథర్‌ఫోర్డ్ (నాటౌట్) 31; షెఫర్డ్ (సి) బర్ల్ (బి) ఎన్‌గరవ 21; హోల్డర్ (సి) మున్యోంగా (బి) ముజరబాని 13; ఫోర్డ్ (నాటౌట్) 1; ఎక్స్‌ట్రాలు 21; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 254. వికెట్ల పతనం:** 1–17, 2–54, 3–176, 4–194, 5–229, 6–248. **బౌలింగ్:** ఎన్‌గరవ 4–0–47–2, ముజరబాని 4–0–42–2, ఇవాన్స్ 4–0–46–1, క్రీమర్ 4–0–38–1, రజా 3–0–52–0, మైయెర్స్ 1–0–19–0.

జింబాబ్వే ఇన్నింగ్స్: మరుమని (సి) హెట్‌మైర్ (బి) ఫోర్డ్ 14; బెనెట్ (బి) హోసీన్ 5; మైయెర్స్ (బి) మోతీ 28; బర్ల్ (సి) హెట్‌మైర్ (బి) హోసీన్ 0; రజా (బి) మోతీ 27; మున్యోంగా (సి) జోసెఫ్ (బి) మోతీ 14; ముసెకివా (బి) మోతీ 0; ఇవాన్స్ (సి) హోసీన్ (బి) ఫోర్డ్ 43; క్రీమర్ (సి అండ్ బి) హోల్డర్ 0; ముజరబాని (సి) జోసెఫ్ (బి) హోసీన్ 0; ఎన్‌గరవ నాటౌట్ 7; ఎక్స్‌ట్రాలు 9; **మొత్తం (17.4 ఓవర్లలో ఆలౌట్) 147. వికెట్ల పతనం:** 1–20, 2–20, 3–20, 4–52, 5–94, 6–94, 7–101, 8–102, 9–103, 10–147. **బౌలింగ్:** హోసీన్ 4–1–28–3, ఫోర్డ్ 3.4–0–27–2, మోతీ 4–1–28–4, జోసెఫ్ 3–0–35–0, హోల్డర్ 3–0–25–1.

మరో విజయం లక్ష్యంగా...

- నేడు ఆస్ట్రేలియా మహిళల జట్టుతో భారత్ తొలి వన్డే
- ఉదయం గం. 9:20 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో హాట్‌స్టార్‌లో ప్రత్యక్ష ప్రసారం

హర్మన్‌ప్రీత్, అలీసా హీలీ (ఫైల్)

బ్రిస్బేన్: టి20 సిరీస్‌ను సొంతం చేసుకున్న ఉత్సాహంలో భారత మహిళల క్రికెట్ జట్టు వన్డే సిరీస్‌లోనూ అదరగొట్టాలనే లక్ష్యంతో ఉంది. ఈ నేపథ్యంలో ఆస్ట్రేలియా జట్టుతో బ్రిస్బేన్‌లో నేడు జరిగే తొలి వన్డేలో హర్మన్‌ప్రీత్ కౌర్ బృందం బరిలోకి దిగనుంది. గత ఏడాది తొలిసారి వన్డే వరల్డ్ కప్ టైటిల్ గెలిచిన తర్వాత భారత్ ఆడబోతున్న తొలి వన్డే ఇదే కావడం విశేషం. నవీ ముంబైలో గత వన్డే వరల్డ్‌కప్ సెమీఫైనల్లో భారత్ చేతిలో ఓడిపోయిన ఆస్ట్రేలియా ఆ ఓటమికి బదులు తీర్చుకోవాలనే పట్టుదలతో ఉంది. టి20 సిరీస్‌కు దూరంగా ఉన్న సీనియర్ స్టార్ అలీసా హీలీ వన్డే సిరీస్‌కు కెప్టెన్‌గా అందుబాటులోకి వచ్చింది. భారత్‌తో సిరీస్ తర్వాత అలీసా హీలీ అంతర్జాతీయ క్రికెట్ నుంచి వీడ్కోలు తీసుకోనుంది. టి20 సిరీస్‌లో ఆడిన అరుంధతి రెడ్డి, భారతి పుల్మాలి, శ్రేయాంక పాటిల్ స్థానాల్లో కాశ్వీ గౌతమ్, హర్లీన్ డియోల్, ప్రతీక రావల్ భారత వన్డే జట్టులోకి వచ్చారు. వన్డే ఫార్మాట్‌లో ఏకంగా ఏడుసార్లు ప్రపంచకప్ గెలిచిన ఆస్ట్రేలియా జట్టులో ఎలీస్ పెరీ, యాష్లీ గార్డ్‌నర్, బెత్ మూనీ, అనాబెల్ సదర్లాండ్, అలీసా హీలీ రూపంలో పలువురు మ్యాచ్ విన్నర్లు ఉన్నారు. పటిష్టమైన ఆస్ట్రేలియాను వారి గడ్డపైనే భారత్ ఓడించాలంటే... బ్యాట్‌తో స్మృతి మంధాన, హర్మన్‌ప్రీత్, జెమీమా రోడ్రిగ్స్, ప్రతీక రావల్, హర్లీన్ డియోల్, రిచా ఘోష్... బంతితో రేణుక, క్రాంతి, శ్రీచరణి అద్భుత ప్రదర్శన చేయాల్సి ఉంటుంది. బ్రిస్బేన్ మైదానం ఆస్ట్రేలియా మహిళల జట్టుకు ఎంతో కలిసొచ్చిన వేదిక. ఈ గ్రౌండ్‌లో ఆస్ట్రేలియా జట్టు ఇప్పటి వరకు ఆడిన 20 వన్డేల్లోనూ విజయం సాధించి అజేయంగా ఉంది. మంగళవారం తొలి వన్డే అనంతరం.... రెండు జట్లు హోబర్ట్ వేదికగా ఫిబ్రవరి 27న రెండో వన్డే, మార్చి 1న మూడో వన్డే ఆడతాయి. టి20, వన్డే, టెస్టు సిరీస్ ముగిశాక ఎక్కువ పాయింట్లు సాధించిన జట్టుకు ఓవరాల్ విన్నర్స్ ట్రోఫీని అందజేస్తారు. టి20 సిరీస్ నెగ్గిన భారత జట్టు ప్రస్తుతం 4–2తో ఆధిక్యంలో ఉంది.

సెమీస్‌లో ఆంధ్ర

హెన్రిత

పద్మజ

రూప్‌నగర్ (పంజాబ్): బీసీసీఐ సీనియర్ మహిళల వన్డే క్రికెట్ టోర్నమెంట్‌లో ఆంధ్ర జట్టు సెమీఫైనల్లోకి దూసుకెళ్లింది. రాజస్తాన్ జట్టుతో సోమవారం జరిగిన క్వార్టర్ ఫైనల్లో అంజలి శర్వాణి సారథ్యంలోని ఆంధ్ర జట్టు నాలుగు వికెట్ల తేడాతో గెలిచింది. మొదట బ్యాటింగ్ చేసిన రాజస్తాన్ నిర్ణీత 50 ఓవర్లలో 165 పరుగులకు ఆలౌటైంది. ఆంధ్ర బౌలర్లలో అనూష (3/26), పద్మజ (2/34), ధాత్రి (2/34) రాణించారు. అంజలి శర్వాణి, షబ్నమ్‌లకు ఒక్కో వికెట్ దక్కింది. అనంతరం 166 పరుగుల లక్ష్యాన్ని ఆంధ్ర జట్టు 6 వికెట్లు కోల్పోయి 49.3 ఓవర్లలో ఛేధించి గెలిచింది. పుష్పలత (31; 2 ఫోర్లు), రంగలక్ష్మి (24; 3 ఫోర్లు) రాణించగా... హెన్రితా పెరీరా (51; 4 ఫోర్లు) అర్ధ సెంచరీ చేసింది. పద్మజ (47 నాటౌట్; 3 ఫోర్లు) కీలక ఇన్నింగ్స్ ఆడింది. ఒకదశలో 73 పరుగులకు 5 వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడిన ఆంధ్ర జట్టును హెన్రితా, పద్మజ ఆదుకున్నారు. వీరిద్దరు ఆరో వికెట్‌కు 78 పరుగులు జోడించారు. లక్ష్యానికి 15 పరుగుల దూరంలో హెన్రితా అవుటవ్వగా.. పద్మజ మిగతా లాంఛనాన్ని పూర్తి చేసింది. గురువారం మొహాలీలో జరిగే సెమీఫైనల్లో ఢిల్లీ జట్టుతో ఆంధ్ర తలపడుతుంది.

సాక్షి సినిమా

‘మా’ (మూవీ ఆర్టిస్ట్స్ అసోసియేషన్) 2026 డైరీని తెలంగాణ రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క విడుదల చేశారు. సోమవారం హైదరాబాద్‌లోని ప్రజాభవన్‌లో ‘మా’ అధ్యక్షుడు విష్ణు మంచు ఆధ్వర్యంలో ఈ డైరీ లాంచ్ జరిగింది. ఈ సందర్భంగా మల్లు భట్టి విక్రమార్క మాట్లాడుతూ–“మా’ సభ్యుల కోసం చేపడుతున్న ఆరోగ్య అవగాహన కార్యక్రమాలు, హెల్త్ చెకప్స్, సభ్యుల సంక్షేమం కోసం ‘మా’ కార్యవర్గం చేపడుతున్న కార్యక్రమాలు అభినందనీయం. ఇకపైనా ఇలాగే ముందుకెళ్లాలి” అని తెలిపారు. డైరీ లాంచ్‌లో ‘మా’ వైస్ ప్రెసిడెంట్ మాదాల రవి, ట్రెజరర్ శివ బాలాజీ, ఎగ్జిక్యూటివ్ కమిటీ మెంబర్స్ జయవాణి, మలక్‌పేట్ శైలజ, శివ నారాయణ, శశాంక్, హరనాథ్ బాబు, మానిక్, సంపూర్ణేశ్ బాబు, ఎం.ఆర్.సి. వడ్లపట్ల తదితరులు పాల్గొన్నారు.

చరిత్ర సృష్టించిన బూంగ్

- 79వ బాఫ్టా అవార్డ్స్‌లో భారతీయ సినిమా బూంగ్‌కి అవార్డు

భారతీయ చిత్రం ‘బూంగ్’ చరిత్ర సృష్టించింది. లండన్‌లో జరిగిన 79వ ‘బాఫ్టా’ (బ్రిటిష్ అకాడమీ ఆఫ్ ఫిల్మ్ అండ్ టెలివిజన్ ఆర్ట్స్) అవార్డుల ప్రదానోత్సవంలో ‘బెస్ట్ చిల్డ్రన్స్ అండ్ ఫ్యామిలీ ఫిల్మ్’ విభాగంలో అవార్డు అందుకున్న తొలి భారతీయ చిత్రంగా నిలిచింది. అలాగే ‘బాఫ్టా’లో తొలి అవార్డు సాధించిన మణిపుర్ సినిమా కూడా ఇదే. ఈ విభాగంలో ‘జూటోపియా 2’, ‘లిలో – స్టిచ్’, ‘ఆర్కో’ వంటి హాలీవుడ్ చిత్రాలు నామినేషన్ దక్కించుకున్నప్పటికీ ‘బూంగ్’ అవార్డును గెలుచుకోవడం విశేషం.

‘బాఫ్టా’లో ‘బూంగ్’ యూనిట్

గుగున్ కిప్జెన్

బూంగ్ కథ ఏంటంటే...

గుగున్ కిప్జెన్ టైటిల్ రోల్‌లో, బాలా హిజామ్ కీలక పాత్రలో నటించిన మణిపుర్ చిత్రం ‘బూంగ్’. లక్ష్మీ ప్రియా దేవి దర్శకత్వం వహించిన తొలి ఫీచర్ ఫిలిం ఇది. ఫర్హాన్ అక్తర్, విశేష్ భూతాని, అలాన్ మెక్ అలెక్స్, రితేష్ సిధ్వాని, షుజాత్ వ్యాపారి నిర్మించారు. ఈ సినిమాని 2024లో కెనడాలో జరిగిన 49వ టొరంటో ఇంటర్నేషనల్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో తొలిసారి ప్రదర్శించారు. 2025 సెప్టెంబరు 19న ఈ చిత్రాన్ని ఇండియాలో రిలీజ్ చేశారు. తన తల్లిదండ్రులు మందాకిని, జాయ్‌కుమార్‌లను కలిపేందుకు బూంగ్ అనే పాఠశాల విద్యార్థి తన స్వస్థలం నుంచి మయన్మార్ సరిహద్దు వరకు చేసిన సాహసోపేతమైన భావోద్వేగ ప్రయాణంతో ఈ మూవీ సాగుతుంది.

మణిపూర్‌లో శాంతి నెలకొనాలి: లక్ష్మీప్రియా దేవి

‘బాఫ్టా’ అవార్డు స్వీకరించిన అనంతరం భావోద్వేగంతో మాట్లాడారు లక్ష్మీ ప్రియా. ‘‘మేం ఎంతో కష్టపడుతూ ఓ పర్వతం ఎక్కుతున్నది ఫస్ట్ ప్లేస్ కోసమని మేం ఈ వేదికపైకి వచ్చాక అర్థం అయింది. మా చిన్న సినిమాపై ఇంతటి ప్రేమను వ్యక్తం చేసిన జ్యూరీ సభ్యులకు, బాఫ్టాకు థ్యాంక్స్. భారతదేశంలోని మణిపూర్ నా మాతృభూమి. అక్కడ తిరిగి శాంతి నెలకొనాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నానని చెప్పేందుకు ఈ వేదికను వినియోగించుకోవాలనుకుంటున్నాను. సినిమాలోని బాల నటులతో సహా, మణిపూర్‌లోని పిల్లలందరూ వారి ఆనందాన్ని, వారి కలలను తిరిగి పొందాలని కోరుకుంటున్నాను’’ అని చెప్పారు.

ప్రధాని మోదీ ప్రశంస

‘‘బూంగ్’ సినిమాతో అసోసియేట్ అయిన అందరికీ శుభాకాంక్షలు. నిజంగా ఆనందమైన క్షణాలు ఇవి. ముఖ్యంగా మణిపూర్‌కు. అలాగే దేశంలోని అపారమైన సృజనాత్మక ప్రతిభ హైలైట్ అవుతుంది’’ అంటూ భారత ప్రధాని నరేంద్ర మోది ‘ఎక్స్’ వేదికగా స్పందించారు. అలాగే పలువురు భారత సినీ ప్రముఖులు కూడా శుభాకాంక్షలు చెప్పారు.

ఆలియా సందడి

‘బాఫ్టా’ అవార్డ్స్‌లో బాలీవుడ్ నటి ఆలియా భట్ సందడి చేశారు. ‘బెస్ట్ ఫిల్మ్ నాట్ ఇన్ ది ఇంగ్లిష్ లాంగ్వేజ్’ విభాగంలో ‘సెంటిమెంటల్ వేల్యూ’ యూనిట్‌కు అవార్డు అందించారు. ఈ అవార్డ్స్‌లో ‘వన్ బాటిల్ ఆఫ్టర్ అనదర్’ సినిమా బెస్ట్ ఫిల్మ్‌గా నిలవడంతో పాటు అత్యధికంగా ఆరు అవార్డులను సొంతం చేసుకుంది. చిత్ర దర్శకుడు పాల్‌థామస్ ఉత్తమ దర్శకుడిగా అవార్డు అందుకున్నారు. రాబర్ట్ అరమాయో (ఐ స్వేయిర్ సినిమాకు) ఉత్తమ నటుడిగా నిలవగా, జెస్సీ బక్లీ ఉత్తమ నటిగా నిలిచి (‘హామ్నెట్’ చిత్రానికిగాను).. బాఫ్టా లీడ్ యాక్ట్రస్ అవార్డు గెలుచుకున్న తొలి ఐరిస్ మహిళగా రికార్డు సాధించారు.

ఆలియా భట్

చిరునవ్వుతో బయటికి వస్తారు

- నిర్మాతలు సుబ్రహ్మణ్యం- సుమంత్



సుమంత్, సుబ్రహ్మణ్యం

‘‘విష్ణు విన్యాసం’ మూవీ మంచి కామెడీ ఎంటర్‌టైనర్. ఫస్ట్ హాఫ్ యూత్‌కి కనెక్ట్ అవుతుంది. సెకండ్ హాఫ్ యూత్, ఫ్యామిలీ ఆడియన్స్‌ని అలరిస్తుంది. ఓవరాల్‌గా అన్నివర్గాల ప్రేక్షకులు మా మూవీలోని కామెడీని పక్కాగా ఎంజాయ్ చేస్తారు’’ అని నిర్మాతలు సుబ్రహ్మణ్యం నాయుడు జి, సుమంత్ నాయుడు జి. తెలిపారు. శ్రీ విష్ణు, నయన్ సారిక హీరో హీరోయిన్లుగా నటించిన సినిమా ‘విష్ణు విన్యాసం’. యదునాథ్ మారుతీ రావు దర్శకత్వంలో హేమ, షాలిని సమర్పణలో శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర సినిమాస్ బ్యానర్‌పై సుమంత్ నాయుడు జి. నిర్మించిన ఈ చిత్రం ఈ నెల 27న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా నిర్మాతలు సుబ్రహ్మణ్యం నాయుడు జి, సుమంత్ నాయుడు జి. విలేకరులతో మాట్లాడుతూ–‘‘మారుతీ రావు చెప్పిన కథ మాకు నచ్చింది. ఆ తర్వాత ఈ స్క్రిప్ట్‌ని శ్రీవిష్ణుకి వినిపించగా వెంటనే ఓకే అన్నారాయన. ఈ మూవీలో హీరో పాత్ర పేరు విష్ణు. అందుకే సినిమాకి ‘విష్ణు విన్యాసం’ అని టైటిల్ పెట్టాం. శ్రీవిష్ణుగారి కెరీర్‌లో ఈ మూవీ టాప్ ఫైవ్‌లో ఒకటిగా నిలుస్తుంది. నయన్ సారిక చాలా మంచి నటి. ఈ క్యారెక్టర్‌కు తను పర్ఫెక్ట్ యాప్ట్. రధన్ మ్యూజిక్ చాలా మంచి సాంగ్స్, బ్యాక్ గ్రౌండ్ స్కోర్ ఇచ్చారు. ఈ మూవీలోని నాలుగు పాటల్ని రామజోగయ్య శాస్త్రిగారే రాశారు. మా సినిమా చూసిన ఆడియన్స్ చిరునవ్వుతో థియేటర్స్ నుంచి బయటికి వస్తారు. ప్రస్తుతం రెండు సినిమాల ప్రీ ప్రొడక్షన్ వర్క్స్ నడుస్తున్నాయి.. వివరాలు త్వరలోనే ప్రకటిస్తాం’’ అని చెప్పారు.

బ్యాక్ టు హైదరాబాద్

ఎన్టీఆర్

జోర్డాన్ నుంచి ‘డ్రాగన్’ మూవీ టీమ్ తిరిగొచ్చింది. ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్ నీల్ దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ‘డ్రాగన్’ (ప్రచారంలో ఉన్న టైటిల్). రుక్మిణీ వసంత్ హీరోయిన్. మలయాళ నటుడు టొవినో థామస్, బాలీవుడ్ నటుడు అనిల్ కపూర్ ఇతర కీలక పాత్రల్లో నటిస్తున్నారని సమాచారం. నందమూరి కల్యాణ్ రామ్, నవీన్ ఎర్నేని, వై.రవిశంకర్, కె. హరికృష్ణ నిర్మిస్తున్నారు. కాగా ఇటీవల జోర్డాన్‌లో మొదలైన ‘డ్రాగన్’ షెడ్యూల్ ముగిసింది. దీంతో ఎన్టీఆర్, ప్రశాంత్ అండ్ టీమ్ హైదరాబాద్ చేరుకున్నారు. జోర్డాన్‌లో ప్రధానంగా రెండు కీలకమైన యాక్షన్ సన్నివేశాలను చిత్రీకరించారని తెలిసింది. అయితే తదుపరి షూటింగ్ షెడ్యూల్ కోసం టీమ్ ఎక్కువ గ్యాప్ తీసుకోవడం లేదట. ఈ నెలాఖరులోనే హైదరాబాద్‌లో కొత్త షెడ్యూల్ ప్రారంభం కానుందట. ఎన్టీఆర్‌తో పాటు ప్రధాన తారాగణం ఈ షెడ్యూల్‌లో పాల్గొంటారని ఫిల్మ్ నగర్ సమాచారం. ‘డ్రాగన్’ మూవీని ఈ ఏడాదే రిలీజ్ చేయాలనుకుంటున్నారు. విడుదల తేదీపై త్వరలోనే ఓ స్పష్టత రానుంది.

రుబరూ రెడీ

అడివి శేష్, మృణాళ్

అడివి శేష్, మృణాళ్ ఠాకూర్ జోడీగా నటించిన ద్విభాషా (తెలుగు, హిందీ) చిత్రం ‘డెకాయిట్’. ఈ యాక్షన్ లవ్‌స్టోరీతో కెమెరామెన్ షానియల్ డియో దర్శకుడిగా పరిచయం అవుతున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సమర్పణలో సుప్రియ యార్లగడ్డ నిర్మించిన ఈ సినిమా త్వరలోనే విడుదల కానుంది. కాగా ఈ చిత్రంలోని ‘రుబరూ...’ అంటూ సాగే పాట లిరికల్ వీడియోను ఈ నెల 27న రిలీజ్ చేయనున్నట్లు మేకర్స్ తెలిపారు. ‘‘డెకాయిట్’ మూవీ కథాంశం ప్రధానంగా యాక్షన్ చుట్టూ తిరిగినప్పటికీ ‘రుబారూ..’ సాంగ్ మాత్రం మంచి ఎమోషనల్ టచ్‌తో కొత్త ఫీల్‌ని ఇస్తుంది. హీరో హీరోయిన్ల కెమిస్ట్రీని హైలెట్ చేస్తూ, వారి జర్నీని ప్రజెంట్ చేసే పాట ఇది’’ అని యూనిట్ పేర్కొంది. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రలో నటించిన ఈ సినిమాకు సునీల్ నారంగ్ సహ నిర్మాతగా వ్యవహరించగా, భీమ్స్ సిసిరోలియో సంగీతం అందించారు.

డాటర్ ఆఫ్ ప్రసాద్‌రావు నిరాశ పరచదు

- రాజీవ్ కనకాల

రాజీవ్ కనకాల, వసంతిక

‘‘నేను ఇప్పటి వరకు ఎన్నో పాత్రల్ని పోషించాను. అయితే ‘డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు’ సిరీస్‌లో నేను చేసిన పాత్ర మాత్రం ఓ మైలురాయిగా నిలుస్తుంది. ఈ సిరీస్ వీక్షకులను నిరాశ పరచదు’’ అని నటుడు రాజీవ్ కనకాల చెప్పారు. కృష్ణ పోలూరు దర్శకత్వంలో రాజీవ్ కనకాల, ఉదయభాను, వసంతిక, శ్రీరామ్ వెంకట్ ప్రధాన పాత్రల్లో తెరకెక్కిన వెబ్ సిరీస్ ‘డాటర్ ఆఫ్ ప్రసాద్ రావు’. సౌత్ ఇండియా స్క్రీన్స్ బ్యానర్‌పై కె.వి. శ్రీరామ్ నిర్మించిన ఈ సిరీస్ ఈ నెల 27 నుంచి జీ5 లో స్ట్రీమింగ్ కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన గ్రాండ్ ప్రివ్యూ ఈవెంట్‌లో ఉదయ భాను మాట్లాడుతూ–‘‘పోలీస్ ఆఫీసర్ రోల్ చేయాలనే ఆకాంక్ష ఎప్పటి నుంచో ఉండేది.. ఇందులో నా క్యారెక్టర్‌కు ఎంతో కనెక్ట్ అయ్యాను’’ అని తెలిపారు. ‘‘ప్రతి ఒక్క తండ్రికి కనెక్ట్ అయ్యే సిరీస్ ఇది’’ అన్నారు కె.వి. శ్రీరామ్. ‘‘ఈ స్టోరీ రాయడానికి నాకు రెండేళ్లు పట్టింది’’ అని కృష్ణ పోలూరు పేర్కొన్నారు. ‘‘మా సిరీస్ తప్పకుండా అలరిస్తుంది’’ అని జీ5 తెలుగు సీనియర్ వైస్ ప్రెసిడెంట్ జయంత్ రాఘవన్ తెలిపారు. నటి గాయత్రి భార్గవి మాట్లాడారు.

కాక్రోచ్ ప్రేమకథ

‘సొంత ఊరు, గంగపుత్రులు, ఒక రొమాంటిక్ క్రైమ్ కథ’ వంటి చిత్రాలను తెరకెక్కించిన పి. సునీల్ కుమార్ రెడ్డి దర్శకత్వంలో రూపొందిన సినిమా ‘కాక్రోచ్’. అభిలాష్ సుంకర, ప్రేమసన్, నవీన్, తీర్థ ప్రధాన పాత్రల్లో నటించారు. శ్రీ లక్ష్మి పిక్చర్స్‌పై బి. బాపిరాజు, ముతుకి నాగ సత్యనారాయణ నిర్మించిన ఈ సినిమా మార్చి 6న రిలీజ్ కానుంది. ఈ సందర్భంగా హైదరాబాద్‌లో నిర్వహించిన సమావేశంలో పి.సునీల్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ–‘‘విశాఖ, గాజువాక ప్రాంతాల్లో నివాసం ఉండే కొందరు నేరస్తుల నిజ జీవిత ఘటనల ఆధారంగా వయొలెంట్ లవ్ స్టోరీగా ‘కాక్రోచ్’ సినిమా తీశాను. ఓ వేశ్యకు, ఒక నేరస్థుడికి మధ్య జరిగే లవ్‌స్టోరీతో ఈ సినిమా కథనం సాగుతుంది. ఇది రెగ్యులర్ మూవీ కాదు. మనకు తెలియని ఒక ప్రపంచాన్ని పరిచయం చేసే చిత్రమిది. కేవలం వినోదం కోసం సినిమా చూసే వారికి మా చిత్రం నచ్చకపోవచ్చు. కానీ, సమాజంలోని చేదు నిజాన్ని చూడాలనుకునేవారికి మా చిత్రం తప్పకుండా నచ్చుతుంది’’ అని చెప్పారు. ‘‘ఈ చిత్ర నిర్మాణంలో ఎన్నో సవాళ్లను ఎదుర్కొన్నాం. రొటీన్ సినిమాలు చూసి విసిగిపోయిన ప్రేక్షకులకు మా సినిమా కొత్తదనం ఇస్తుంది’’ అని పేర్కొన్నారు బి.బాపిరాజు.



బాపిరాజు, సునీల్ కుమార్ రెడ్డి

సాక్షి **బిజినెస్**
మంగళవారం
24-2-2026

స్టాక్ మార్కెట్లు

(తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)

దేశీ సూచీలు

సెన్సెక్స్ ▲	480	83,295
నిఫ్టీ ▲	142	25,713

విదేశీ సూచీలు

● నాస్‌డాక్	22,613	▽	274
● డోజోన్స్	48,874	▽	752
● ఎఫ్‌టీఎస్‌ఈ 100	10,682	▽	5
● డాక్స్	25,028	▽	232
● షాంఘై (ఫిబ్రవరి 13 ముగింపు)	4,082	▽	52
● నికాయ్ (శుక్రవారం ముగింపు)	56,826	▽	642

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

ఫారెక్స్ రేట్లు రూ. లలో

			కొనుగోలు	అమ్మకం
$	యూఎస్ డాలర్	ఎస్‌బీఐ	90.30	91.32
£	బ్రిటన్ పౌండ్	ఎస్‌బీఐ	121.19	124.21
€	యూరో	ఎస్‌బీఐ	105.90	108.74
¥	జపాన్ యెన్ (100)	ఎస్‌బీఐ	58.12	59.55
AU$	ఆస్ట్రేలియా డాలర్	థామస్‌కుక్	61.86	65.79
S$	సింగపూర్ డాలర్	థామస్‌కుక్	69.50	73.22
SAR	సౌదీ రియాల్	థామస్‌కుక్	23.34	24.85
UAE D	యూఏఈ దిర్హామ్	థామస్‌కుక్	23.85	25.12
¥	చైనా యువాన్	థామస్‌కుక్	12.28	14.10

బ్యాంకులూ.. మీ పని మీరు చూసుకోండి

బీమా అమ్మకం కాదు కస్టమర్ల నమ్మకం ముఖ్యం

- డిపాజిట్ల సమీకరణ, రుణ వితరణ కీలకం
- బ్యాంక్‌లకు ఆర్థిక మంత్రి సీతారామన్ హితవు

న్యూఢిల్లీ: బ్యాంకులు తమ అసలు వ్యాపారం అయిన డిపాజిట్లు సమీకరించడం, రుణాలు ఇవ్వడం, తక్కువ వ్యయాలతో కూడిన కాసా డిపాజిట్లను పెంచుకోవడంపై దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ కోరారు. అంతేకానీ, బ్యాంకుకు సంబంధం లేని బీమా, ఇతర ఉత్పత్తులను అనుచిత మార్గాల్లో విక్రయించే (మిస్ సెల్లింగ్) చర్యలకు దూరంగా ఉండాలని సూచించారు. ''బ్యాంక్‌లు తమ ప్రధాన వ్యాపార సూత్రాలను దృష్టిలో పెట్టుకోకుండా, వారి రుణ అవసరాలను అర్థం చేసుకోకుండా, వారితో సంబంధాలను బలోపేతం చేసుకోకుండా, ఇతర కార్యకలాపాలకు ప్రాధాన్యం ఇస్తున్నాయి. అవసరం లేకపోయినప్పటికీ బీమా పాలసీల విక్రయాలపైనే ఎక్కువ సమయం వెచ్చిస్తున్నాయి. దీంతో రెండు స్కూళ్ల పరిధిలోకి (ఆర్‌బీఐ, ఐఆర్‌డీఏఐ నియంత్రణలు) వచ్చి చేరుతున్నాయి. కస్టమర్లకు అప్పటికే బీమా రక్షణ ఉన్నప్పటికీ, మళ్లీ కొనుగోలు చేయాలని బ్యాంక్‌లు అడుగుతున్నాయి. బీమా ఐఆర్‌డీఏఐ పరిధిలోకి వస్తుందన్న ఉద్దేశంతో ఈ తప్పుడు విక్రయాలను ఆర్‌బీఐ పర్యవేక్షించడం లేదు. బ్యాంక్‌లు ఆర్‌బీఐ పరిధిలోకి వస్తాయని ఐఆర్‌డీఏఐ ఊరుకుంటోంది. ఈ పర్యవేక్షణ అంతరాల వల్ల కస్టమర్లు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు''అని ఆర్‌బీఐ సెంట్రల్ బోర్డు సమావేశం అనంతరం మీడియాతో మాట్లాడిన సందర్భంగా మంత్రి సీతారామన్ వ్యాఖ్యానించారు. మిస్ సెల్లింగ్‌పై ఆర్‌బీఐ ఫిబ్రవరి 11న ముసాయిదా మార్గదర్శకాలు జారీ చేయడం గమనార్హం. వీటి ప్రకారం కస్టమర్లకు అవసరం లేని ఉత్పత్తులను విక్రయించ రాదు. అలా చేసినట్టు తేలితే కస్టమర్ చెల్లించిన మొత్తాన్ని వెనక్కి ఇచ్చేయాల్సి ఉంటుంది. అవసరం లేకపోయినా ఉత్పత్తి లేదా సేవను విక్రయించడం వల్ల కస్టమర్ నష్టపోయినట్టు తేలితే, ఆ మేరకు పరిహారం కూడా ఇవ్వాల్సి ఉంటుంది. ఇవి ఇంకా అమల్లోకి రావాల్సి ఉంది. మిస్‌సెల్లింగ్ ఆమోదయోగ్యం కాదంటూ ఆర్‌బీఐ మార్గదర్శకాలు జారీ చేయడం పట్ల సంతోషంగా ఉందని మంత్రి సీతారామన్ పేర్కొన్నారు. ప్రభుత్వరంగ బ్యాంకుల విలీనానికి సంబంధించి ఎలాంటి కార్యాచరణ లేదని సీతారామన్ అన్నారు.

బంగారం దిగుమతులపై కన్నేసి ఉంచాం..

బంగారం, వెండి దిగుమతులు ఆందోళనకర స్థాయిలో లేవని.. దీనిపై ప్రభుత్వం, **ఆర్‌బీఐ కన్నేసి ఉంచినట్టు** మంత్రి సీతారామన్ చెప్పారు. **అంతర్జాతీయంగా సెంట్రల్** బ్యాంక్‌లు పెద్ద మొత్తంలో కొను**గోలు చేస్తుండడం వల్లే** బంగారం ధరలు పెరుగుతున్నట్టు **తెలిపారు. ప్రస్తుత ఆర్థిక** సంవత్సరం ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు బంగారం దిగుమతులు బిలియన్ డాలర్ల మేర పెరిగి 50 బిలియన్ డాలర్లుగా ఉండడం గమనార్హం. బంగారం భారతీయ కుటుంబాలకు ఎల్లప్పుడూ అనుకూల పెట్టుబడి సాధనంగా ఉన్నట్టు మంత్రి గుర్తు చేశారు. జనవరిలో బంగారం దిగుమతులు ఒక్కసారిగా పెరిగిపోవడాన్ని పరిశీలిస్తున్నట్టు ఆర్‌బీఐ గవర్నర్ సంజయ్ మల్హోత్రా సైతం ఈ సమావేశంలో భాగంగా మీడియాతో చెప్పారు.

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌కే పరిమితం..

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్‌లో రూ.590 కోట్ల మోసపూరిత ఘటన వ్యవస్థాపరమైన సమస్య కాదన్నారు ఆర్‌బీఐ గవర్నర్ మల్హోత్రా. పరిణామాలను గమనిస్తున్నట్టు చెప్పారు. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ చండీగఢ్ శాఖలో హరియాణా ప్రభుత్వ సంస్థల ఖాతాల నుంచి ఉద్యోగులు నిధులను దారి మళ్లించడం తెలిసిందే. 2024 బేస్ సంవత్సరం ఆధారంగా విడుదలయ్యే రిటైల్ ద్రవ్యోల్బణం.. కుటుంబాల వినియోగం తీరుతెన్నులను మరింత ప్రభావంతంగా ప్రతిఫలిస్తుందని మల్హోత్రా తెలిపారు.

టారిఫ్‌లకు బ్రేక్.. వెండి, పసిడికి కిక్

సిల్వర్ రూ.8,000 పెరుగుదల ● గోల్డ్ రూ.3,300 అప్

న్యూఢిల్లీ: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ విధించిన టారిఫ్**లను** అక్కడి సుప్రీంకోర్టు కొట్టివేయడంతో అనిశ్చితి నెలకొన్న నేప**థ్యంలో** వెండి, పసిడి రేట్లకు మళ్లీ రెక్కలొచ్చాయి. న్యూఢిల్లీ బులియ**న్ మార్కెట్లో** దాదాపు మూడు శాతం మేర పెరిగాయి. ఆలిండియా **సరాఫా** అసోసియేషన్ ప్రకారం వెండి కేజీ ధర సుమారు రూ. 8,000 **పెరిగి రూ.** 2,72,000కు చేరింది. అటు 99.9 శాతం స్వచ్ఛత గల బం**గారం పది** గ్రాముల రేటు రూ. 3,300 మేర పెరిగి రూ. 1,62,800 వద్ద **ముగిసింది.**

సురక్షిత పెట్టుబడి సాధనాలకు మళ్లీ డిమాండ్ పెరగడంతో వెండి, పసిడి రేట్లు మూడు వారాల గరిష్ట స్థాయిల వద్ద ట్రేడయినట్లు మార్కెట్ వర్గాలు తెలిపాయి. అమెరికాలో విధానాలు ఒక్కసారిగా మారిపోవడంతో అంతర్జాతీయంగా **అనిశ్చితి తీవ్రత పెరిగిపోయిందని,** వివిధ దేశాల ప్రభుత్వాలు ఆచితూచి స్పందిస్తున్నాయని **హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్** అనలిస్ట్ సౌమిల్ గాంధీ తెలిపారు. ట్రంప్ టారిఫ్‌లు చట్టవిరు**ద్ధమని సుప్రీంకోర్టు ప్రకటించినప్పటికీ,** వాణిజ్య ఉద్రిక్తతల వల్ల అమెరికా డాలరుపై ఒత్తిడి పెరిగి, బులి**యన్‌కి మద్దతు కొనసాగవచ్చని జియోజిత్** ఇన్వెస్ట్‌మెంట్స్ హెడ్ (కమోడిటీ రీసెర్చ్)వి. హరీష్ చెప్పారు. **దేశీయంగా ఫ్యూచర్స్ మార్కెట్ ఎంసీఎక్స్‌లో** పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు ధర ఒక దశలో దాదాపు రూ. 3,974 **ఎగిసి రూ. 1,60,080 వద్ద, వెండి మార్చి కాంట్రాక్టు రూ.** 13,063 పెరిగి రూ. 2,66,007 వద్ద ట్రేడయ్యాయి. అంతర్జా**తీయంగా ఫ్యూచర్స్ మార్కెట్లో పసిడి ఏప్రిల్ కాంట్రాక్టు రేటు** ఔన్సుకి (31.1 గ్రాములు) దాదాపు 140 డాలర్లకు పైగా పెరిగి **5,224.86 డాలర్ల గరిష్టాన్ని తాకింది. అటు వెండి మార్చి కాంట్రాక్టు** 4.7 డాలర్లకు పైగా పెరిగి 87.83 డాలర్ల స్థాయిలో ట్రేడైంది.

ఒలెక్ట్రాకు 1,085 బస్సుల భారీ ఆర్డరు

టీజీఎస్ఆర్‌టీసీ నుంచి లెటర్ ఆఫ్ ఇంటెంట్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: పీఎం ఈ–డ్రైవ్ కింద తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా కార్పొరేషన్ (టీజీఎస్ఆర్‌టీసీ) నుంచి 1,085 ఎలక్ట్రిక్ బస్సులకు ఆర్డరు వచ్చినట్లు ఒలెక్ట్రా గ్రీన్‌టెక్ వెల్లడించింది. దీనికి సంబంధించి తమ అనుబంధ సంస్థ ఈవీ ట్రాన్స్ ద్వారా లెటర్ ఆఫ్ ఇంటెంట్ లభించినట్లు వివరించింది. ఎలక్ట్రిక్ బస్సులను హైదరాబాద్‌లో ప్రజా రవాణా వ్యవస్థ కోసం వినియోగించనున్నట్లు సంస్థ ఎండీ మహేష్‌బాబు తెలిపారు. ఇక్కడి రహదారులకు అనుగుణంగా ఏసీ, నాన్ ఏసీ వేరియంట్లలో 12 మీటర్ల లో–ఫ్లోర్ కాన్ఫిగరేషన్స్‌తో ఈ బస్సులను అందించనున్నట్లు వివరించారు. ఒకసారి చార్జ్ చేస్తే 250 కి.మీ. మైలేజీనిచ్చే విధంగా

ఇవి ఉంటాయని, సుమారు 45 నిమిషాల్లో చార్జింగ్ చేసేందుకు వీలుంటుందని మహేష్‌బాబు తెలిపారు. ఇప్పటికే కంపెనీకి చెందిన 3,600 ఎలక్ట్రిక్ బస్సులు దేశవ్యాప్తంగా రహదారులపై తిరుగుతుండగా, 10,000 పైగా వాహనాలకు ఆర్డర్లు ఉన్నాయి.

మెడికవర్ ఎయిర్ అంబులెన్స్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: దేశీయంగా, అంతర్జాతీయంగా పేషంట్ల బదిలీ కోసం ఎయిర్ అంబులెన్స్ సర్వీసులను అందుబాటులోకి తెచ్చేలా ఎవర్‌గ్రీన్ హెల్త్‌కేర్‌తో మెడికవర్ హాస్పిటల్స్ ఒప్పందం కుదుర్చుకుంది. ఫైనాన్షియల్ డిస్ట్రిక్ట్‌లో కొత్త ఆసుపత్రిని ఇంకా అధికారికంగా ప్రారంభించేలోపే ఎయిర్ అంబులెన్స్ ఏర్పాట్లు చేసుకోవడం వల్ల, తొలి రోజు నుంచే ఎమర్జెన్సీ సమయాల్లో మరింత మెరుగ్గా స్పందించేందుకు వీలవుతుందని సంస్థ తెలిపింది. ప్రతి క్షణం విలువైనదిగా ఉండే క్రిటికల్ కేసుల్లో ఇవి ఎంతగానో ఉపయోగకరంగా ఉంటాయని హెడ్ ఆఫ్ ఎమర్జెన్సీ మెడిసిన్ నయన్ శ్రీరాముల తెలిపారు. ప్రమాదాలు, గుండెపోటులాంటి క్రిటికల్ సందర్భాల్లో పేషంట్లను ఆసుపత్రికి తరలించే ప్రక్రియ నిపుణుల పర్యవేక్షణలో జరగడమనేది ప్రాణాలను కాపాడటంలో కీలకంగా ఉంటుందని పేర్కొన్నారు.



మార్కెట్‌కు 'యూఎస్ సుప్రీం' జోష్

- ట్రంప్ టారిఫ్‌లు చెల్లవంటూ తీర్పు
- ప్రభుత్వ బ్యాంకులు, ఆటో షేర్లకు డిమాండ్
- సెన్సెక్స్ లాభం 480 పాయింట్లు
- 25,700 ఎగువకు నిఫ్టీ

ముంబై: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ప్రపంచ దేశాలపై విధించిన సుంకాలు (టారిఫ్‌లు) చెల్లవంటూ యూఎస్ సుప్రీం కోర్టు ఇచ్చిన తీర్పు ఈక్విటీ మార్కెట్లకు ఉత్సాహాన్నిచ్చింది. ఫలితంగా సెన్సెక్స్ 480 పాయింట్లు పెరిగి 83,295 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 142 పాయింట్లు బలపడి 25,713 వద్ద నిలిచింది. సూచీలకిది రెండోరోజూ లాభాల ముగింపు. ఉదయమే సానుకూల సంకేతాలు అందుకున్న సూచీలు లాభాలతో ముందుకు కదిలాయి. స్థిరమైన డిమాండ్, ఆర్థిక పునరుద్ధరణపై ఆశావహ అంచనాలతో ప్రభుత్వ బ్యాంకులు, ఎఫ్ఎంసీజీ, కన్జూమర్ డిస్క్రెషనరీ షేర్లకు కొనుగోళ్ల మద్దతు లభించింది. ఒక దశలో సెన్సెక్స్ 671 పాయింట్లు పెరిగి 83,486 వద్ద, నిఫ్టీ 200 పాయింట్లు ఎగసి 25,771 వద్ద ఇంట్రాడే గరిష్టాన్ని నమోదు చేశాయి.

➤ బీఎస్ఈలో రంగాల వారీ ఇండెక్సుల్లో ప్రభుత్వ రంగ బ్యాంక్స్ 1.4%, సర్వీసెస్ 0.97%, హెల్త్‌కేర్ 0.89%, విద్యుత్ 0.76%, ఆటో 0.71%, ఫైనాన్సియల్ సర్వీసెస్ 0.65%, ఎఫ్ఎంసీజీ 0.54%, యుటిలిటి 0.52 శాతం పెరిగాయి. స్మాల్ క్యాప్ ఇండెక్స్ 0.41% లాభపడగా, మిడ్ క్యాప్ సూచీ 1.56% నష్టపోయింది.

'సాక్షి ప్లస్' ఈ-పేపర్‌లో ..

4 కంపెనీల లిస్టింగ్‌కు ఓకే	ఏఐతో ముప్పేమీ లేదు: బ్రాడ్ స్మిత్

ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు డీలా

హరియాణా ప్రభుత్వానికి చెందిన ఖాతాల్లో రూ.590 కోట్ల మోసం జరిగిందంటూ వార్తలు వెలుగులోకి రావడంతో ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంక్ షేరు ఇంట్రాడేలో 20% క్షీణించి రూ.66.85 వద్ద లోయర్ సర్క్యూట్ తాకింది. చివరికి 16% నష్టంతో రూ.70 వద్ద స్థిరపడింది. ఐడీఎఫ్‌సీ ఫస్ట్ బ్యాంకుతో పాటు ఏయూ స్మాల్ ఫైనాన్స్ బ్యాంకును ప్రభుత్వ కార్యకలాపాల నిర్వహణ నుంచి హరియాణా ప్రభుత్వం తొలగించింది. దీంతో ఏయూ బ్యాంక్ షేరు 5.30% పతనమై రూ.974 వద్ద స్థిరపడింది.

భవిత

స్పర్ధయా వర్ధతే విద్య

విద్య, ఉద్యోగ సమాచారం

ఆర్ఆర్‌సీ-వెస్ట్రన్ రైల్వేలో 5,349 అప్రెంటిస్‌లు

ముంబై ప్రధాన కేంద్రంగా ఉన్న రైల్వే రిక్రూట్‌మెంట్ సెల్(ఆర్ఆర్‌సీ)–వెస్ట్రన్ రైల్వే 2025–26 సంవత్సరానికి సంబంధించి డివిజన్/వర్క్‌షాప్‌లలో అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 5,349.
» **ఖాళీల వివరాలు:** ఫిట్టర్–1614, ఎలక్ట్రీషియన్–1217, వెల్డర్–532, పీఏఎస్ఏఏ–280, ఎలక్ట్రానిక్ మెకానిక్–236, మెకానిక్(డీజిల్)–207, పెయింటర్–190, కార్పెంటర్–184, రిఫ్రిజిరేటర్(ఏసీ–మెకానిక్)–184, పైప్ ఫిట్టర్–176, ప్లంబర్–136, వైర్‌మ్యాన్–126, డ్రాఫ్ట్స్‌మ్యాన్(సివిల్)–87, టర్నర్–75, స్టెనోగ్రాఫర్–40, మెషినిస్ట్(గ్రైండర్)–25, ఫోర్జర్–హీట్ ట్రీటర్–16, మెషినిస్ట్–14, మెకానిక్ మోటార్ వెహికల్–10.
» **అర్హత:** పదో తరగతితో పాటు సంబంధిత ట్రేడులో ఐటీఐ ఉత్తీర్ణులై ఉండాలి.
» **వయసు:** 23.03.2026 నాటికి 15 నుంచి 24 ఏళ్ల మధ్య ఉండాలి.
» **ఎంపిక విధానం:** పదో తరగతి, ఐటీఐ మార్కుల మెరిట్, సర్టిఫికేట్‌ల పరిశీలన ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి.
» **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:** 21.02.2026.
» **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:** 23.03.2026
» **వెబ్‌సైట్:** https://www.rrcwr.com

ఐఆర్ఈఎల్(ఇండియా)లిమిటెడ్‌లో 89 అప్రెంటిస్‌లు

చవారా(కేరళ)లోని ఇండియన్ రేర్ ఎర్త్ లిమిటెడ్ గ్రాడ్యుయేట్, టెక్నీషియన్, ట్రేడ్ అప్రెంటిస్‌ల ఖాళీల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

» **మొత్తం ఖాళీల సంఖ్య:** 89.
» **ఖాళీల వివరాలు:** ట్రేడ్ అప్రెంటిస్‌లు–51, గ్రాడ్యుయేట్ అప్రెంటిస్‌లు–15, టెక్నీషియన్ అప్రెంటిస్‌లు–09, జనరల్ స్ట్రీమ్–14.
» **విభాగాలు:** ఎలక్ట్రికల్, సివిల్, మెకానికల్, ఎలక్ట్రానిక్/ఇన్‌స్ట్రుమెంట్ మెకానిక్, ఫిట్టర్, కార్పెంటర్, ఎంఎల్‌టీ తదితరాలు.
» **అర్హత:** పోస్టును అనుసరించి సంబంధిత విభాగంలో బీకాం/బీఏ/బీబీఏ /బీఎస్సీ/ఎంఎస్సీ/బీటెక్/బీఈ, డిప్లొమా, ఐటీఐ ఉత్తీర్ణులవ్వాలి.
» **వయసు:** 18 నుంచి 25 ఏళ్ల వరకు ఉండాలి.
» **ఎంపిక విధానం:** విద్యార్హత మార్కుల ఆధారంగా ఎంపికచేస్తారు
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును ది డీజీఎం (హెచ్ఆర్ఎం), ఐఆర్ఈఎల్(ఇండియా) లిమిటెడ్, చవారా, కొల్లం జిల్లా, కేరళ–691583 చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 24.02.2026.
» **వెబ్‌సైట్:** https://irel.co.in

ఏపీపీఎస్సీ-ఆర్ఐఎంసీ, డెహ్రాడూన్‌లో ఎనిమిదో తరగతి ప్రవేశాలు

డెహ్రాడూన్ (ఉత్తరాఖండ్) లోని భారత ప్రభుత్వ రక్షణ మంత్రిత్వ శాఖకు చెందిన రాష్ట్రీయ ఇండియన్ మిలిటరీ కాలేజ్(ఆర్ఐఎంసీ) ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి సంబంధించి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్(ఏపీపీఎస్సీ)– జనవరి–2027 టర్మ్‌కు అర్హులైన బాలురు, బాలికల నుంచి దరఖాస్తులు కోరుతోంది.

» **అర్హత:** గుర్తింపు పొందిన పాఠశాల నుంచి 2027 జనవరి 1వ తేదీ నాటికి ఏడో తరగతి చదువుతున్న లేదా ఏడో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అర్హులు.
» **వయసు:** 01.01.2027 నాటికి పదకొండున్నర ఏళ్లకు తగ్గకుండా పదమూడేళ్లకు మించకుండా ఉండాలి.
» **ఎంపిక విధానం:** రాతపరీక్ష, వైవా వాయిస్, మెడికల్ ఎగ్జామినేషన్ ఆధారంగా ఎంపికచేస్తారు.
» **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును అసిస్టెంట్ సెక్రటరీ (ఎగ్జామ్స్), ఏపీ పబ్లిక్ సర్వీస్ కమిషన్, న్యూ హెడ్స్ ఆఫ్ ద డిపార్ట్‌మెంట్స్ బిల్డింగ్, రెండో అంతస్తు, ఆర్టీఏ కార్యాలయం దగ్గర, ఎంజీ రోడ్డు, విజయవాడ చిరునామకు పంపించాలి.
» **దరఖాస్తులకు చివరితేది:** 05.04.2026.
» **పరీక్ష తేది:** 07.06.2026.
» **పరీక్ష కేంద్రం:** విజయవాడ
» **వెబ్‌సైట్:** https://portalpsc.ap.gov.in

ఒక్క పరీక్ష.. రెండు కోర్సులు

» ఏపీ, టీజీల్లో ఐసెట్–2026 నోటిఫికేషన్ విడుదల
» ఐసెట్ ర్యాంకుతో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో ప్రవేశం
» భవిష్యత్తులో మేనేజ్‌మెంట్, ఐటీ రంగాల్లో కొలువులు

ఐసెట్-2026

ఇంటిగ్రేటెడ్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(ఐసెట్).. తెలుగు రాష్ట్రాల విద్యార్థులకు సుపరిచితమైన ప్రవేశ పరీక్ష. ఈ ఎంట్రన్స్‌లో బెస్ట్ ర్యాంకు సొంతం చేసుకుంటే.. రాష్ట్ర స్థాయిలోని యూనివర్సిటీల క్యాంపస్ కళాశాలలు, అనుబంధ కళాశాలల్లో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో అడుగు పెట్టొచ్చు. ఇదే లక్ష్యంగా వేల మంది డిగ్రీ విద్యార్థులు ఐసెట్‌లో ర్యాంకు కోసం కృషి చేస్తుంటారు. మంచి ర్యాంకుతో టాప్ కళాశాలల్లో చేరొచ్చని కోరుకుంటారు. తాజాగా 2026-27 ప్రవేశాలకు సంబంధించి రెండు తెలుగు రాష్ట్రాలు ఏపీ, తెలంగాణలలో ఐసెట్-2026 దరఖాస్తు ప్రక్రియ ప్రారంభమైంది. ఈ నేపథ్యంలో.. ఏపీ ఐసెట్, టీజీ ఐసెట్ వివరాలు, పరీక్ష విధానం, సిలబస్ విశ్లేషణ, ప్రిపరేషన్ తదితర సమాచారం..

భవిష్యత్తులో మేనేజ్‌మెంట్ ప్రొఫెషనల్స్, అదే విధంగా సాఫ్ట్‌వేర్ రంగంలో ప్రోగ్రామర్స్‌గా కొలువులు సొంతం చేసుకోవాలనుకునే వారికి ఎంబీఏ, ఎంసీఏ కోర్సులు చక్కటి మార్గం. ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో చేరేందుకు నిర్వహించే ఉమ్మడి ప్రవేశ పరీక్ష.. ఐసెట్. ఈ ఎంట్రన్స్‌లో స్కోర్ ఆధారంగా అటు ఎంబీఏ, ఇటు ఎంసీఏ రెండు కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చు. దీంతో ఈ ఎంట్రెన్స్‌లో మంచి స్కోర్ సాధించేందుకు వేల మంది కృషి చేస్తున్నారు.

అర్హతలు

- **ఎంబీఏ:** కనీసం 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణత ఉండాలి.
- **ఎంసీఏ:** కనీసం 50 శాతం మార్కులతో మూడు లేదా నాలుగేళ్ల వ్యవధిలోని బ్యాచిలర్ డిగ్రీ ఉత్తీర్ణులవ్వాలి. అయితే ఎంసీఏ అభ్యర్థులు ఇంటర్మీడియెట్‌లో మ్యాథమెటిక్స్ గ్రూప్ సబ్జెక్ట్‌గా పాసవ్వాలి.
- ఈ ఏడాది ఆయా కోర్సుల చివరి సంవత్సరం పరీక్షలకు హాజరవుతున్న వారు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏపీ ఐసెట్ 200 మార్కులు

- ఏపీ ఐసెట్ పరీక్షను మూడు విభాగాల్లో 200 మార్కులకు నిర్వహిస్తారు. ఇందులో సెక్షన్–ఎలో 75 ప్రశ్నలు, సెక్షన్–బిలో 70 ప్రశ్నలు, సెక్షన్–సిలో 55 ప్రశ్నలుంటాయి. ఒక్కో ప్రశ్నకు ఒక మార్కు చొప్పున మొత్తం 200 మార్కులకు పరీక్ష ఉంటుంది. సెక్షన్–ఎ అనలిటికల్ ఎబిలిటీలో.. డేటా సఫిషియన్సీ 20 ప్రశ్నలు, ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్–బి కమ్యూనికేషన్ ఎబిలిటీలో.. వొకాబ్యులరీ 15 ప్రశ్నలు, ఫంక్షనల్ గ్రామర్ 20 ప్రశ్నలు, బిజినెస్ అండ్ కంప్యూటర్ టెర్మినాలజీ 25 ప్రశ్నలు, రీడింగ్ కాంప్రహెన్షన్ 20 ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్–సి మ్యాథమెటికల్ ఎబిలిటీలో.. అర్థమెటిక్ ఎబిలిటీ 35 ప్రశ్నలు, అల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు, స్టాటిస్టికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు అడుగుతారు.

మూడు విభాగాల్లో టీజీ ఐసెట్

- టీజీ ఐసెట్ సైతం మూడు విభాగాల్లో 200 ప్రశ్నలు–200 మార్కులకు నిర్వహిస్తారు.
- ఇందులో సెక్షన్ ఏ అనలిటికల్ ఎబిలిటీలో 75 ప్రశ్నలు, సెక్షన్ బీ మ్యాథమెటికల్ ఎబిలిటీలో 75 ప్రశ్నలు, సెక్షన్ సీ కమ్యూనికేషన్ ఎబిలిటీలో 50 ప్రశ్నలు ఉంటాయి.
- సెక్షన్–ఎ అనలిటికల్ ఎబిలిటీలో.. డేటా సఫిషియన్సీ 20 ప్రశ్నలు, ప్రాబ్లమ్ సాల్వింగ్ 55 ప్రశ్నలు ఉంటాయి. సెక్షన్–బి మ్యాథమెటికల్ ఎబిలిటీలో.. అర్థమెటిక్ ఎబిలిటీ 35 ప్రశ్నలు, అల్జీబ్రికల్ అండ్ జామెట్రికల్ ఎబిలిటీ 30 ప్రశ్నలు, స్టాటిస్టికల్ ఎబిలిటీ 10 ప్రశ్నలు చొప్పున అడుగుతారు. సెక్షన్–సి కమ్యూనికేషన్ ఎబిలిటీలో.. 50 ప్రశ్నలు ఉంటాయి. ప్రతి ప్రశ్నకు ఒక మార్కు చొప్పున కేటాయిస్తారు.

ఏపీ ఐసెట్ 2026 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2026, మార్చి 2
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2026, మార్చి 23
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** 2026, ఏప్రిల్ 15 నుంచి
- **ఐసెట్ పరీక్ష తేదీలు:** 2026,మే 2
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://cets.apsche.ap.gov.in/ICET/ICET/ICET_HomePage.aspx

టీజీ ఐసెట్ 2026 ముఖ్య సమాచారం

- **దరఖాస్తు విధానం:** ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలి.
- **ఆలస్య రుసుము లేకుండా ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ:** 2026, మార్చి 16
- **ఆన్‌లైన్ దరఖాస్తు సవరణ:** 2026, ఏప్రిల్ 18 – 24
- **హాల్ టికెట్ డౌన్‌లోడ్:** 2026, మే 4
- **టీజీ ఐసెట్ తేదీలు:** 2026, మే 13, 14
- **పూర్తి వివరాలకు వెబ్‌సైట్:** https://icet.tsche.ac.in

అన్వయ నైపుణ్యాలతోనే విజయం

ఐసెట్‌లో విజయం సాధించాలంటే.. అభ్యర్థులు విశ్లేషణాత్మక దృక్పథం, అన్వయ నైపుణ్యాలను అలవర్చుకోవాలి. విభాగాల వారీగా వ్యూహాత్మకంగా ప్రిపరేషన్ సాగించాలి. పరీక్ష తీరు, సిలబస్ స్థాయిపై అవగాహన పెంచుకొని విభాగాల వారీగా పట్టు సాధించాలి.

డేటా సఫిషియన్సీ, ప్రాబ్లమ్ సాల్వింగ్

ఈ విభాగంలో రాణించేందుకు విశ్లేషణ నైపుణ్యాలు మెరుగుపరచుకోవాలి. ఈ విభాగం నుంచి అడిగే ప్రశ్నలు ఒక డేటాను ఇచ్చి దాని ఆధారంగా సమస్య సాధించేవిగా, స్టేట్‌మెంట్ ఆధారితంగా ఉంటాయి. కాబట్టి బేసిక్ అర్థమెటిక్ అంశాల్లో పట్టు సాధించడం ఉపయుక్తంగా ఉంటుంది. అదే విధంగా స్టేట్‌మెంట్ ఆధారిత ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. గణితంపై ప్రాథమిక అవగాహన అవసరం. ప్రాబ్లమ్ సాల్వింగ్ విభాగంలో రీజనింగ్ ఆధారిత ప్రశ్నలు అడుగుతారు. అభ్యర్థులు కోడింగ్, డీ–కోడింగ్, బ్లడ్ రిలేషన్, సిరీస్, సిలాజిజమ్, సీటింగ్ అరేంజ్‌మెంట్ తదితర అంశాల్లో పట్టు సాధించాలి.

కమ్యూనికేషన్ ఎబిలిటీ

- మిగతా విభాగాలతో పోల్చితే కొంత సులభమైన విభాగంగా కమ్యూనికేషన్ ఎబిలిటీని పేర్కొనొచ్చు. ఇందులో వొకాబ్యులరీ కోసం బేసిక్ ఇంగ్లిష్ గ్రామర్ నైపుణ్యాలు సొంతం చేసుకోవాలి. అదే విధంగా వొకాబ్యులరీ పెంచుకునేందుకు ప్రతి రోజు కనీసం 20 కొత్త పదాలు నేర్చుకోవడం, వాటిని వినియోగించే తీరుపై ప్రాక్టీస్ చేయడం ఉపయుక్తంగా ఉంటుంది. ఫంక్షనల్ గ్రామర్‌లో మంచి మార్కుల కోసం బేసిక్ గ్రామర్ అంశాలుగా పేర్కొనే సినానిమ్స్, యాంటానిమ్స్, కొశ్చన్ ట్యాగ్స్, డైరెక్ట్–ఇన్‌డైరెక్ట్ స్పీచ్ అంశాలను ప్రాక్టీస్ చేయాలి. ఇందుకోసం ఆరు నుంచి పదో తరగతి వరకు ఇంగ్లిష్ గ్రామర్ బుక్స్ చదవడం ఉపయుక్తంగా ఉంటుంది.
- రీడింగ్ కాంప్రహెన్షన్ విభాగంలో ప్యాసేజ్‌ల ఆధారంగా అడిగే 20 ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలంటే.. ముందుగా అభ్యర్థులు సదరు ప్యాసేజ్‌లోని కీలక పదాలను, ముఖ్య సారాంశాన్ని గుర్తించే నేర్పు పెంచుకోవాలి. ఇందుకోసం దినపత్రికల్లో వచ్చే వ్యాసాలు, ఇంగ్లిష్ స్టోరీ బుక్స్ చదవాలి.

బిజినెస్ అండ్ కంప్యూటర్ టెక్నాలజీ

ఇందులో సామాజిక వ్యాపార–వాణిజ్య అంశాలు, అదే విధంగా తాజా పరిణామాలు, కంప్యూటర్ బేసిక్స్‌పై అభ్యర్థులకు ఉన్న అవగాహనను పరీక్షించే విధంగా ప్రశ్నలు ఉంటాయి. వీటిలో రాణించాలంటే.. బిజినెస్ టెర్మినాలజీ, కొత్త వ్యాపార విధానాలు, ఆయా సంస్థలు–వాటి క్యాప్షన్లు వంటివి తెలుసుకోవాలి. ఇక కంప్యూటర్ టెర్మినాలజీకి సంబంధించి బేసిక్ ఆఫీస్ అడ్మినిస్ట్రేషన్ టూల్స్, అదే విధంగా కంప్యూటర్ హార్డ్‌వేర్‌కు సంబంధించిన ముఖ్య భాగాలు, వాటి పనితీరుకు సంబంధించి ప్రాథమిక నైపుణ్యం కలిసొస్తుంది.

మ్యాథమెటికల్ ఎబిలిటీ

మ్యాథమెటికల్ ఎబిలిటీలో ఉండే అర్థమెటిక్, జామెట్రికల్, స్టాటిస్టికల్ ఉప విభాగాలకు సంబంధించిన అంశాల్లో నైపుణ్యం పొందాలంటే.. ముందుగా మ్యాథమెటిక్స్‌లోని ప్రాథమిక సూత్రాలపై అవగాహన పొందాలి. ఇందుకోసం హైస్కూల్ స్థాయి మ్యాథమెటిక్స్ పుస్తకాలను అధ్యయనం చేయాలి. అయితే ప్రశ్నల శైలి కొంత క్లిష్టంగా ఉండే స్టాటిస్టికల్ ఎబిలిటీ కోసం ఇంటర్మీడియెట్ స్థాయి పుస్తకాల ప్రిపరేషన్ అవసరం. ముఖ్యంగా ప్రాబబిలిటీ, ఇనీక్వాలిటీస్ అంశాల కోసం ఈ స్థాయి ప్రిపరేషన్ తప్పనిసరి. అర్థమెటిక్ విభాగంలోని ప్రశ్నలకు సులువుగా సమాధానాలు గుర్తించాలంటే.. శాతాలు, లాభ నష్టాలు, నిష్పత్తులు, మెన్సురేషన్, పని–కాలం, పని–సమయం వంటి అంశాలు ముఖ్యమైనవి. అల్జీబ్రా అండ్ జామెట్రికల్ ఎబిలిటీ కోసం ట్రిగ్నోమెట్రీ, సెట్స్ అండ్ రిలేషన్స్, లీనియర్ ఈక్వేషన్స్, ప్రోగ్రెషన్స్ వంటి అంశాల్లో నైపుణ్యం కీలకంగా నిలుస్తాయి.

ప్రాక్టీస్‌కు ప్రాధాన్యం

ఐసెట్ అభ్యర్థులు ప్రిపరేషన్‌లో భాగంగా ప్రాక్టీస్‌కు ప్రాధాన్యమివ్వాలి. ఐసెట్‌లో నిర్దేశించిన విభాగాలన్నీ ప్రాక్టికల్, అప్లికేషన్ ఓరియెంటేషన్‌గా ఉంటున్నాయని నిపుణుల అంచనా. కాబట్టి ఆయా అంశాల రీడింగ్‌కే అధిక సమయం కేటాయిస్తే ఉత్తీర్ణత సాధించేందుకు అవకాశం ఉంటుంది. కానీ మెరుగైన ర్యాంకు కోసం నిత్యం ప్రాక్టీస్ చేయాలని సూచిస్తున్నారు.

కెరీర్ కౌన్సెలింగ్
మీ సందేహాలు, సలహాలు పంపించాల్సిన ఈ- మెయిల్ sakshieducation@gmail.com

నేటి భవిత ఈ పేపర్‌లో..
» సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: పాలిటీ » టెట్/డీఎస్సీ ప్రత్యేకం: భౌతిక శాస్త్రం
» గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం: తెలంగాణ చరిత్ర » బ్యాంక్ ఎగ్జామ్స్ ప్రత్యేకం: కంప్యూటర్ అవేర్‌నెస్

క్లుప్తంగా...

ప్రశాంతంగా ఇంటర్ పరీక్షలు

తొలిరోజు 20,123 మంది గైర్హాజరు

సాక్షి, అమరావతి: ఇంటర్మీడియెట్ పరీక్షలు (ఐపీఈ–2026) తొలిరోజు ప్రశాంతంగా ముగిశాయి. మొదటి సంవత్సరంలో 5,45,028 మందికి హాల్‌టికెట్లు జారీ కాగా, సోమవారం జరిగిన రెండోభాషా (పేపర్–1) పరీక్షకు 5,24,771 మంది హాజరవగా, 20,123 మంది గైర్హాజరయ్యారు. ఇంటర్ విద్యా మండలి కార్యదర్శి రంజిత్ బాషా మంగళగిరిలోని విజయజ్యోతి, నారాయణ జూనియర్ కాలేజీల్లో పరీక్ష సరళిని పరిశీలించారు. ప్రశ్నపత్రాలు, జవాబు పత్రాలు ఉంచే స్టాక్ పాయింట్లను తనిఖీ చేసినట్టు బోర్డు ఓ ప్రకటనలో పేర్కొంది.

మా సమస్యలపై న్యాయ పోరాటం చేస్తాం

ఏపీపీఎస్ హెచ్ఎం అసోసియేషన్ వెల్లడి

సాక్షి, అమరావతి: తమ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక సమావేశాన్ని రాష్ట్ర విద్యా శాఖ ఏర్పాటు చేయాలని ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయుల సంఘం (ఏపీపీఎస్ హెచ్ఎం అసోసియేషన్) రాష్ట్ర అధ్యక్షుడు సీవీ ప్రసాద్ డిమాండ్ చేశారు. ఉపాధ్యాయుల సర్దుబాటు కోసం హైస్కూళ్లల్లో పనిచేసే తమను డీ గ్రేడ్ చేసి ప్రాథమిక పాఠశాలల్లో నియమించారని మండిపడ్డారు. కీలకమైన సమస్య పరిష్కరించకుండానే పదోన్నతులు, నియామకాలు, బదిలీలు చేపడితే పీఎస్ హెచ్ఎంలుగా పనిచేస్తున్న స్కూల్ అసిస్టెంట్లకు తీవ్ర అన్యాయం జరుగుతుందన్నారు. ఉపాధ్యాయుల బదిలీ కంటే ముందే విల్లింగ్ ఉన్న స్కూల్ అసిస్టెంట్లను తిరిగి ఉన్నత పాఠశాలలకు పంపించాలని కోరారు. ప్రభుత్వం చర్యలు తీసుకోకపోతే తమ సమస్యలపై న్యాయ పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. సమస్యల పరిష్కారం కోసం త్వరలోనే మలిదశ నిరసన కార్యాచరణ చేపడతామని చెప్పారు.

మద్యం మత్తులో తండ్రిని నరికి చంపిన తనయుడు

- మంట ఎక్కువ ఎందుకు పెట్టావు అని అడగడమే పాపం
- కృష్ణా జిల్లా కొండిపర్రులో దారుణ ఘటన

కొండిపర్రు(పామర్రు): పొయ్యిలో మంట ఎందుకు ఎక్కువగా పెట్టావని తిట్టిన తండ్రిని మద్యం మత్తులో ఉన్న కుమారుడు హత్య చేశాడు. ఈ ఉన్మాదం కృష్ణా జిల్లా పామర్రు మండలం కొండిపర్రు గ్రామంలో ఆదివారం రాత్రి జరిగింది. పామర్రు పోలీసుల కథనం మేరకు.. కొండిపర్రు గ్రామశివారు డీపీగూడెంలో చదువుల సురేష్(45)కుమారుడు చంద్రమహేష్ నివసిస్తున్నారు. సురేష్ భార్య గతంలో మృతి చెందింది. 22 ఏళ్ల చంద్రమహేష్ పనీపాట చేయకుండా తాగి తిరుగుతుంటాడు. ఆదివారం రాత్రి చంద్రమహేష్ పొయ్యి వెలిగించి నీరు కాస్తున్నాడు. ఆ సమయంలో తండ్రి సురేష్ వేడి నీరు తోడుతూ ఎందుకు ఇంత పెద్ద మంట పెట్టావు అని తిట్టాడు. మద్యం మత్తులో ఉన్న చంద్రమహేష్ ఆగ్రహంతో అక్కడే ఉన్న కత్తి తీసి తండ్రి మెడతో పాటు ఇంకా రెండు చోట్ల నరికాడు. సురేష్ రక్తపు మడుగులో కొట్టుకుంటుండగా స్థానికులు మచిలీపట్నం ప్రభుత్వ వైద్యశాలకు తరలించే ప్రయత్నం చేశారు. అయితే మార్గం మధ్యంలోనే సురేష్ మృతి చెందాడు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పామర్రు సీఐ సుభాకర్ తెలిపారు.

దమ్ముంది.. దన్ను కావాలి

ఏఐ మేధోనిధి.. ఇండియా!

- మెరికలున్నా సదుపాయాలేవీ
- నైపుణ్యం ఒక్కటే సరిపోదు
- సూపర్ కంప్యూటర్లు... భారీ పెట్టుబడులు అవసరం

ఇప్పటికైతే మనది 10వ స్థానం

ఏఐ సదస్సు చూపిన 'ఇంపాక్ట్'

ఢిల్లీలో ఐదు రోజుల ఐఏ ఇంపాక్ట్ సదస్సు ఇటీవలే ముగిసింది. ఇండియా ఈ సదస్సును మొదటిసారి నిర్వహించింది. ప్రపంచ దేశాల నాయకులు ఇందులో పాల్గొన్నారు. కొత్త ఆవిష్కరణలపై అంతా దృష్టి పెట్టారు. ఇండియాకైతే ఇది ఒక కీలకమైన సందర్భం. మన ఏఐ వ్యవస్థలో ఉన్న బలాలు, పూరించుకోవలసిన లోట్లను ఈ సదస్సు స్పష్టం చేసింది.

అంతర్జాతీయ స్థాయి ఏఐ సామర్థ్యం - మొదటి పది దేశాలు

ర్యాంకు	దేశం	ప్రతిభ	మౌలిక సదుపాయాలు	పని వాతావరణం	పరిశోధన	అభివృద్ధి
1	అమెరికా	1	1	2	1	1
2	చైనా	9	2	21	2	2
3	సింగపూర్	6	3	48	3	5
4	యూకె	4	17	4	4	16
5	ఫ్రాన్స్	10	14	19	6	4
6	ద. కొరియా	13	6	35	13	3
7	జర్మనీ	3	13	8	8	11
8	కెనడా	8	18	16	9	10
9	ఇజ్రాయెల్	7	26	65	7	6
10	ఇండియా	2	68	3	14	13

(ఆధారం : టార్టాయిస్ గ్లోబల్ ఇండెక్స్)

సూపర్ కంప్యూటింగ్ సామర్థ్యం (వివిధ ఆదాయ వర్గాల వారీగా... శాతాలలో.. టాప్ 500 సూపర్ కంప్యూటర్‌లలో)

	హెచ్.పి.సి. సిస్టమ్	హెచ్.పి.సి కెపాసిటీ
అమెరికా	35	48
చైనా	9	2
ఇతర హెచ్.ఐ.సి.లు	51	48
ఇతర యు.ఎం.ఐ.సి.లు	3	0
ఇతర ఎల్.ఎం.ఐ.సి.లు	0	0
ఇండియా	1	1

(ఆధారం : ప్రపంచ బ్యాంకు)

- హెచ్.పి.సి. సిస్టమ్ : హై పెర్ఫార్మింగ్ కంప్యూటింగ్ (యంత్ర సామర్థ్యం)
- హెచ్.పి.సి. కెపాసిటీ : హై పెర్ఫార్మింగ్ కెపాసిటీ (శక్తి సామర్థ్యం)
- హెచ్.ఐ.సి.: హై ఇన్‌కం కంట్రీస్; యు.ఎం.ఐ.సి.: అప్పర్ మిడిల్ ఇన్‌కం కంట్రీస్
- ఎల్.ఎం.ఐ. సి. : లోయర్–మిడిల్ ఇన్‌కం కంట్రీస్

ఏఐ శిక్షణలో వెంచర్ క్యాపిటల్ పెట్టుబడులు (2014-2024)

ప్రపంచ వాటా (శాతాలలో)

అమెరికా	56
చైనా	17
ఐరోపా సమాఖ్య దేశాలు	15
ఇతర దేశాలు	6
ఇండియా	3
యూకె	2

(ఆధారం : ప్రపంచ బ్యాంకు)

నిపుణుల సంఖ్యలో రెండో స్థానం

ఏఐ రంగంలో మెరికలు ఉన్న దేశంగా ఇండియా పేరు పొందింది. కానీ మౌలిక సదుపాయాల విషయంలో వెనుకబడి ఉంది. 2024 'టార్టాయిస్ గ్లోబల్ ఏఐ ఇండెక్స్' ప్రకారం, ఏఐ సామర్థ్యంలో ఇండియా ప్రపంచంలో 10వ స్థానంలో ఉంది. ఏఐ నిపుణుల సంఖ్యలో మాత్రం 2వ స్థానంలో నిలిచింది.

సౌకర్యాలలో 68వ స్థానం

ఏఐ ఆపరేషన్స్‌లో ఇండియా 3వ స్థానంతో మంచి ప్రతిభ కనబరిచింది. అయితే కంప్యూటింగ్ పవర్, ఇతర సౌకర్యాల విషయంలో 68వ స్థానంలో ఉంది. ఈ కారణంగా అమెరికా, చైనాతో పోటీ పడటం భారత్‌కు కష్టం కావచ్చన్న అభిప్రాయం ఏఐ పరిశ్రమంలో వ్యక్తం అవుతోంది.

ఉన్నది కొన్నే సూపర్ కంప్యూటర్‌లు

ప్రపంచవ్యాప్తంగా ఉన్న అత్యంత శక్తివంతమైన 500 సూపర్ కంప్యూటర్లలో ఇండియా వాటా కేవలం 1 శాతం మాత్రమే. అంటే, ఏఐకి కావలసిన కంప్యూటింగ్ సామర్థ్యం మన దగ్గర చాలా తక్కువగా ఉంది. అమెరికా ఈ విషయంలో చాలా ముందుంది. ప్రపంచంలోని మొత్తం సూపర్ కంప్యూటర్లలో 35 శాతం సిస్టమ్‌లు, దాదాపు 48 శాతం కంప్యూటింగ్ సామర్థ్యం అమెరికా దగ్గరే ఉంది.

ట్రైనింగ్ డేటాలో 3 శాతం వాటా

ఏఐ ట్రెనింగ్ డేటా రంగంలో ప్రపంచవ్యాప్తంగా వస్తున్న పెట్టుబడులలో భారతదేశం వాటా కేవలం 3 శాతం మాత్రమే. అంటే, మన దేశానికి చాలా తక్కువ పెట్టుబడులు అందుతున్నాయి. ఈ విషయంలో అమెరికా 56 శాతంతో అందరికంటే ముందుంది. ఆ తర్వాత చైనా 17 శాతంతో, ఐరోపా సమాఖ్య దేశాలు 15 శాతంతో తర్వాతి స్థానాల్లో ఉన్నాయి.

ప్రపంచాన్ని శాసించగలమా ?

మన దగ్గర అద్భుతమైన తెలివితేటలు కలిగిన నిపుణులు ఉన్నారు. కానీ, ఆ తెలివితేటలకు తగ్గట్టుగా శక్తివంతమైన కంప్యూటర్లు, భారీ పెట్టుబడులు తోడవాల్సి ఉంది. అమెరికా, చైనా వంటి దేశాలతో పోటీ పడాలంటే, కేవలం సాఫ్ట్‌వేర్ నైపుణ్యం మాత్రమే సరిపోదు; సొంతంగా డేటా సెంటర్లు, సూపర్ కంప్యూటర్లను పెంచుకోవాలి. అప్పుడే ఇండియా ఏఐ ప్రపంచాన్ని శాసించ గలుగుతుంది.

- సాక్షి స్పెషల్ డెస్క్

రెండు కొత్త జాతుల ఆర్మీ చీమల గుర్తింపు

తూర్పు కనుమల్లో రెండు జాతులకు చెందిన ఆర్మీ చీమలను కనుగొన్నారు. కీటక శాస్త్రవేత్తలు సహనశ్రీ, ప్రియదర్శనన్, ఒడిశాలోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైసర్) పరిశోధకులు బికాశ్ సాహు, నిఖితా కుమారన్, అనిరుద్ధ దత్తారాయ్ తమ పరిశోధనలో ఈ చీమలను గుర్తించారు. ఏపీలోని శ్రీ వేంకటేశ్వర వన్యప్రాణుల అభయారణ్యంలో అనిక్టస్ చిట్టోరెన్సిస్, శ్రీ లంకమల్లేశ్వర వన్యప్రాణి అభయారణ్యంలో అనిక్టస్ లంకమల్లెన్సిస్ రకానికి చెందిన చీమలను గుర్తించారు. ఈ ఆర్మీ చీమలు సంచార జాతులు. ఇవి నిర్వహించే సామూహిక మేత దాడులు ఇతర కీటకాలు, పక్షులు, బల్లులకు ఆహారాన్ని అందించేందుకు తోడ్పడతాయి. ఇవి పర్యావరణ వ్యవస్థను మెరుగు పరుస్తాయి. ఇవి ఉష్ణమండల పర్యావరణ వ్యవస్థల్లో కనిపించే అత్యంత సంచార మాంసాహారులు. వాటి శరీరాలతో తాత్కాలిక బయోవాక్స్‌ను ఏర్పాటు చేసుకుంటాయి. సామాజిక కీటకాలుగా అవి భారీ కాలనీలను ఏర్పాటు చేసుకుంటాయి. ఇవి దండెత్తి కీటకాలు, ఇతర చిన్న కీటకాలను తింటాయి. పెద్ద, పదునైన కోరలతో కుట్టగలిగిన సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. ఇప్పటివరకు పరిశోధన, అధ్యయనాల ఆధారంగా దేశంలో 38 రకాల ఆర్మీ చీమలను గుర్తించారు. ఇప్పుడు ఈ రెండు కొత్త జాతులను కనుగొనడంతో ఆర్మీ చీమల జాతుల సంఖ్య 40కి చేరుకుందని కీటక శాస్త్రవేత్తలు సహనశ్రీ, జీవ వైవిధ్య పరిశోధకులు మంజునాథ్ ఎస్ నాయక్ తెలిపారు.

- కడప సెవెన్‌రోడ్స్

అనిక్టస్ లంకమల్లెన్సిస్ జాతి

అనిక్టస్ చిట్టూరెన్సిస్ జాతి

ప్రభుత్వంలో ఎక్కడో ఏదో తేడా ఉంది

- సీఎంఓలో ఒకరిద్దరు అధికారులే అన్ని నిర్ణయాలు తీసుకుంటున్నారు
- మనది నియంతృత్వ దేశం కాదు
- ఎలా పడితే అలా, ఏది పడితే అది చేయడానికి వీల్లేదు
- వర్సిటీల్లో బోధనా సిబ్బంది రిటైర్మెంట్ వయసు పెంపుపై వివక్ష సరికాదు
- ఉన్నత విద్యాశాఖ– వ్యవసాయ శాఖ వర్సిటీల మధ్య వ్యత్యాసం తగదు
- ఇది రాజ్యాంగ విరుద్ధం
- రాష్ట్ర ప్రభుత్వంపై హైకోర్టు ధర్మాసనం ఆగ్రహం

సాక్షి, అమరావతి: ఉన్నత విద్యాశాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తూ యూజీసీ స్కేల్ పొందుతున్న బోధనా సిబ్బంది పదవీ విరమణ వయసును 62 నుంచి 65కి పెంచిన రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ శాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో పనిచేస్తున్న బోధనా సిబ్బంది పదవీ విరమణ వయసు 65కి పెంచకపోవడం రాజ్యాంగ విరుద్ధమని హైకోర్టు తేల్చి చెప్పింది. ప్రభుత్వ చర్యలు వివక్షాపూరితమని స్పష్టం చేసింది. ప్రభుత్వంలో ఎక్కడో ఏదో తేడా ఉందని ఈ సందర్భంగా వ్యాఖ్యానించిన హైకోర్టు, ముఖ్యమంత్రి కార్యాలయంలో (సీఎంఓ) కూర్చొని ఒకరిద్దరు అధికారులే అన్నీ నిర్ణయాలు తీసేసుకుంటున్నారని సూచించింది. మనది ప్రజాస్వామ్య దేశమే తప్ప, నియంతృత్వ దేశం కాదని, ఈ విషయాన్ని అధికారులందరూ గుర్తు పెట్టుకోవాలని స్పష్టం చేసింది. ఎలా పడితే అలా, ఏది పడితే అది చేయడానికి వీల్లేదంది. ఈ అంశంపై దాఖలైన అప్పీళ్లపై న్యాయమూర్తులు జస్టిస్ బట్టు దేవానంద్, జస్టిస్ సుబేంధు శమం ధర్మాసనం సోమవారం కీలక మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది.

బోధనా సిబ్బందిని కొనసాగింపునకు ఆదేశాలు..

వ్యవసాయ శాఖ పరిధిలోని ఉద్యానవన, వ్యవసాయ, పశుసంవర్ధక, మత్స్య విశ్వవిద్యాలయాల్లో యూజీసీ స్కేల్ పొందుతున్న బోధనా సిబ్బందిని తదుపరి ఉత్తర్వులిచ్చేంత వరకు కొనసాగించాలని ప్రభుత్వాన్ని హైకోర్టు తాజాగా ఆదేశించింది. పదవీ విరమణ వయసును 65కి పెంచాలంటూ ఈ నాలుగు విశ్వవిద్యాలయాలు చేసిన ప్రతిపాదనలను వ్యవసాయ శాఖ ఎక్స్ అఫీషియో ప్రత్యేక ప్రధాన కార్యదర్శి బుడిత రాజశేఖర్ ఏకపక్షంగా తిరస్కరించడాన్ని హైకోర్టు తప్పుపట్టింది. ఈ మేరకు రాజశేఖర్ ఇచ్చిన లేఖ అమలును నిలిపేసింది. వ్యవసాయ శాఖ పరిధిలోని విశ్వవిద్యాలయాల్లో ఇప్పటికే పలువురు పదవీ విరమణ చేశారని, అయితే ప్రభుత్వం ఆ ఖాళీలను భర్తీ చేసేందుకు ఎలాంటి చర్యలు తీసుకోవడం లేదని ఆక్షేపించింది. ఇలా అయితే విద్యార్థులకు నాణ్యమైన విద్య ఎలా అందుతుందని ప్రశ్నించింది. పదవీ విరమణ వయసు పెంపుపై కౌంటర్ దాఖలుకు ప్రభుత్వానికి మూడు వారాల గడువునిచ్చింది. కాగా ఈ అంశంపై ధర్మాసనం ఆదేశాల మేరకు బుడిద రాజశేఖర్ కోర్టు ముందు స్వయంగా హాజరయ్యారు.

పనితీరు ఆధారంగా ఉద్యోగులకు వెయిటేజి

- ఆస్పత్రుల్లో డాక్టర్ల కొరత ఉండకూడదు
- టెక్నాలజీతో అందించే సేవలపై అవగాహనకు ప్రత్యేక కార్యాచరణ
- వివిధ శాఖల పనితీరుపై సమీక్షలో సీఎం చంద్రబాబు

సాక్షి, అమరాతి: ఉద్యోగుల పని తీరు ఆధారంగా వెయిటేజీ ఇవ్వాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. సోమవారం ఆర్టీజీఎస్ నుంచి వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షించారు. ఉద్యోగుల పనితీరును మదింపు చేయాలని, పనితీరు సరిగా లేని వారిని మోటివేట్ చేయాలని సూచించారు. అన్ని స్థాయిల్లోని ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇవ్వాలని, పారిశుద్ధ్యం సరిగా లేకపోతే ఔట్ సోర్సింగ్ ఏజెన్సీలను బాధ్యులుగా చేయాలని చెప్పారు. ఆస్పత్రుల్లో పారిశుద్ధ్యం నిర్వహణ సరిగా లేకపోయినా, వైద్య పరికరాలు అందుబాటులో లేకపోయినా ఆ ఆస్పత్రుల అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్లను బాధ్యులని చేయాలన్నారు. ప్రతి ఆస్పత్రిలో డాక్టర్ల కొరత రాకుండా చూసుకోవాలని చెప్పారు. రెవెన్యూ శాఖలో అవినీతిని రూపుమాపాలని అన్నారు. సరిగా పని చేయని తహసీల్దార్లను పక్కన పెట్టే పరిస్థితి తెచ్చుకోవద్దన్నారు. ప్రభుత్వం టెక్నాలజీ ద్వారా అందించే సేవలపై ప్రజల్లో మరింత అవగాహన కల్పించాలని చెప్పారు. దీని కోసం మీ సేవ, డ్వాక్రా సంఘాలు, ప్రణాళిక విభాగం వంటి వాటితో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాలని సీఎం సూచించారు.

'కాయం' కష్టం

- రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన ఓ యువకుడు
- గ్రామానికి రోడ్డు లేక శవాన్ని కట్టెకు కట్టుకుని మోసుకుంటూ తీసుకెళ్లిన కుటుంబ సభ్యులు
- పార్వతీపురం మన్యం జిల్లాలో హృదయ విదారక ఘటన
- గిరిజన గ్రామాలకు కనీస సదుపాయాలు కల్పించలేని చంద్రబాబు ప్రభుత్వం

మృతదేహాన్ని కర్రకు కట్టుకుని రోదిస్తూ మోసుకెళ్తున్న కుటుంబసభ్యులు

గుమ్మలక్ష్మీపురం : ఉబికి వస్తున్న దుఃఖాన్ని దిగమింగి.. పంటి బిగువున కన్నీరు బిగబట్టి.. మృతదేహాన్ని కర్రకు కట్టి మోసుకు వెళ్లాల్సి వస్తే..! చదువుతుంటేనే మన కళ్లలో నీళ్లు వస్తున్నాయి కదా..! మరి గ్రామానికి రోడ్డు లేక శవాన్ని కట్టెకు కట్టుకుని మోసుకెళ్లిన ఆ కుటుంబ సభ్యుల రోదన వర్ణనాతీతం.. ఆ హృదయ విదారక దృశ్యాన్ని చూసిన ఆ గిరిజన గ్రామస్తులు విలపించిన తీరు వర్ణనాతీతం. స్వాతంత్ర్యం వచ్చి దశాబ్దాలు గడుస్తున్నా.. కనీస సదుపాయాలు కల్పించలేకపోతున్న ఈ కూటమి పాలకులను ఏమనాలి ? పార్వతీపురం మన్యం జిల్లా గుమ్మలక్ష్మీపురం మండలం వనకాబడి గ్రామానికి చెందిన పువ్వల బంగారాజు (21) విశాఖపట్నంలోని ఓ కంపెనీలో రోజు వారి కార్మికుడిగా పని చేస్తున్నాడు. అతని మామ కిల్లక సుబ్బారావు 15న మృతిచెందడంతో వారి కుటుంబ సభ్యులను కిల్లక క్రాంతికుమార్‌తో కలిసి ఈనెల 19న బైక్‌లో వెళ్లి పరామర్శించి తిరుగు పయనమయ్యాడు. ఈ క్రమంలో విజయనగరం జిల్లా దత్తిరాజేరు మండలం బూర్జవలస వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో బంగారాజు తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స నిమిత్తం తొలుత గజపతినగరం ఏరియా ఆస్పత్రికి, అనంతరం విజయనగరం ప్రభుత్వాస్పత్రికి, అక్కడి నుంచి ఈ నెల 20న విశాఖపట్నం కేజీహెచ్‌కు తీసుకెళ్లగా చికిత్స పొందుతూ ఈ నెల 21న మృతిచెందాడు. ఆదివారం సాయంత్రం మృతదేహాన్ని అంబులెన్స్‌లో వనకాబడికి రోడ్డు లేకపోవడంతో 3 కి.మీ.దూరాన ఉన్న దేరువాడ వద్ద దింపేసి వెళ్లారు. దీంతో బంగారాజు శవాన్ని కర్రకు కట్టి కుటుంబ సభ్యులు రాళ్లదారిలో ఇంటికి తీసుకొచ్చారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక పల్లెపండగ పేరుతో రోడ్లు నిర్మించేస్తున్నామని సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ హడావుడి చేశారని.. ఒకసారి గిరిజన గ్రామాల వైపు చూడాలంటూ గిరిజన సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణికి గిరిజనుల కష్టాలు పట్టడం లేదంటూ ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి, సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యుడు ఆర్‌వీఎస్ కుమార్, అగ్రిగోల్డ్ యూనియన్ అధ్యక్షుడు గెంబలి శ్రీనివాసరావు ఆరోపించారు.

తెలంగాణ సీఎం వ్యాఖ్యలపై మాట్లాడవేం చంద్రబాబూ?

నిలదీసిన వైఎస్సార్‌సీపీ నేతలు

మాట్లాడుతున్న ఎస్వీ మోహన్‌రెడ్డి, చిత్రంలో ఉషశ్రీ చరణ్, తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, ఈర లక్కప్ప తదితరులు

చిలమత్తూరు: రాయలసీమ లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును నిలుపుదల చేసినట్టు తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి చేసిన వ్యాఖ్యల్లో నిజముందా లేదా.. సీఎం చంద్రబాబు చెప్పాలని వైఎస్సార్‌సీపీ నేతలు డిమాండ్ చేశారు. రాయలసీమ ప్రజల ప్రయోజనాలను చంద్రబాబు ఏమాత్రం పట్టించుకోవడంలేదని ధ్వజమెత్తారు. శ్రీసత్యసాయి జిల్లా హిందూపురంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో పార్టీ కర్నూలు జిల్లా అధ్యక్షుడు ఎస్వీ మోహన్‌రెడ్డి, మాజీమంత్రి ఉషశ్రీచరణ్, మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి, మడకశిర వైఎస్సార్‌సీపీ సమన్వయకర్త ఈర లక్కప్ప మాట్లాడుతూ రాయలసీమతోపాటు ఆరు జిల్లాలకు మేలు చేకూర్చే బృహత్తర పథకమైన రాయలసీమ ఎత్తిపోతలపై చంద్రబాబు ప్రభుత్వం పూర్తి నిర్లక్ష్యం వహిస్తోందని మండిపడ్డారు. పలు ప్రాంతాలకు సాగు, తాగునీరు, హంద్రీ–నీవాకు నీరు రావాలన్నా ఈ ప్రాజెక్టును పూర్తిచేయాల్సిన అవసరం ఉందన్నారు. రేవంత్‌రెడ్డితో కుమ్మక్కై చంద్రబాబు సీమ ప్రజలకు ద్రోహం చేస్తున్నారని మండిపడ్డారు. రాయలసీమకు నీటి విషయంలో గరిష్టంగా మేలు చేయడానికి వైఎస్ జగన్ చేపట్టిన రాయలసీమ ఎత్తిపోతల పథకాన్ని చంద్రబాబు నిర్వీర్యం చేస్తున్నారని చెప్పారు. ఇలా అయితే రాయలసీమ రైతులు ఏం కావాలని ప్రశ్నించారు. హంద్రీ–నీవా కాలువ సామర్థ్యాన్ని 3,850 క్యూసెక్కుల నుంచి ఆరువేల క్యూసెక్కులకు పెంచే పనుల్ని వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మొదలుపెట్టిందని చెప్పారు. చంద్రబాబు ఆ పనుల్ని కూడా ఆపేస్తున్నారని తెలిపారు. రాయలసీమ హక్కుల సాధనకు కార్యాచరణ రూపొందించడానికి మార్చి ఒకటోతేదీ కడపలో సమావేశం నిర్వహించనున్నట్టు తెలిపారు. టీడీపీ రాయలసీమ ప్రజలను కేవలం ఓటు బ్యాంకుగానే చూస్తోందని విమర్శించారు. ఎన్నికల సమయంలో సీమ నీటి హక్కులపై మాట్లాడిన ఎమ్మెల్యే బాలకృష్ణ ఇప్పుడు పట్టించుకోవడంలేదని, హిందూపురం ప్రజలు ఆలోచించాలన్నారు.

తెలంగాణ ప్రభుత్వ వాదన అశాస్త్రీయం

- కృష్ణా డెల్టాకు 195.7 టీఎంసీలు అవసరం
- తెలంగాణ ప్రతిపాదించిన 130.19 టీఎంసీలు సరిపోవు
- బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్ ఎదుట ఏపీ ప్రభుత్వ న్యాయవాది వాదనలు

సాక్షి, అమరావతి: కృష్ణా డెల్టాలో రైతులు దశాబ్దాలుగా అనుసరిస్తున్న సాగు పద్ధతులు కాకుండా స్వల్ప కాలిక పంట రకాలను సాగు చేయాలంటూ తెలంగాణ ప్రభుత్వం చేసిన ప్రతిపాదన అశాస్త్రీయమైనదని బ్రిజేష్‌కుమార్ ట్రిబ్యునల్‌కు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలిపింది. జస్టిస్ బ్రిజేష్‌కుమార్ అధ్యక్షతన జస్టిస్ తాళపత్ర, జస్టిస్ రామ్మోహన్‌రెడ్డి సభ్యులుగా ఏర్పాటైన ట్రిబ్యునల్ ఎదుట ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తరఫున సీనియర్ న్యాయవాది జైదీప్ గుప్తా సోమవారం నాడు కూడా తుది వాదనలు కొనసాగించారు. ప్రస్తుత సాగు పద్ధతులు అధిక దిగుబడులను ఇస్తున్నాయని.., శాస్త్రీయమైన, ఆచరణాత్మకమైన కారణాలు లేకుండా అకస్మాత్తుగా స్వల్పకాలిక పంట రకాలను ప్రవేశపెడితే ఉత్పత్తిని దెబ్బతీస్తుందని తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌కు నీటి కేటాయింపులను తగ్గించడానికే తెలంగాణ ఈ చేసిందన్నారు. కృష్ణా డెల్టాలో పంట కాలాన్ని 180 రోజులుగా కేడబ్ల్యూడీటీ–1 నిర్ధారించిందని గుర్తు చేశారు. డెల్టాను ఆధునికీకరించే సమయంలో పంట కాలాన్ని 140 రోజులుగా లెక్కగట్టారన్నారు. తెలంగాణ సర్కార్ సాక్షి ప్రతిపాదించినట్లుగా 122 రోజులు కాదని చెప్పారు. గతంలో జరిపిన క్రాస్ ఎగ్జామినేషన్‌లో తెలంగాణ, ఏపీ రాష్ట్రాల సాక్షులు చేసిన వాదనలను ప్రస్తావిస్తూ కృష్ణా డెల్టా నీటి అవసరాలను సమర్థించుకున్నారు. వాస్తవానికి కృష్ణా డెల్టాకు 195.7 టీఎంసీలు అవసరమని, తెలంగాణ ప్రతిపాదించిన 130.19 టీఎంసీలు డెల్టాకు ఏమాత్రం సరిపోవన్నారు. ప్రస్తుతం డెల్టాకు వినియోగిస్తున్న 152 టీఎంసీలను కొనసాగించాలని ట్రిబ్యునల్‌ను జైదీప్ గుప్తా కోరారు. మంగళవారం నాడు కూడా గుప్తా వాదనలు కొనసాగించనున్నారు. విచారణకు తెలంగాణ తరఫున సీనియర్ న్యాయవాది వైద్యనాథన్, రెండు రాష్ట్రాల అంతర్రాష్ట్ర జలవనరుల విభాగం అధికారులు హాజరయ్యారు.

Published and Printed by Dhananjaya Reddy Rakkasi on behalf of Jagati Publications Limited, Published at D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP) and Printed at Jagati Publications Limited, D. No. 5 - 625, Vadlamudi Road, Atmakur Village, Mangalagiri Mandal, Guntur Dist-522 503, (AP).,
EDITOR: Dhananjaya Reddy Rakkasi, (Responsible for selection of news under the PRB act) Phone No : 0863-2512581 Fax No: 0863-2512584, RNI Regn No. APTEL/2008/23801. Reproduction in whole or in part without written permission of the publisher is prohibited.

సర్వేంద్రియానాం నయనం ప్రధానం

నయనేంద్రియానాం... కార్నియా ప్రధానం!



డాక్టర్
కె. రవికుమార్ రెడ్డి
సీనియర్
కంటి వైద్య నిపుణులు



ఓ చిన్నారి పుట్టినప్పటి నుంచి అతడు / ఆమె నేర్చుకునే మొత్తం జీవన నైపుణ్యాల్లో దాదాపు 80 శాతానికి పైగా కంటిచూపు వల్లనే సాధ్యమవుతుంది. పైగా ఈ యుగంలోని చిత్రవిచిత్రాలన్నీ చూడాలంటే కన్నుంటేనే సాధ్యం. అందుకే 'కన్నుంటేనే కలికాలం' అన్న నానుడి స్థిరపడింది. జనసామాన్యంలోని ఈ మాటే ఈరోజుల్లో కంటికి ఉన్న ప్రాముఖ్యతనూ, ప్రాధాన్యాన్నీ నొక్కి చెబుతుంది. మరి ఇంతటి విలువైన కంటిచూపును ఏదైనా కారణాల వల్ల కోల్పోయినప్పుడు నేత్రదానం తర్వాత కంటి చూపు పొందడం సాధ్యమవుతుందనే అభిప్రాయం చాలామందిలో ఉంది. పైగా ఈ కంటిదానం సమయంలో మొత్తం కనుగుడ్డును స్వీకరిస్తారనే అపోహ కూడా చాలామందిలో ఉంటుంది. నిజానికి కార్నియా అనే పారదర్శకమైన పొర దెబ్బతినడం వల్ల వచ్చిన దృష్టిలోపాన్ని మాత్రమే నేత్రదానంతో సరిచేయడం సాధ్యమవుతుంది. పైగా ఇలా నేత్రదానం చేసిన కేసుల్లో కనుగుడ్డు మొత్తం కాకుండా కేవలం 'కార్నియా' అనే నల్లగుడ్డుపై ఉండే పొరనే స్వీకరిస్తారు. ఈ నేపథ్యంలో నేత్రదానమనేది ఎప్పుడెప్పుడు ఎంతమేరకు సాధ్యం? ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా కంటి చూపును పొందడం ఏయే సందర్భాల్లో సాధ్యమవుతుంది? ఏయే సందర్భాల్లో అది సాధ్యం కాదు... అలా సాధ్యం కాకపోవడానికి కారణాలేమిటి... వంటి అనేక అంశాలపై అవగాహన కోసం... ఈ కథనం.

కంటితో చూడటాన్ని సాధ్యం చేసే కంటి నల్లగుడ్డుపై ఉండే పారదర్శకమైన పొరను 'కార్నియా' అంటారు. నిజానికి నేత్రదానం చేసిన వారి నుంచి కంటిని తీసుకునే సమయంలో కనుగుడ్డునంతా స్వీకరించరు. కేవలం కార్నియా అని పిలిచే ఈ నల్లగుడ్డుపై ఉండే పారదర్శకమైన పొరను మాత్రమే తీసుకుంటారు.

కార్నియా అంటే..?

ఇది కంట్లో ఉండే ఒక పారదర్శకమైన పొర. కంటిలోని నల్లగుడ్డుపై ఉండటం వల్ల... ఇది పారదర్శకమైన పొర కావడంతో ఇది కూడా నల్లగా కనిపిస్తుంది. ఇది కంట్లోని ఐరిస్ అనే భాగాన్ని, ప్యూపిల్‌నూ, యాంటీరియర్ ఛేంబర్‌ను కప్పి ఉంచుతుంది. ఇది బయటి నుంచి వచ్చే కాంతికిరణాలను కంటిపై పడేలా చూస్తూ... మొదట కంట్లోకి ప్రవేశించేలా... అటు పిమ్మట కంటి వెనక ఉండే పొర రెటీనాపై ప్రతిబింబించేలా చేస్తుంది. ఇది పారదర్శకంగా ఉంటేనే చూపు ఉంటుంది. ఇది పారదర్శకత కోల్పోవడం వల్ల చూపునూ కోల్పోవడం జరుగుతుంది.

కార్నియా మార్పిడి చికిత్స అంటే..?

కార్నియా గాయపడటం లేదా దెబ్బతినడం వల్ల కలిగిన అంధత్వాన్ని కార్నియల్ బ్లైండ్‌నెస్ అంటారు. కార్నియా దెబ్బతినడం వల్ల ఎవరైనా కంటి చూపు కోల్పోతే... అలాంటి వారికి దెబ్బతిన్న కార్నియా స్థానంలో మంచి కార్నియాను అమర్చడం ద్వారా వారు కోల్పోయిన చూపును తిరిగి తెప్పించడం సాధ్యమే. అంటే కార్నియా దెబ్బతినడం వల్ల వచ్చిన అంధత్వానికి మాత్రమే కార్నియా ద్వారా చూపు తెప్పించవచ్చు. ప్రస్తుతానికి కోల్పోయిన కంటి చూపును పొందడానికి ఈ ప్రక్రియ ఒక్కటే అందుబాటులో ఉంది. ఇప్పటికి ఇది మాత్రమే సాధ్యం. ఇంకా ఇతరత్రా కారణాల వల్ల కోల్పోయిన కంటి చూపును పొందేందుకు పెద్దగా అవకాశాలేమీ లేవు. అయితే కేవలం కార్నియల్ బ్లైండ్‌నెస్‌నే కాకుండా ఇతరత్రా కారణాల వల్ల కోల్పోయిన కంటి చూపును పొందడానికి ప్రయత్నాలూ, పరిశోధనలు మాత్రం ముమ్మరంగా కొనసాగుతున్నాయి.

తొలిసారి కార్నియా మార్పిడి చికిత్స నేపథ్యమిలా...

తొలిసారిగా కార్నియా మార్పిడి శస్త్రచికిత్సను డాక్టర్ ఎడ్వర్డ్ జిమ్ అనే వైద్య నిపుణుడు 1905లో చేశారు. కార్నియా మార్పిడి శస్త్రచికిత్స విజయవంతమయ్యే అవకాశాలు దాదాపు 90 శాతానికి పైగా ఉంటాయి. అయితే ఎవరైనా కళ్ల దానం చేసిన వ్యక్తి మరణించాక ఆరుగంటలలోపే అతడి నుంచి కార్నియాను స్వీకరించి, ఐ-బ్యాంక్‌లో భద్రపరచాల్సి ఉంటుంది. అటు తర్వాత సేకరించినప్పటికీ అది కార్నియా మార్పిడికి ఉపయోగపడదు.

కొన్ని వాస్తవాలు

- ప్రస్తుతం కేవలం 25 శాతం మందికి మాత్రమే కార్నియాలు లభ్యమవుతున్నాయి. మిగతావారికి కార్నియాల లభ్యత లేదనే చెప్పాలి.
- కార్నియాలు అవసరమైన చాలా మంది వారిజీవితంలో చాలా కీలకమైన యువదశలో లేదా సంపాదించే ప్రాయంలో (ప్రొడక్టివ్ దశలో) ఉన్నవారే కావడం విశేషం. అంటే... 90 శాతం మంది 45 ఏళ్ల కంటే వయసు తక్కువ ఉన్నవారే ఉంటారు. ఇక 12 ఏళ్ల కంటే తక్కువ వయసు ఉన్నవారు 60 శాతం వరకు ఉంటారు.

కార్నియల్ బ్లైండ్‌నెస్‌కు దారి తీసే పరిస్థితులు

● కంటికి అయ్యే గాయాల కారణంగా కార్నియా దెబ్బతినడం ● రసాయన ప్రమాదాలకు గురికావడంతో కార్నియా గాయపడటం లేదా కాలిపోవడం (కార్నియల్ బర్న్) ● పోషకాహార లోపం వల్ల కార్నియా దెబ్బతినడం (మరీ ముఖ్యంగా చిన్న వయసులో వైటమిన్ ఏ లోపం వల్ల) ● కంటికి... మరీ ముఖ్యంగా కార్నియాకు వచ్చే ఇన్ఫెక్షన్స్ (కార్నియల్ అల్సర్స్ – నిజానికి మిగతా కారణాల కంటే కార్నియల్ ఇన్ఫెక్షన్‌తోనే అంధత్వాలు వచ్చే అవకాశం ఎక్కువ) ● పుట్టుకతో లేదా జన్యుపరంగా వచ్చే కొన్ని రకాల సమస్యలు ● ఆపరేషన్ తర్వాత వచ్చే కాంప్లికేషన్లతో ఒకవేళ పైన పేర్కొన్న కారణాలతో కార్నియా దెబ్బతిని అంధత్వం వస్తే దాన్ని కార్నియా మార్పిడి (కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్) చికిత్సతో బాధితులకు చూపు తెప్పించవచ్చు.

కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్ ఎప్పుడెప్పుడంటే...

కంటి చూపునకు సంబంధించిన కొన్ని సమస్యలున్నప్పుడు (ఆప్టికల్) : సూడోఫేకిక్ బుల్లోస్ కెరటోపతి, కార్నియల్ డీజనరేషన్, కెరటోకోనస్, కెరటోగ్లోబస్, కార్నియల్ డిస్ట్రఫీ వంటి కొన్ని కంటి సమస్యలు ఉన్నప్పుడు కంటి చూపును మెరుగుపరచడానికి.

కంటిలోని భాగాలను సమీకృతంగా (ఇంటెగ్రల్‌గా) ఉంచడానికి (టెక్టానిక్) : 'స్ట్రోమల్ థిన్నింగ్ డెస్మాటోసీల్' అనే సమస్యలున్నప్పుడు కంటిలోని భాగాలను బయటికి రాకుండా నియంత్రించి వాటిని ఏకీకృతంగా లోపలే కలిపి ఉంచడానికి.

చికిత్సలో భాగంగా చేసే ట్రాన్స్‌ప్లాంట్స్‌లో (థెరపాటిక్) : ఇన్ఫెక్షన్ ఉన్నప్పుడు చికిత్సకు ఎంతమాత్రమూ సహకరించకుండా ఉండే కార్నియల్ భాగాన్ని తొలగించి, ఆ ప్రదేశంలో కొత్త కార్నియా ఉంచి చూపు తెప్పించడానికి.

అందం కోసం (కాస్మటిక్): కంటి నల్లగుడ్డు భాగంలో తెల్లమచ్చలు ఉన్నప్పుడు...ఆ కార్నియల్ స్కార్స్‌ను తొలగించి, అందాన్ని ఇనుమడింపజేయడం కోసం.

ఎవరెవరిలో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ సాధ్యం కాదంటే...

కొందరిలో కార్నియా ట్రాన్స్‌ప్లాంటేషన్ ద్వారా చూపు తెప్పించడం సాధ్యం కాదు. అది ఎవరిలోనంటే... ● రెటీనా లోపం లేదా ఆప్టిక్ నర్వ్ లోపంతో అంధత్వం వచ్చినవారు ● రెటినైటిస్ పిగ్మెంటోజా అనే కండిషన్ కారణంగా చూపు కోల్పోయిన వారు ● వయసు పెరుగుతున్న కొద్దీ వచ్చిన మాక్యులార్ డీజనరేషన్ అనే సమస్య కారణంగా చూపు పోగొట్టుకున్నవారు ● ఆప్టిక్ అట్రోఫీతో బాధపడుతున్న వారు ● రాడ్ అండ్ కోన్ డిస్ట్రఫీ అనే జబ్బుల కారణంగా చూపు కోల్పోయిన వారు ● నీటికాసుల (అడ్వాన్స్‌డ్ గ్లకోమా)తో కంటిచూపు కోల్పోయినవారు, ● కాంతికి స్పందించని (లైట్ పర్‌సెప్షన్ లేని) కళ్లలో ఈ చికిత్స సాధ్యం కాదు. ఇక్కడ పేర్కొన్న అన్ని సందర్భాల్లోనూ కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌తో ఏమాత్రం ప్రయోజనం చేకూరదు.

నేత్రదానం ఎందుకు చేయాలి?

భారతదేశంలో దాదాపు 12 లక్షల నుంచి 15 లక్షల మంది కార్నియల్ బ్లైండ్‌నెస్ కారణంగా అంధులుగా మారుతున్నారని గణాంకాలు చెబుతున్నాయి. పైగా ప్రతి సంవత్సరమూ ఈ కార్నియల్ బ్లైండ్‌నెస్ కారణంగా ఏడాదికి 25,000 నుంచి 30,000 వరకు కొత్త కేసులు ఈ అంధుల జాబితాకు జత అవుతున్నాయన్నది మరో అంచనా. నేత్రదానం అంటే కార్నియాను ఇవ్వడం వల్ల వీళ్లకు అంధత్వాన్ని దూరం చేసి, కంటి చూపు ప్రసాదించవచ్చు.

నిజానికి మన దేహంలోని కొన్ని కణజాలాలను కృత్రిమంగా సృష్టించడం సాధ్యం కాదు. ఒకరి నుంచి దానంగా స్వీకరించిన కణజాలాన్ని వేరే చోట అమర్చగలగడం సాధ్యమవుతుంది. అందువల్ల అలాంటి కణజాలాలు అవసరమైనప్పుడు వాటిని దాత ఇచ్చినప్పుడే స్వీకరించడం సాధ్యమవుతుంది. అలాంటివాటిల్లో కార్నియా ఒకటి. ఒకవేళ పిల్లల్లో ఇలా కార్నియా లోపం వల్ల అంధత్వం వస్తే... ఆ పిల్లలకు తెలిసే ఒకే ఒక రంగు... నలుపు! ఈ రంగురంగుల ప్రపంచాన్ని వాళ్లు చూడటమే సాధ్యం కాదు. ఆ చిన్నారి జీవితాల్లోంచి ఆ నలుపును తొలగించి, వాళ్ల జీవితాలను రంగులమయం చేయడానికి కార్నియాలు లభ్యం కావడమన్నది ఎంతగానో అవసరం. అందువల్ల వ్యక్తులంతా తమ మరణానంతరం కార్నియాను నిరుపయోగంగా మట్టిలో కలిసిపోయేలా చేయడానికి బదులు, వాటిని దానంగా ఇవ్వడం ద్వారా ప్రతి వ్యక్తీ మరో ఇద్దరికి చూపును తెప్పించే అవకాశం ఉంటుంది. అందుకే అలా కంటిచూపునకు దూరమైన వ్యక్తులకు ఈ లోకం చూపించడానికి నేత్రదానాలు పెరగడం ఎంతగానో అవసరం.

నేత్రదానం చేయడానికి ఎవరెవరు అర్హులు ?

ఏడాది వయసుకు పైగా ఉన్నవారెవరైనా తమ మరణానంతరం నేత్రదానం చేయడానికి అర్హులవుతారు. అలాంటి వారిలో ఈ కింద పేర్కొన్న సమస్యలునప్పటికీ వారు తమ మరణానంతరం నేత్రదానం చేయవచ్చు. అవి... ● హ్రస్వదృష్టి / పాక్షికంగానే కనుచూపు ఉన్నవారు (పూర్ సైట్), ● కళ్లజోడు వాడేవారు ● డయాబెటిస్‌తో బాధపడేవారు ● రక్తపోటుతో బాధపడేవారు (చక్కెర వ్యాధి, హైబీపీ ఉన్నప్పటికీ నిరభ్యంతరంగా నేత్రదానం చేయవచ్చు. ఇలాంటి రుగ్మతలు ఉన్నప్పటికీ నేత్రదానానికి వారు పూర్తిగా అర్హులే) ● రెటీనా లేదా ఆప్టిక్ నర్వ్ లోపం వల్ల అంధత్వం వచ్చినవారూ... వీరంతా ఎంతగా వయసుపైబడ్డవారైనప్పటికీ నిరభ్యంతరంగా నేత్రదానం చేయవచ్చు.

నిర్వహణ: యాసీన్

కార్నియాల లభ్యత అవరమైన మేరకు ఎందుకు ఉండటం లేదంటే?

నేత్రదానం అని చెప్పే ఈ కార్నియా దానాలు ఇంకా జరగాల్సినంత విస్తృతంగా జరగడం లేదనే చెప్పాలి. దాంతో బాధితులకు అవసరమైనన్ని కార్నియాలు లభ్యం కావడం లేదు. చాలా అంశాలు ఇందుకు కారణమవుతున్నాయి. వాటిలో కొన్ని ఇవే... ● నేత్రదానం విషయంలో అవగాహనలోపం ● నేత్రదానం తర్వాత కార్నియాలను నిలువ చేయడానికి అవసరమైనన్ని కేంద్రాలు (ఐ బ్యాంకులు) లేకపోవడం, ● నేత్రదానాన్ని ప్రోత్సహించే వారి సంఖ్య అంతగా లేకపోవడం (మోటివేషన్ లేకపోవడం) ● సామాజిక, మతపరమైన కారణాలతో నేత్రదానానికి ముందుకు వచ్చే వారి సంఖ్య తక్కువగా ఉండటం.

ఎవరు నేత్రదానం చేయడానికి అర్హులు కారంటే...

కొందరి నుంచి మరణానంతరం కార్నియా స్వీకరించడం కుదరకపోవచ్చు. వారు ఎవరంటే... ● నిర్దిష్టంగా ఏ కారణం వల్ల చనిపోయారో చెప్పలేని వారు ● రేబిస్, సిఫిలిస్, హెపటైటిస్, సెప్టిసీమియా, ఎయిడ్స్ వంటి జబ్బులతో చనిపోయిన వారి నుంచి ● కంటికి వచ్చే ఆక్యులార్ ఇన్ఫెక్షన్స్ ఉన్నవారు... ఈ అందరి నుంచి కార్నియా స్వీకరించడం కుదరదు. అంటే వీళ్లు నేత్రదానానికి అర్హులు కాదు.

కార్నియా సేకరణ ఎలా జరుగుతుందంటే..?

నేత్రదానం చేస్తానని వాగ్దానం చేసిన వ్యక్తి మరణించిన వెన్వెంటనే... బంధుమిత్రులు 'ఐ బ్యాంక్'కు సమాచారమివ్వాలి. ఎందుకంటే... మరణించాక ఆరు గంటలలోపే దాత నుంచి కార్నియాను సేకరించాలి. లేకపోతే ఆ కార్నియా నిరుపయోగంగా మారిపోతుంది. ఈలోపు ఐ-బ్యాంక్ నుంచి సిబ్బంది వచ్చే లోపు మరణించిన వ్యక్తి కళ్లపైన తడి దూదిని ఉంచాలి. ఆ గదిలో ఉన్న ఫ్యాన్‌ను స్విచ్-ఆఫ్ చేయాలి. మరణించిన వ్యక్తి తల

భాగం మిగతా శరీరానికి ఆరు అంగుళాల ఎత్తుండేలా మృతుడి తలకింద తలగడ అమర్చాలి. ఐ-బ్యాంక్ సిబ్బంది వచ్చాక... ఇక్కడ

పేర్కొన్నట్లుగా ఉంచిన మృతుడి పార్థివ శరీరంలోని కళ్లలోని కార్నియాతో పాటు 10 సి.సి.ల రక్తపు నమూనానూ సేకరిస్తారు. కార్నియా తొలగింపు తర్వాత ఐ-బ్యాంక్ సిబ్బంది ఆ ప్రదేశంలో కృత్రిమ కార్నియాను అమర్చి కంటి ఆకృతిలో ఎలాంటి తేడా కనిపించకుండా చూస్తారు.

చూపు పొందడానికే అవకాశాలెక్కువ...

కార్నియా మార్పిడి శస్త్రచికిత్స విజయవంతం కాకపోవడానికి అవకాశాలు చాలా తక్కువ. శస్త్రచికిత్స విజయవంతమై చూపు పొందడానికే అవకాశాలెక్కువ. ఈ మాట చెప్పాల్సిన అవసరమేమిటంటే... సాధారణంగా మిగతా అవయవాల మార్పిడి తాలూకు శస్త్రచికిత్స చేసినప్పుడు శరీరం ఆ అవయవాలను అంత తేలిగ్గా తనవిగా ఆమోదించదు. తనది కాని బయటి పదార్థం (ఫారిన్‌బాడీ) పరిగణించి, దాన్ని రిజెక్ట్ చేయడానికి ప్రయత్నిస్తుంది. కానీ కార్నియల్ ట్రాన్స్‌ప్లాంటేషన్‌లో అలాంటి అవకాశాలు చాలా తక్కువ. అందుకే దాదాపు 90 శాతం కేసులకు పైగా విజయవంతం అవుతాయి. పైగా పైన పేర్కొన్న రిస్క్ ఉన్నందున మిగతా అవయవ మార్పిడి శస్త్రచికిత్స కేసుల్లో శరీరానికి రోగనిరోధక శక్తిని (ఇమ్యూనిటీని) తగ్గించడానికి ఇమ్యూనోసప్రెసెంట్ ఔషధాలు ఇవ్వాల్సి ఉంటుంది. కానీ కార్నియాకు అలాంటి ప్రమాదం లేదు కాబట్టి ఇమ్యూనో సప్రెసెంట్స్ ఇవ్వాల్సిన అవసరం ఉండదు. ఇది నేత్రదానం విషయంలో ఉన్న మంచి సౌకర్యం. కంటి ఆపరేషన్ అయినవాళ్లు కూడా నేత్రదానానికి అర్హులే.

ఏయే సందర్భాల్లో రిస్క్ ఉంటుందంటే...

కార్నియాను అమర్చే సమయంలో స్వీకర్త శరీరం దాన్ని స్వీకరించకపోవడం అన్న రిస్క్ చాలా తక్కువ. అయినప్పటికీ కొన్ని సందర్భాల్లో ఆ ప్రమాదం ఉండవచ్చు. అదెప్పుడంటే... ● అంటించిన గ్రాఫ్ట్ ఊడిపోవడం లేదా కదిలిపోవడం ● గ్రాఫ్ట్ తర్వాత కంటికి ఇన్ఫెక్షన్ రావడం ● కంటిలోని గుడ్డులో ఒత్తిడి పెరగడం వల్ల (గ్లకోమా) ● కుట్లు వేయడంలో కొన్ని సమస్యల కారణంగా ● కార్నియా వాపు వచ్చినప్పుడు.

కార్నియా నిరుపయోగమని తేలితే...?

కొందరు పెద్దమనసుతో నేత్రదానం చేయడానికి ముందుకు వచ్చినప్పటికీ వాళ్ల కార్నియా నిరుపయోగం అని తేలితే... అప్పుడూ దాతల వల్ల కొన్ని ప్రయోజనాలు కలుగుతాయి. ఉదాహరణకు ఎయిడ్స్ రోగులు, హెపటైటిస్ బీ లేదా సీ ఉన్నవారి కార్నియాలు దానంగా స్వీకరించడానికి ఉపయోగపడవు. అయితే కొన్ని సందర్భాల్లో వారి నుంచి స్క్లెరా వంటి కొన్ని కంటి భాగాలను గ్రాఫ్టింగ్ కోసం వాడుకోవచ్చు. మరికొన్ని సందర్భాల్లో మానవాళికి ఉపయోగపడే కొన్ని పరిశోధనల కోసం కూడా ఆ కార్నియాలను ఉపయోగించుకోవచ్చు. అందుకే మరో బాధితుడికి అమర్చడానికి వీల్లేనంత మాత్రాన కార్నియా నిరుపయోగం అవుతుందనే అభిప్రాయానికి రావద్దు.

చివరగా... మరణానంతరం వృథాగా మట్టిలో కలసిపోవడం వల్లగానీ లేదా కట్టెపై కాలిపోవడం ద్వారాగానీ వృథాగా పోయే కార్నియాలను వీలైనంత ఎక్కువ మంది దానం చేస్తే... ఎంతోమంది చిన్నారులూ, పెద్దవారూ చూపు పొందేలా చేయవచ్చు. అందుకే కార్నియా దానాల ప్రాధాన్యాన్ని గుర్తించి ప్రతి ఒక్కరూ నేత్రదానంపై అవగాహనను పెంచుకోవడం ఎంతైనా అవసరమని గుర్తించాలి.

బిజినెస్ రీల్

విస్తరణ బాటలో జీరో21

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: విద్యుత్ వాహనాల సంస్థ జీరో21 రెట్రోసొల్యూషన్స్ తమ కార్యకలాపాలను విస్తరిస్తోంది. ఇటీవలే 40 బస్సులను విద్యుత్ బస్సులుగా మార్చేందుకు తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ) నుంచి రెట్రోఫిటింగ్ ఆర్డరు లభించినట్లు సంస్థ ఫౌండర్ రాణి శ్రీనివాస్, సహ వ్యవస్థాపకుడు శశి రావినూతల తెలిపారు. దీనికి సంబంధించి లెటర్ ఆఫ్ అవార్డు లభించిందని, ఆరు నెలల్లో పూర్తి చేయాల్సి ఉంటుందని వివరించారు. అటు ఆంధ్రప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్‌లో కూడా ఇలాంటి కాంట్రాక్టులను దక్కించుకోవడంపై దృష్టి పెడుతున్నట్లు చెప్పారు. మరోవైపు, వచ్చే మూడేళ్లలో దాదాపు రూ. 400 కోట్లతో ఎలక్ట్రిక్ త్రీవీలర్లు తదితర ఉత్పత్తుల తయారీ కోసం ఆంధ్రప్రదేశ్, తెలంగాణలో రెండు ప్లాంట్లను ఏర్పాటు చేసే ప్రణాళికల్లో ఉన్నట్లు శ్రీనివాస్ తెలిపారు. ఇందుకు సంబంధించి నిధుల సమీకరణకు ఇన్వెస్టర్లతో చర్చలు జరుగుతున్నాయన్నారు.

రెండంకెల స్థాయిలో ఫార్మా ఎగుమతులు

2026–27పై వాణిజ్య శాఖ అంచనా

న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో ఫార్మా ఎగుమతులు రెండంకెల స్థాయిలో వృద్ధి చెందుతాయని అంచనా వేస్తున్నట్లు కేంద్ర వాణిజ్య శాఖ వెల్లడించింది. 2024–25లో ఇవి 9.4 శాతం వృద్ధి చెంది 30.47 బిలియన్ డాలర్లకు చేరాయని పేర్కొంది. ప్రస్తుతం 60 బిలియన్ డాలర్లుగా ఉన్న పరిశ్రమ 2030 నాటికి 130 బిలియన్ డాలర్లకు చేరొచ్చనే అంచనాలు ఉన్నట్లు తెలిపింది. 200 పైగా దేశాలకు ఎగుమతులతో, పరిమాణంపరంగా భారత పరిశ్రమ అంతర్జాతీయంగా 3వ స్థానంలో ఉంది వాణిజ్య శాఖ వివరించింది. ఎగుమతుల్లో అమెరికా వాటా 34 శాతంగా యూరప్ వాటా 19 శాతంగా ఉంది. యూరోపియన్ యూనియన్, అమెరికా మొదలైన వాటితో వాణిజ్య ఒప్పందాలతో వచ్చే అవకాశాల గురించి ఎగుమతిదార్లకు వివరించినట్లు వాణిజ్య శాఖ తెలిపింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

24-2-2026

విశాఖ	480–00
చిత్తూరు	533–00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	475–00
విజయవాడ	500–00
రిటైల్ ధర (డజను)	72.00
హైదరాబాద్	465–00
వరంగల్	467–00
రిటైల్ ధర	5.25

నిఫ్టీ 50

టాప్ 5 గెయినర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
ADANIPORTS	1,554.00	2.81
KOTAKBANK	430.8	2.24
HDFCLIFE	743	1.97
DRREDDY	1,305.10	1.93
ULTRACEMCO	12,970.00	1.6

నిఫ్టీ 50

టాప్ 5 లూజర్స్ (రూపాయల్లో)

Symbol	LTP	(%)Change
HINDALCO	914.85	-2.23
WIPRO	205.9	-1.89
INFY	1,328.00	-1.86
TECHM	1,437.20	-1.35
CIPLA	1,327.00	-1.05

స్టాక్ మార్కెట్ డేటా

	టర్నోవర్ (రూ. కోట్లలో)
బీఎస్ఈ	7,379
ఎన్ఎస్ఈ	1,01,052
ఎన్ఎస్ఈ(డెరివేటివ్స్)	4,59,031
ఎఫ్ఐఐ	+ 3,484
డీఐఐ	- 1,292

ముడిచమురు... (బ్యారెల్)

	రాత్రి 11.30కు		క్రితం ముగింపు
నైమెక్స్ లైట్ స్వీట్	66.32	$	66.48
బ్రెంట్	71.11	$	71.03

4 కంపెనీల లిస్టింగ్‌కు ఓకే

ఐపీవో స్ట్రీట్

సెబీ తాజాగా గ్రీన్ సిగ్నల్

- జాబితాలో ఇంటెగ్రిస్ మెడ్‌టెక్, అంజలీ ల్యాబ్
- ఏపీపీఎల్ కంటెయినర్స్, ఆల్పైన్ టెక్స్‌వరల్డ్

రాజకీయ, భౌగోళిక అనిశ్చితుల కారణంగా సెకండరీ మార్కెట్లు ఆటుపోట్లు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రైమరీ మార్కెట్లు సందడి చేస్తూనే ఉన్నాయి. తాజాగా 4 కంపెనీల లిస్టింగ్ ప్రణాళికలకు క్యాపిటల్ మార్కెట్ల నియంత్రణ సంస్థ సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఇక పైనా ఐపీవోల జోరు కొనసాగనుంది. వివరాలు చూద్దాం..

న్యూఢిల్లీ: తాజాగా నాలుగు కంపెనీల ప్రాస్పెక్టస్‌లకు సెబీ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. తద్వారా స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టయ్యేందుకు అనుమతించింది. వెరసి గతేడాది(2025) బాటలో కొత్త కేలండర్ ఏడాదిలోనూ పబ్లిక్ ఇష్యూల జోరు కొనసాగనుంది. జాబితాలో ఇంటెగ్రిస్ మెడ్‌టెక్, అంజలీ ల్యాబ్‌టెక్, ఏపీపీఎల్ కంటెయినర్స్, ఆల్పైన్ టెక్స్‌వరల్డ్ చోటు చేసుకున్నాయి. ఈ కంపెనీలన్నీ సెబీకి 2025 సెప్టెంబర్– అక్టోబర్‌లో ముసాయిదా ప్రాస్పెక్టస్ దాఖలు చేశాయి. ఐపీవో ద్వారా బీఎస్ఈ, ఎన్ఎస్ఈలలో లిస్టకానున్నాయి. 2025లో తొలిసారి దేశీ ప్రైమరీ మార్కెట్ల చరిత్రలోనే అత్యధికంగా 103 కంపెనీలు రూ. 1.76 లక్షల కోట్లను సమీకరించిన విషయం విదితమే.

మెడికల్ టెక్నాలజీ

పీఈ దిగ్గజం ఎవర్‌స్టోన్ క్యాపిటల్‌కు పెట్టుబడులున్న మెడికల్ టెక్నాలజీ ప్లాట్‌ఫామ్ ఇంటెగ్రిస్ మెడ్‌టెక్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా రూ. 925 కోట్ల విలువైన ఈక్విటీని తాజాగా జారీ చేయనుంది. వీటికి జతగా కంపెనీ ప్రమోటర్లు 2.16 కోట్ల షేర్లను ఆఫర్ చేయనున్నారు. తద్వారా కంపెనీ సుమారు రూ. 3,500–4,000 కోట్లవరకూ సమీకరించే ప్రణాళికల్లో ఉన్నట్లు తెలుస్తోంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది. కంపెనీ ప్రధానంగా కార్డియాక్ స్టెంట్ల తయారీ, పంపిణీ నిర్వహిస్తోంది. కార్డియోవాస్కులర్ పరికరాలతోపాటు.. క్లినికల్ డయాగ్నోస్టిక్స్, సైంటిఫిక్ ల్యాబొరేటరీ సొల్యూషన్స్ అందిస్తోంది. లిస్టింగ్‌లో కంపెనీ రూ. 11,000–13,000 కోట్ల విలువను ఆశిస్తోంది.

కంటెయినర్ బిజినెస్

పబ్లిక్ ఇష్యూ చేపట్టనున్న కంటెయినర్ల తయారీ కంపెనీ ఏపీపీఎల్ కంటెయినర్స్ కొత్తగా 12.5 లక్షల ఈక్విటీ షేర్లను జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్లు సైతం 25.6 లక్షల షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. ఈక్విటీ జారీ నిధులను వర్కింగ్ క్యాపిటల్ అవసరాలు, రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంటెయినర్ల తయారీలో ఉన్న కంపెనీ 2025–26లో వీటి లీజింగ్ సర్వీసులలోకి సైతం ప్రవేశించింది. తద్వారా వివిధ క్లయింట్ల అవసరాలకు అనుగుణమైన సర్వీసులు సమకూర్చుతోంది.

వీవింగ్, స్పిన్నింగ్

టెక్స్‌టైల్స్ తయారీలో సమీకృత కార్యకలాపాలుగల గుజరాత్ కంపెనీ అల్పైన్ టెక్స్‌వరల్డ్ పబ్లిక్ ఇష్యూకి రానుంది. దీనిలో భాగంగా 1.5 కోట్ల ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. 2016లో ఏర్పాటైన కంపెనీ ప్రధానంగా నేత(వీవింగ్), స్పిన్నింగ్ సామర్థ్యాలను కలిగి ఉంది. ఈక్విటీ జారీ నిధులను అహ్మదాబాద్‌లో కొత్త వీవింగ్ యూనిట్ ఏర్పాటుకు వినియోగించనుంది. తద్వారా గ్రే ఫ్యాబ్రిక్ తయారీకి వీలుగా ఉత్పత్తిని విస్తరించనుంది. అంతేకాకుండా మరికొన్ని నిధులను రుణ చెల్లింపులు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వెచ్చించనుంది.

కృత్రిమ వజ్రాల తయారీ

స్టాక్ ఎక్స్ఛేంజీలలో లిస్టింగ్‌కు వీలుగా ల్యాబొరేటరీ వజ్రాల తయారీ కంపెనీ అంజలీ ల్యాబ్‌టెక్ 2025 అక్టోబర్‌లో సెబీకి గోప్యతా మార్గంలో దరఖాస్తు చేసింది. తాజాగా అనుమతి పొందింది. కంపెనీ ప్రధానంగా ల్యాబ్ డైమండ్లు సహా.. ల్యాబ్ డైమండ్ ఆభరణాలు, మైక్రోవేవ్ ప్లాస్మా సీవీడీ సిస్టమ్ తదితరాలను రూపొందిస్తోంది.

ఓమ్నిటెక్ ఇంజినీరింగ్ @ రూ. 216-227

- ఈ నెల 25–27 మధ్య ఐపీవో
- రూ. 583 కోట్ల సమీకరణకు సై

హైప్రెసిషన్ ఇంజినీర్డ్ విడిభాగాల తయారీ కంపెనీ ఓమ్నిటెక్ ఇంజినీరింగ్ పబ్లిక్ ఇష్యూకి రూ. 216–227 ధరల శ్రేణి ప్రకటించింది. ఇష్యూ ఈ నెల 25న ప్రారంభమై 27న ముగియనుంది. దీనిలో భాగంగా రూ. 418 కోట్ల విలువైన ఈక్విటీ షేర్లను తాజాగా జారీ చేయనుంది. అంతేకాకుండా కంపెనీ ప్రమోటర్ ఉదయ్‌కుమార్ అరుణ్‌కుమార్ పరేఖ్ రూ. 165 కోట్ల విలువైన షేర్లను విక్రయానికి ఉంచనున్నారు. వెరసి ఇష్యూ ద్వారా రూ. 583 కోట్లు సమీకరించాలని కంపెనీ భావిస్తోంది. యాంకర్ ఇన్వెస్టర్లకు 24న షేర్లను ఆఫర్ చేయనుంది. మార్చి 5న లిస్టకానున్న కంపెనీ విలువ రూ. 2,800 కోట్లుగా నమోదయ్యే అవకాశముంది. ఈక్విటీ జారీ నిధులను రుణ చెల్లింపులు, కొత్త తయారీ యూనిట్ల ఏర్పాటు, పెట్టుబడి వ్యయాలు, సాధారణ కార్పొరేట్ అవసరాలకు వినియోగించనుంది. కంపెనీ ప్రధానంగా ఎనర్జీ, ఆటోమేషన్, ఇండస్ట్రియల్ ఎక్విప్‌మెంట్ సిస్టమ్స్ తదితర రంగాల కస్టమర్లకు హైప్రెసిషన్ ఇంజినీర్డ్ విడిభాగాలను రూపొందిస్తోంది. ఈ విభాగంలో ఆజాద్ ఇంజినీరింగ్, యూనిమెక్ ఏరోస్పేస్, డైనమాటిక్ టెక్నాలజీస్, ఎంటార్ టెక్నాలజీస్ తదితరాలతో పోటీ పడవలసి ఉంటుంది.

ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత

ప్రభుత్వ నికర రుణ సమీకరణ కొంతే ఆర్‌బీఐ బులెటిన్

ముంబై: జీడీపీలో ప్రభుత్వ నికర రుణభారం 2026–27 ఆర్థిక సంవత్సరంలో 3 శాతానికి తగ్గనుండడంతో.. ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత పెరగనున్నట్టు ఆర్‌బీఐ బులెటిన్ తెలిపింది. 2026–27 బడ్జెట్‌లో ప్రభుత్వం స్థూల రుణ సమీకరణను రూ.17.3 లక్షల కోట్లుగా.. నికర రుణ సమీకరణ జీడీపీలో 3 శాతంగా పేర్కొనడాన్ని ప్రస్తావించింది. ఇది క్రమంగా కరోనా ముందస్తు స్థాయిలకు తగ్గించుకోవడంగా ఆర్‌బీఐ బులెటిన్ పేర్కొంది. రూ.17.3 లక్షల కోట్ల స్థూల రుణ సమీకరణ అంచనాలకు మించి ఉందని, ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత తగ్గుతుందంటూ ఓ వర్గం ప్రజల్లో నెలకొన్న ఆందోళనలను ఈ సందర్భంగా ప్రస్తావించింది. ఆర్‌బీఐ డేటా ప్రకారం 2019–20లో జీడీపీలో ప్రభుత్వ నికర మార్కెట్ రుణ సమీకరణ రూ.4.73 లక్షల కోట్లు (2.4 శాతం)గా ఉండడం గమనార్హం. 2020–21లో కరోనా విపత్తు కారణంగా ఏకంగా రూ.10.33 లక్షల కోట్లకు పెరిగింది. కరోనా ముందస్తు స్థాయిలకు నికర మార్కెట్ రుణ సమీకరణ తగ్గించుకుంటున్నందున ప్రైవేటు రంగానికి నిధుల లభ్యత పెరుగుతుందని, ఆర్థిక మార్కెట్లపై ఒత్తిడి తగ్గుతుందని ఆర్‌బీఐ బులెటిన్ స్పష్టం చేసింది. ఇక 2024–25 ప్రభుత్వ నికర మార్కెట్ రుణ సమీకరణ జీడీపీలో 3.5 శాతం (రూ.11.63 లక్షల కోట్లు), 2025–26లో 3.2 శాతం (రూ.11.32 లక్షల కోట్లు) చొప్పున ఉండడం గమనార్హం.

ఏఐతో ముప్పేమీ లేదు

సాఫ్ట్‌వేర్ ప్రొఫెషనల్స్ తగ్గరు

- కొత్త టెక్నాలజీతో నైపుణ్యాలు పెరుగుతాయి
- మైక్రోసాఫ్ట్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్

న్యూఢిల్లీ: కృత్రిమ మేథ (ఏఐ)తో టెక్ పరిశ్రమ ఉద్యోగాల్లో భారీగా కోత పడుతుందన్న ఆందోళనలను మైక్రోసాఫ్ట్ కార్పొరేషన్ ప్రెసిడెంట్ బ్రాడ్ స్మిత్ తోసిపుచ్చారు. దీనివల్ల సాఫ్ట్‌వేర్ ఇంజినీర్లు, ఐటీ ప్రొఫెషనల్స్‌కి ముప్పేమీ లేదని, ఇది వారి స్థానాన్ని భర్తీ చేయదని చెప్పారు. వారు తమ నైపుణ్యాలను, సృజనాత్మకతను మెరుగుపర్చుకునేందుకు ఏఐ సహాయకరంగా ఉంటుందని పేర్కొన్నారు. ప్రజలు మరింత స్మార్ట్‌గా పని చేసుకునేందుకు తోడ్పడే టెక్నాలజీని రూపొందించడం మైక్రోసాఫ్ట్ లక్ష్యమని ఆయన చెప్పారు. పదే పదే పునరావృతమయ్యే కోడింగ్ పనులను మాత్రమే ఏఐ టేకోవర్ చేయొచ్చని, దీనితో ప్రోడక్ట్ డిజైన్, ఆర్కిటెక్చర్, టెస్టింగ్, భద్రత మొదలైన వాటిపై ఫోకస్ చేసేందుకు డెవలపర్లకు వీలు చిక్కుతుందని స్మిత్ తెలిపారు. ఉద్యోగాలను తగ్గించడం కాకుండా వాటిని మరింత ఆసక్తికరంగా మార్చేందుకు ఏఐ సహాయపడుతుందని చెప్పారు. దీనితో నిపుణులకు డిమాండ్ పెరుగుతుందని, వేతనాలు కూడా పెరుగుతాయని స్మిత్ వివరించారు. ప్రజల సామర్థ్యాలు మెరుగుపర్చేందుకు ఉపయోగపడే టెక్నాలజీని, మెషిన్లను తయారు చేయడమే మైక్రోసాఫ్ట్ ప్రాథమిక లక్ష్యమని ఆయన చెప్పారు. సాంకేతికత అనేది ఉత్పాదకత, ఆర్థిక వృద్ధికి చోదకంగా ఉంటూనే అత్యంత నాణ్యమైన ఉద్యోగాల కల్పనకు దోహదపడే విధంగా ఉండాలని పేర్కొన్నారు.

గ్లోబల్ సరఫరా వ్యవస్థకు దన్నుగా నిలవాలి

దేశీ ఫార్మా పరిశ్రమకు మంత్రి నడ్డా పిలుపు



న్యూఢిల్లీ: పరిమాణంపరంగానే కాకుండా నాణ్యత, విశ్వసనీయత, నూతన ఆవిష్కరణలతో అంతర్జాతీయంగా సరఫరా వ్యవస్థకు దేశీ ఫార్మా రంగం దన్నుగా నిలవాలని కేంద్ర మంత్రి జేపీ నడ్డా సూచించారు. సరికొత్త టెక్నాలజీలను భారత్ బాధ్యతాయుతంగా వినియోగించుకుంటోందని, వ్యాధులను ముందస్తుగా గుర్తించేందుకు, ఆరోగ్య సంరక్షణ సేవలను విస్తరించేందుకు కృత్రిమ మేధను ఉపయోగించుకుంటోందని ఆయన పేర్కొన్నారు. 11వ గ్లోబల్ ఫార్మా క్వాలిటీ సదస్సులో పాల్గొన్న సందర్భంగా మంత్రి ఈ విషయాలు చెప్పారు. దశాబ్దాలుగా ప్రపంచానికి ఫార్మసీగా గుర్తింపు పొందిన భారత్, ప్రస్తుతం ప్రపంచానికి కొత్త ఉత్పత్తులు, సాంకేతికతను అందించే ఆవిష్కర్తగా పరివర్తన చెందుతోందని ఆయన తెలిపారు.

దేశ అభివృద్ధి సాధనకు ఆరోగ్య సంరక్షణ, తయారీ రంగం, శాస్త్రీయ పరిశోధనలకు కేంద్రం మరింత ప్రాధాన్యం ఇస్తున్నట్లు పేర్కొన్నారు. రూ. 10,000 కోట్ల బడ్జెట్‌తో ప్రకటించిన బయోఫార్మా శక్తి పథకం, భారత్‌ను గ్లోబల్ బయోఫార్మా తయారీ హబ్‌గా నిలుపుతుందని నడ్డా ధీమా వ్యక్తం చేశారు. దేశీయంగా ఉత్పత్తిని పెంచుకునేందుకు, అంతర్జాతీయ ప్రమాణాలతో పరిశోధన సామర్థ్యాలను పటిష్టం చేసుకునేందుకు ఇది తోడ్పడుతుందని వివరించారు. ఫార్మా–మెడ్‌టెక్ రంగంలో పరిశోధనలు, ఆవిష్కరణలను ప్రోత్సహించేందుకు ఉద్దేశించిన రూ. 5,000 కోట్ల పీఆర్ఐపీ స్కీము .. కొత్త ఔషధాలు, సంక్లిష్టమైన జనరిక్స్, టీకాలు, అధునాతన వైద్య సాంకేతికతలను అభివృద్ధి చేసేందుకు సహాయకరంగా ఉంటోందన్నారు.

దేశీయంగా రేర్ ఎర్త్ మెటల్స్ ఉత్పత్తి

న్యూఢిల్లీ: దేశీయంగా ఈ ఏడాది రేర్ ఎర్త్ పెర్మనెంట్ మ్యాగ్నెట్స్(ఆర్ఈపీఎంలు) ఉత్పత్తి ప్రారంభంకానున్నట్లు కేంద్ర బొగ్గు, గనుల శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి వెల్లడించారు. తద్వారా క్రిటికల్ మినరల్స్‌లో స్వయంసమృద్ధి సాధించేందుకు కీలక ముందడుగు పడనున్నట్లు తెలియజేశారు. విద్యుత్ వాహనాలు(ఈవీలు), పునరుత్పాదక ఇంధన రంగాలకు అవసరమైన క్రిటికల్ మినరల్స్ కోసం దిగుమతులపై ఆధారపడటాన్ని తగ్గించుకోనున్నట్లు పేర్కొన్నారు. ఇందుకు ఆత్మనిర్భర్ భారత్ కార్యక్రమంలో భాగంగా ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను ప్రస్తావించారు. పరిశ్రమల సమాఖ్య ఫిక్కీ, గనుల శాఖ సంయుక్తంగా నిర్వహించిన ఒక సదస్సులో మాట్లాడుతూ కిషన్‌రెడ్డి దేశీయంగా ఈ ఏడాది పెర్మనెంట్ మ్యాగ్నెట్స్ ఉత్పత్తి ప్రారంభంకానున్నట్లు తెలియజేశారు. నియోడైమియమ్, ప్రాజియోడైమియమ్ తదితర రేర్ ఎర్త్ మినరల్స్ సరఫరాలకు వీలుగా గనుల శాఖ అన్వేషణా సంబంధ బ్లాకుల వేలానికి తెరతీయడంతోపాటు.. రీసైక్లింగ్ సౌకర్యాలకు అనుమతిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో మంత్రి ప్రకటనకు ప్రాధాన్యత ఏర్పడింది. మరోపక్క క్రిటికల్ మినరల్స్ ప్రాసెసింగ్ యూనిట్ల కొరత నెలకొన్న నేపథ్యంలో ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్, ఒడిషా, మహారాష్ట్ర, గుజరాత్‌లలో క్రిటికల్ మినరల్ ప్రాసెసింగ్ ప్లాంట్ పార్క్‌ల ఏర్పాటుకు ప్రోత్సాహాన్నిస్తోంది.

ఎయిర్‌టెల్ ఫైనాన్స్ సేవల రింగ్

ఎన్‌బీఎఫ్‌సీ అనుబంధ సంస్థకు జోష్ ● రూ. 20,000 కోట్ల పెట్టుబడులకు రెడీ

న్యూఢిల్లీ: మొబైల్ టెలికం రంగ దిగ్గజం భారతీ ఎయిర్‌టెల్ బ్యాంకింగేతర అనుబంధ కంపెనీ(ఎన్‌బీఎఫ్‌సీ) ఎయిర్‌టెల్ మనీ లిమిటెడ్‌పై భారీ ప్రణాళికలు ప్రకటించింది. రానున్న కొన్నేళ్లలో రూ. 20,000 కోట్ల పెట్టుబడులకు తెరతీయనున్నట్లు పేర్కొంది. వీటిలో 70 శాతం ఎయిర్‌టెల్ సమకూర్చనుండగా.. మిగిలిన 30 శాతం ప్రమోటర్ గ్రూప్ సంస్థ భారతీ ఎంటర్‌ప్రైజెస్ ద్వారా లభించనున్నట్లు తెలియజేసింది. ఎయిర్‌టెల్ మనీ ఇటీవలే(2026 ఫిబ్రవరి 13న) ఆర్‌బీఐ నుంచి ఎన్‌బీఎఫ్‌సీ లైసెన్స్‌ను పొందింది. పటిష్ట డిజిటల్ ఆస్తులు, 500కుపైగా సైంటిస్టులతో నడుస్తున్న భారీ డేటా ఎనలిటిక్స్, లోతైన నిర్వహణా సామర్థ్యాలు కలిగిన కంపెనీగా ఎయిర్‌టెల్ కొత్తతరహా డిజిటల్ ఫైనాన్షియల్ సర్వీసులను దేశవ్యాప్తంగా విస్తరించనున్నట్లు ఒక ప్రకటనలో వివరించింది. డిజిటల్ ప్లాట్‌ఫామ్, సమీకృత చానళ్ల ద్వారా గత రెండేళ్లుగా క్రెడిట్ ఇంజిన్‌ను నిర్మించినట్లు పేర్కొంది. దీంతో దేశీయంగా పటిష్ట రుణ సర్వీసుల మోడళ్లలో ఒకటిగా ఆవిర్భవించినట్లు తెలియజేసింది. ఇప్పటికే రూ. 9,000 కోట్లకుపైగా రుణాల విడుదల ద్వారా ప్లాట్‌ఫామ్ అత్యున్నతస్థాయి(హైపర్‌స్కేల్)ని అందుకున్నట్లు వెల్లడించింది. ఇందుకు పటిష్ట అండర్‌రైటింగ్ విధానాలు, క్రమశిక్షణాయుత పోర్ట్‌ఫోలియో నిర్వహణ, రియల్‌టైమ్ రిస్క్ పర్యవేక్షణ దోహదపడినట్లు వివరించింది.

ఈ నేపథ్యంలో ఎయిర్‌టెల్ షేరు బీఎస్ఈలో 1% బలపడి రూ. 1,997 వద్ద ముగిసింది.

ఫండ్స్ ఆస్తులు.. @ 455 లక్షల కోట్లు!

- 2030 మార్చి నాటికి రెట్టింపు
- 2025 మార్చి నాటికి రూ.210 లక్షల కోట్లు
- క్రిసిల్ ఇంటెలిజెన్స్ నివేదిక



ముంబై: ఫండ్స్ పరిశ్రమ నిర్వహణలోని ఆస్తులు (ఏయూఎం) ఐదేళ్లలో రెట్టింపు కానున్నాయి. మ్యూచువల్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు, ఆల్టర్నేటివ్ ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్స్ (ఏఐఎఫ్‌లు) నిర్వహణలోని మొత్తం ఆస్తులు (మేనేజ్డ్ ఫండ్స్ ఇండస్ట్రీ ఏయూఎం) 2025 మార్చి నాటికి రూ.212 లక్షల కోట్లుగా ఉన్నాయి. ప్రస్తుత జీడీపీలో 64 శాతంగా ఉంటే, 2030 మార్చి నాటికి 73 శాతానికి పెరగనున్నాయి. ఈ వివరాలతో క్రిసిల్ ఇంటెలిజెన్స్ (క్రిసిల్ రేటింగ్స్ సంస్థ) ఒక నివేదికను విడుదల చేసింది. గృహ పొదుపులు ఈక్విటీ, ఏఐఎఫ్‌ల్లోకి వస్తుండడాన్ని ప్రస్తావించింది. 2025 మార్చితో ముగిసిన ఐదేళ్ల కాలంలో మేనేజ్డ్ ఫండ్ అసెట్స్ ఏటా 18 శాతం చొప్పున పెరుగుతూ వచ్చాయని.. అదే కాలంలో డిపాజిట్లలో వృద్ధి 11 శాతాన్ని మించినట్టు తెలిపింది. సంప్రదాయ పొదుపు సాధనాల నుంచి నిపుణుల ఆధ్వర్యంలో నిర్వహించే సాధనాల్లోకి నిధులు మళ్లుతుండడానికి ఈ గణాంకాలు నిదర్శనంగా పేర్కొంది. ఏఐఎఫ్‌లు చాలా వేగవంతమైన వృద్ధిని చూస్తున్నాయని.. మేనేజ్డ్ ఫండ్స్ పరిశ్రమ (నిపుణులు నిర్వహించే) మొత్తం ఆస్తుల్లో ఏఐఎఫ్‌ల వాటా 2020 మార్చి నాటికి 4 శాతంగా ఉంటే, 2030 మార్చి నాటికి 9 శాతానికి చేరనున్నట్టు తెలిపింది.

క్యాపిటల్ మార్కెట్ల వైపు పొదుపు నిధులు

గృహ పొదుపుల్లో ఈక్విటీలు, మ్యూచువల్ ఫండ్స్ వాటా 2020లో 4 శాతంగాఉంటే, 2025 నాటికి 15 శాతానికి చేరిందని.. రిస్క్ తీసుకునే ధోరణి, ఫైనాన్షియల్ మార్కెట్లలో భాగస్వామ్యం పట్ల ఆసక్తికి ఇది నిదర్శనమని ఈ నివేదిక పేర్కొంది. రిటైర్మెంట్ ఫండ్స్, జీవిత బీమా ఆస్తులు సైతం స్థిరంగా పెరుగుతూ వస్తున్నాయని, ఆర్థిక వ్యవస్థ మరింత సంఘటితం అవుతుండడం, ఆదాయ స్థాయిలు పెరుగుతుండడం, 8వ వేతన కమిషన్ వంటివి అనుకూలిస్తున్నట్టు తెలిపింది. 2025 మార్చి నాటికి రిటైర్మెంట్ ఫండ్స్ నిర్వహణ ఆస్తులు రూ.53.39 లక్షల కోట్లు, జీవిత బీమా నిర్వహణ ఆస్తులు రూ.67.79 లక్షల కోట్లుగా ఉన్నట్టు వెల్లడించింది. రియల్ ఎస్టేట్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (రీట్‌లు), ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ ట్రస్టులు (ఇన్విట్‌లు) నిర్వహణ ఆస్తులు 2020 మార్చి నాటికి రూ.2.60 లక్షల కోట్లు కాగా, 2025 మార్చి నాటికి రూ.7.78 లక్షల కోట్లకు పెరిగినట్టు, ఇది ఏటా 25 శాతం వృద్ధికి సమానమని తెలిపింది.

ఆరోగ్య సేవా కేంద్రాల ఏర్పాటులో స్టార్ హెల్త్

STAR Health Insurance — Personal & Caring — The Health Insurance Specialist

చెన్నై: దేశవ్యాప్తంగా 9 రాష్ట్రాల్లో 32 ఆరోగ్య సేవా కేంద్రాలను ఏర్పాటు చేస్తున్నట్లు ఆరోగ్య బీమా సంస్థ స్టార్ హెల్త్ అండ్ అలైడ్ ఇన్సూరెన్స్ వెల్లడించింది. వీటిలో డాక్టర్ కన్సల్టేషన్లు, మధుమేహంలాంటి వ్యాధుల స్క్రీనింగ్, రోగ నిర్ధారణ పరీక్షలు, ఔషధాలు, నిర్దిష్ట టీకాలు మొదలైనవి ఉచితంగా పొందవచ్చని పేర్కొంది. తెలంగాణలోని నిజామాబాద్, ఖమ్మం, కరీంనగర్, మహబూబ్ నగర్, అలాగే ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూల్, విశాఖపట్నంలో ఇవి ఉంటాయని సంస్థ తెలిపింది. పిరమాల్ ఫౌండేషన్‌లో భాగమైన పిరమాల్ స్వాస్థ్య భాగస్వామ్యంతో వీటిని నెలకొల్పుతున్నట్లు వివరించింది.

సోమవారం న్యూయార్క్‌లో ఓ బస్టాప్ సమీపంలో పేవ్‌మెంట్‌పై దట్టంగా పేరుకుపోయిన మంచును తొలగిస్తున్న వ్యక్తి

న్యూయార్క్‌లోని ప్రఖ్యాత టైమ్స్ స్క్వేర్ వద్ద మంచు తొలగింపు పనుల్లో నిమగ్నమైన పారిశుధ్య సిబ్బంది

న్యూయార్క్‌లో దట్టంగా కురుస్తున్న మంచు నడుమ రోడ్డు దాటుతున్న పాదచారులు

అమెరికాలో మంచు బీభత్సం

ఈశాన్య తీర రాష్ట్రాలపై విరుచుకుపడుతున్న మంచు తుపాను

- న్యూయార్క్ సహా పలు నగరాలపై భారీగా మంచు దుప్పటి
- ప్రయాణాలు చేయొద్దని ప్రజలకు వాతారణశాఖ హెచ్చరిక
- ఇళ్లకే పరిమితమైన లక్షలాది మంది
- స్తంభించిన జనజీవనం
- పలు చోట్ల 57 అంగుళాల మేర కురిసిన మంచు

న్యూయార్క్: అమెరికా ఈశాన్య ప్రాంతాలపై భీకర మంచు తుపాను విరుచుకుపడింది. న్యూయార్క్ నగరం మొదలు మసాచుసెట్స్ దాకా సోమవారం తెల్లవారుజామున గంటకు 7.6 సెంటీమీటర్ల ఎత్తులో మంచును కురిపిస్తూ శీతాకాల తుపాను భీకరంగా విరుచుకుపడింది. దీంతో రోడ్లు, ఇళ్లు, దుకాణాలు, పార్క్‌లు, మైదానాలు ఇలా ఎక్కడ చూసినా అంతెత్తున మంచు పేరుకుపోయింది. మంచు, చలిగాలుల ధాటికి వాహనాల్లో ప్రయాణాలపై అధికారులు నిషేధం విధించారు. అత్యవసరంకాని పనులు కోసం ఎవరూ ఎక్కడికి వెళ్లొద్దని జాతీయ వాతావరణ శాఖ అధికారులు హెచ్చరించడంతో జనసమ్మర్ధ న్యూయార్క్ నగరంలో జనం ఎటూ పోలేక లక్షలాది మంది ఇళ్లకే పరిమితమయ్యారు. నార్త్ కరోలినా మొదలు ఉత్తర మెయిన్ ప్రాంతందాకా పెను తుపాను హెచ్చరికలు జారీచేశారు. అమెరికాకు రాకపోకలు సాగించాల్సిన 5,000 విమాన సర్వీసులు సోమవారం రద్దయ్యాయి. ముఖ్యంగా న్యూయార్క్, న్యూజెర్సీ, బోస్టన్ పరిధిలో ఎక్కువ విమానాలు రద్దయ్యాయి.

అంధకారంలో లక్షలాది కుటుంబాలు...

మంచు సంబంధ కారణాలతో విద్యుత్ సరఫరా నిలిచిపోవడంతో లక్షలాది మంది అంధకారంలో ఉండిపోయారు. ఈ స్థాయిలో న్యూయార్క్ నగరాన్ని మంచు తుపాను చుట్టుముట్టడం గత తొమ్మిదేళ్లలో ఇదే తొలిసారి. న్యూజెర్సీ రాష్ట్రంలో 1996 తర్వాత ఇంతటి స్థాయిలో మంచు కురవడం ఇదే మొదటిసారి. ''మా ఇంటి ముందున్న చెట్లు మంచు భారీగా కురవడంతో బరువుకు బలహీనమయ్యాయి. వీటికి తోడు భీకర చలిగాలుల ధాటికి అవి నేలకూలాయి''అని మసాచుసెట్స్‌లోని కేంబ్రిడ్జ్ ప్రాంతవాసి మేరీ షైఫిలే చెప్పారు. సోమవారం విద్యాలయాలన్నీ మూతబడి ఆన్‌లైన్ మోడ్‌లోకి వెళ్లిపోయాయి. ప్రజల భద్రత నిమిత్తం రవాణాపై నిషేధం కొనసాగిస్తున్నామని న్యూజెర్సీ మహిళా గవర్నర్ మైకీ షెరిల్ చెప్పారు. న్యూజెర్సీ రాష్ట్రంలోని చాలా ప్రాంతాలను ఆదివారం రాత్రే 46 సెంటీమీటర్ల మేర మంచు దుప్పటి కప్పేసింది. న్యూజెర్సీలోని ఫ్రీహోల్డ్ ప్రాంతంలో 55 సెంటీమీటర్ల మేర మంచు కురిసింది. రోడ్ ఐలాంలోని ఇస్లిప్ ప్రాంతంలో ఏకంగా 57 సెంటీమీటర్ల ఎత్తుదాకా మంచు పడింది. న్యూయార్క్‌లోని ప్రఖ్యాత సెంట్రల్ పార్క్(39 సెం.మీ.ల మంచు), జాన్ ఎఫ్.కెన్నడీ అంతర్జాతీయ విమానాశ్రయం(38 సెం.మీ.ల మంచు), లాంగ్ ఐస్‌లాండ్ మ్యాక్ఆర్థర్ ఎయిర్‌పోర్ట్(57 సెం.మీ.ల మంచు) సైతం మంచు గుప్పిట్లో చిక్కుకుపోయాయి.

న్యూయార్క్‌లో ఎడతెరిపి లేని మంచులోనూ రోడ్డుపై నడుస్తున్న మహిళ

చలిపులికి బలికాకండి...

మరి కొద్దిరోజులపాటు ఈ మంచు తుపాను విశ్వరూపం చూపించే ప్రమాదముందని నేషనల్ ఓషియానిక్ అండ్ అట్మాస్ఫిరిక్ అడ్మినిస్ట్రేషన్ సోమవారం ప్రకటించింది. గంటలకు 112 కిలోమీటర్ల వేగంతో అతి చలి గాలులు వీస్తున్నాయి. న్యూయార్క్, డెలావర్, మసాచుసెట్స్, న్యూజెర్సీ, కనెక్టికట్, రోడ్ఐలాండ్, పెన్సిల్వేనియా రాష్ట్రాల్లో అత్యయిక స్థితిని ప్రకటించారు. అనవసరంగా బయటికొచ్చి చలిపులికి బలికావొద్దని న్యూయార్క్ నగర మేయర్ జోహ్రాన్ మామ్దానీ సిటీ పౌరులను వేడుకున్నారు. కరెంట్ కట్ అయి తాము చీకట్లో మగ్గిపోతున్నామని న్యూజెర్సీలో 1,23,000 కుటుంబాలు, మసాచుసెట్స్‌లో 1,46,000 కుటుంబాలు, డెలావర్‌లో 71,000 కుటుంబాలు విద్యుత్ సరఫరా సంస్థకు ఫిర్యాదులుచేశాయి. దీంతో అట్లాంటిక్ సిటీ ఎలక్ట్రిక్ సంస్థ ఉద్యోగులు రంగంలోకి దిగారు. ''మంచు కారణంగా చెట్లు కూలడంతో పాడైన విద్యుత్ స్తంభాలు, యూటిలిటీ పోల్స్‌ను బాగుచేయడం మా తరం కాదు. అదనపు సిబ్బంది పొరుగు ప్రాంతాల నుంచి రప్పించాల్సిందే. లేదంటే ఆయా ఇళ్లల్లో విద్యుత్ వెలుగులు కష్టమే. పరిస్థితి సాధారణ స్థితికి రావాలంటే మరికొన్ని రోజులు పట్టొచ్చు''అంటూ విద్యుత్ సిబ్బంది చేతులెత్తేశారు. వీధుల్లో పేరుకుపోయిన మంచును తొలగించేందుకు స్నో మేనేజ్‌మెంట్ సిబ్బంది అవిశ్రాంతంగా పనిచేస్తున్నారు. ''ఏకధాటిగా 36 గంటలపాటు పనిచేస్తున్నాం. కొద్దిసేపు విశ్రాంతి తీసుకుని మళ్లీ మంచు తొలగింపు పనిలో మునిగిపోయాం''అని జాన్ బెర్లింగెరీ చెప్పారు.

నేపాల్‌లో నదిలో పడిన బస్సు

18 మంది దుర్మరణం

కఠ్మాండు: నేపాల్‌లో ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. ప్రయాణికుల బస్సు నదిలో పడిపోయింది. ఈ దుర్ఘటనలో ఇద్దరు న్యూజిలాండ్ పర్యాటకులతో సహా 18 మంది మరణించారు. 26 మంది గాయపడ్డారు. వారిని చికిత్స కోసం పలు ఆస్పత్రులకు తరలించారు. మృతుల్లో 12 మంది పురుషులు, ఆరుగురు మహిళలున్నారు. బస్సు పోఖారా నుంచి కఠ్మాండు వెళ్తుండగా సోమవారం తెల్లవారుజామున ప్రమాదం జరిగింది. ధాడింగ్ జిల్లాలోని భైసేపతి సమీపంలో అర్ధరాత్రి ఒంటిగంట ప్రాంతంలో హైవేపై బస్సు అదుపు తప్పింది. బోల్తాపడి 300 మీటర్ల లోతులో ఉన్న త్రిశూలి నదిలో పడిపోయింది. నేపాల్ సైన్యం, పోలీసులు సంయుక్తంగా సహాయక చర్యలు చేపట్టారు. లోయ కావడం, చీకటి ఉండటం, సామగ్రి లేమితో సహాయక చర్యలకు ఆటంకం ఏర్పడింది. అయినా సిబ్బంది సాహసంగా వ్యవహరించి క్షతగాత్రులను పడవల్లో కిలోమీటరు దిగువకు తీసుకొచ్చి రోడ్డు మార్గాన అంబులెన్సుల్లో ఆస్పత్రులకు తరలించారు. అతివేగమే ప్రమాదానికి కారణమై ఉండొచ్చని భావిస్తున్నారు. నేపాల్‌లో రోడ్డు ప్రమాదాలు పెరిగాయి. 2024–25లో 7,669 ప్రమాదాల్లో 190 మంది మరణించారు.

30 లక్షల ఇళ్లకు పీఎం సూర్య ఘర్!

'స్వచ్ఛ ఇంధన' ప్రస్థానంలో గొప్ప మైలురాయి: మోదీ

న్యూఢిల్లీ: కేంద్రప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 'పీఎం సూర్య ఘర్' పథకం 30 లక్షల ఇళ్ల మైలురాయిని చేరడం హర్షణీయమని ప్రధాని నరేంద్ర మోదీ పేర్కొన్నారు. ''అన్ని లక్షల ఇళ్లు సౌర విద్యుత్‌ను వాడుకుంటుండటం గొప్ప విషయం. భారత స్వచ్ఛ ఇంధన ప్రస్థానంలో ఇది నిజంగా గొప్ప మైలురాయి. లబ్ధిదారులందరికీ నా మనఃపూర్వక శుభాకాంక్షలు'' అంటూ సోమవారం ఎక్స్‌లో ప్రధాని పోస్టు చేశారు. భావి అవసరాలన్నింటినీ స్వచ్ఛ ఇంధనంతోనే తీర్చుకోవాలన్న కేంద్ర ప్రభుత్వ లక్ష్యసాధనలో దీన్ని గొప్ప ముందడుగుగా ఆయన అభివర్ణించారు. కృత్రిమ మేధ రంగంలో భారత ప్రగతికి ఇటీవలి ఇండియా ఏఐ ఇంపాక్ట్ సదస్సు అద్దం పట్టిందని చెప్పారు.

ఉత్తరప్రదేశ్‌లో 'జల సత్యాగ్రహం'

తాగునీటి కొరతపై సిందూరియా గ్రామస్తుల నిరసన

సోన్‌భద్ర: మహాత్మా గాంధీ నేతృత్వంలో జరిగిన ఉప్పు సత్యాగ్రహం చరిత్ర ప్రసిద్ధం. అదే కోవలో ఉత్తరప్రదేశ్‌లోని సోన్‌భద్ర జిల్లాలో సిందూరియా గ్రామ ప్రజలు ఇప్పుడు 'జల్ సత్యాగ్రహ' చేపట్టారు. గ్రామంలో తాగునీటి కొరత, ఇంటింటికీ నల్లా నీరు పథకంలో జాప్యానికి నిరసనగా ఈ శాంతియుత మార్గాన్ని ఎంచుకున్నారు. ఆదివారం సోన్ నది ఒడ్డున పెద్ద సంఖ్యలో 'జల్ సత్యాగ్రహం' నిర్వహించారు. వేసవి మొదలైనా కాకముందే నీటి సంక్షోభం తీవ్రతరమైందని వాళ్లు వాపోయారు. చేతిపంపులు, బోర్లు ఎండిపోతున్నాయని, తాగునీటి కోసం సుదూరాల దాకా వెళ్లాల్సి వస్తోందని ఆవేదన వెలిబుచ్చారు. ''కేంద్ర ప్రభుత్వ పథకం కింద ఇంటింటికి నల్లా ద్వారా నీటి సరఫరా జరుగుతుందని ఆశించాం. కానీ ఇప్పటికే కొరత మొదలైంది. రెండు మూడేళ్ల కిందట రోడ్లు తవ్వి పైప్‌లైన్లు వేశారు. ఇళ్లలోకి మాత్రం నల్లాలు ఏర్పాటు చేయలేదు. దాంతో మేం కలుషితమైన నదీ జలాలే వాడుకోవాల్సి వస్తోంది'' అంటూ గ్రామస్తులు వాపోయారు. తమ డిమాండ్లను వెంటనే తీర్చకపోతే లఖ్‌నవూకు పాదయాత్ర చేస్తామని హెచ్చరించారు. అయితే 90 శాతం గ్రామాల్లో నీటి కనెక్షన్లు ఏర్పాటు చేశామని యూపీ జల్ నిగమ్ ఈఈ అరుణ్ సింగ్ తెలిపారు. ''కొన్ని ప్రాజెక్టుల పరీక్షలు జరుగుతున్నాయి. త్వరలో సాధారణ సరఫరా ప్రారంభమవుతుంది'' అని వెల్లడించారు.

ఎల్లుండి భారత్‌కు కార్నీ

నిజ్జర్ వివాదం తర్వాత వస్తున్న తొలి కెనడా ప్రధాని

ఒట్టావా: కెనడా ప్రధాని మార్క్ కార్నీ గురువారం భారత పర్యటనకు రానున్నారు. ద్వైపాక్షిక బంధాన్ని బలోపేతం చేసుకోవడంతో పాటు రక్షణ, ఇంధన, ఏఐ రంగాల్లో నూతన ఒప్పందాలే లక్ష్యంగా ఆయన పర్యటన జరగనుంది. కార్నీ తొలుత ముంబై సందర్శిస్తారు. తర్వాత ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో భేటీ అవుతారు. ''అనంతరం పలువురు పారిశ్రామిక దిగ్గజాలతో కూడా కార్నీ సమావేశం అవుతారు. కెనడాలో పెట్టుబడి అవకాశాలపై వారితో లోతుగా చర్చిస్తారు'' అని ఆయన కార్యాలయం సోమవారం ఒక ప్రకటనలో పేర్కొంది. 2024లో భారత్, కెనడా నడుమ 30.8 బిలియన్ డాలర్ల మేరకు వాణిజ్య కార్యకలాపాలు జరిగాయి. 2023లో కెనడాలో ఖలిస్తానీ వేర్పాటువాది హర్దీప్‌సింగ్ నిజ్జర్ హత్య తర్వాత ఇరుదేశాల నడుమ సంబంధాలు పూర్తిగా క్షీణించడం తెలిసిందే. ఆ ఉదంతం అనంతరం భారత్‌లో పర్యటిస్తున్న తొలి కెనడా ప్రధాని కార్నీయే.

ఎప్‌స్టీన్ ఫైళ్ల వివాదం

మండేల్సన్ అరెస్టు

లండన్: ఎప్‌స్టీన్ సెక్స్ కుంభకోణం తాలూకు టేపుల రగడ బ్రిటన్‌లో మరిన్ని ప్రకంపనలు సృష్టిస్తోంది. ఎప్‌స్టీన్‌తో సన్నిహిత సంబంధాలు నెరిపినట్టు ఆరోపణలు ఎదుర్కొంటున్న అమెరికాలో బ్రిటన్ మాజీ రాయబారి పీటర్ మండేల్సన్ (72)ను పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అయితే మండేల్సన్‌పై లైంగిక దుష్ప్రవర్తన వంటి ఆరోపణలేమీ లేవు. దాదాపు పదిహేనేళ్ల కింద బ్రిటన్ ప్రభుత్వానికి సంబంధించిన రహస్య సమాచారాన్ని ఆయన ఎప్‌స్టీన్‌కు చేరవేశారన్న అభియోగాలపై దర్యాప్తు సాగుతోంది. ఎప్‌స్టీన్ బాగోతానికి సంబంధించి బ్రిటన్ రాకుమారుడు ప్రిన్స్ ఆండ్రూను ఐదు రోజుల క్రితమే పోలీసులు అరెస్టు చేయడం తెలిసిందే.

అజిత్ కేసును నీరుగార్చేందుకే.. సీబీఐ దర్యాప్తు!

మహారాష్ట్ర ప్రభుత్వంపై ఎన్సీపీ (ఎస్పీ) ధ్వజం

రోహిత్ పవార్

ముంబై: మహారాష్ట్ర ఉప ముఖ్యమంత్రి అజిత్ పవార్ మృతికి దారితీసిన విమాన ప్రమాదంపై సీబీఐ దర్యాప్తు కోరాలన్న మహారాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ (ఎస్పీ) తీవ్రంగా తప్పుబట్టింది. దర్యాప్తును ఆలస్యం చేసి నీరుగార్చేందుకే ఫడ్నవీస్ సర్కారు ఈ నిర్ణయం తీసుకుందంటూ పార్టీ ఎమ్మెల్యే రోహిత్ పవార్ సోమవారం దుయ్యబట్టారు. సీబీఐ వద్ద ఇప్పటికే ఏకంగా 7 వేలకు పైగా కేసులు పెండింగ్‌లో ఉన్నట్టు ఆయన గుర్తు చేశారు. వాటిలో 2,500 కేసులకైతే ఏకంగా దశాబ్దానికి అతీగతీ లేదంటూ ఆక్షేపించారు. దర్యాప్తు పేరుతో కాలహరణం చేసే ఈ యత్నాలను తాము అంగీకరించే ప్రసక్తే లేదని రోహిత్ కుండబద్దలు కొట్టారు. విమాన ప్రమాదంపై సీఐడీతోనే దర్యాప్తు జరపాలని డిమాండ్ చేశారు. దర్యాప్తులో ఇప్పటిదాకా వెలుగులోకి వచ్చిన వివరాల్లో 30 శాతాన్ని మాత్రమే బయటపెట్టారని కూడా ఆయన ఆరోపించారు. ప్రమాదంలో బ్లాక్‌బాక్స్ కాలిపోయిందని చెప్పడంపై పలు అనుమానాలు వెలిబుచ్చారు. ''బ్లాక్‌బాక్స్‌ను సురక్షితంగా వెలికితీశారు. దాన్ని అందరూ చూశారు. అందుకు సంబంధించిన ఫొటోలు కూడా నా దగ్గరున్నాయి. ఇప్పుడు అది కాలిపోయిందని చెప్పడం వెనక మతలబు ఏమిటి?'' అని ప్రశ్నించారు. దర్యాప్తులో ఏవైనా లోపాలు జరిగినట్టు తేలితే ఫడ్నవీస్ సర్కారు భారీ మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు. అంతకుముందు అసెంబ్లీలో అజిత్ పవార్‌కు రోహిత్ ఘనంగా నివాళులు అర్పించారు. ఆయనతో తన సాన్నిహిత్యాన్ని తలచుకుంటూ కంటతడి పెట్టారు.

అజిత్ విమాన ప్రమాదం దర్యాప్తులో జరుగుతున్న జాప్యం పలు ప్రశ్నలకు తావిస్తోందని ఎన్సీపీ (ఎస్పీ)కి చెందిన మరో ఎమ్మెల్యే జితేంద్ర అవద్ కూడా పేర్కొన్నారు. ''బ్లాక్‌బాక్స్ కాలిపోవడం ఏమిటి? ప్రపంచంలో ఇప్పటిదాకా ఎక్కడా అలా జరగలేదు. ప్రమాద కారణాలను తేల్చేందుకు జరుగుతున్న దర్యాప్తే మరిన్ని అనుమానాలకు దారితీస్తే ప్రజలిక దేన్ని నమ్మాలి?'' అని ప్రశ్నించారు. ప్రమాదానికి గురైన విమానానికి భారత్‌లో నడిచేందుకు అనుమతే లేదని అవద్ ఆక్షేపించారు. ''ఆ విమానాన్ని మొత్తం జీవితకాలంలో గరిష్టంగా 5,000 గంటలకు మించి నడపరాదు. కానీ అప్పటికే అది 8,000 గంటల పాటు నడిచింది. ఇవన్నీ మొత్తం ఉదంతంపై అనుమానాలను మరింత పెంచుతున్నాయి'' అన్నారు.

ప్రకటనలు, డేటా షేరింగ్‌పై నిబంధనలకు కట్టుబడతాం

సుప్రీంకోర్టుకు తెలిపిన వాట్సాప్

న్యూఢిల్లీ: ప్రకటనల సంబంధిత డేటాకు కాంపిటీషన్ కమిషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) గోప్యత, అంగీకార నిర్దేశకాలను వర్తింపజేస్తామని సోషల్ నెట్‌వర్కింగ్ వేదిక వాట్సాప్, దాని మాతృ సంస్థ మెటా సోమవారం సుప్రీంకోర్టుకు తెలిపాయి. ఈ విషయంలో ఎన్సీఎల్ఏటీ విధివిధానాలకు కట్టుబడతామని పేర్కొన్నాయి. ఎన్సీఎల్ఏటీ నిర్దేశాలను సవాలు చేస్తూ ఆ సంస్థలు పెట్టుకున్న పిటిషన్లపై ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, న్యాయమూర్తులు జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీ ధర్మాసనం విచారణ జరిపింది. ట్రిబ్యునల్ నిర్దేశాలను మార్చి 16కల్లా అమలు చేయాలని మెటా, వాట్సాప్ నిర్ణయించినట్టు వాటి తరఫున సీనియర్ న్యాయవాది కపిల్ సిబల్ దాఖలు చేసిన విజ్ఞాపనలను పరిగణనలోకి తీసుకుంది. దాంతో వాట్సాప్, మెటా పిటిషన్లను పరిష్కరించినట్టు భావించాలని ధర్మాసనం పేర్కొంది. ప్రైవసీ పాలసీ ఉల్లంఘనకు సంబంధించి వాట్సాప్‌కు సీసీఐ గతంలో రూ.213.14 కోట్ల జరిమానా విధించడం తెలిసిందే. డేటా షేరింగ్ పేరిట పౌరుల భద్రతతో ఆటలాడటాన్ని అనుమతించబోమని ఫిబ్రవరి 3న మెటా, వాట్సాప్‌లను సుప్రీంకోర్టు తీవ్రంగా మందలించింది.

అమెరికాలోని న్యూజెర్సీలో విపరీతంగా కురుస్తున్న మంచు నడుమే పెళ్లికి గుర్రంపై వేడుకగా వెళ్తున్న వరుడు, ఆ సందర్భంగా డ్యాన్స్ చేస్తున్న అతని బంధుమిత్రులు

రంజాన్ మాసం సందర్భంగా ఇరాక్ రాజధాని బాగ్దాద్‌లో ఉదయపు ప్రార్థనలు, భోజనం నిమిత్తం అందరినీ మేల్కొలిపేందుకు సోమవారం సాంప్రదాయిక డ్రమ్ము వాయిస్తున్న వ్యక్తి

నీట్-పీజీ కటాఫ్ తగ్గింపుతో

విద్యా నాణ్యత తగ్గుతుందా?

ఈ అంశాన్ని పరిశీలిస్తామన్న సుప్రీం

న్యూఢిల్లీ: ఉన్నత వైద్యవిద్య కోర్సుల్లో ప్రవేశాలకు ఉద్దేశించిన నీట్–పీజీ 2025–26 కౌన్సిలింగ్ కోసం కటాఫ్ పర్సంటైల్‌ను భారీగా తగ్గించడంతో విద్యా నాణ్యత ఏ తగ్గుతుందనే అంశాన్ని తాము పరిశీలిస్తామని సర్వోన్నత న్యాయస్థానం వెల్లడించింది. తాజా విద్యాసంవత్సరానికి కటాఫ్ పర్సంటైల్‌ను తగ్గిస్తూ నేషనల్ బోర్డ్ ఆఫ్ ఎగ్జామినేషన్ ఇన్ మెడికల్ సైన్సెస్ నిర్ణయాన్ని సామాజిక కార్యకర్త హరిశరణ్ దేవగన్ సహా పలువురు వైద్యులు సుప్రీంకోర్టులో సవాల్‌చేయడం తెల్సిందే. ఈ కేసును జస్టిస్ పీఎస్ నరసింహ, జస్టిస్ అలోక్ అరాధేల ధర్మాసనం సోమవారం విచారించింది. సీట్లను భర్తీచేసే ఉద్దేశంతోనే పర్సంటైల్‌ను తగ్గించామని అదనపు సొలిసిటర్ జనరల్ ఐశ్వర్య వాదించారు. దీంతో ధర్మాసనం కల్గజేసుకుంది. ''ఈ పరీక్ష ఎంబీబీఎస్ లాంటి ఎంట్రీలెవల్ పరీక్ష కాదు అని మీరు వాదిస్తున్నారు. ఎంపికైన వాళ్లంతా ఇప్పటికే వైద్యులు. కాబట్టి పర్సంటైల్ తగ్గించినా విద్యా నాణ్యత తగ్గిపోదని మీరు వాదిస్తున్నారు. దీనిని మేం లోతుగా పరిశీలిస్తాం''అని ధర్మాసనం తెలిపింది. కేసు తదుపరి విచారణను మార్చి 24వ తేదీకి వాయిదావేసింది.

పండగల వేళ విమాన చార్జీల పెంపు ఫిర్యాదులను పరిశీలిస్తున్నాం

సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం

న్యూఢిల్లీ: పండగల వేళ హఠాత్తుగా హఠాత్తుగా విమానచార్జీలు పెరుగుతున్నాయంటూ వస్తున్న ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పౌరవిమానయాన శాఖ పరిగణనలోకి తీసుకుంటోందని సుప్రీంకోర్టుకు కేంద్ర ప్రభుత్వం స్పష్టంచేసింది. హఠాత్తుగా పెరిగే విమాన చార్జీలను నియంత్రించేలా మార్గదర్శకాలు జారీచేయాలంటూ దాఖలైన ప్రజా ప్రయోజన వ్యాజ్యాన్ని సోమవారం జస్టిస్ విక్రమ్‌నాథ్, జస్టిస్ సందీప్ మెహతాల ధర్మాసనం ఆలకించింది. ''చార్జీల కట్టడి విషయంలో సంబంధిత వర్గాలకు చర్చలు త్వరగా ముగించాలి. ఇందుకు నాలుగు వారాల గడువు ఇస్తున్నాం. చార్జీల మోత అనేది చాలా తీవ్రమైన అంశం''అని ధర్మాసనం అసహనం వ్యక్తంచేసింది. కేసు విచారణను మార్చి 23వ తేదీకి వాయిదావేసింది.

మిగతా ముస్లిం ఓబీసీల సంగతేంటి?

పస్మందా ముస్లింల అనుకూల పిల్‌పై సుప్రీం వ్యాఖ్య

న్యూఢిల్లీ: ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో పస్మందా ముస్లింలకు ప్రాధాన్యతనివ్వాలంటూ దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై సుప్రీంకోర్టు స్పందించింది. పిటిషనర్ మొహమ్మద్‌వసీం సైఫీ తరఫున వాదిస్తున్న సీనియర్ మహిళా లాయర్ అంజనా ప్రకాశ్‌ను సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్య బాగ్చీల ధర్మాసనం సూటి ప్రశ్న వేసింది. ''పస్మందాలకు కోటా సరే. మరి మిగతా ముస్లిం ఓబీసీల సంగతేంటి?. రిజర్వేషన్ అనేది ఇది కేవలం సామాజిక స్థితికి సంబంధించింది కాదు. ఇందులో ఆర్థిక స్థితిగతులను సైతం పట్టించుకోవాల్సి ఉంటుంది''అని వ్యాఖ్యానించింది. రంగనాథ్ మిశ్రా కమిషన్ నివేదిక ప్రకారం ఓబీసీలను ఉపవర్గీకరించి పస్మందా ముస్లింలకు 10 శాతం కోటా ఇవ్వాలని పిటిషనర్ కోరడం తెల్సిందే. బీసీల్లో పస్మందాలు మాత్రమే వెనుకబడ్డారని నిరూపించే గణాంకాలు ఉన్నాయా? అని ప్రశ్నించింది.

వాంగ్‌చుక్ నిర్బంధం కేసు 26కు వాయిదా

న్యూఢిల్లీ: లద్దాఖ్‌కు రాష్ట్ర ప్రతిపత్తి, ఈ ప్రాంతాన్ని ఆరో షెడ్యూల్ పరిధిలో చేర్చాలంటూ ఉద్యమిస్తున్న పర్యావరణవేత్త సోనమ్ వాంగ్‌చుక్‌ను అన్యాయంగా అరెస్ట్‌చేశారంటూ భార్య గీతాంజలి జె.ఆంగ్మో వేసిన పిటిషన్ విచారణను సుప్రీంకోర్టు ఫిబ్రవరి 26వ తేదీకి వాయిదావేసింది. కేంద్రప్రభుత్వం తరఫున వాదించాల్సిన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా అందుబాటులో లేనికారణంగా ఈ కేసు విచారణను వాయిదావేస్తున్నట్లు జస్టిస్ అరవింద్, జస్టిస్ పీబీ వరాలేల ధర్మాసనం స్పష్టంచేసింది. జాతీయ భద్రతా చట్టం కింద అరెస్ట్‌ను సవాల్‌చేస్తూ గీతాంజలి కేసు వేయగా సరిహద్దు వద్ద భద్రత వంటి సున్నిత అంశాలను ప్రభావితంచేసేలా నిరసనకారులను ఉద్యమందిశగా వాంగ్‌చుక్ రెచ్చగొడుతున్నారని, అందుకే అరెస్ట్‌చేశామని కేంద్రం గతంలో వాదించడం తెల్సిందే. గత ఏడాది సెప్టెంబర్ 24నాటి ఘర్షణలకు, నలుగురి మరణాలకు వాంగ్‌చుక్ కారణమని కేంద్రప్రభుత్వం వాదిస్తోంది.

బొగ్గు ఆధారిత పరిశ్రమల సంగతేంటి?

ప్రతిపాదనలపై కేంద్రం నుంచి స్పందన కోరిన సుప్రీంకోర్టు

న్యూఢిల్లీ: హస్తినలో వాయుకాలుష్యాన్ని తగ్గించేందుకు వస్తున్న ప్రతిపాదనలపై స్పందన తెలపాలని కేంద్ర పర్యావరణ, అటవీ, వాతావరణ మార్పులు, విద్యుత్, పెట్రోలియం మంత్రిత్వ శాఖలను సోమవారం సుప్రీంకోర్టు ప్రశ్నించింది. బొగ్గు ఆధారిత థర్మల్ విద్యుత్ కర్మాగారాలను ఢిల్లీ నుంచి 300 కిలోమీటర్ల దూరానికి తరలించాలంటూ వచ్చిన ప్రతిపాదనలను పరిశీలిస్తామని సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చీ, జస్టిస్ విపుల్ ఎం.పంచోలీల ధర్మాసనం తెలిపింది. వాహనాల వాయుకాలుష్యం అంశాన్ని మార్చి నెల 12వ తేదీన విచారిస్తామని కోర్టు పేర్కొంది. పరిశ్రమల తరలింపుపై ప్రజల నుంచి సలహాలు, సూచనలు కోరుతూ బహిరంగ ప్రకటనలు జారీచేయాలని ఢిల్లీ పొరుగున ఉన్న ఉత్తర ప్రదేశ్, హరియాణా, రాజస్థాన్ ప్రభుత్వాలకూ కోర్టు ఆదేశాలిచ్చింది.

ఉగ్ర దాడిలో ముగ్గురు పోలీసులు మృతి

పెషావర్: పాకిస్తాన్‌లోని ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లోని కరాక్ జిల్లాలో పారామిలటరీ ఫెడరల్ కానిస్టేబులరీ(ఎఫ్‌సీ) సిబ్బందితో వెళ్తున్న అంబులెన్స్‌పై సోమవారం ఉగ్రవాదులు జరిపిన దాడిలో ముగ్గురు పోలీసులు ప్రాణాలు కోల్పోయారు. పారామిలటరీ బలగాల ప్రధానకార్యాలయంపై జరిగిన డ్రోన్ దాడిలో గాయపడిన ఐదుగురిని అంబులెన్స్‌లో తరలిస్తుండగా ఈ ఘటన జరిగిందని కరాక్ జిల్లా పోలీస్ అధికారి సవూద్ ఖాన్ వెల్లడించారు. ఇదే ప్రావిన్స్‌లోని బజౌర్ జిల్లాలో చెక్‌పోస్ట్ గోడను పేలుడుపదార్థాలున్న వాహనం ఢీకొనడంతో 11 మంది భద్రతా సిబ్బంది మరణించిన వారం రోజులకే పొరుగు జిల్లాలో మరో దాడి జరగడం గమనార్హం. ఇటీవలికాలంలో ఖైబర్ పఖ్తుంఖ్వా ప్రావిన్స్‌లో ఉగ్ర దాడులు ఎక్కువయ్యాయి.

38 మందిని చంపేసిన సాయుధ గ్రూప్

అబూజా: నైజీరియాలోని వాయవ్య జామ్‌ఫ్రారా రాష్ట్రంలో అన్కా స్థానిక ప్రభుత్వ అధీనంలోని తున్గాన్ దస్తే ప్రాంతంలో సోమవారం సాయుధ గ్రూప్ ఒకటి స్థానికులపై విచక్షణారహితంగా దాడిచేసి 38 మందిని చంపేసింది. కొందరిని బందీలుగా వెంట తీసుకెళ్లింది. దాడి జరగబోతోందని కాస్తంత ముందే నిఘా సమాచారం అందినా అక్కడికి వెళ్లడానికి సరైన రోడ్డు సదుపాయం లేకపోవడంతో సమయానికి చేరుకోలేకపోయామని రాష్ట్ర పోలీస్ అధికార ప్రతినిధి యాజిద్ అబూబకర్ ఆవేదన వ్యక్తంచేశారు. గత వారమే సమీప కెబ్బీలో ఇలాగే 33 మందిని చంపేశారు. నైజీరియాలోని వాయవ్య ప్రాంతంలో దాడులు జరగడం సర్వసాధారణంగా మారింది. సోమవారం నాటి ఘటనను 55 సభ్యదేశాల 'ది ఆఫ్రికన్ యూనియన్'తీవ్రంగా ఖండించింది. భిన్న సాయుధ గ్రూప్‌ల మధ్య ఆధిపత్య పోరులో నైజీరియా తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. తరచూ మహిళలు, చిన్నారుల హత్యలతో మానవహక్కుల ఉల్లంఘనకు తోడు జీవించే హక్కును సాయుధ గ్రూప్‌లు కాలరాస్తున్నాయని పలు దేశాలు ఆగ్రహం వ్యక్తంచేశాయి.

లక్నోలో డబల్ డెక్కర్ బస్సు బోల్తా

ఐదుగురు మృతి

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్ పై ఒక టోల్‌ప్లాజా వద్ద బస్సుపై డ్రైవర్ నియంత్రణ కోల్పోవడంతో అది బోల్తాపడిన దుర్ఘటనలో ఐదుగురు ప్రాణాలు కోల్పోయారు. 25 మంది గాయపడ్డారు. పంజాబ్‌లోని లూథియానా నుంచి బిహార్‌లోని మోతిహారికి బయల్దేరిన బస్సు ఉత్తరప్రదేశ్‌లోని లక్నో శివారు గుండా వెళ్తున్న పూర్వాంచల్ ఎక్స్‌ప్రెస్‌వే 11.2 కిలోమీటర్ మైలురాయి వద్ద ప్రమాదానికి గురైందని డిప్యూటీ కమిషనర్ఆఫ్ పోలీస్ నిపుణ్ అగర్వాల్ చెప్పారు. ఘటన జరిగినప్పుడు బస్సులో దాదాపు 85 మంది ప్రయాణికులు ఉన్నారు. ''నేపాల్‌కు వెళ్తున్నా. బస్సు నడిపే డ్రైవర్ పూటుగా తాగాడు. అత్యంత వేగంగా బస్సును నడిపి టోల్‌ప్లాజా వద్ద నియంత్రణ కోల్పోయి పల్టీ కొట్టేలా చేశాడు''అని గాయపడిన ఆ బస్సులోని ప్రయాణికుడు ఒకరు చెప్పారు.

ప్రజా పదవుల దుర్వినియోగాన్ని ప్రశ్నించే కోవారంటో

సివిల్స్, గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం

జనరల్ స్టడీస్

పాలిటీ

వివిధ రిట్లు-అర్థం-పరిధి - ప్రాముఖ్యత

ప్రొహిబిషన్ (నిషేధం)

భాషా పరంగా ప్రొహిబిషన్ అంటే నిషేధించడం అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు లేదా ట్రిబ్యునల్ తన పరిధిని అతిక్రమించి కేసులు విచారిస్తున్నప్పుడు ఆ విచారణను తదుపరి ఆదేశాల వరకు నిలిపివేయాలని కోర్టు ఆదేశిస్తుంది. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే ఈ రిట్ ముఖ్య ఉద్దేశం. ప్రొహిబిషన్ న్యాయ సంస్థలకు మాత్రమే వర్తిస్తుంది. పాలనా సంస్థలు, చట్టపర సంస్థలకు వర్తించదు.

సెర్షియోరరి (ఉన్నత న్యాయస్థాన పరిశీలన అధికారం)

భాషాపరంగా సెర్షియోరరి అంటే 'సుపీరియర్' లేదా 'టు బి సర్టిఫైడ్' లేదా 'బ్రింగ్ ద రికార్డ్స్' అని అర్థం. ఏదైనా దిగువ కోర్టు తన పరిధిని అతిక్రమించి కేసును విచారించి తీర్పు వెలువరించినప్పుడు దాన్ని రద్దు చేసి, కేసును పై స్థాయి కోర్టుకు బదిలీ చేయాలని ఇచ్చే ఆదేశం. ఈ రిట్ ఉద్దేశం కూడా దిగువ న్యాయస్థానాలు తమ పరిధులను అతిక్రమించకుండా నిరోధించడమే.

సెర్షియోరరిని ప్రైవేటు సంస్థలు, శాసన సంస్థలకు వ్యతిరేకంగా జారీ చేయరు. ప్రాథమిక హక్కులను ఉల్లంఘించే పరిపాలనా సంస్థలకు వ్యతిరేకంగా జారీచేయవచ్చని ఇండియన్ కౌన్సిల్ ఫర్ ఎన్విరాన్-లీగల్ యాక్షన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా (1996) కేసులో సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది.

ప్రొహిబిషన్, సెర్షియోరరి మధ్య తేడాలు

ప్రొహిబిషన్, సెర్షియోరరిల రిట్ల ఉద్దేశం ఒక్కటే. దిగువ కోర్టులు తమ పరిధులను అతిక్రమించకుండా నియంత్రించడం. అయితే వీటి ప్రక్రియలో తేడా ఉంది. కేసు ప్రారంభదశలో ఉంటే ప్రొహిబిషన్ రిట్, తీర్పు వెలువడిన తర్వాత సెర్షియోరరి రిట్‌ను జారీ చేస్తారు.

సెర్షియోరరి రిట్ దిగువ కోర్టులను నియంత్రించడంతోపాటు, అవి చేసిన తప్పులను కూడా సవరిస్తుంది. ప్రొహిబిషన్ రిట్ కేవలం నిలుపుదల చేస్తుంది. (Prohibition is preventive where as certiorari is curative)

కోవారంటో (అధికార పృచ్ఛ)

భాషాపరంగా దీన్ని 'బై వాట్ వారంట్' (By What Warrant) అంటారు. అంటే 'ఏ అధికారంతో' అని ప్రశ్నించడం. ప్రజా పదవుల దుర్వినియోగాన్ని అరికట్టడం ఈ రిట్ ప్రధాన ఉద్దేశం. ప్రజా సంబంధమైన పదవుల్లోకి అక్రమంగా ప్రవేశించిన లేదా ప్రజా పదవులను దుర్వినియోగం చేసిన వ్యక్తి ఆ పదవిలో కొనసాగడానికి చట్టబద్ధంగా ఉన్న అధికారాన్ని న్యాయస్థానాలు ప్రశ్నిస్తాయి. చట్టబద్ధత లేకపోతే ఆ పదవి నుంచి వెంటనే తొలగిపోవాలని ఆదేశిస్తాయి. ప్రజా పదవి అంటే చట్టంతో ఏర్పాటైన స్వతంత్ర ప్రతిపత్తి సంస్థ. ఉదాహరణకు ప్రభుత్వ కార్పొరేషన్ చైర్మన్లు, డైరెక్టర్లు, మంత్రులు, ముఖ్యమంత్రులు మొదలైనవి.

ఈ రిట్ కోసం బాధితుడు మాత్రమే న్యాయస్థానాల్లో కేసు వేయాలనే నియమం లేదు. ప్రజా పదవులను దుర్వినియోగం నుంచి కాపాడాలనే సామాజిక స్పృహ ఉన్న ఏ పౌరుడైనా కోర్టును ఆశ్రయించవచ్చు. మూడో వ్యక్తికి (Third Person) ఇందులో జోక్యం చేసుకునే హక్కు (Locus Standi- లోకస్ స్టాండై) ఉంటుంది.

ఇన్‌జంక్షన్ (నిలుపుదల ఆదేశం)

ఈ రిట్ గురించి రాజ్యాంగంలో ప్రస్తావించలేదు. కేవలం సివిల్ వివాదాల్లో యథాతథస్థితిని (Status-Quo-Ante) కొనసాగించడానికి దీన్ని జారీ చేస్తారు. భర్తీ చేయడానికి వీలుపడని నష్టాన్ని అరికట్టేందుకు ఇన్‌జంక్షన్‌ను జారీ చేస్తారు. కాబట్టి ప్రాథమిక హక్కుల రక్షణకు, ఈ రిట్‌కు సంబంధం లేదు.

ప్రాథమిక హక్కులు - ఇతర నిబంధనలు

ప్రకరణ 33ను అనుసరించి, ప్రాథమిక హక్కులు కింది వర్గాలకు వర్తించే విషయంలో పార్లమెంటు చట్టం ద్వారా కొన్ని పరిమితులు విధించవచ్చు.

ఎ) సైనిక, పారా మిలటరీ దళాలు.
బి) పోలీసులు, ఇతర రక్షణపరమైన విధులు నిర్వర్తిస్తున్న సంస్థలు, అధికారుల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించవచ్చు.
సి) గూఢచార సంస్థల్లో పనిచేసే ఉద్యోగులు.
డి) అత్యవసర సర్వీసులైన టెలి కమ్యూనికేషన్లు, ఇతర శాఖల్లో పనిచేసే ఉద్యోగులు.

ప్రకరణ 34-సైనికచట్టం (Marshal Law) - ప్రాథమిక హక్కులపై పరిమితులు

దేశంలోని ఏదైనా ప్రాంతంలో సైనిక చట్టం ప్రకటించినప్పుడు ఆ సమయంలో సైనిక బలగాలు చేపట్టిన చర్యలు, తద్వారా జరిగిన నష్టాలకు, పరిణామాలకు వారిని బాధ్యులను చేయడానికి వీలులేదు. పార్లమెంటు ఒక చట్టం ద్వారా వారి చర్యలకు రక్షణ కల్పిస్తుంది. ప్రాథమిక హక్కులకు భంగం వాటిల్లిందని న్యాయస్థానాన్ని ఆశ్రయించడానికి వీలులేదు.

ప్రకరణ 34, 35ల మధ్య తేడా

ప్రకరణ 34లో ప్రస్తావించిన అంశాలు కేవలం కొన్ని వర్గాల ఉద్యోగులు, వారి హక్కులపై విధించిన పరిమితులు. ప్రకరణ 35లో ప్రస్తావించిన అంశాలు కొన్ని ప్రత్యేక ప్రాంతాల్లో ప్రాథమిక హక్కులను పరిమితం చేయడానికి రూపొందించినవి. కాబట్టి ఒకటి వర్గానికి సంబంధించింది, మరొకటి ప్రాంతానికి సంబంధించినది.

ఉదా: 1958లో రూపొందించిన సాయుధ బలగాల ప్రత్యేక అధికారాల చట్టం (Armed Forces (Special Power) Act- AFSPA). దీన్ని పలు పర్యాయాలు సవరించి అసోం, మణిపూర్ రాష్ట్రాల్లోని కల్లోలిత ప్రాంతాల్లో విధించారు. అలాగే 1983లో పంజాబ్, చండీగఢ్‌లో కూడా ప్రయోగించారు. అక్కడి పరిస్థితుల కారణంగా శాంతి భద్రతల నిర్వహణలో పోలీసులు విఫలమైనప్పుడు ఈ చట్టం ద్వారా సాయుధ బలగాలకు ప్రత్యేక అధికారాలు ఉంటాయి.

ప్రకరణ- 35 చట్టబద్ధత, శిక్షలు

మూడో భాగంలో పేర్కొన్న నిబంధన అమలుకు చట్టబద్ధత కల్పించడం, శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. శాసనసభలకు ఉండదు. ప్రాథమిక హక్కుల అమలుకు సంబంధించి దేశవ్యాప్తంగా ఒకే పద్ధతి లేదా ప్రక్రియ ఉండాలనే ఉద్దేశంతో ఈ అధికారాన్ని పార్లమెంటుకు మాత్రమే ఇచ్చారు.

ఉదా: ప్రకరణ 16(3) ప్రకారం రిజర్వేషన్ల అమలు, ప్రకరణ 32(3) ప్రకారం రిట్లు జారీ చేసే అధికారాన్ని న్యాయస్థానాలకు సంక్రమింపజేయడం, ప్రకరణ 33 ప్రకారం సాయుధ బలగాల ప్రాథమిక హక్కులపై పరిమితులు విధించడం, ప్రకరణ 34 ప్రకారం సైనిక పాలన, మొదలైన అంశాలపై పార్లమెంటుకు మాత్రమే చట్టాలు చేసే అధికారం ఉంటుంది. అదే విధంగా ఈ భాగంలో పేర్కొన్న నేరాలకు, (ఉదాహరణకు ప్రకరణ 17లో పేర్కొన్న అస్పృశ్యత, 23లో పేర్కొన్న దోపిడీ, 24లోని బాలకార్మిక వ్యవస్థ మొదలైన వాటికి) శిక్షలు నిర్ణయించే అధికారం పార్లమెంటుకే ఉంటుంది.

ప్రకరణ 35(బి) ప్రకారం, పై విషయాలకు సంబంధించి రాజ్యాంగం అమల్లోకి రాక పూర్వం ఉన్న చట్టాలు అలాగే కొనసాగుతాయి. అయితే ప్రకరణ 372 ప్రకారం పూర్వ శాసనాలకు మార్పులు, చేర్పులు, సవరణలు చేసి పార్లమెంటు కొత్త చట్టాలు రూపొందించుకోవచ్చు.

ప్రాథమిక హక్కులు - ప్రజా ప్రయోజన వ్యాజ్యాలు (Public Interest Litigation-PIL)

ప్రాథమిక హక్కుల రక్షణ, అమలుకు సంబంధించి రాజ్యాంగంలో ప్రత్యేక ఏర్పాట్లను ప్రకరణ 32, ప్రకరణ 226లో పేర్కొన్నారు. హక్కులకు భంగం వాటిల్లినప్పుడు లేదా అమలు కానప్పుడు బాధితుడే కోర్టును ఆశ్రయిస్తాడు. అయితే బాధితుడికి సరైన అవగాహన లేకపోవడం లేదా ఆర్థిక, సామాజిక స్థితి పరంగా కోర్టును ఆశ్రయించే పరిస్థితి ఉండకపోవచ్చు. అలాంటి సందర్భాల్లో బాధితులకు సంబంధించి ప్రజాప్రయోజనం అందులో ఇమిడి ఉంటే వారి తరఫున మూడో వ్యక్తి కూడా కోర్టులో వ్యాజ్యం వేయవచ్చు. దీన్నే ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం అంటారు.

సాధారణంగా కోర్టు జోక్యాన్ని కోరే హక్కు (Locus Standi) బాధితులకే ఉంటుంది. కానీ సుప్రీంకోర్టు ఆ హక్కును ఇతరులకు కూడా సంక్రమింపజేసింది. ఈ వెసులుబాటును పబ్లిక్ ఇంట్రస్ట్ లిటిగేషన్ (పీఐఎల్) లేదా సోషల్లీ ఇంట్రస్ట్ లిటిగేషన్ అని అంటారు.

గమనిక: పీఐఎల్ భావన మొదట అమెరికా న్యాయ వ్యవస్థలో ప్రారంభమైంది. ఆ తర్వాత ఆస్ట్రేలియాలో బాగా ప్రచారంలోకి వచ్చింది. ఇండియాలోని పీఐఎల్ భావన అమెరికా నమూనా లాంటిదే. కానీ కొన్ని మార్పులతో పాటిస్తుంది.

రాజ్యాంగంలో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యం గురించి ప్రస్తావన లేదు. అయితే సుప్రీంకోర్టులో మొదటిసారి ఈ భావనను ప్రవేశపెట్టింది జస్టిస్ వి.ఆర్. కృష్ణ అయ్యర్. ఆ తర్వాత జస్టిస్ పి.ఎన్. భగవతి నేతృత్వంలోని సుప్రీంకోర్టు బెంచ్‌కి మొదటిసారిగా 1979లో బిహార్ జైల్లో ఖైదీల తరఫున పీఐఎల్ దాఖలు చేశారు. దీన్నే హుస్సేనార ఖతూన్ వర్సెస్ స్టేట్ ఆఫ్ బిహార్ కేసు అంటారు.

1981లో ఎస్.పి.గుప్తా వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా కేసును పీఐఎల్‌కు సంబంధించిన అతి ముఖ్యమైన కేసుగా పేర్కొంటారు. జస్టిస్ పి.ఎన్.భగవతి పీఐఎల్‌ను చక్కగా నిర్వచించి, తగిన వివరణ ఇచ్చారు.

ప్రకరణ 32 ప్రకారం, సుప్రీంకోర్టులో, ప్రకరణ 226 ప్రకారం హైకోర్టులో ప్రజా ప్రయోజనాల వ్యాజ్యాన్ని దాఖలు చేయవచ్చు. ఇతర న్యాయస్థానాలకు ఈ అధికారం లేదు. ప్రభుత్వ వైఫల్యాలు, అవినీతి కుంభకోణాలు పీఐఎల్ ద్వారానే దేశంలో వెలుగులోకి వచ్చాయి.

పీఐఎల్‌ను వ్యక్తిగత ప్రయోజనాలకు ఉపయోగించరాదు. ప్రచారం కోసం ప్రత్యర్థులను ఇబ్బందులకు గురి చేయాలనే దురుద్దేశంతో ప్రజాప్రయోజనాల నెపంతో పీఐఎల్ ను దాఖలు చేస్తే అలాంటి వ్యక్తులపై న్యాయస్థానాలు భారీ జరిమానాలు విధిస్తాయి.

ఉదా: సంజీవ్ భట్నాగర్ జాతీయగీతం నుంచి సింధ్ అనే పదాన్ని తొలగించాలని సుప్రీంకోర్టులో పీఐఎల్ దాఖలు చేశారు. అది అనవసరమైన, ఆర్భాటమైన కేసుగా భావించి కోర్టు సమయాన్ని వృథా చేసినందుకు భారీ జరిమానా విధించింది.

ప్రాథమిక హక్కులపై పరిమితులు- జాతీయ అత్యవసర పరిస్థితి ప్రభావం

నిబంధన 352 ప్రకారం, జాతీయ అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మూడో భాగంలో పేర్కొన్న ప్రాథమిక హక్కులు రద్దవుతాయి. దీనికి సంబంధించి రాజ్యాంగంలో ప్రకరణలు 358, 359లలో వివరణలు ఉన్నాయి.

ప్రకరణ 358 ప్రకారం బాహ్య అత్యవసర పరిస్థితి

యుద్ధం, దురాక్రమణ కారణంగా అత్యవసర పరిస్థితి విధించినప్పుడు మాత్రమే వర్తిస్తుంది. దీని ప్రకారం ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలను మాత్రమే రద్దు చేస్తారు. ఇతర ప్రాథమిక హక్కులు రద్దు కావు.

ప్రకరణ 358 ప్రకారం జాతీయ అత్యవసర పరిస్థితిలో ప్రకరణ 19లో పేర్కొన్న స్వేచ్ఛలు వాటంతట అవే రద్దవుతాయి.

కానీ ప్రకరణ 359 ప్రకారం ప్రాథమిక హక్కులు రద్దు చేయడానికి రాష్ట్రపతి ప్రత్యేక ఆదేశాన్ని జారీ చేయాలి. ఎమర్జెన్సీ విధించినంత మాత్రాన వాటంతట అవే రద్దు కావు.

నిబంధన 358 పరిధి దేశవ్యాప్తంగా వర్తిస్తుంది. కానీ ప్రకరణ 359 పరిధి దేశంలో కొన్ని ప్రాంతాలకు లేదా మొత్తం భాగానికి వర్తింపజేయవచ్చు.

జాతీయ అత్యవసర పరిస్థితిని ఏ కారణంగా విధించినప్పటికీ (బాహ్య, అంతరంగిక కారణాలు) ప్రకరణ 20, 21 రద్దుకావు. ఈ అంశాన్ని 1978లో 44వ రాజ్యాంగ సవరణ ద్వారా పొందుపరిచారు.

ప్రకరణలు 358, 359 మధ్య కొంత సామీప్యం ఉంది. ఇవి అత్యవసర పరిస్థితి విధించడం ద్వారా జరిగే పరిణామాలకు రక్షణ కల్పిస్తాయి కానీ ఎమర్జెన్సీతో సంబంధం లేని చట్టాలకు వర్తించవు.

ప్రాథమిక హక్కులు- మినహాయింపులు

ప్రకరణ 31-ఏ లో పేర్కొన్న ఐదు రకాల చట్టాలు తమ ప్రాథమిక హక్కులకు విరుద్ధమంటూ న్యాయస్థానాల్లో ప్రశ్నించడానికి వీలులేదు. ఈ అంశాలను తొమ్మిదో షెడ్యూల్‌లో చేర్చారు.

నిబంధన 31-బిలో కూడా ఇలాంటి పరిమితులనే పేర్కొన్నారు. 31-సి ప్రకారం నిర్దేశిక నియమాల్లో పొందుపరిచిన 39-బి, 39-సి అమలు కోసం ప్రాథమిక హక్కులపై పరిమితులు విధిస్తే, అది రాజ్యాంగ విరుద్ధమంటూ న్యాయస్థానంలో ప్రశ్నించరాదు.

వస్తువు వేగాన్ని రెండింతలు చేస్తే దాని గతిజశక్తి?

టెట్/డీఎస్సీ- ప్రత్యేకం

భౌతిక శాస్త్రం

యాంత్రిక శాస్త్రం

ప్రచోదనం

ఏదైనా ఒక వస్తువుపై అతి స్వల్పకాలంలో అత్యధిక బలాన్ని ప్రయోగిస్తే దాన్ని ప్రచోదనం అంటారు.

ప్రచోదనం (I) = బలం × కాలం

$I = F \times \Delta t$

$\frac{I}{\Delta t} = F$ ప్రకారం ఒక వస్తువుపై అత్యధిక బలాన్ని అతిస్వల్పకాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది.

ప్రమాణాలు: డైన్ సెకన్, న్యూటన్ సెకన్

అనువర్తనాలు:

- జంపింగ్ పోటీలో దూకే స్థలం వద్ద గోతిని తవ్వి దానిలో వరిపొట్టు, రంపం పొట్టు, ఇసుక,స్పాంజ్‌ను ఉంచుతారు.వీటివల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. ఫలితంగా దూకుతున్న వ్యక్తికి గాయాలు కావు.
- క్రికెట్‌లో బంతిని క్యాచ్ పట్టుకునే సమయంలో ఫీల్డర్ చేతులను ముందుకు చాపి, తర్వాత క్రమంగా వెనక్కి తీసుకుంటాడు. ఇలా చేయడం వల్ల కాలపరిమితి పెరిగి ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. అందువల్ల ఫీల్డర్ చేతులకు గాయాలు కావు.
- వాహనాల్లో షాక్ అబ్జార్బ్స్ (స్ప్రింగ్‌లు) అమరుస్తారు. దీనివల్ల వాహనాలు గుంతలున్న రోడ్డుపై ప్రయాణిస్తున్నప్పుడు ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- సున్నితమైన గాజు వస్తువులు, పింగాణీ, మట్టి వస్తువులను రవాణా చేసేటప్పుడు వాటి చుట్టూ దూది, గడ్డి, స్పాంజి, థర్మాకోల్ మొదలైన వాటిని అమరుస్తారు. ఫలితంగా ఆ వస్తువుల రవాణా సమయంలో ప్రచోదన ప్రభావం తగ్గుతుంది.
- గమనంలో వున్న ఒక వాహనం అంతే ద్రవ్యరాశి ఉన్న విరామస్థితిలోని మరో వాహనాన్ని ఢీకొడితే.. కదులుతున్న వాహనం ఆగి ఉన్న వాహనంపై తక్కువ సమయంలో ఎక్కువ బలాన్ని ప్రయోగిస్తుంది. కాబట్టి ఆగి ఉన్న వాహనానికి ఎక్కువ నష్టం జరుగుతుంది.
- కొంత ఎత్తు నుంచి స్వేచ్ఛగా దృఢమైన తలం పైకి దూకిన వ్యక్తి తన శరీర బరువు మొత్తాన్నీ స్వల్పకాలంలో ఆ తలంపై ప్రయోగిస్తాడు. దీంతో ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉంటుంది. ఫలితంగా అతడికి గాయాలవుతాయి. కానీ అదే వ్యక్తి సరిపడా నీరున్న బావిలో దూకితే కాలపరిమితి పెరిగి, ప్రచోదన ప్రభావం తగ్గుతుంది. కాబట్టి ఆ వ్యక్తికి ఎలాంటి గాయాలు కావు.
- ఒక ఇనుప మేకుపై అత్యధిక బలాన్ని అతిస్వల్ప కాలంలో ప్రయోగిస్తే ప్రచోదన ప్రభావం ఎక్కువగా ఉండి, ఆ మేకు గోడలోకి లేదా చెక్కదిమ్మలోకి చొచ్చుకొని వెళ్లగలుగుతుంది.

ప్రక్షేపకం (Projectile)

ఏదైనా ఒక వస్తువును భూమి క్షితిజ సమాంతర దిశకు కొంత కోణంలో (90° తప్ప) పైకి విసిరినప్పుడు అది పరావలయ మార్గంలో ప్రయాణించి భూమిని మరో బిందువు వద్ద తాకుతుంది. ఈ విధంగా విసిరిన వస్తువును ప్రక్షేపకం అంటారు.

ప్రక్షేపకం ఎల్లప్పుడూ పరావలయ లేదా అర్ధ పరావలయ మార్గంలో ప్రయాణిస్తుంది.

ఉదాహరణలు:

1. తుపాకి నుంచి వెలువడిన బుల్లెట్, యుద్ధ ట్యాంకుల నుంచి వెలువడిన విస్ఫోటక పదార్థాలు పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
2. ప్రయోగించిన క్షిపణి, రాకెట్లు కూడా పరావలయ మార్గంలో ప్రయాణిస్తాయి.
3. కదులుతున్న వాహనంలో నుంచి ఒక వస్తువును బయటకు జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి కింద పడుతుంది.
4. గగనతలంలో ఎగురుతున్న ఒక జెట్ విమానం నుంచి బాంబును జారవిడిస్తే అది పరావలయ మార్గంలో ప్రయాణించి లక్ష్యాన్ని తాకుతుంది.

వ్యాప్తి (Range)

ఒక ప్రక్షేపకం భూమి క్షితిజ సమాంతర దిశలో ప్రయాణించిన గరిష్ట దూరాన్ని వ్యాప్తి అంటారు. గరిష్ట వ్యాప్తి పొందాలంటే ప్రక్షేపకాన్ని 45° కోణంతో ప్రయోగించాలి.

యాంత్రికశక్తి

ఒక వస్తువు క్షితిజ శక్తి, గతిజ శక్తిల మొత్తాన్ని యాంత్రిక శక్తి (Mechanical Energy) అంటారు.

యాంత్రిక శక్తి = P.E. + K.E.

స్థితిజ శక్తి:

ఒక వస్తువుకు తన స్థితి లేదా స్థానం లేదా నిర్మాణం వల్ల కలిగే శక్తిని క్షితిజ శక్తి అంటారు.

క్షితిజ శక్తి (P.E.) = mgh

m = వస్తువు ద్రవ్యరాశి (ఎల్లప్పుడు స్థిరం)

g = గురుత్వ త్వరణం (ఒక ప్రదేశంలో g విలువ స్థిరం)

h = భూమి ఉపరితలం నుంచి వస్తువు పొందిన ఎత్తు.

వస్తువు పొందిన ఎత్తు విలువ పెరిగితే వస్తువు పొందిన క్షితిజ శక్తి కూడా పెరుగుతుంది.

ఉదాహరణలు:

- రిజర్వాయర్లలో, ఓవర్‌హెడ్ ట్యాంకుల్లో ఉండే నీటికి స్థితిజశక్తి ఉంటుంది.
- ఒక తీగను స్ప్రింగ్‌లా చుట్టినపుడు దానిలో PE నిల్వ ఉంటుంది.
- ఒక రబ్బరు పట్టీని సాగదీసినప్పుడు కూడా దానిలో స్థితిజశక్తి ఉంటుంది.
- విల్లులో బాణం అమర్చి వెనక్కి లాగినప్పుడు దానిలోనూ PE నిల్వ ఉంటుంది.



గతిజశక్తి:

ఒక వస్తువు తన గమనం వల్ల పొందిన శక్తిని గతిజశక్తి అంటారు.

గతిజ శక్తి = $KE = \frac{1}{2}mv^2$

m = వస్తువు ద్రవ్యరాశి; v = వేగం

- గమనంలో వున్న రాయి, బంతికి ఈ శక్తి ఉంటుంది.
- పేల్చిన తుపాకీ గుండు, తుఫాన్ గాలులకు, రంపం మిల్లులో వేగంగా తిరిగే రంపానికి గతిజ శక్తి ఉంటుంది.
- వేగం పెరిగితే వస్తువు గతిజశక్తి కూడా పెరుగుతుంది.
- గతిజశక్తి సమీకరణం, రేఖీయ ద్రవ్యవేగాల మధ్య సంబంధం

$KE = \frac{p^2}{2m} \Rightarrow K.E. \propto p^2$

- గమనంలో వున్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని x% పెంచినప్పుడు దాని K.E.లో

పెరుగుదల శాతం $= \left(\frac{200 + x}{100}\right)x$

ప్రశ్న: గమనంలో ఉన్న వస్తువు రేఖీయ ద్రవ్యవేగాన్ని 100 శాతం పెంచితే, దాని K.E. లో మార్పు (పెరుగుదల) శాతం ఎంత?

$= \left(\frac{200 + x}{100}\right)x \qquad (\because x = 100\%)$

$= \left(\frac{200 + 100}{100}\right) \times 100 = \frac{300}{100} \times 100$

K.E.లో పెరుగుదల = 300%

- గమనంలో ఉన్న వస్తువు వేగాన్ని రెండింతలు చేస్తే దాని K.E. నాలుగు రెట్లు పెరుగుతుంది.

యాంత్రిక శక్తికి ఉదాహరణలు:

ఒక వస్తువు ఏక కాలంలో క్షితిజ, గతిజ శక్తులను కలిగి ఉంటే వాటికి ఉదాహరణలు.

- గగన తలంలో ఎగురుతున్న విమానం, రాకెట్లు, క్షిపణులు, గాలిపటం, మేఘాలు, పక్షి, బెలూన్ మొదలైన వాటికి యాంత్రిక శక్తి ఉంటుంది.
- గమనంలో ఉన్న వాహనంలోని ప్రయాణికుడు యాంత్రిక శక్తిని కలిగి ఉంటాడు.
- సౌర కుటుంబంలో సూర్యుడి చుట్టూ పరిభ్రమిస్తున్న గ్రహాలు లేదా గ్రహాల చుట్టూ పరిభ్రమిస్తున్న ఉపగ్రహాలకు యాంత్రిక శక్తి ఉంటుంది.
- పరమాణు కేంద్రకం చుట్టూ పరిభ్రమిస్తున్న ఎలక్ట్రాన్‌కు యాంత్రిక శక్తి ఉంటుంది.

నోట్: బావిలోని నీరు, లోయలో వున్న వస్తువు, గనిలోని కార్మికుడికి క్షితిజ శక్తి ఉంటుంది.

- తిరుగుతున్న సీలింగ్ ఫ్యాన్ రెక్కలకు క్షితిజ శక్తి, భ్రమణ గతిజ శక్తులుంటాయి.

శక్తి రూపాంతరాలు

- రిజర్వాయర్‌లో నిలకడగా ఉన్న నీరు క్షితిజ శక్తిని కలిగి ఉంటుంది. ఈ నీరు జలపాతంలా కిందకి పడుతున్నపుడు దాని స్థితిజశక్తి గతిజశక్తిగా మారుతుంది. నీటి ప్రవాహానికి ఎదురుగా విద్యుత్ టర్బైన్‌ను అమరిస్తే జనరేటర్‌లో విద్యుత్‌గా రూపాంతరం చెందుతుంది.
- గడియారంలో చుట్టగా చుట్టిన స్ప్రింగ్‌లో స్థితిజ శక్తి ఉంటుంది. ఈ స్థితిజ శక్తి గడియారంలోని ముల్లు తిరగడానికి కావాల్సిన K.E.గా మారుతుంది.
- పక్షులను వేటాడటానికి ఉపయోగించే గులేరు లోని రబ్బరు పట్టీ మధ్యభాగంలో ఒక చిన్న రాయిని అమర్చి వెనక్కి లాగితే, ఆ రబ్బరు పట్టీలోని స్థితిజశక్తి రాయికి గతిజశక్తిని అందిస్తుంది. ఫలితంగా రాయి ముందుకు దూసుకెళ్తుంది. ఇలాంటి శక్తి రూపాంతరం ధనస్సు, బాణాల్లో కూడా జరుగుతుంది.
- వాహనాల్లో ఇంధనాలను మండించినప్పుడు వెలువడే ఉష్ణశక్తి వాటిని కదిలించడానికి కావల్సిన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- సైకిల్ డైనమోలో యాంత్రికశక్తి విద్యుత్ శక్తిగా మారుతుంది.
- పరుగు తీస్తున్న వ్యక్తిలో కండర శక్తి గతిజశక్తిగా మారుతుంది.
- ఒక వ్యక్తి.. భవనం, పర్వతం, స్తంభం మొదలైన వాటిపై ఎక్కినప్పుడు కండర శక్తి స్థితిజ శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- చెట్టు కొమ్మపై వాలిన పక్షి ఎగరడం ఆరంభించినప్పుడు దాని కండర శక్తి(PE) యాంత్రిక శక్తిగా రూపాంతరం చెందుతుంది.
- సముద్రంలో ఆటుపోట్లు ఏర్పడినప్పుడు ఉవ్వెత్తున లేచిన సముద్ర కెరటాల స్థితిజశక్తి ఓడకు గతిజశక్తిగా అందుతుంది.
- చిన్న పిల్లలు ఆడుకునే ఆట బొమ్మల్లో అమర్చిన ఘటాల్లోని రసాయనశక్తి విద్యుచ్ఛక్తిగా, తర్వాత బొమ్మలను కదిలించడానికి అవసరమైన యాంత్రిక శక్తిగా మారుతుంది.
- విద్యుత్ మోటార్‌లో విద్యుత్ శక్తి యాంత్రిక శక్తిగా మారుతుంది.

భ్రమణ చలనం లేదా కోణీయ చలనం

ఒక వస్తువు ఏదైనా స్థిర బిందువు చుట్టూ వృత్తాకార మార్గంలో పరిభ్రమిస్తే ఆ చలనాన్ని భ్రమణ చలనం లేదా కోణీయ చలనమంటారు.

ఉదా: తిరుగుతున్న ఫ్యాన్ రెక్కలు, వాహనం చక్రాలు, సౌరకుటుంబంలోని గ్రహాలు, ఉపగ్రహాలు భ్రమణ చలనాన్ని కలిగి ఉంటాయి.

- భ్రమణ చలనంలో ఉన్న ప్రతి వస్తువుకు ఏక కాలంలో రేఖీయ, కోణీయ భౌతిక రాశులుంటాయి.

రేఖీయ స్థానభ్రంశం (Linear displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు వృత్త పరిధిపై పొందిన స్థానభ్రంశాన్ని రేఖీయ స్థాన భ్రంశం అంటారు.

ప్రమాణాలు: సెం.మీ. లేదా మీటర్

కోణీయ స్థానభ్రంశం (Angular displacement)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు ఆ వృత్త కేంద్రం వద్ద పొందిన స్థానభ్రంశాన్ని కోణీయ స్థానభ్రంశం అంటారు.

$\theta = \angle BOA$

ప్రమాణాలు: డిగ్రీ, రేడియన్ (రేడియన్ - అంతర్జాతీయ ప్రమాణం)

- రేఖీయ, కోణీయ స్థానభ్రంశాల మధ్య సంబంధం:

వృత్త చాపం (AB) = వృత్త వ్యాసార్థం × కేంద్రం వద్ద కోణం

$\bar{S} = r \times \theta$

రేఖీయ వేగం (V)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త పరిధిపై పొందిన రేఖీయ స్థానభ్రంశాన్ని రేఖీయ వేగం అంటారు.

$\bar{V} = \frac{\bar{S}}{t}$

ప్రమాణాలు: సెం.మీ./సెకన్, మీ./సెకన్

కోణీయ వేగం (ω)

భ్రమణ చలనంలో ఉన్న ఒక వస్తువు నిర్ణీత కాలంలో వృత్త కేంద్రం వద్ద పొందిన కోణీయ స్థానభ్రంశాన్ని కోణీయ వేగం అంటారు.

$\therefore \omega = \frac{\theta}{t}$; ప్రమాణాలు: డిగ్రీ/ సెకన్ లేదా రేడియన్ / సెకన్.

- రేఖీయ, కోణీయ వేగాల మధ్య సంబంధం $v = r\omega$
- భ్రమణ చలనంలో రేఖీయవేగం ఒక కణం నుంచి మరో కణానికి మారుతుంది. కానీ కోణీయ వేగం అన్ని కణాలకు సమానం.

కోణీయ ద్రవ్యవేగం

భ్రమణ చలనంలో ఉన్న వస్తువుకు ఉండే ద్రవ్యవేగాన్ని కోణీయ ద్రవ్యవేగం అంటారు.

$L = mvr$ లేదా $L = mr^2\omega$ [$\because v = r\omega$]

ప్రమాణాలు: గ్రామ్.సెం.మీ.^{2}/సెకన్, కేజీ. సెం.మీ.^{2}/సెకన్

$L = mvr \Rightarrow \frac{L}{r} = mv$

$V \propto \frac{1}{r}$ (ద్రవ్యరాశి స్థిరంగా ఉన్నప్పుడు)

- భ్రమణ చలనంలో ఉన్న వస్తువు రేఖీయ వేగం దాని వృత్త వ్యాసార్ధానికి విలోమానుపాతంలో ఉంటుంది. కాబట్టి కక్ష్యావ్యాసార్ధం పెరిగితే రేఖీయ వేగం తగ్గుతుంది.

ఉదా: భూమి చుట్టూ పరిభ్రమిస్తున్న ఒక కృత్రిమ ఉపగ్రహాన్ని అల్పకక్ష్య నుంచి అధిక కక్ష్యలోకి బదిలీ చేస్తే ఆ ఉపగ్రహం రేఖీయ వేగం తగ్గుతుంది. కక్ష్య వ్యాసార్ధం పెరగడమే దీనికి కారణం.

- భ్రమణ చలనం చేస్తున్న వస్తువుకు ఏకకాలంలో అభికేంద్ర, అపకేంద్ర బలాలు ఉంటాయి.

తెలంగాణలో 700 ఏళ్ల వలస పాలన

తెలంగాణ పోరాటానికి శతాబ్దాల చారిత్రక నేపథ్యం ఉంది. తెలంగాణ పోరాటానికి గల కారణాలను సంపూర్ణంగా అర్థం చేసుకోవాలంటే.. 1323లో కాకతీయ రాజుల పాలన అనంతరం జరిగిన వలస రాజ్య స్థాపనల గురించి తెలుసుకోవాలి. 1324 నుంచి 1948 వరకు తెలంగాణ ప్రాంతాన్ని అయిదు ముస్లిం రాజ్య వంశాలు పాలించాయి. వీరి 624 ఏళ్ల పాలనలో తెలంగాణ ప్రజలు దుర్భర పరిస్థితుల్లో జీవించారు. మరో రకంగా చెప్పాలంటే.. మన పూర్వీకులు తమ సొంత ప్రాంతంలోనే ద్వితీయ శ్రేణి పౌరులుగా బతుకులు వెళ్లదీశారు.

గ్రూప్స్, ఇతర పోటీ పరీక్షల ప్రత్యేకం
జనరల్ స్టడీస్
తెలంగాణ చరిత్ర

కాకతీయుల స్వర్ణయుగం

క్రీ.శ. 1324లో కాకతీయ రాజు రెండో ప్రతాపరుద్రుడిని ఢిల్లీ సుల్తాన్ మహ్మద్‌బిన్ తుగ్లక్ ఓడించడంతో తెలంగాణా ప్రాంతంలో వలస పాలన మొదలైంది. ప్రతాపరుద్రుడి ఓటమితో 300 ఏళ్లకు పైగా సాగిన కాకతీయుల సువర్ణ పాలన అంతమైంది. కాకతీయులు ఉత్తర తెలంగాణ ప్రాంతంలో పుట్టి, పెరిగి.. సాధారణ తెలంగాణ ప్రజల స్థాయి నుంచి రాజులుగా ఎదిగారు. కాకతీయ రాజులు సాగు కోసం చెరువులు, కాలువలు, బావులను తవ్వించారు. తెలంగాణ ప్రాంతంలో అనేక దేవాలయాలు నిర్మించారు. వీరి పాలనలో తెలంగాణ శాంతి, సౌభాగ్యాలతో విలసిల్లింది.

వలస పాలనలో రికార్డు

తెలంగాణలో కాకతీయుల పాలన అనంతరం క్రీ.శ. 1324 నుంచి క్రీ.శ. 1347 వరకు మహ్మద్ బిన్ తుగ్లక్ పాలన కొనసాగింది. క్రీ.శ. 1347లో అతని సుబేదారు అల్లావుద్దీన్ హసన్ గంగూ బహమనీ తిరుగుబాటు చేసి స్వాతంత్ర్యం ప్రకటించుకున్నాడు. బహమనీ సామ్రాజ్యం పేరుతో దక్కన్‌లో తన స్వతంత్ర రాజ్యాన్ని స్థాపించుకున్నాడు. దక్షిణ భారత దేశంలో ఇది తొలి ముస్లిం రాజ్యం. ఈ పరిణామం తదనంతర కాలంలో దక్షిణ భారతదేశంపై ముస్లిం రాజుల దాడులకు మార్గం వేసింది. బహమనీ రాజ్యంలోని 5 ప్రావిన్సుల్లో గోల్కొండ ఒకటి. తెలంగాణ ఇందులో భాగంగా ఉండేది. బహమనీ సుల్తానులు క్రీ.శ. 1347 నుంచి క్రీ.శ. 1512 వరకూ.. 165ఏళ్లు పరిపాలన సాగించారు. 165 ఏళ్ల బహమనీయుల పాలన చివర్లో ఆయా ప్రావిన్సుల పాలకులు తిరుగుబాటు చేయడంతో క్రీ.శ. 1512లో బహమనీ సామ్రాజ్యం 5 రాజ్యాలుగా విడిపోయింది. వీటిల్లో గోల్కొండ రాజ్యాన్ని సుల్తాన్ కులీ కుతుబ్ షా 1512లో ఏర్పాటు చేశాడు. ఈ గోల్కొండ రాజ్యంలో తెలంగాణ అంతర్భాగం. కుతుబ్‌షాహీ పాలకులు గోల్కొండ రాజ్యాన్ని 1687 వరకూ పాలించారు. కుతుబ్‌షాహీ అయిదో రాజు మహ్మద్ కులీ కుతుబ్ షా క్రీ.శ. 1592లో హైదరాబాద్‌ను, చార్మినార్‌ను నిర్మించాడు. ఆయనను హైదరాబాద్ నగర నిర్మాతగా పేర్కొంటారు. క్రీ.శ. 1687లో మొఘల్ చక్రవర్తి ఔరంగజేబు గోల్కొండను జయించి తన సామ్రాజ్యంలో కలిపేసుకున్నాడు. మొఘలుల పాలన క్రీ.శ 1723 వరకూ కొనసాగింది.

1724లో మొదటి నిజాం ఉల్ ముల్క్ అసఫ్‌జా తెలంగాణను జయించి హైదరాబాద్ రాజ్యంలో విలీనం చేశాడు. అసఫ్ జాహీలు క్రీ.శ.1724 నుంచి క్రీ.శ 1948 వరకూ సుదీర్ఘంగా 224 ఏళ్లపాటు పాలించారు. ఇలా తెలంగాణలో పరాయి పాలన 624 ఏళ్ల పాటు నిరాటంకంగా కొనసాగింది. ఇదో రకంగా ప్రపంచ రికార్డు. ఎందుకంటే.. ప్రపంచ చరిత్రలో మరెక్కడా కూడా ఒక ప్రాంతంలో ఇంత సుదీర్ఘ కాలం వలస పాలన సాగిన దాఖలాలు లేవు.

పరాయి పాలనలో వివక్షలెన్నో

ముస్లిం పాలకులు తెలుగు భాష స్థానంలో పర్షియన్ భాషను ప్రజలపై బలవంతంగా రుద్దారు. కాకతీయ పాలకులు ప్రోత్సహించిన స్థానిక సంస్కృతి స్థానంలో పర్షియన్ సాహిత్యం, కళలు, సంస్కృతిని ప్రవేశపెట్టారు. సమాజంలోని ఉన్నత వర్గాల వస్త్రాలంకరణ, ఆహారపు అలవాట్లలోనూ మార్పులు వచ్చాయి. వలస పాలకులు స్కూళ్లలో స్థానిక భాష కాకుండా.. పర్షియన్ మాధ్యమంలోనే బోధన విధానాన్ని ప్రవేశ పెట్టారు. అది కూడా ముస్లిం జనాభా అధికంగా ఉండే పట్టణాల్లోనే జరిగేది. పరాయి పాలకులు హిందువులు ఎక్కువగా నివసించే తెలంగాణ గ్రామాలను పూర్తిగా విస్మరించారు. ఈ నిర్లక్ష్యం, పక్షపాత ధోరణి వల్ల ప్రజలు నిరక్షరాస్యులుగా మిగిలిపోయి జీవనోపాధి కోసం వ్యవసాయ పనులకు మాత్రమే పరిమితం అయ్యారు. ఫలితంగా ప్రభుత్వ ఉద్యోగాల్లో, సైన్యంలో స్థానిక ప్రజలకు స్థానం లేకుండా పోయింది.

అసఫ్ జాహీల కాలంలో 1885 వరకు పర్షియనే అధికార భాషగా కొనసాగింది. 1885లోఅప్పటి ప్రధాని రెండో సాలార్‌జంగ్ పర్షియన్ స్థానంలో ఉర్దూను అధికార భాషగా మార్చాడు. స్థానిక భాష తెలుగుకు బదులు బోధన మాధ్యమంగా ఉర్దూను తప్పనిసరి చేశారు. అప్పటి నుంచి 1948లో అసఫ్ జాహీల పాలన ముగిసే వరకూ.. ఉర్దూ మాధ్యమంలోనే బోధన కొనసాగింది. అంతేకాకుండా ధరించే దుస్తుల విషయంలోనూ పట్టణాల్లోని ముస్లిమేతర ఉన్నత వర్గాలకు షేర్వాణి, పైజామా అనేది హోదాకు గుర్తుగా మారింది. ఇవన్నీ ఇలా ఉంటే.. 1918 లో ఉస్మానియా యూనివర్సిటీని ఏర్పాటు చేస్తూ.. పీజీ వరకూ అన్ని స్థాయిల్లో ఉర్దూ మాధ్యమం తప్పనిసరి చేశారు. ఉర్దూ మీడియంలో చదవడం వల్ల తదనంతర కాలంలో ప్రభుత్వ ఉద్యోగాలు పొందే విషయంలో ఉస్మానియా యూనివర్సిటీ విద్యార్థులు వెనుకబడిపోయారు. మరోవైపు 1887లో హైదరాబాద్‌లోని జాగీర్దార్లు ఇంగ్లిష్ మీడియం బోధనతో నిజాం కాలేజీని ఏర్పాటుచేసుకున్నారు. తద్వారా తమ పిల్లలకు ఇంగ్లిష్ మాధ్యమంలో విద్యను అందించాలనేది వీరి ఆలోచన. సమాజంలోని ఉన్నత వర్గాలకే ఇంగ్లిష్ మీడియం చదువు అందిందని చెప్పడానికి ఇదొక ఉదాహరణ. నిజాం కాలేజీ 1948వరకూ మద్రాస్ యూనివర్సిటీకి అనుబంధంగా కొనసాగింది. ఆరో నిజాం రాజు కాలంలో హైదరాబాద్ స్టేట్‌లోని పట్టణాల, జిల్లాల పేర్లను సైతం మార్చారు. ఎలగందల్‌ను కరీంనగర్‌గా.. ఇందురును నిజామాబాద్‌గా, పాలమూరును మహబూబ్‌నగర్‌గా.. మెతుకును మెదక్‌గా.. మానుకోట పేరు మహబూబాబాద్‌గా.. భువనగిరి పేరను భోంగిర్‌గా; ఎద్దులాపురం పేరును ఆదిలాబాద్‌గా.. పొంచెర్లను హుజూర్‌నగర్‌గా మార్చేశారు. ఇప్పుడు మారిన పరిస్థితుల నేపథ్యంలో వలసపాలకులు మార్చిన పేర్ల స్థానంలో అసలు పేర్లను తిరిగి పెట్టాల్సిన అవసరం ఉంది.

ఏడో నిజాం వలస వాద, మతతత్వ విధానాలు

ఏడో నిజాం రాజు మీర్ ఉస్మాన్ అలీ ఖాన్ అసహన, పక్షపాత మతతత్వ ధోరణులకు మరికొన్ని ఉదాహరణలు చూద్దాం. 1939లో వందేమాతరం గీతంపై నిషేధం విధించడం అనేది నిజాం అసహనం, అణిచివేత విధానాలకు నిదర్శనం. హిందూ విద్యార్థులు ఉస్మానియా యూనివర్సిటీ హాస్టళ్లలో వందేమాతరం గీతం పాడకుండా నిషేధించారు. ఆ నిర్ణయానికి వ్యతిరేకంగా వందేమాతరం పాడితే వారిని యూనివర్సిటీ నుంచి బహిష్కరించారు. ఇలా బహిష్కరణకు గురైన విద్యార్థులు తమ చదువులు కొనసాగించేందుకు నాగ్‌పూర్‌కు వెళ్లాల్సి వచ్చేది. ఇలా నాడు బహిష్కరణకు గురైన వారిలో పీవీ నరసింహారావు ఒకరు. అంతేకాకుండా రోజూ ఉదయం తరగతుల ప్రారంభానికి ముందు ఏడో నిజాం రాజును స్తుతిస్తూ ఉర్దూలో ప్రార్థన చేయాలని విద్యాశాఖ ఆదేశించింది. ఏడో నిజాం రాజు ముస్లిం జనాభా పెంచుతూ, హిందూ జనాభాను తగ్గించే యోచనతో మతతత్వ జనాభా విధానాన్ని ప్రవేశపెట్టాడు. ఈ విషయం 1931 జనాభా లెక్కలను చూస్తే అర్థమవుతుంది. 1931లో హిందూ జనాభా 84 శాతం ఉండగా, ముస్లిం జనాభా 10 శాతం ఉండేది. కానీ 1941లో ముస్లిం జనాభా గణనీయంగా 12.8 శాతానికి చేరగా, హిందూ జనాభా 81.4 శాతానికి తగ్గింది. అదే విధంగా 1941లోనే హిందూ జనాభాను తగ్గించే యోచనతో దళితులను విడిగా నమోదు చేశారు. ఫలితంగా హిందూ జనాభాను 63.5 శాతంగా చూపించారు. అంతేకాకుండా ఉత్తర భాతరదేశానికి చెందిన ముస్లింలు హైదరాబాద్ రాజ్యానికి వచ్చేలా ఉద్దేశపూర్వకంగా, పక్కా ప్రణాళికతో చర్యలు చేపట్టారు. ఉత్తరాది నుంచి వచ్చే ముస్లింలకు ఇక్కడ ప్రత్యేక వేతనాలు, సదుపాయాలు, రాయితీలు అందించి ఉద్యోగాల్లో చేరేలా ప్రోత్సహించారు. దాంతో వర్తక వాణిజ్యాల్లో, విద్యాసంస్థల్లో, రక్షణ, పోలీసు బలగాల్లో వారికి ప్రాధాన్యత లభించింది. ఇలా 60వేల మంది ఉత్తరాది ముస్లింలు హైదరాబాద్ రాష్ట్రానికి వచ్చారు. వీరిలో ఉత్తరప్రదేశ్, పంజాబ్, రాజస్థాన్ రాష్ట్రాల నుంచి వచ్చిన వారున్నారు. ఈ విధానం ద్వారా రాజ్యంలో ముస్లింలను ఉన్నత వర్గంగా ఏర్పరచాలని ఏడో నిజాం భావించాడు. అయితే ఇలాంటి చర్యల ద్వారా 1919 లో నిజాం చేసిన ముల్కీ నిబంధనల చట్టాన్ని స్వయంగా తనే ఉల్లంఘించినట్లయింది. 1947 దేశ విభజన సమయంలో ఉత్తర భారతదేశం నుంచి భారీ సంఖ్యలో ముస్లింలు రాష్ట్రానికి వలస వచ్చారు. వారు ఇక్కడ పునరావాసం ఏర్పరచుకోవడానికి ప్రభుత్వం అన్ని రకాల రాయితీలు కల్పించింది. హైదరాబాద్ రాజ్యంలో ముస్లిం జనాభా పెంచడానికి తీసుకున్న మరో చర్య ఇది. ఇలాంటి మతతత్వ విధానాల వల్ల ప్రభుత్వ ఉద్యోగాలు, విద్యాసంస్థలు, వర్తక వాణిజ్యాల్లో హిందువులు అవకాశాలు అందుకోలేకపోయారు. 1931 జనాభా లెక్కల ప్రకారం రక్షణ, పోలీసు, ఇతర సర్వీసుల్లో హిందూ, ముస్లింల గణాంకాలను పరిశీలిస్తే... ముస్లింలు 1,07,737 మంది ఉంటే.. హిందువుల సంఖ్య కేవలం 23,368 మంది. పైన పేర్కొన్న సర్వీసుల్లో ముస్లింల సంఖ్య 1931 నుంచి 1947 మధ్య కాలంలో మరింతగా పెరిగింది. దీన్ని బట్టి ప్రభుత్వ సర్వీసుల్లో ముస్లింలకు అధిక ఆదరణ లభించిందని స్పష్టమవుతోంది. ఇలాంటి వివక్ష ఇతర రంగాల్లోనూ కొనసాగింది. అక్షరాస్యత పరంగానూ హిందూ, ముస్లింల మధ్య స్పష్టమైన వ్యత్యాసాలు, అసమానతలు ఉండేవి. 1921లో ప్రతి వెయ్యిమంది హిందువుల్లో 23 మంది అక్షరాస్యులు ఉంటే.. ప్రతి వెయ్యి మంది ముస్లింలలో 59 మంది అక్షరాస్యులు ఉండేవారు. ఇది 1931లో ప్రతి వెయ్యి మంది హిందువుల్లో 33.3గా.. ప్రతి వెయ్యి మంది ముస్లింలలో 103.5గా ఉంది.

కాంగ్రెస్ పార్టీపై నిషేధం

రాజకీయ పార్టీల విషయంలోనూ నిజాం పక్షపాత వైఖరి స్పష్టంగా ఉండేది. 1927లో బహదూర్ యార్‌జంగ్ స్థాపించిన 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్' అనే ముస్లిం సంస్థకు ప్రభుత్వం అనుమతించింది. ఇది ముస్లింల రాజకీయ హక్కుల పరిరక్షణే లక్ష్యంగా ఏర్పడింది. అయినప్పటికీ ప్రభుత్వం అన్ని విధాలా సహకారాలు అందించింది. 1937లో ఏర్పడిన కాంగ్రెస్ పార్టీని మతతత్వ సంస్థ అనే కారణంతో నిజాం ప్రభుత్వం నిషేధించింది. బ్రిటిష్ ఇండియాలో కాంగ్రెస్ పార్టీ ప్రధాన రాజకీయ పార్టీ. బ్రిటిష్ పాలన నుంచి విముక్తి కోసం స్వాతంత్ర్య పోరాటం చేసింది. అలాంటి పార్టీని నాటి నిజాం ప్రభుత్వం మతతత్వ పార్టీగా ముద్ర వేసింది. అదే సమయంలో మతతత్వ పార్టీ అయిన 'ఇత్తెహాదుల్ ముస్లిమీన్'ను మాత్రం సమ్మతించింది. ప్రభుత్వ మతతత్వ విధానాలు ముస్లింలను అన్ని రంగాల్లో ప్రోత్సహించాయనడానికి ఇది మరో ఉదాహరణ.

రాజకీయ నాయకుల నిర్బంధం

హైదరాబాద్ రాష్ట్ర స్వాతంత్ర ఆందోళనలను నియంత్రించేందుకు 1947 ఆగస్టు 25 తర్వాత ఎంతో మంది రాజకీయ నాయకులను, దాశరథి, కాళోజీ నారాయణరావు తదితర కవులను, ప్రముఖులను నిజాం ప్రభుత్వం జైళ్లలో నిర్బంధించింది. 1947 ఆగస్టులో భారతదేశం స్వాతంత్ర్యం పొందిన తర్వాత కూడా 13 నెలలపాటు వీరు జైలు జీవితం గడిపారు. 1948 సెప్టెంబర్‌లో పోలీసు చర్య తర్వాతే వీరు విడుదలయ్యారు. ఏడో నిజాం పాలనలో హైదరాబాద్‌లో పౌరహక్కుల ఉల్లంఘన, అణచివేత చర్యలు ఏ విధంగా ఉండేవో చెప్పడానికి ఈ సంఘటనే ప్రత్యక్ష నిదర్శనం.

హైదరాబాద్‌లో దుష్పరిపాలన

ఇత్తెహాదుల్ ముస్లిమీన్‌కు చెందిన సాయుధ విభాగం 'రజాకార్లు' హిందువులపై తీవ్ర అకృత్యాలకు పాల్పడ్డారు. దీంతో వేల మంది ప్రజలు పొరుగు రాష్ట్రాలకు వలస వెళ్లారు. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ దుష్పరిపాలన తమ దృష్టికి వచ్చిన తర్వాత భారత ప్రభుత్వం 1948 జూలైలో హైదరాబాద్‌పై ఒక శ్వేత పత్రాన్ని విడుదల చేసింది. ఈ క్రమంలో దుష్పరిపాలనకు సంబంధించి కొన్ని వ్యాఖ్యలు చేసింది. అవి.. 'హైదరాబాద్‌లో దుష్పరిపాలన, అకృత్యాలకు నిస్సహాయ వీక్షకులుగా చూస్తూ ఉండాలని కేంద్ర ప్రభుత్వం భావించట్లేదు. ఇప్పటికే క్షీణించే పరిస్థితుల్లో ఉన్న శాంతి భద్రతలు మరింత క్షీణించి శాంతి, సహనాలకు విఘాతం కలిగించే పరిస్థితులు తలెత్తితే భారత ప్రభుత్వం తప్పనిసరిగా సమస్య పరిష్కారానికి జోక్యం చేసుకుంటుంది' అని పేర్కొంది. మరోవైపు రజాకార్ల దుష్పరిపాలన, అకృత్యాలకు నిరసనగా అప్పటి హైదరాబాద్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్న జి. రామాచారి 1948 ఫిబ్రవరిలో రాజీనామా చేశారు. ఆయన తన రాజీనామాలో రాష్ట్రంలో శాంతి భద్రతల పరిస్థితిని ఈ విధంగా వర్ణించారు. ''రాజ్యంలో విధ్వంసక శక్తులు, గూండాయిజం విశృంఖలమయ్యాయి.

మిగతా తర్వాతి పేజీలో →

Another term for hyperlink is..

BANK EXAMS
COMPUTER AWARENESS

The Internet is a worldwide network of networks. It can be defined as a global network of over millions of smaller heterogeneous computer networks consists of a set of national, regional and private. The internet is the common language where by dissimilar computers with various operating systems, are able to communicate with each other using a standard set of protocols.

The Internet is the world's largest computer network, a distinction it has earned by virtue of being a "network of networks." The Internet is an outgrowth of a network (ARPANET) established roughly a quarter-century ago to meet the needs of researchers working in the defense industry in the United States and a few of their colleagues in other countries.

The ARPANET grew slowly, from a handful of computers in 1971 to more than 1000 in 1984. Working with the ARPANET researchers came to regard high-speed computer networks as an indispensable tool for academic research in all fields and in 1986 the US National Science Foundation established NSFNET to provide network connections to more research institutions and improve international network cooperation. In 1987, the Internet served more than 10,000 computers. By 1989 the network had grown to more than 100,000.

Evolution of Internet

- The origin of Internet can be traced to a U.S. Department of Defense (DoD) organization called Advanced Research Projects Agency (ARPA).
- ARPA developed a four node packet switching network called ARPANET in 1969. The network was intended to support the military research on fault tolerant computer networks. DoD wanted to ensure a reliable data transfer in the event of a nuclear war, even if parts of the network has been destroyed.
- As the years pass by, the network grew in size and by 1st January 1983, the ARPANET no longer remained an experimental network but its control was passed over to Defense Communications Agency (DCA).
- The network then became available for the academic research, government employee and contractors.
- The world's fastest and most powerful computers were made available to an academic and scientific community.
- In 1990 the ARPANET was officially decommissioned.

Some of the major networks contributing to the growth of the internet are as follows:

- ARPANET
- USENET (User's network)
- CSNET (Computer science network)
- BITNET (Because it's time network)
- NSFNET (National science foundation network)
- WWW (World Wide Web)
- NREN (National research and education network)
- Intranet

It is said that the Internet is growing at a rate of 20% per month. The data speeds have gone up considerably, which makes the access even faster.

- The event which started as a military assistance program is now largely a private enterprise.

Services on the Internet

The services that are available on the Internet can be classified into two categories:

- Communication services (electronic mail (e-mail))
- Information retrieval services (Web (pages with links and multimedia content of its Web sites))

Applications of Internet

Traditionally the internet has the following applications.

1) E-mail 2) News
3) Remote login
4) File transfer
5) World wide web (www)

MODEL QUESTIONS

1. A ______ is a named location on a disk where files are stored.
   1) Folder 2) Pod 3) Version
   4) Bag 5) None of the above
2. The ______ allows you to choose where to go and is located below the Standards Buttons toolbar.
   1) System menu
   2) Address bar
   3) Menu bar
   4) Tool bar
   5) None of the above
3. A ______ is a set of computer instructions that carry out a task on the computer.
   1) Program 2) Database
   3) Memory file4) Folder
   5) None of the above
4. An operating system version designed for home use is Microsoft Windows XP______
   1) Home Edition
   2) Media Center Edition
   3) Tablet PC Edition
   4) All of the above 5) None
5. A user-interface that is easy to use is considered to be______
   1) user-happy
   2) user-simple
   3) user-friendly
   4) Interface
   5) None of the above
6. When you press and release the secondary mouse button you are______
   1) Right-clicking
   2) Left-clicking
   3) Either 1 or 2
   4) All of the above
   5) Neither 1 nor 2
7. Another term for hyperlink is______
   1) Link 2) Source
   3) Bar 4) All of the above
   5) None of the above
8. A graphical user interface displays__________
   1) Graphics
   2) Text
   3) Both 1 and 2
   4) Neither 1 nor 2 5) None
9. The ______ program compresses larger files into a smaller file.
   1) Win Zip 2) Win Shrink
   3) Win Style 4) Win small
   5) None of the above
10. The efficient data structure to insert/delete a number in a stored set of numbers is _________.
    1) Queue
    2) Linked list
    3) Doubly linked list
    4) Binary tree
    5) None of the above
11. Caps lock, Num-lock are known as ________
    1) Modifier key
    2) Toggle key
    3) Function key
    4) Numeric key
    5) None of these
12. Which of the following memories must be refreshed many times per second?
    1) Static RAM
    2) Dynamic RAM 3) EPROM
    4) ROM 5) None of these
13. Anurag is a supercomputer developed in _____
    1) China 2) USA 3) India
    4) England 5) None of these
14. A result of a computer virus can not lead to______
    1) Disk Crash
    2) Mother Board Crash
    3) Corruption of program
    4) Deletion of files
    5) None of these
15. Choose the correct way to indicate that a line in a C++ program is a comment line, that is/a line they will not be executed as an instruction.
    1) Begin the line with a # sign
    2) Begin the line with double slashes (/ /)
    3) Begin and end the line with double hyphens (-_-)
    4) Indent the line
    5) None of these
16. Programming language built into user programs such as Word and Excel are known as_____
    1) 4GLs 2) Macro languages
    3) Procedure-oriented languages
    4) Visual programming languages
    5) None of these
17. Firewalls are used to protect against ________.
    1) Unauthorized Attacks
    2) Virus Attacks
    3) Data Driven Attacks
    4) Fire Attacks
    5) All of these
18. System software is the set of programs that enables your computer's hardware devices and ______software to work together.
    1) Management 2) Processing
    3) Utility 4) Application
    5) None of these
19. RAM can be thought of as the ________ for the computer's processor.
    1) Factory
    2) Operating room
    3) Waiting room
    4) Planning room
    5) None of these
20. The CPU and memory are located on the ________.
    1) Expansion board
    2) Motherboard
    3) Storage device
    4) Output device
    5) None of these
21. Word processing, spreadsheet and photo-editing are examples of ________
    1) Application software
    2) System software
    3) Operating system software
    4) Platform software
    5) None of the above
22. To hyperlink on the web page through HTML language, _____ tag is used.
    1) <ahref> 2) <a> 3) <link>
    4) <hlink> 5) <href>
23. Drop cap option found in which menu?
    1) Insert 2) Format 3) Edit
    4) Tools 5) None of these
24. A half byte is known as_______.
    1) Data 2) Bit 3) Half byte
    4) Nibble 5) All of these
25. A piece of computer hardware that is physically placed between two devices each of which manages data in a different way is called_______.
    1) Modern 2) Interface
    3) Clue 4) Data bus
    5) All of these
26. ______ tags, when placed on an animal, can be used to record and track in a database all of the animals movements.
    1) POS 2) RFID 3) PPS
    4) GPS 5) None of these
27. Format for musical data communication between two devices such as computer and synthesizer is called_______.
    1) HTML 2) MP3 3) MPEG
    4) MIDI 5) None of these

KEY

1) 1 2) 2 3) 1 4) 1 5) 3 6) 1
7) 1 8) 3 9) 1 10) 3 11) 2 12) 2
13) 3 14) 2 15) 2 16) 4 17) 1 18) 4
19) 3 20) 2 21) 1 22) 1 23) 1 24) 4
25) 2 26) 2 27) 4